
'ప్రజల రుణం తీర్చుకునేందుకు
ఎంత కృషి చేయడానికైనా నేను సిద్ధం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 16
సంచిక: 60

సోమవారం 22-5-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



ముంబైకి 'గ్రీన్' కార్డ్
గ్రీన్ సెంచరీ. బెంగళూరు ఓటమితో ముంబైకి ప్లే ఆఫ్ బెర్త్. -12లో



జీవిత బీమా.. రాబడి చూడొద్దు
కావాల్సింది బీమా రక్షణా? లేక రాబడా? ఈ అంశాలను వివరించే కథనం. -13లో




కేజ్రీవాల్‌తో నితీశ్ మంతనాలు
కేంద్రంతో కొనసాగుతున్న వివాదంలో తమ పూర్తి మద్దతు ఉంటుందని కేజ్రీవాల్‌కు నితీశ్ కుమార్ భరోసా ఇచ్చారు.
వివరాలు 6లో ▸



రక్షణ వలయంలో శ్రీనగర్
శ్రీనగర్‌లో నేటి నుంచి జీ-20 టూరిజం వర్కింగ్ గ్రూప్ సమావేశాలు మొదలవుతున్న నేపథ్యంలో పటిష్ట భద్రత ఏర్పాటు చేశారు..
వివరాలు 6లో ▸



ఐరాసను సంస్కరించాల్సిందే..
ఐక్యరాజ్యసమితి వంటి సంస్థలను తక్షణం సంస్కరించుకోవాల్సిన అవసరముందని జీ-7 సదస్సులో మోదీ కుండబద్దలు కొట్టారు.
వివరాలు 6లో ▸



మనది ఒకే మూలం కాదు...
తొలి మానవులు ఆఫ్రికాలో పుట్టి ప్రపంచమంతా వ్యాపించారని దశాబ్దాలుగా వింటున్న సిద్ధాంతం తప్పంటోంది తాజా అధ్యయనం.
వివరాలు 6లో ▸

న్యూస్‌రీల్

సంగీత రాజ్ ఇక లేరు



తన సంగీతంతో ప్రేక్షకులను ఉర్రూతలూగించిన సంగీత దర్శకుడు రాజ్ కన్నుమూశారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో గుండెపోటుతో తుది శ్వాస విడిచినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సోమవారం మహాప్రస్థానంలో ఆయన అంత్యక్రియలు జరుగుతాయని వెల్లడించారు. రాజ్ అసలు పేరు తోటకూర సోమరాజు.

- వివరాలు 11లో

దేశానికి అన్నం పెట్టే స్థాయికి తెలంగాణ



దేశానికి అన్నం పెట్టే స్థాయికి ఎదిగిన తెలంగాణ.. మరోపక్క నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంలో కూడా మొదటి స్థానంలో నిలుస్తోందని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్ చెప్పారు.

- వివరాలు 5లో

ఏపీ పారిశ్రామిక దూకుడు



పారిశ్రామిక మౌలిక వసతుల కల్పనలో ఏపీ వేగంగా దూసుకెళుతోంది. దేశంలో ఎక్కడా లేనివిధంగా మూడు పారిశ్రామిక కారిడార్లతోపాటు 974 కి.మీ సుదీర్ఘ తీర ప్రాంతాన్ని కలిగి ఉండటం లాంటి అనుకూలతలను అందిపుచ్చుకుంటూ పురోగమిస్తోంది.


- వివరాలు 10లో

బెంగళూరులో వరదలు..

ఏపీకి చెందిన యువతి మృతి

- కర్ణాటక రాజధాని బెంగళూరులో ఆదివారం సాయంత్రం గంటకు పైగా భారీ వర్షం కురిసింది. ఓ కారు వరద నీటిలో చిక్కుకోవడంతో ఆంధ్రప్రదేశ్ వాసి భానురేఖారెడ్డి(22)మృతిచెందారు. భానురేఖారెడ్డి స్వస్థలం కృష్ణా జిల్లా ఉంగుటూరు మండలం తేలప్రోలు గ్రామం. ఈమె బెంగళూరులోని ఇన్ఫోసిస్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నారు.

- వివరాలు 6లో



పార్లమెంటు 2.0

6లో

సర్వాంగ సుందరంగా కొత్త భవనం.. 28న ప్రారంభించనున్న ప్రధాని

రూ.2,000 నోట్ల మార్పిడికి ధ్రువీకరణ పత్రాలు అక్కర్లేదు

స్పష్టం చేసిన ఎస్‌బీఐ.. బ్యాంకు శాఖలకు సూచనలు



న్యూఢిల్లీ: రూ. 20,000 వరకూ విలువ చేసే రూ. 2,000 నోట్లను మార్చుకొనేందుకు ఎటువంటి ఫారం లేదా రిక్విజిషన్ స్లిప్ అవసరం లేదని ప్రభుత్వరంగ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) తెలిపింది. అలాగే వినియోగదారుడు ఎటువంటి ధ్రువీకరణ పత్రం కూడా సమర్పించాల్సిన అవసరం లేదని స్థానిక ప్రధాన కార్యాలయాలకు పంపిన సూచనల్లో పేర్కొంది. నోట్ల మార్పిడి ప్రక్రియ సజావుగా జరిగేందుకు ప్రజలకు అవసరమైన తోడ్పాటు అందించాలని సూచించింది. రూ. 2,000 నోట్లను మార్చుకోదల్చుకున్న వారు ఎన్ని సార్లయినా బ్యాంకును సందర్శించవచ్చని సంబంధిత వర్గాలు తెలిపాయి. రూ. 2,000 కరెన్సీ నోట్లను చెలామణీ నుంచి ఉపసంహరిస్తున్నట్లు, మే 23 నుంచి సెప్టెంబర్ 30 వరకూ ఖాతాల్లో డిపాజిట్ చేసుకోవచ్చని లేదా మార్చుకోవచ్చని ఆర్‌బీఐ శుక్రవారం ప్రకటించడం తెలిసిందే. దీంతో చాలా మంది వినియోగదారులు శనివారం నుంచే తమ ఖాతాల్లో జమ చేసుకొనేందుకు, మార్చుకొనేందుకు బ్యాంకులకు వెళ్లినప్పటికీ బ్యాంకు సిబ్బంది వారిని తిప్పి పంపారు. కొందరు కస్టమర్లు నగదు డిపాజిట్ మెషీన్ల ద్వారా తమ ఖాతాల్లోకి రూ. 2,000 నోట్లను డిపాజిట్ చేసుకున్నారు. దేశవ్యాప్తంగా జ్యువెలరీ షాపుల్లో బంగారం, ఇతర విలువైన ఆభరణాలను కొనుగోలు

మిగతా 2వ పేజీలో ▶

క్వింటాల్‌కు 9 నుంచి 10 కిలోల వరకు తరుగు తీస్తున్నారు..

గుండె తరుక్కుపోతోంది

రైతుల ధాన్యం దించకుండా మిల్లర్ల వేధింపులు

- తాలు, గడ్డి, మట్టి ఉందంటూ నిరాకరణ
- మరింత తరుగుకు అంగీకరిస్తేనే ఆన్‌లైన్‌లో నమోదు
- కొనుగోలు కేంద్రాల్లో కాంటాకు తీవ్ర ఆలస్యం
- వాన భయంతో వణికిపోతున్న రైతన్నలు



జగిత్యాలలోని ఓ కొనుగోలు కేంద్రంలో మల్లయ్య అనే రైతుకు సంబంధించిన ధాన్యం కాంటా పెట్టారు. మరునాడు అందులో తాలు, గడ్డి ఉన్నాయని, తాము చెప్పినంత తరుగుకు ఒప్పుకుంటేనే ధాన్యం దించుకుంటామని మిల్లు యజమాని నిర్వాహకులకు ఫోన్ చేశాడు. ఇదే విషయం నిర్వాహకులు మల్లయ్యకు ఫోన్ చేసి చెప్పడంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో అంగీకరించాడు.

కాంటాలు పెడతలేరు

మాది ఖానాపురం మండలం అశోక్ నగర్ గ్రామం. పది రోజుల క్రితం కొనుగోలు కేంద్రానికి ధాన్యం తీసుకువచ్చా. నాలుగు రోజులు అవుతోంది బస్తాలు నింపి. ఇప్పటివరకు కాంటాలు పెడతలేరు. కొనుగోళ్లు అయితలెవ్వు. మబ్బులు పడుతుండడంతో తడుస్తయేమోనని భయంగా ఉంది.



– బొమ్మగాని ఉప్పలయ్య, వరంగల్ జిల్లా

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: రాష్ట్రంలోని పలు జిల్లాల్లో కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు తమ ధాన్యాన్ని అమ్ముకోలేక కష్టాలు పడుతున్నారు. మరోవైపు తరుగు పేరిట మిల్లర్లు వారిని వేధిస్తున్నారు. ఏటా కోట్లాది రూపాయల రైతుల కష్టాన్ని తరుగు పేరిట దోచుకుంటున్నా.. ఈ యాసంగిలో ఇది శ్రుతి మించింది. మిల్లర్లు ఏకంగా రైతుకే ఫోన్లు చేసి ధాన్యం వెనక్కి తీసుకెళ్లాలని చెబుతున్నారు. ఈ బెదిరింపులతో ఆందోళనకు గురవుతున్న రైతులు వారు చెప్పినట్లు తరుగుకు తలూపుతున్నారు. గతనెల 22న కొనుగోళ్ల ప్రారంభమైనపుడే కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, మిల్లర్లు మొత్తం మిలాఖత్ అయి క్వింటాల్‌కు ఏకంగా తొమ్మిది నుంచి పది కిలోల వరకు తరుగుతో దోపిడీకి తెరతీశారు. వాస్తవానికి కొనుగోలు కేంద్రాల్లో క్వింటాల్‌కు నాలుగు కిలోల చొప్పున తరుగు తీశాక.. ఆ ధాన్యాన్ని మిల్లులో ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి. ఇక్కడే మిల్లు యజమానులు చక్రం తిప్పుతున్నారు. లారీలో వచ్చిన ధాన్యాన్ని మిల్లుల్లో దించడం లేదు. ధాన్యంలో తాలు, గడ్డి, మట్టి ఉన్నాయని, తమకు అవసరం లేదంటూ వేధిస్తున్నారు. ధాన్యం తీసుకెళ్లాలంటూ రైతులకు ఫోన్లు చేసి చెబుతున్నారు. దీంతో రైతులు మిల్లులకు పరుగులు పెడుతున్నారు. అలా వచ్చిన వారిని మరింత వేధిస్తూ మరింత తరుగు తీసైనా సరే తమ ధాన్యం కొనాలంటూ బతిమాలేలా మిల్లర్లు చేస్తున్నారు. మరోవైపు గన్నీ బ్యాగులు, లారీలు, టార్పాలిన్ల కొరత, ట్రాన్స్‌పోర్టు ఇబ్బందులు కూడా రైతులు తమ ధాన్యం అమ్ముకోవడానికి వీల్లేకుండా చేస్తున్నాయి.

ఆసిఫాబాద్‌లో గింజ కూడా కొనలేదు..

ఈ యాసంగిలో రాష్ట్రవ్యాప్తంగా 80.46 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కొనుగోలు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకోసం 32 జిల్లాల్లో 7,183 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలనుకుంది. ఇప్పటివరకు ఇందులో 6,889 కేంద్రాల ద్వారా కొనుగోళ్లు జరపగా.. అందులో 186 కేంద్రాలను ఇప్పటికే మూసివేశారు. మొత్తం 32 జిల్లాల్లో దాదాపు 5.23 లక్షల మంది రైతుల నుంచి ఇప్పటి వరకూ దాదాపు 34 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించారు. దీని విలువ దాదాపు రూ.6,934 కోట్ల వరకు ఉంటుందని అధికారుల అంచనా. నల్లగొండలో అత్యధికంగా రూ.1,100 కోట్ల ధాన్యం, నిజామాబాద్‌లో రూ.1,030 కోట్ల విలువైన ధాన్యాన్ని కొనుగోలు చేసిన అధికారులు.. ఆసిఫాబాద్‌లో శనివారం (20వ తేదీ) సాయంత్రం వరకు రూపాయి విలువైన ధాన్యం కూడా కొనుగోలు చేయకపోవడం

మిగతా 3వ పేజీలో ▶

ఎరికా బోగర్‌కు జ్ఞాపికను అందజేస్తున్న మంత్రి కేటీఆర్. చిత్రంలో జయేశ్ రంజన్ తదితరులు



పెట్టుబడులకు పలు సంస్థలు

- అమెరికా కంపెనీల తెలంగాణ బాట: మంత్రి కేటీఆర్
- వీఎక్స్‌ఐ గ్లోబల్‌తో ఐదు వేల ఉద్యోగాలు
- టెక్నాలజీ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేయనున్న మాండీ హోల్డింగ్స్
- విస్తరణ ప్రణాళికలు ప్రకటించిన స్టోరబుల్
- రైట్ సాఫ్ట్‌వేర్ కంపెనీ కొత్త డెవలప్‌మెంట్ సెంటర్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో పెట్టుబడులకు అమెరికా కంపెనీలు ఆసక్తి వ్యక్తం చేశాయి. మాండీ హోల్డింగ్స్, స్టోరబుల్, రైట్ తదితర సంస్థలు ఇందులో ఉన్నాయి. రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించేందుకు అమెరికాలో పర్యటిస్తున్న రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి కె. తారక రామారావు ఆదివారం హ్యూస్టన్‌లోని పలు కంపెనీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. తెలంగాణలోని పెట్టుబడుల అనుకూల వాతావరణంతో పాటు ప్రభుత్వ ప్రగతిశీల విధానాలను ఆయా కంపెనీల యాజమాన్యాలకు వివరించారు. అంతర్జాతీయ సంస్థలెన్నో తెలంగాణ బాట పట్టాయని చెబుతూ, రాష్ట్రాభివృద్ధిలో తమతో కలిసి నడవాలని వారికి ఆహ్వానం పలికారు. ఈ నేపథ్యంలో ఆయా కంపెనీలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తిని వ్యక్తం చేశాయి.

మంత్రి కేటీఆర్‌తో భేటీలు

మాండీ హోల్డింగ్స్ వ్యవస్థాపకుడు, చైర్మన్ ప్రసాద్ గుండు మొగుల నేతృత్వంలోని ఓ ప్రతినిధి బృందం మంత్రి కేటీఆర్‌ను కలిసింది. తెలంగాణలో టెక్నాలజీ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేసేందుకు సంసిద్ధత వ్యక్తం చేసింది. దీనివల్ల 2వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపింది. రాష్ట్రంలో ఇప్పటికే గ్లోబల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను కలిగి ఉన్న స్టోరబుల్ కంపెనీకి చెందిన జొనాథన్ లూయిస్, నీల్ వర్మల నేతృత్వంలోని ఓ ప్రతినిధి బృందం మంత్రితో భేటీ అయ్యి తమ విస్తరణ ప్రణాళికలను వివరించింది. అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా, యూరప్‌లో

మిగతా 2వ పేజీలో ▶

రైతుబంధు చూపి అన్నిటికీ కోత



సీఎం కేసీఆర్‌పై కిషన్‌రెడ్డి ధ్వజం

- ఒక్కో రైతుకు రాష్ట్రం రూ.10 వేలు ఇస్తుంటే, కేంద్రం రూ.18,254 ఇస్తోంది
- రాష్ట్రంలో పంటల బీమా లేకపోవడం దురదృష్టకరం
- ముఖ్యమంత్రి ఇక్కడి పాలనను గాలికి వదిలేశారు..
- ఫ్లెక్సీలు పెట్టుకున్నంత మాత్రాన 'దేశ్ కీ నేత' కాలేరు..
- కవిత అరెస్టు మా చేతుల్లో లేదు.. అది సీబీఐ పరిధిలోని అంశం

" దళితుడిని సీఎం చేస్తానని చెప్పి మొదట్లోనే వారిని మోసం చేశారు. రైతులు, నిరుద్యోగులు, ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి, డబుల్ బెడ్ రూమ్, వైద్యం, మౌలిక వసతులు, గ్రామ పంచాయతీల అభివృద్ధి, మున్సిపాలిటీల అభివృద్ధి.. ఏ విషయంలోనూ కేసీఆర్ మాట నిలబెట్టుకోలేదు. అలాంటి సీఎం మహారాష్ట్రకు వెళ్లి ప్రధాని మోదీని విమర్శిస్తున్నారు.

- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

5లో



111 జీవో రద్దుపై సుప్రీంకు..!

- న్యాయపోరాటానికి సన్నద్ధమవుతున్న స్వచ్ఛంద సంస్థలు
- జంట జలాశయాలను కాపాడుకోవాలంటున్న పర్యావరణవేత్తలు
- జీవో ఎత్తివేతతో పర్యావరణానికి పెను ముప్పు అంటూ ఆందోళన
- నిపుణుల కమిటీ నివేదికను ప్రజల్లోకి తీసుకెళ్లే యోచన

3లో

ఏది నిజం?

ఆసుపత్రిలో చేరటంపైనా రోగిష్టి రాతలేనా?

- అవినాశ్‌రెడ్డి తల్లి అనారోగ్యంపై 'ఈనాడు' దారుణ కథనాలు
- కర్నూలు ఆసుపత్రిలో చేరటంపైనా విషపూరిత కల్పనలు
- డాక్టర్ హితేష్ నిపుణుడైన కార్డియాలజిస్టు అనేది చెప్పరేం?
- విశ్వభారతి ఆస్పత్రి కార్డియాలజీకి పేరున్నదని ప్రస్తావించరేం?
- అది వదిలి ఆ వైద్యుడు పులివెందుల వాసి అని మాత్రమే రాస్తారా?
- ఎంపీ అవినాశ్‌ను పరామర్శించిన వారి కులాన్ని ప్రస్తావించటమేల?
- రామోజీని పరామర్శించినవారి కులాల గురించి ఎన్నడైనా రాశారా?.. సీబీఐ దర్యాప్తు అంటే.. అంబులెన్స్‌ను పిలిపించి డ్రామాలాడిందెవరు?
- నోటికి మాస్కు, నడుముకు బెల్టుతో అనారోగ్యపు 'సెటప్' చేసుకున్నదెవరు?
- ఇంతటి దుర్మార్గాలు స్వయంగా చేసి.. ఇతరులపై ఆరోపణలేల?

- వివరాలు 4లో

ఇదండీ వరస



..వచ్చే ఎన్నికల్లో ఏ మొహం పెట్టుకొని ఓట్లు అడగాలో అర్థం కావట్లేదు!



'పీపుల్స్ మార్చ్'కు అతిరథులు

- భట్టి చేపట్టిన పాదయాత్రలో భాగంగా పలు నియోజక వర్గాల్లో భారీ బహిరంగ సభలు
- జడ్చర్లకు రాజస్తాన్ సీఎం గెహ్లాట్
- నల్లగొండకు ప్రియాంక, ఖమ్మంలో ముగింపు సభకు రాహుల్‌గాంధీ
- తేదీల ఖరారుకు కాంగ్రెస్ ముఖ్యనేతల కసరత్తు

5లో

'రైతు వేదిక'లు ఇక ప్రజా వేదికలు



- ఇకపై అన్ని శాఖల సమావేశాలు పెట్టుకునే వీలు
- కీలక నిర్ణయం తీసుకున్న వ్యవసాయ శాఖ

సాక్షి, హైదరాబాద్: 'రైతు వేదిక'లు ఇక నుంచి 'ప్రజా వేదిక'లుగా రూపాంతరం చెందనున్నాయి. రైతులకు సంబంధించిన సమావేశాలే కాకుండా ఇతర ప్రభుత్వ లబ్ధిదారులకు సంబంధించిన మీటింగులు పెట్టుకునేలా వీలు కల్పిస్తూ వ్యవసాయశాఖ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు జిల్లాలకు అంతర్గత ఉత్తర్వులు జారీ చేసింది. ఇక నుంచి అన్ని ప్రభుత్వ శాఖలూ తమ కార్యక్రమాలను రైతు వేదికగా ప్రజలకు తెలియజేసేందుకు ఏర్పాట్లు చేసుకోవచ్చు. ప్రభుత్వ పథక లబ్ధిదారులందరినీ రైతు వేదికల వద్దకు పిలిచి వారికి అవగాహన కల్పించొచ్చు. కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, ఆసరా పింఛన్లు తదితర పథకాలపై అవగాహన కల్పించాలంటే ఇకపై రైతు వేదికలనే కేంద్రంగా చేసుకోవచ్చు. ఆ మేరకు మండల అధికారులు చర్యలు తీసుకోవాలని, వాటిని ఉపయోగించుకోవాలని వ్యవసాయశాఖ విజ్ఞప్తి చేసింది.

వినియోగంలోకి తీసుకురావాలన్న ఉద్దేశంతోనే...

వ్యవసాయ ఉత్పత్తిని పెంచాలన్న ప్రధాన లక్ష్యంతో పాటు సాంకేతిక వ్యవసాయంతో పాటు వివిధ అంశాలపై రైతులకు అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం రైతు వేదికలకు రూపకల్పన చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా 2,601 రైతు వేదికలను ఏర్పాటు చేసింది. ఒక్కో రైతు వేదికకు ప్రభుత్వం రూ.12 లక్షలు ఖర్చు చేసింది. మైకులు, కుర్చీలు, ఇతర మౌలిక సదుపాయాలతో వీటిని సుందరంగా తీర్చిదిద్దారు. అయితే ఇప్పటివరకు అనుకున్నంత స్థాయిలో రైతు వేదికలు పూర్తి స్థాయిలో వినియోగంలోకి రాలేదన్న భావన సర్కారులో నెలకొంది. అందుకోసం ఇకపై అన్ని ప్రభుత్వ శాఖలు

మిగతా 2వ పేజీలో ▶

రూ. 550 కోట్ల విలువైన భూమిని రూ.40 కోట్లకే కాజేస్తారా?

బీఆర్‌ఎస్ నేతలపై బండి సంజయ్ ఆగ్రహం

- వందల కోట్ల విలువైన భూములను చౌకగా ఎలా కొట్టేస్తారు?
- 111 జీవో ఎత్తివేత వెనుక లక్షల కోట్ల స్కాం
- బీఆర్‌ఎస్, కాంగ్రెస్ కలిసే పోటీ చేస్తాయి..



కైలాస్‌నగర్: గజానికి లక్షా పదివేల రూపాయల ధర పలికే హైదరాబాద్ కోకాపేట భూములను కారుచౌకగా గజానికి రూ.7,500 చొప్పున 11 ఎకరాలను బీఆర్‌ఎస్ పార్టీకి ఎలా తీసుకుంటారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్ ప్రశ్నించారు. ఆ భూములేమైనా బీఆర్‌ఎస్ పార్టీ నాయకుల అయ్య జాగీరా? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఓ శుభకార్యానికి హాజరైన ఆయన ఆ తర్వాత మీడియాతో మాట్లాడారు. రూ.550 కోట్ల విలువైన కోకాపేట భూమిని కేవలం రూ.40 కోట్లకు కాజేశారని సంజయ్ ఆరోపించారు. ఆ భూముల స్వాధీనం కోసమే కేబినెట్ సమావేశం పెట్టిన సీఎం కేసీఆర్, ఈ విషయం ప్రజలకు తెలియకుండా దాచారన్నారు. పేదల కోసం స్థలాలే లేవని ముఖ్యమంత్రి చెబుతున్నారని, అలాంటప్పుడు బీఆర్‌ఎస్ పార్టీకి భూములెలా వచ్చాయని ప్రశ్నించారు. పార్టీ కార్యాలయాల పేరిట

మిగతా 2వ పేజీలో ▶

క్లుప్తంగా...

యాదాద్రికి భారీగా భక్తులు

యాదగిరిగుట్ట: వేసవి సెలవులు ముగుస్తుండటంతో యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి భక్తుల తాకిడి పెరుగుతోంది. ఆదివారం శ్రీస్వామి వారిని దర్శించుకోవడానికి భక్తులు పెద్ద సంఖ్యలో రావడంతో రద్దీ నెలకొంది. స్వామి వారి ధర్మదర్శనానికి 3 గంటలకు పైగా సమయం, వీఐపీ దర్శనానికి గంట సమయం పట్టింది. ఆలయ క్యూలైన్లు, ముఖ మండపం, ప్రసాద విక్రయశాల, బస్టాండ్, విష్ణు పుష్కరిణి, కల్యాణకట్ట వంటి ప్రాంతాల్లో భక్తులు ఎక్కువగా కనిపించారు. కాగా, శ్రీస్వామిని 35 వేల మందికి పైగా భక్తులు దర్శించుకొని తమ మొక్కులు తీర్చుకున్నారు. నిత్యకల్యాణ మండపం భక్తులతో నిండిపోయింది. కాగా, వివిధ పూజలతో ఆదివారం ఒక్క రోజు రూ.50,96,399 ఆదాయం వచ్చినట్లు అధికారులు వెల్లడించారు.

తుగ్లక్ పాలనలా కేంద్రం నిర్ణయం: గుత్తా



చౌటుప్పల్: రూ.2వేల నోట్ల రద్దు విషయంలో కేంద్ర ప్రభుత్వ నిర్ణయం అనాలోచితమని, నోట్లను వారే ప్రవేశపెట్టి తిరిగి వారే రద్దు చేయడం తుగ్లక్ పాలనలా కన్పిస్తోందని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి విమర్శించారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్‌లో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రస్తుతం రూ.2వేల నోట్ల రద్దు అంశం ప్రజలను ఇబ్బందిపెట్టే విధంగా ఉందన్నారు. గతంలో రూ.500, రూ.1000 నోట్ల రద్దు సమయంలో ప్రజలు ఎన్నో అవస్థలుపడ్డారని గుర్తు చేశారు. అర్థం పర్థం లేని విధానాలతో ఆర్థిక వ్యవస్థను కుదేలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రపంచంలోనే అతి ప్రజాస్వామ్యం, అత్యంత జనాభా కలిగిన దేశంలో పాలకుల నిర్ణయాలు ప్రజలకు మేలు జరిగేవిగా ఉండాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా సరైన ఆలోచన, విజ్ఞతతో నిర్ణయాలు తీసుకోవాలని గుత్తా సూచించారు.

టీఎస్ ఈఈయూ రాష్ట్ర అధ్యక్షుడిగా సంజీవ రెడ్డి



హన్మకొండ: తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్-327 రాష్ట్ర కమిటీ అధ్యక్షుడిగా జి.సంజీవ రెడ్డి, సెక్రటరీ జనరల్‌గా ఇనుగాల శ్రీధర్ ఎన్నికయ్యారు. ఆదివారం హనుమకొండలోని యూనియన్ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో రాష్ట్ర కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి పి.రాజిరెడ్డి తెలిపారు. సీనియర్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎస్.ప్రభాకర్‌గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నీలం బలేష్, ప్రధాన కార్యదర్శులుగా పి.రాజిరెడ్డి, జి.అశోక్ వర్ధన్ రెడ్డి, పి.అరుణ, చీఫ్ వైస్ ప్రెసిడెంట్‌లుగా పి.రమేష్, సి.హెచ్.నరేందర్‌రెడ్డి, డి.గోవిందరావు, కె.వెంకటేశ్వర్‌రావు, వైస్ ప్రెసిడెంట్లుగా కె.బాబు, ఎ.రవికుమార్, బి.జస్వంత్ కుమార్, తులసి, ఎం.సత్యనారాయణరెడ్డి, పెంటయ్యాచారి, పి.మధుసూదన్ రెడ్డి, మీడియా సెక్రటరీగా కె.శ్రీనివాస్ గౌడ్, కోశాధికారిగా కె.భూపాల్ రెడ్డి ఎన్నికైనట్లు వివరించారు.

'సహకార చైర్మన్ పదవి గంగపుత్రులకే ఇవ్వాలి'




పంజగుట్ట (హైదరాబాద్): తెలంగాణ రాష్ట్ర మత్స్యపారిశ్రామిక సహకార ఫెడరేషన్ చైర్మన్ పదవిని గంగపుత్రులకే ఇవ్వాలని గంగపుత్ర చైతన్య సమితి మంగిలిపల్లి శంకర్ డిమాండ్ చేశారు. అలాకాదని ఫెడరేషన్ చైర్మన్ పదవిని ముదిరాజ్ కులస్థులకు ఇస్తే సామూహిక ఆమరణ నిరాహార దీక్ష చేస్తామని హెచ్చరించారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం తెలంగాణ ప్రదేశ్ గంగపుత్ర సంఘం అధ్యక్షుడు గడప శ్రీహరి, తెలంగాణ రాష్ట్ర గంగపుత్ర సంఘం అధ్యక్షుడు మెట్టు ధనరాజ్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ముదిరాజ్‌లకు ప్రాధాన్యతనిస్తూ గంగపుత్రులను అణగదొక్కేలా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. గ్రామాల్లో గంగపుత్రులు ఎవరైనా చెరువు వద్దకు వెళితే ముదిరాజ్‌లు దాడులు చేస్తున్నారని చెప్పారు. సమావేశంలో వివిధ గంగపుత్ర సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పెద్దాయనకు రెస్ట్ ఇద్దాం..

- ఎమ్మెల్యే వనమాను ఉద్దేశించి డీహెచ్ వ్యాఖ్యలు



పాల్వంచ రూరల్: కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు 80 ఏళ్ల వయసుకు చేరుకున్నారని, ఇక ఆయనకు రెస్ట్ ఇద్దామని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ సంచాలకుడు గడల శ్రీనివాసరావు అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం ఉల్వనూరులో జీఎస్సార్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన వాలీబాల్ టోర్నీ ఆదివారం ముగిసింది. విజేతలకు బహుమతుల సందర్భంగా డీహెచ్ మాట్లాడుతూ.. స్వస్థలమైన కొత్తగూడెం ప్రజలకు సేవ చేయాలన్నదే తన లక్ష్యమని, అందుకే జీఎస్సార్ ట్రస్ట్ ఏర్పాటు చేశానన్నారు. అయితే ట్రస్ట్ వద్దకు ప్రజలు రాకుండా కొందరు బెదిరిస్తున్నారని ఆరోపించారు. రాబోయే రోజుల్లో ప్రజల ముందుకొస్తానని, అందరూ సహకరించాలని కోరారు. ప్రస్తుత ఎమ్మెల్యే వనమా గత ఎన్నికల్లో ఒక్క చాన్స్ ఇవ్వండంటే ఇచ్చామని, ఇంకెన్నిసార్లు ఇస్తామని ప్రశ్నించారు.



➤ కొండాపూర్‌లో మ్యూజియాన్ని మూడేళ్లుగా మూసి పెట్టిన కేంద్ర పురావస్తు సర్వేక్షణ సంస్థ (ఏఎస్ఐ), అంతకంటే పెద్ద ఘనకార్యాన్నే చేసింది. పన్నెండేళ్ల క్రితం తవ్వకాల్లో వెలుగు చూసిన వస్తువులను సంబంధిత ఉన్నతాధికారి ఇప్పటివరకు వాటిని మ్యూజియంకు హ్యాండోవర్ చేయలేదు. ఆ తవ్వకాల్లో ఏయే వస్తువులు లభించాయో నివేదికనూ అందజేయలేదు. తవ్వకాల్లో దొరికిన వస్తువులెన్ని? అవి ఎక్కడున్నాయి? వాటిల్లో అన్నీ ఉన్నాయా? లేదా? వంటి విషయాలేవీ బయటి ప్రపంచానికి చెప్పలేదు. నివేదిక ఇవ్వకున్నా ఏఎస్ఐ పన్నెండేళ్లుగా చేష్టలుడిగి చూస్తుండటం విడ్డూరం. పుష్కర కాలం కిందట ఆ తవ్వకాలకు నేతృత్వం వహించిన అధికారి, ఈ నెలాఖరుకు పదవీ విరమణ చేయబోతున్నారు. దీంతో తవ్వకాల్లో దొరికిన చారిత్రక సంపద విషయం గందరగోళంగా మారింది.

తవ్వి తీశారు.. అప్పగించటం మరిచారు

- 2009–11 మధ్య కొండాపూర్‌లో తవ్వకాలు
- వెలుగులోకి శాతవాహన కాలంనాటి వస్తువులు
- నివేదిక ఇవ్వకుండా, అప్పగించకుండా వెళ్లిపోయిన అధికారి
- పుష్కరకాలంగా అజ్ఞాతంలో నాటి చారిత్రక సంపద
- ఈ నెలాఖరుతో రిటైర్ కాబోతున్న అధికారి
- అజ్ఞాత సంపద విషయంలో అనుమానాలు

సాక్షి, హైదరాబాద్: సంగారెడ్డికి చేరువలో ఉన్న కొండాపూర్ అద్భుత శాతవాహన కేంద్రం. క్రీ.పూ.2వ శతాబ్దం–క్రీ.శ.2వ శతాబ్దం మధ్య ఇది వ్యాపార, ఆధ్యాత్మిక పట్టణం. 19వ శతాబ్ద ప్రారంభం, 1940, 1970ల్లో పలుమార్లు ఇక్కడ తవ్వకాలు జరిగాయి. చరిత్రపరిశోధకులు గొప్పవిగా భావించే అనేక ఆధారాలు వెలుగు చూశాయి. రోమన్లు వచ్చి ఇక్కడ స్థిరపడి అంతర్జాతీయస్థాయిలో వాణిజ్యాన్ని నిర్వహించినట్టు తేలింది. అగస్టస్ కాలం నాటి బంగారు నాణేలూ ఇక్కడ దొరికాయి. ప్రస్తుతం ప్రపంచాన్ని ఏలుతున్న చైనా పోర్సలీస్ బొమ్మలను తలదన్నే బొమ్మలు అక్కడ 2 వేల ఏళ్ల నాడే మనుగడలో ఉన్నట్టు తేలింది. నాటి బంగారు ఆభరణాలు, మణులు, వైఢూర్యాలు, కెంపులు, పచ్చలలాంటివెన్నో వెలుగు చూశాయి. ఓ పట్టణానికి సంబంధించిన అవశేషాలు కనిపించాయి. దీంతో అక్కడ 86 ఎకరాల స్థలాన్ని ఏఎస్ఐ తన ఆధీనంలోకి తీసుకుని ఓ మ్యూజియంను నిర్మించింది. తవ్వకాల్లో వెలుగు చూసిన వాటిల్లోంచి కొన్నింటిని ప్రదర్శనకు ఉంచింది.

మరోసారి తవ్వకాలు..

2009 నుంచి 2011 వరకు ఏఎస్ఐ మరోసారి తవ్వకాలు జరిపింది. భువనేశ్వర్ కేంద్రంగా ఉన్న తవ్వకాల విభాగం (4) సూపరింటెండెంట్ ఆర్కియాలజిస్టు మహేశ్వరి ఆధ్వర్యంలో తవ్వకాలు జరిగాయి. అందులోనూ వేల సంఖ్యలో విలువైన వస్తువులు, శాతవాహన కాలం నాటి నాణేలు భారీ గా వెలుగు చూశాయి. అయితే.. ఏయే వస్తువులు దొరికాయి? వాటి ప్రత్యేకతలేంటి? అనే నివేదికను మాత్రం ఏఎస్ఐ బహిర్గతం చేయలేదు. ఎంతోమంది అడిగినా స్పందించలేదు. ఈలోపు అధికారి మహే శ్వరి వివిధ ప్రాంతాలకు బదిలీ అయ్యారు. ఆమె నివేదిక పోవడం, లభించిన వస్తువులను ఇక్కడి అధికారులకు హ్యాండోవర్ చేయకపోవడం విమర్శలకు తావిస్తోంది. వాటిని పెట్టిన గది తాళంచెవులు కూడా అప్పగించలేదు. దీంతో తవ్వి తీసినా కూడా అవి అజ్ఞాతంలోనే ఉండిపోయాయి.



పరిశోధనలకు ఆస్కారమే లేక..

కర్ణాటకలోకి మస్కిలో తవ్వకాలు జరిపినప్పుడు 33 బంగారు నాణేలు వెలుగు చూశా యి. మస్కి తవ్వకాల్లో లభించిన 33 ఫనమ్ బంగారు నాణేల్లో కేవలం ఒకటి మాత్రమే హోయసల రాజ్యానిదని, మిగతావన్నీ అంతకు చాలా ముందుగా ఉన్న విష్ణుకుండినులు సహా ఇతర పాలకులు అని వాటిని పరిశోధించిన ప్రముఖ నాణేల నిపుణుడు డాక్టర్ రాజారెడ్డి తేల్చారు. అలాంటి కొత్త విషయాలు కొండాపూర్‌లో 2009లో జరిపిన తవ్వకాల్లో దొరికిన నాణేల్లోనూ ఉంటాయన్న ఉద్దేశంతో వాటి పరిశోధనకు కేంద్రప్రభుత్వం నుంచి 2015లో అనుమతి పొందారు. అయితే.. నాటి అధికారి వాటిని హ్యాండోవర్ చేయకపోవటంతో పరిశోధనకు కేటాయించలేమని అధికారులు చెప్పారు. అలా పరిశోధనలేవీ జరగలేదు.

కొత్త రేషన్ కార్డులు ఇప్పట్లో లేనట్టే!

- ఎన్నికల నేపథ్యంలో జూన్‌లో కొత్త కార్డుల జారీ అంటూ సోషల్ మీడియాలో ప్రచారం
- అది అవాస్తవమన్న పౌరసరఫరాల శాఖ.. అలాంటి ఆలోచనేదీ లేదని వెల్లడి
- ఇప్పటికే పేద కుటుంబాల సంఖ్యకు మించి కార్డులు ఉన్నాయంటున్న అధికార వర్గాలు
- పాత కార్డుల్లో కొత్త పేర్ల చేర్పు కోసమే పెండింగ్‌లో లక్షలాది దరఖాస్తులు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కొత్త రేషన్ కార్డులను ఇప్పట్లో జారీ చేసే అవకాశం కనిపించడం లేదు. త్వరలో ఎన్నికలు ఉన్న నేపథ్యంలో జూన్ నుంచి కొత్త రేషన్ కార్డుల జారీని ప్రారంభించనున్నట్టు సోషల్ మీడియాలో కొన్ని రోజులుగా ప్రచారం సాగుతోంది. దీంతో కొత్త రేషన్ కార్డుల కోసం ఎదురుచూస్తున్న లక్షలాది మంది దీనిపై ఆరా తీయడం మొదలుపెట్టారు. కానీ ప్రస్తుతం కొత్త రేషన్ కార్డుల జారీ విషయంలో ఎలాంటి ప్రతిపాదన లేదని.. ప్రభుత్వం నుంచి ఆ దిశగా ఆలోచనేదీ లేదని పౌర సరఫరాల శాఖ అధికారులు స్పష్టం చేస్తున్నారు.

ఇప్పటికే కుటుంబాలను మించి కార్డులు

రాష్ట్రంలో జనాభా లెక్కల ప్రకారం చూస్తే.. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న పేద కుటుంబాల కన్నా అత్యధిక సంఖ్యలో ఆహార భద్రత కార్డులు ఉన్నాయని పలు సర్వేలు తేల్చాయి. అనర్హులకు ఇచ్చిన కార్డులను ఏరివేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఒకటి రెండు సార్లు ఆలోచించినా.. ప్రజల నుంచి వ్యతిరేకత వస్తుందనే ఉద్దేశంతో మిన్నకుండిపోయింది. 2018 ఎన్నికలకు ముందు రేషన్‌కార్డుల కోసం దరఖాస్తులు ఆహ్వానించగా.. సుమారు 9 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. ఆ దరఖాస్తులను పరిశీలించిన సర్కారు.. 2021 వరకు పలు దఫాల్లో 3.11 లక్షల కార్డులను జారీ చేసింది. ఆ తర్వాత కొత్త కార్డుల జారీ ప్రక్రియ నిలిచిపోయింది. అయితే కుటుంబంలో ఎవరైనా మరణిస్తే.. రేషన్ కార్డు నుంచి సదరు వ్యక్తి పేరును తొలగిస్తున్న అధికారులు, కొత్తగా జన్మించిన వారి పేర్లను చేర్చడం లేదు. ఈ మార్పులు చేర్పుల కోసం ఎఫ్ఎస్సీఆర్ఎం వెబ్‌సైట్‌లో చేసుకుంటున్న దరఖాస్తుకే ఇప్పటివరకు మోక్షం కలగలేదు.

90.14 లక్షల ఆహార భద్రత కార్డులు

ప్రస్తుతం రాష్ట్రంలోని 33 జిల్లాల పరిధిలో 90,14,263 ఆహార భద్రత కార్డులు ఉన్నాయి. ఈ కార్డుల్లో ఉన్న యూనిట్ల (కుటుంబ సభ్యుల) సంఖ్య 2.83 కోట్లు. అంటే రాష్ట్ర జనాభాలో మూడింట రెండొంతుల మేర ప్రజలు వీటి పరిధిలో ఉన్నారు. ఇక రేషన్ కార్డుల్లో జాతీయ ఆహార భద్రత చట్టం (ఎన్ఎఫ్ఎస్ఏ) కింద 48.86 లక్షల కార్డులు, అంత్యోదయ అన్న యోజన పథకం (ఏఏవై) కింద 5.62 లక్షల కార్డులు ఉండగా.. రాష్ట్ర ప్రభుత్వమే పూర్తి సబ్సిడీ భరిస్తూ ఇచ్చిన ఆహార భద్రత కార్డులు (ఎఫ్ఎస్సీ) 35.66 లక్షల మేర ఉన్నాయి. ఇందులో 5,211 కార్డులు అన్నపూర్ణ పథకం కింద వినియోగంలో ఉన్నాయి. అన్నపూర్ణ పథకం కింద కార్డుకు 10 కిలోల ఉచిత బియ్యం పంపిణీ చేస్తారు. ఏఏవై, అన్నపూర్ణ మినహా మిగతా రేషన్ కార్డులపై ప్రతినెలా కుటుంబంలోని ఒక్కొక్కరికి రూపాయికి కిలో చొప్పున 6 కిలోల బియ్యాన్ని ప్రభుత్వం అందిస్తుంది. కరోనా ప్రబలిన నేపథ్యంలో 2021 నుంచి ఉచితంగానే బియ్యం పంపిణీ చేస్తున్నారు. మొత్తంగా రాష్ట్రంలో నెలకు 1.80 లక్షల టన్నుల బియ్యాన్ని పేదలకు పంపిణీ చేస్తున్నారు.

ఆ ప్రచారంలో నిజం లేదు

గత ఎన్నికల ముందు ప్రభుత్వం కొత్త రేషన్‌కార్డుల కోసం దరఖాస్తులు ఆహ్వానించినట్లుగానే.. ఈసారి కూడా అవకాశం ఇచ్చిందని సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. జూన్ నుంచే కొత్త రేషన్ కార్డులను జారీ చేయనున్నట్టు ప్రభుత్వం నిర్ణయించిందన్న ప్రచారమూ జరిగింది. అయితే ఈ ప్రచారాన్ని పౌర సరఫరాల శాఖ తోసిపుచ్చింది. కొత్త రేషన్‌కార్డుల కోసం ప్రభుత్వం ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని 'సాక్షి'కి స్పష్టం చేసింది.

రాష్ట్రంలో రేషన్‌కార్డుల వివరాలివీ..

కార్డు తరహా	కార్డుల సంఖ్య	రేషన్ అందే పేదల సంఖ్య
జాతీయ ఆహార భద్రత చట్టం	48,85,730	1,76,33,190
అంత్యోదయ అన్న యోజన	5,62,440	15,36,410
రాష్ట్రం తరఫున ఎస్ఎఫ్సీ	35,60,882	91,64,455
అన్నపూర్ణ	5,211	5,423
మొత్తం	90,14,263	2,83,39,478

.. ధ్రువీకరణ పత్రాలు అక్కర్లేదు

▶ మొదటి పేజీ తరువాయి

చేసేందుకు పలువురు ప్రయత్నించారు. అయితే రూ. 2,000 నోట్లను తీసుకొనేందుకు ఆభరణాల సంస్థలు సందేహించి, నగదు కొనుగోళ్ల పరిమితి నిబంధనల ప్రకారం ధ్రువీకరణ పత్రాలు అడిగినట్లు సమాచారం. రూ. 2,000 నోట్ల రద్దుతో చిన్న వ్యాపారులపై ఎటువంటి ప్రభావం ఉండదని, కానీ పెద్ద సంఖ్యలో ఆ నోట్లను నిల్వ చేసుకున్న సంపన్నులపై ప్రభావం ఉండొచ్చని అఖిల భారత ట్రేడర్ల సమాఖ్య సీఏఐటీ పేర్కొంది.

పసిడికి '2000' బూస్ట్!

- రూ. 2,000 నోట్ల ఉపసంహరణతో కొనుగోళ్లపై ఆసక్తి

ముంబై: రూ. 2,000 నోట్లను ఉపసంహరిస్తున్నట్లు ఆర్‌బీఐ ప్రకటించిన నేపథ్యంలో దేశీయంగా పసిడి, వెండి కొనుగోళ్లపై ప్రజల్లో ఆసక్తి పెరిగింది. రూ. 2,000 నోట్లతో కొనుగోళ్లు జరిపే ఉద్దేశంతో కొనుగోలుదారులు పెద్ద ఎత్తున ఆరాలు తీస్తున్నట్లు ఆభరణాల విక్రయ సంస్థలు వెల్లడించాయి. అయితే కేవైసీ (నో యువర్ కస్టమర్) నిబంధనలను కఠినంగా పాటిస్తుండటంతో గత రెండు రోజులుగా వాస్తవంగా లావాదేవీలు ఆ స్థాయిలో ఏమీ జరగలేదని పేర్కొన్నాయి. కానీ రూ. 2,000 నోట్లకు బదులుగా పసిడిని విక్రయించేందుకు కొందరు జ్యువెలర్లు 5–10 శాతం ఎక్కువ వసూలు చేయడం మొదలుపెట్టాయని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఫలితంగా 10 గ్రాముల పసిడి రూ. 66,000 పలుకుతోందని వివరించాయి. మరోవైపు 2016లో పెద్ద నోట్ల రద్దు సమయంలోలాగా ఆందోళనకర పరిస్థితేమీ లేదని ఆభరణాల సంస్థల సమాఖ్య జీజేసీ తెలిపింది. 'రూ. 2,000 నోట్లతో బంగారం లేదా వెండిని కొనుగోలు చేసేందుకు చాలా ఎంక్వైరీలు వచ్చాయి. కానీ కఠినతరమైన కేవైసీ నిబంధనల కారణంగా వాస్తవంగా జరిగిన కొనుగోళ్లు తక్కువే' అని జీజేసీ చైర్మన్ సైయ్యమ్ మెహ్రా తెలిపారు. నోట్ల ఉపసంహరణకు నాలుగు నెలల సమయం ఉన్నందున ప్రజల్లో తీవ్ర భయాందోళనలు ఏమీ లేవని వివరించారు.



..రూ.40 కోట్లకే కాజేస్తారా?

▶ మొదటి పేజీ తరువాయి

కోట్లాది రూపాయల విలువైన స్థలాలను కారుచౌకగా కొట్టేస్తున్నారని ఆరోపించారు. 111జీవో ఎత్తివేత వెనుక లక్షల కోట్ల స్కాం దాగి ఉందని సంజయ్ ఆరోపించారు. గతంలో కాంగ్రెస్ పార్టీ కూడా బోయినపల్లిలో 10 ఎకరాలకు పైగా స్థలాన్ని కొట్టేసిందని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ కలిసే దోచుకుంటున్నాయని, అధికారాన్ని పంచుకున్నాయని, వచ్చే ఎన్నికల్లోనూ ఆ రెండు పార్టీలు కలిసే పోటీ చేయనున్నాయని చెప్పారు. కోకాపేట భూముల కేటాయింపు ఉత్తర్వులను తక్షణమే ఉపసంహరించుకోవాలని, ఆ స్థలంలో పేదలకు ఇళ్లు కట్టివ్వాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని, సర్కారు భూ భాగోతాన్ని ప్రజల ముందు ఎండగడతామని హెచ్చరించారు.

ప్రత్యామ్నాయం బీజేపీయే..

బీజేపీ గ్రాఫ్‌ను తగ్గించేందుకు తమ నేతలు కొందరు పార్టీని వీడుతున్నారంటూ ఆ రెండు పార్టీలు, ఒక విభాగం మీడియా దుష్ప్రచారం చేస్తున్నాయని సంజయ్ విమర్శించారు. కర్ణాటక ఎన్నికలకు, తెలంగాణకు ఏం సంబంధమని ప్రశ్నించారు. బీజేపీ 18 రాష్ట్రాల్లో అధికారంలో ఉందని, ఒక్క రాష్ట్రంలో ఓడిపోగానే తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రాదంటున్నారని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్‌కు ప్రత్యామ్నాయం బీజేపీయేనని, వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

ఉన్నతవిద్యకు సారథులు

- ఎన్ఈపీ సారథి పేరుతో యూజీసీ సరికొత్త కార్యక్రమం
- ఉన్నత విద్యాసంస్థలు, వర్సిటీల్లో స్టూడెంట్ అంబాసిడర్ల నియామకం
- కొత్త విద్యావిధానంపై అవగాహన, ఉన్నతవిద్య ప్రోగ్రామ్‌ల ప్రోత్సాహమే లక్ష్యం

సాక్షి, అమరావతి: ఉన్నతవిద్యలో మరిన్ని సంస్కరణల దిశగా యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) అడుగులు వేస్తోంది. నూతన జాతీయ విద్యావిధానం (ఎన్ఈపీ)పై విద్యార్థులకు అవగాహన కల్పించడంతోపాటు అభిప్రాయ సేకరణ చేసేలా కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. దీనికి 'నూతన విద్యావిధానం–స్టూడెంట్ అంబాసిడర్ ఫర్ అకడమిక్ రిఫామ్స్ ఇన్ ట్రాన్స్‌ఫార్మింగ్ హయ్యర్ ఎడ్యుకేషన్ (ఎన్ఈపీ సారథి)అని పేరుపెట్టింది. ఇందులో విద్యార్థులను భాగస్వామ్యం చేస్తూ వారినే ఆయా వర్సిటీల్లో స్టూడెంట్ అంబాసిడర్లుగా నియమించనుంది. ఈ మేరకు ఉన్నత విద్యాసంస్థలు, వర్సిటీల నుంచి ముగ్గురు విద్యార్థుల పేర్లను ప్రతిపాదించాలని సూచించింది. ప్రతిపాదిత విద్యార్థుల్లో కమ్యూనికేషన్ స్కిల్స్, ఔట్‌రీచ్ ప్రోగ్రామ్‌లు నిర్వహించే సంస్థాగత సామర్థ్యాలు, సృజనాత్మకత, నాయకత్వ లక్షణాలతోపాటు బాధ్యతాయుత భావాలను కలిగి ఉండాలని సూచించింది.

దేశవ్యాప్తంగా 300 మంది ఎంపిక

వర్సిటీల నుంచి వచ్చిన ప్రతిపాదనల ఆధారంగా జూలైలో 300 మందిని ఎన్ఈపీ సారథులుగా ఎంపిక చేయనుంది. వీరు ఆయా క్యాంపస్‌లలో కొత్త విద్యావిధానంపై సంపూర్ణ అవగాహన కల్పించడంతోపాటు ఎన్ఈపీ అమలులో విద్యార్థులు చురుగ్గా పాల్గొనేలా ప్రోత్సహించడం, ఎన్ఈపీ కార్యక్రమం అమలును అర్థం చేసుకోవడానికి యూజీసీకి ఫీడ్‌బ్యాక్ మెకానిజం అందించడం, విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషిచేయడంలో కీలకపాత్ర పోషించనున్నారు. ఎన్ఈపీ సారథి సేవలకు గుర్తింపుగా యూసీజీ ప్రత్యేక సర్టిఫికెట్ ఇవ్వనుంది. వివిధ స్థాయిల్లో ఉన్నతవిద్యను అభ్యసిస్తూ.. సర్టిఫికెట్, డిప్లొమా, అండర్ గ్రాడ్యుయేట్, పోస్టు గ్రాడ్యుయేట్ డిగ్రీని చేస్తున్న విద్యార్థులు ఈ ప్రోగ్రామ్‌కు అర్హులు. ఎన్ఈపీ సారథికి ఎంపికైనవారు యూజీసీ అధికారిక సోషల్ మీడియాను వినియోగించుకోవచ్చు. వీరికి యూజీసీ ఆన్‌లైన్‌లో నిర్వహించే అన్ని ఈవెంట్స్‌కు శాశ్వత ఆహ్వానంతోపాటు యూజీసీ న్యూస్‌లెటర్‌లో వ్యాసాలను ప్రచురించే అవకాశం దక్కుతుంది.



'రైతు వేదిక'లు ఇక ప్రజా వేదికలు

▶ మొదటి పేజీ తరువాయి

కూడా వీటిని వినియోగించుకోవాలని సూచించింది. వీటిని నిత్యం ఏదో ప్రభుత్వ కార్యక్రమం జరిగే కేంద్రాలుగా తీర్చిదిద్దాలన్నదే ప్రస్తుత నిర్ణయంలోని ఉద్దేశం

ప్రైవేట్ కార్యక్రమాలకూ ఇవ్వాలన్న ప్రతిపాదనలు...

మండలానికి మూడు నాలుగు చొప్పున రైతు వేదికలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో రైతు వేదికలను ఆదాయ కేంద్రాలుగా మార్చాలని జిల్లాల్లోని కొందరు ప్రజాప్రతినిధులు వ్యవసాయశాఖ దృష్టికి తీసుకొచ్చారు. పెళ్లిళ్లు, పుట్టిన రోజు వేడుకలు, ఇతర శుభకార్యాలకు ఇవ్వడం వల్ల ఆయా కేంద్రాలకు ఆదాయం సమకూరుతుందని, దీనివల్ల రైతు వేదికల నిర్వహణ భారం ప్రభుత్వంపై ఉండదని చెప్పుకొచ్చారు. అయితే దీనిపై ప్రభుత్వ వర్గాల్లో మాత్రం భిన్నమైన అభిప్రాయం నెలకొంది. అలా చేయడం వల్ల ప్రభుత్వ ఉద్దేశం పక్కదారి పడుతుందని అంటున్నారు.

గతంలో ఒకట్రెండు చోట్ల ప్రభుత్వం దృష్టికి రాకుండానే రైతు వేదికలను పెళ్లిళ్లకు ఇచ్చారన్న ప్రచారం జరిగింది. దీంతో ప్రస్తుతానికి వాటిని ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రైవేట్ కార్యక్రమాలు, ఫంక్షన్లకు ఇవ్వొద్దని నిర్ణయించారు.

పెట్టుబడులకు పలు సంస్థలు

▶ మొదటి పేజీ తరువాయి

41,000 స్టోరేజ్ సేవలను అందిస్తున్న ఈ టెక్ దిగ్గజం.. హైదరాబాద్‌లో ముందుగా 100 మంది సాఫ్ట్‌వేర్ డెవలపర్లను నియమించుకోనుంది. ఆ తర్వాత రీసెర్చ్ డెవలప్‌మెంట్ కోసం మరికొంతమంది నిపుణులను నియమించుకుంటామని తెలిపింది. తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్)తోపాటు స్థానిక విద్యా సంస్థలతో కలిసి పనిచేయనున్నట్లు వివరించింది. రైట్ సాఫ్ట్ వేర్ కంపెనీ ప్రతినిధి బృందం కూడా ఆదివారం కేటీఆర్‌తో సమావేశమైంది. హైదరాబాద్‌లో త్వరలో జరిగే తమ డెవలప్‌మెంట్ సెంటర్ ప్రారంభోత్సవానికి ఆయన్ను ఆహ్వానించింది. ఈ కొత్త సెంటర్‌తో 500 మందికి ఉద్యోగ అవకాశాలు లభించడంతో పాటు రాష్ట్రంలోని పలు విద్యాసంస్థలతో కంపెనీకి భాగస్వామ్యం ఏర్పడుతుందని తెలిపింది. త్వరలో వరంగల్ నగరంలో ఒక డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. ఇక బ్యాంకింగ్, కమర్షియల్ బ్యాంకింగ్, ఇన్వెస్ట్‌మెంట్ రంగాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న 'చార్లెస్ స్క్వాబ్ కార్పొరేషన్'ప్రతినిధి బృందం కూడా మంత్రితో భేటీ అయ్యింది. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని కేటీఆర్ ఈ సందర్భంగా వారిని కోరారు. టెక్సాస్‌కు చెందిన 'రేవ్ గేర్స్'కు చెందిన యాజమాన్య బృందం.. తెలంగాణలో ఉన్న పెట్టుబడి అవకాశాలపై మంత్రితో చర్చించారు. అనంతరం తెలంగాణలో తయారీ ప్లాంట్‌ను ఏర్పాటు చేసేందుకు 'రేవ్ గేర్స్'సంసిద్ధత వ్యక్తం చేసింది. మరోవైపు ప్రొడక్ట్ డెవలప్‌మెంట్, డిజైన్ థింకింగ్ కోసం అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేసేందుకు టెక్ జెన్స్ కంపెనీ ముందుకు వచ్చింది. టెక్‌జెన్స్ తెలంగాణ వ్యాపార కార్యకలాపాలలో కీలకపాత్ర పోషించే అవకాశం ఉందని ఆ సంస్థ ప్రెసిడెంట్ లక్ష్మి యనిగళ్ల, సీఈవో రఘు కొమ్మరాజు చెప్పారు.

'వీఎక్స్ఐ'డెలివరీ సెంటర్

మూడేళ్లలో 5వేల మందికి ఉద్యోగావకాశాలు

రాష్ట్ర రాజధానిలో మరో అంతర్జాతీయ సంస్థ పెట్టుబడి పెట్టనుంది. టెక్నాలజీ రంగంలో వినూత్న సేవలందిస్తున్న వీఎక్స్ఐ గ్లోబల్ సొల్యూషన్స్ హైదరాబాద్‌లో డెలివరీ సెంటర్ ఏర్పాటు చేయనుంది. అమెరికా పర్యటనలో ఉన్న రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీ రామారావుతో సంస్థ చీఫ్ హ్యూమన్ రిసోర్సెస్ ఆఫీసర్ (సీహెచ్ఆర్ఓ) ఎరికా బోగర్ కింగ్ హ్యూస్టన్‌ సమావేశమయ్యారు. ప్రభుత్వం సహకరిస్తే హైదరాబాద్‌లో డెలివరీ సెంటర్ ఏర్పాటు చేసేందుకు సంసిద్ధత వ్యక్తం చేశారు. ఇందుకు మంత్రి కేటీఆర్ వెంటనే ఆమోదం తెలిపారు. వీఎక్స్ఐ గ్లోబల్ సొల్యూషన్స్ నిర్ణయంతో టెక్ కంపెనీల గమ్యస్థానం హైదరాబాదే అన్న సంగతి మరోసారి స్పష్టమైందని వ్యాఖ్యానించారు. హైదరాబాద్‌లోని డైనమిక్ బిజినెస్ ఎకోసిస్టమ్ కారణంగానే డెలివరీ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నామని వీఎక్స్ఐ స్పష్టం చేసింది. మూడేళ్లలో ఐదువేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపింది.

మరింత పెరగనున్న ఉష్ణోగ్రతలు

సాక్షి, హైదరాబాద్

రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు మరింత పెరగనున్నాయి. పలు జిల్లాల్లో సాధారణ ఉష్ణోగ్రతల కంటే 1 నుంచి 3 డిగ్రీల మేర అధికంగా నమోదు కావచ్చని వాతావరణ శాఖ తెలిపింది. ఉత్తర తెలంగాణ జిల్లాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు 42 నుంచి 44 డిగ్రీల సెల్సియస్ మధ్యన, హైదరాబాద్ సమీప జిల్లాల్లో 39 నుంచి 41డిగ్రీల సెల్సియస్ మధ్య నమోదయ్యే అవకాశం ఉన్నట్లు వివరించింది. మరఠ్వాడ, ఉత్తర కర్ణాటక మీదుగా దక్షిణ తమిళనాడు వరకు ఉపరితల ద్రోణి కొనసాగుతోంది. దీని ప్రభావంతో రాష్ట్రంలో అక్కడక్కడా తేలికపాటి వానలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఆదివారం కరీంనగర్‌లో 45.1 డిగ్రీల సెల్సియస్ గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది.

ఆదివారం రాష్ట్రంలో అత్యధిక ఉష్ణోగ్రత నమోదైన ప్రాంతాలు

ప్రాంతం	జిల్లా	గరిష్ట ఉష్ణోగ్రత
కరీంనగర్	కరీంనగర్	45.1
లింగాపూర్	నిర్మల్	44.9
ముత్తారం	పెద్దపల్లి	44.9
కొమ్మెర	మంచిర్యాల	44.8
చాప్రాల	ఆదిలాబాద్	44.8

రాష్ట్రంలోని ప్రధాన కేంద్రాల్లో నమోదైన గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు (సెల్సియస్‌లో)

కేంద్రం	గరిష్టం	కనిష్టం	కేంద్రం	గరిష్టం	కనిష్టం
ఆదిలాబాద్	43.0	29.0	మహబూబ్‌నగర్	40.4	26.6
మెదక్	42.2	23.8	హైదరాబాద్	40.3	26.9
రామగుండం	42.2	25.0	హకీంపేట్	40.0	25.7
నిజామాబాద్	42.1	27.4	భద్రాచలం	39.6	26.0
హనుమకొండ	41.5	24.0	దుండిగల్	39.0	24.9
నల్లగొండ	41.5	23.0	ఖమ్మం	39.0	28.6

క్లుప్తంగా...

నేడు గువ్వలగుట్ట తండాకు గవర్నర్

గిరిజనుల ఆరోగ్యంపై తమిళిసై ఆరా



సాక్షి ప్రతినిధి, నల్లగొండ: నల్లగొండ జిల్లా చందంపేట మండలం గువ్వలగుట్ట తండాకు ఈనెల 22వ తేదీన గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ రానున్నారు. ఏళ్ల తరబడి అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్న అక్కడి గిరిజనుల అనారోగ్య పరిస్థితిపై వివరాలు అడిగి తెలుసుకోనున్నారు. ఆ గ్రామస్తుల్లో 50 శాతానికి పైగా ప్రజలు కిడ్నీ సంబంధ వ్యాధులతో బాధ పడుతున్నారు. ఏళ్ల తరబడి అక్కడి ప్రజలు ఎందుకు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారనే అంశంపై దృష్టి సారించి వారితో ముత్యాలమ్మ గుడిలో సమావేశమవుతారు. అక్కడి రైతులతోనూ చర్చించనున్నారు. ఉదయం 7 గంటలకు హైదరాబాద్‌లోని రాజ్‌భవన్ నుంచి బయల్దేరే గవర్నర్ ఉదయం 9:10 గంటలకు చింతపల్లికి చేరుకుని అక్కడ కాసేపు ఆగనున్నారు. అనంతరం 10 గంటలకు బయలుదేరి 12 గంటలకు గువ్వలగుట్ట తండాకు చేరుకోనున్నారు. మధ్యాహ్నం 12 గంటలనుంచి ఒంటి గంట వరకు అక్కడి ప్రజలు, రైతులతో సమావేశమవుతారు. అనంతరం గ్రామస్తులతో భోజనం చేసి మధ్యాహ్నం 2 గంటలకు బయలుదేరి దేవరకొండ అతిథి గృహానికి 3:15 గంటలకు చేరుకోనున్నారు. అర్ధగంట తరువాత అక్కడి నుంచి బయల్దేరి సాయంత్రం 6 గంటలకు హైదరాబాద్ చేరుకోనున్నారు.

31న బ్రాహ్మణ సముదాయం ప్రారంభం



పంజగుట్ట (హైదరాబాద్): గోపనపల్లిలో ఈ నెల 31వ తేదీన ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రారంభించనున్న ప్రారంభం కానున్న బ్రాహ్మణ సముదాయం (బ్రాహ్మణ ఆత్మగౌరవ భవనం) కార్యక్రమానికి ప్రతి బ్రాహ్మణుడు తప్పక హాజరు కావాలని భాగ్యనగర అర్చక పురోహిత సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు గట్టు శ్రీనివాసాచార్యులు కోరారు. ఆయన ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో కార్యదర్శి దోర్బల జగన్మోహన శర్మతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి ఎంతో ముందుచూపుతో బ్రాహ్మణుల కోసం గోపనపల్లిలో 10 ఎకరాల స్థలం, రూ.12 కోట్లు కేటాయించారని తెలిపారు. 30వ తేదీన చండీయాగం, సుదర్శన హోమంతో పూజలు ప్రారంభమవుతాయని, 31వ తేదీన ఉదయం 11 గంటలకు బ్రాహ్మణ సముదాయాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రారంభిస్తారని పేర్కొన్నారు.

బీసీలు మరో జాతీయ సమరానికి సిద్ధం కావాలి

వకుళాభరణం కృష్ణమోహన్ రావు

కాచిగూడ: బీసీలకు ప్రయోజనాలు కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్ రావు విమర్శించారు. ఈ వర్గాల హక్కులు సాధించుకోవడానికి జాతీయ స్థాయిలో మరో స్వాతంత్ర్య సమరానికి సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి ఆధ్వర్యంలో ఆదివారం కాచిగూడలో జరిగిన బీసీ ప్రతినిధుల సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. బీసీలను ఆదుకోకపోవడం, వ్యూహాత్మకంగా నిర్లక్ష్యం చేయడమేనన్నారు. ఈ తొమ్మిదేళ్లలో కేంద్రం బీసీల నిమిత్తం ఒక్క పథకం కూడా ఆరంభించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బడ్జెట్ కేటాయింపులూ నామమాత్రంగా చేశారని, రాష్ట్రంలో మాత్రం తమ ప్రభుత్వం ఏర్పాటయితే జనాభా మేరకు నిధులు మంజూరు చేస్తామని కల్లబొల్లి మాటలు చెబుతున్నారని విమర్శించారు. దేశంలో బీసీల అభివృద్ధిని, సంక్షేమాన్ని గాలికి వదిలేసి, రాష్ట్ర బీజేపీ నాయకులు శుష్క వాగ్దానాలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. నేడు దేశంలో బీసీలను రెండో తరగతి పౌరులుగా పరిగణిస్తున్నారనే భావన కలుగుతోందని వ్యాఖ్యానించారు. దేశంలోని బీసీలంతా సంఘటిత పోరుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

111 రద్దుపై సుప్రీంకోర్టుకు..!

న్యాయపోరాటానికి సన్నద్ధమవుతున్న స్వచ్ఛంద సంస్థలు

- జంట జలాశయాలను కాపాడుకోవాలంటున్న పర్యావరణవేత్తలు
- జీవో ఎత్తివేతతో పర్యావరణానికి పెను ముప్పు అంటూ ఆందోళన
- నిపుణుల కమిటీ నివేదికను ప్రజల్లోకి తీసుకెళ్లే యోచన



సాక్షి, హైదరాబాద్: జంట జలాశయాల పరిరక్షణ కోసం తెచ్చిన జీవో 111ను పూర్తిగా తొలగించడంపై స్వచ్ఛంద సంస్థలు న్యాయపోరాటానికి సన్నద్ధమవుతున్నాయి. భావితరాల కోసం జంట జలాశయాలను కాపాడుకోవలసిన అవసరముందంటూ గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన సూపర్ ఆర్డర్‌ను ధిక్కరించి ప్రభుత్వం జీవోను ఎత్తివేయడం పట్ల పర్యావరణ పరిరక్షణ సంస్థలు, సామాజిక వేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సుప్రీంకోర్టు ఆదేశాలను ధిక్కరిస్తూ ప్రభుత్వం జీవోను ఎత్తివేయడంపై ప్రముఖ పర్యావరణవేత్త ప్రొఫెసర్ పురుషోత్తమ్‌రెడ్డి విస్మయం వ్యక్తం చేశారు. సర్వోన్నత న్యాయస్థానం దూరదృష్టితో జీవో 111ను సమర్థించిందని చెప్పారు. ప్రభుత్వం ఎలాంటి నిపుణుల కమిటీని ఏర్పాటు చేయకుండానే ఏ విధమైన అధ్యయనం లేకుండానే జీవోను తొలగించిందన్నారు. జీవో 111పై తాము ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీ నివేదికను త్వరలో ప్రజల్లోకి తీసుకెళ్లనున్నట్లు చెప్పారు.

పర్యావరణానికి ముప్పు

ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ రిజర్వాయర్లు రాజధాని ప్రజల తాగునీటి అవసరాలను తీర్చడమే కాకుండా భారీ వరదల నుంచి నగరాన్ని కాపాడుతున్నాయి. 1908లో నగరాన్ని వరదలు ముంచెత్తినప్పుడు మరోసారి అలాంటి వరదల వల్ల నష్టపోకుండా ఉండేందుకు అప్పటి చీఫ్ ఇంజనీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య సూచన మేరకు ఈ రెండు జలాశయాలను నిర్మించారు. 1912లో మొదట గండిపేట్ రిజర్వాయర్ నిర్మాణం చేపట్టి 1917లో పూర్తి చేశారు. ఆ తరువాత 1921లో హిమాయత్‌సాగర్ నిర్మాణం ప్రారంభించి 1927 నాటికి వినియోగంలోకి తెచ్చారు. గ్రావిటీ ద్వారా నగరంలోని అన్ని ప్రాంతాలకు నీటిని అందిస్తున్న ఈ రిజర్వాయర్ల నుంచి ఇప్పటికీ 65 మిలియన్ గ్యాలన్ల నీరు లభిస్తోంది. ప్రస్తుతం ఇవి స్వచ్ఛమైన వర్షపునీటితో నిండి ప్రజలకు అంతే స్వచ్ఛమైన జలాలను అందిస్తున్నాయి. 'గోదావరి జలాల వల్ల భూగర్భ నీటిమట్టం పెరగదు. గతంలో నిర్మించిన ఏ ఎస్టీపీలు, రింగ్‌మెయిన్‌లు చెరువులను కాపాడలేకపోయాయి. ఇప్పటికే నగరంలో వందలాది చెరువులు మాయమయ్యాయి. భవిష్యత్‌లో ఈ జలాశయాలు దెబ్బతింటే భూగర్భ జలాలు అడుగంటుతాయి. భూతాపం విపరీతంగా పెరుగుతుంది' అని నిపుణులు చెబుతున్నారు.

జీవవైవిధ్యానికి హాని

ఈ జలాశయాల వల్ల కొన్ని వేల చదరపు కిలోమీటర్ల పరిధిలో జీవవైవిధ్యానికి రక్షణ లభిస్తుంది. అనేక రకాల పక్షులు, వన్యప్రాణులు మనుగడ సాగిస్తున్నాయి. జీవో 111 ఎత్తివేయడంతో జీవవైవిధ్యం ప్రమాదంలో పడుతుంది. మృగవనం పార్కుకు నష్టం వాటిల్లుతుంది. ఇప్పటికే పెరిగిన భారీ నిర్మాణాల వల్ల ఎన్నో విలువైన పక్షి జాతులు అంతరించాయి. భవిష్యత్తులో ఈ ముప్పు ఇంకా ఎక్కువవుతుంది.

ప్రజల సంక్షేమాన్ని విస్మరించింది



హైదరాబాద్‌ను వరదల బారి నుంచి కాపాడేందుకు అప్పటి నిజాం నవాబు కట్టించిన జంట జలాశయాలు నగరాన్ని భూతాపం నుంచి రక్షిస్తున్నాయి. జీవ వైవిధ్యాన్ని రక్షించుకొనేందుకూ దోహదం చేస్తున్నాయి. జీవో 111ను ఎత్తివేసి ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని విస్మరించింది. సహజవనదరులను, జీవవైవిధ్యాన్ని ధ్వంసం చేయడం ఏ విధంగా కూడా ప్రజా సంక్షేమం కాదు.
– లుబ్నా సార్వత్, సామాజిక కార్యకర్త

సూపర్ ఆర్డర్‌ను ఎలా ధిక్కరిస్తారు



ఏ నగరంలో అయినా 20 శాతం నీటి వనరులు ఉండాలి. కానీ హైదరాబాద్‌లో వందలాది చెరువులు మాయమయ్యాయి. భవిష్యత్‌లో ఈ జలాశయాలు కూడా అలాగే మాయమయ్యే ప్రమాదం పొంచి ఉంది. పారిశ్రామికవేత్తలు, రియల్టర్లు, సంపన్నులకు కొమ్ము కాసే పాలకులు పర్యావరణాన్ని కాపాడుతారనుకోవడం భ్రమే అవుతుంది. గతంలోనూ జీవోకు వ్యతిరేకంగా ప్రభుత్వం వెళ్లినప్పుడు సుప్రీంకోర్టును ఆశ్రయించాం. జీవో 111ను సమర్థిస్తూ 2000 సంవత్సరంలో సుప్రీంకోర్టు సూపర్ ఆర్డర్ ఇచ్చింది. దాన్ని ఎలా ధిక్కరిస్తారు. న్యాయనిపుణులతో చర్చిస్తున్నాం. మరోసారి కోర్టుకెళ్తాం. – ప్రొఫెసర్ పురుషోత్తమ్‌రెడ్డి

111 జీవో ఎత్తివేతపై అఖిలపక్షం ఏర్పాటు చేయాలి

ముఖ్యమంత్రికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని లేఖ



సాక్షి, హైదరాబాద్/కొణిజర్ల: జీవో 111 ఎత్తివేతపై అఖిలపక్ష పార్టీల సమావేశం ఏర్పాటు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆదివారం ఆయన సీఎం కేసీఆర్‌కు లేఖ రాశారు. జీవో 111ను ఎత్తివేతపై పర్యావరణవేత్తలు, ప్రజల్లో తీవ్రమైన ఆందోళన వ్యక్తమవుతోందన్నారు. ఈ జీవో ఎత్తివేతతో ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ పరిధిలో ఉన్న లక్షల ఎకరాల పరీవాహక ప్రాంతాల్లో భూగర్భ జలాలకు ప్రమాదం వాటిల్లే అవకాశం ఉందని భావిస్తున్నారన్నారు.

పిచ్చోడి చేతిలో రాయిలా నోట్ల రద్దు: కేంద్ర ప్రభుత్వం రూ.2 వేల నోట్లను రద్దు చేయడం పిచ్చోడి చేతిలో రాయి చందాన ఉందని కూనంనేని విమర్శించారు. అవినీతి అంతం పేరిట పాత నోట్లు రద్దు చేసి రూ.2 వేల నోటును ప్రవేశపెట్టిన కేంద్రం ఇప్పుడు మళ్లీ ఎందుకు రద్దు చేయాల్సి వచ్చిందో చెప్పాలని డిమాండ్ చేశారు.

గుండె తరుక్కుపోతోంది

▶ మొదటి పేజీ తరువాయి

గమనార్హం. ఓవైపు నైరుతి రుతుపవనాలు సమీపిస్తుండటం, మృగశిర కార్తెకు మరెన్నో రోజులు లేకపోవడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. కొనుగోలు ప్రక్రియ వీలైనంత త్వరగా పూర్తికాకపోతే.. ఇప్పటికే వడగండ్లు, అకాల వర్షాలకు దారుణంగా దెబ్బతిన్న తాము.. ఈ జాప్యంతో మరింత దారుణంగా నష్టపోతామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఐకేపీ సెంటర్‌లో వరి ధాన్యం కొనుగోళ్లు

15 రోజులుగా పడిగాపులు



మాది మంచిర్యాల జిల్లా కాసిపేట మండలం మల్లేపల్లి. 13 ఎకరాల్లో వరి సాగు చేస్తే సుమారు 260 కింటాళ్ల దిగుబడి వచ్చింది. ధాన్యాన్ని ఈ నెల 7న స్థానిక కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చా. గత 15 రోజులుగా ఇక్కడికి ఒక్క లారీ కూడా రాలేదు. శనివారం కురిసిన వర్షానికి తడిసింది. మళ్లీ కూలీలను పెట్టి ఆరబెట్టాల్సి వచ్చింది.
– సూరినేని కమలాకర్, మంచిర్యాల

రాత్రింబవళ్లు కుప్పల వద్దే



వెంటవెంటనే కొనుగోళ్లు చేయకపోవడంతో రాత్రి, పగలు తేడా లేకుండా కుప్పల వద్దే పడిగాపులు కాస్తున్నాం. ధాన్యాన్ని కుప్పలుగా పోసి ఇప్పటికి 20 రోజులు అవుతోంది. తూకం వేసేందుకు హమాలీలు దొరకడం లేదు. లారీలు కూడా సకాలంలో రావడం లేదు. ఈసారి అసలే ధాన్యం దిగుబడి తగ్గింది. మరోవైపు రోజురోజుకు ధాన్యం బరువు దిగిపోతోంది. పెద్ద మొత్తంలో డబ్బులు ముట్టజెబితే కానీ లారీ డ్రైవర్లు ఇటువైపు రావడం లేదు.
– ప్రభాకర్, రైతు, తుక్కాపూర్, మెదక్

వెంటనే ధాన్యం కొనాలి



170 బస్తాలు కొనుగోలు కేంద్రంలోనే ఉన్నాయి. వర్షాలు, దొంగల భయానికి రోజూ కావలి కాస్తున్నాం. ఇంకా కాంటా పెట్టడం లేదు. వెంటనే కాంటా పెట్టి ధాన్యం కొనాలి.
– చిన్నయ్య, నికల్పూరు, దొంకేశ్వర్, నిజామాబాద్

ఆర్టీసీ బస్సులో మహిళకు వేధింపులు

- మద్యం మత్తులో ఇద్దరు వ్యక్తుల వెకిలి చేష్టలు
- బాధితురాలు డ్రైవర్ క్యాబిన్‌లోకి వెళ్లినా వదలని వైనం
- అడ్డుకున్న డ్రైవర్‌పై దాడి
- చాకచక్యంతో వారిని పోలీసులకు అప్పగించిన డ్రైవర్
- నల్లగొండ జిల్లాలో ఘటన

మిర్యాలగూడ టౌన్: మద్యం మత్తులో ఇద్దరు కామాంధులు అర్ధరాత్రి ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న ఓ మహిళపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారు. అడ్డుకున్న డ్రైవర్‌పై దాడికి తెగబడ్డారు. ఈ క్రమంలో డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించి బస్సును నేరుగా పోలీస్‌స్టేషన్‌కు తరలించి ఆ ఇద్దరినీ పోలీసులకు అప్పగించాడు. నల్లగొండ జిల్లాలో ఆదివారం ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. హైదరాబాద్‌లో ఈవెంట్ ఆర్గనైజర్‌గా పనిచేస్తున్న ఓ మహిళ ఇటీవల మిర్యాలగూడకు వచ్చింది. పట్టణంలో ఈ నెల 20న ఈవెంట్ నిర్వహించిన అనంతరం అదే రోజు హైదరాబాద్‌కు తిరిగి వెళ్లేందుకు అర్ధరాత్రి 12:30 గంటలకు మిర్యాలగూడ ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సు ఎక్కింది. అదే బస్సులో మరో ఇద్దరు ప్రయాణికులతో పాటు మిర్యాలగూడకు చెందిన కిరణ్, మంగళ్‌సింగ్ కూడా ఎక్కారు. బస్సు మిర్యాలగూడ నుంచి బయల్దేరిన తర్వాత ఇద్దరు ప్రయాణికులు నిద్రలోకి జారుకున్నారు. ఈ క్రమంలో బాగా మద్యం తాగి ఉన్న కిరణ్, మంగళ్‌సింగ్ .. ఈవెంట్ ఆర్గనైజర్ సీటుపై కాళ్లు వేయడంతో పాటు వెకిలిచేష్టలకు పాల్పడ్డారు. దీంతో ఈవెంట్ ఆర్గనైజర్ వారి వేధింపులు తాళలేక బస్సు డ్రైవర్ క్యాబిన్‌లోకి వెళ్లి కూర్చుంది. దీంతో వారు కూడా డ్రైవర్ క్యాబిన్‌లోకి వెళ్లి ఆ ప్రయాణికురాలిని వేధించారు. దీంతో బస్సు డ్రైవర్ సైదులు వారిని అడ్డుకునే ప్రయత్నం చేయగా అతడిపై దాడి చేశారు. ఈ క్రమంలో డ్రైవర్ బస్సును నేరుగా నల్లగొండ టూటౌన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించాడు. అనంతరం కిరణ్, మంగళ్‌సింగ్‌ను పోలీసులకు అప్పగించాడు. ఇద్దరు నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నల్లగొండ టూ టౌన్ ఎస్‌ఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. కాగా, కామాంధుల నుంచి తనను కాపాడిన ఆర్టీసీ బస్సు డ్రైవర్ సైదులుతో పాటు సంస్థకు కృతజ్ఞతలు తెలుపుతూ ఆ ఈవెంట్ ఆర్గనైజర్ ఆదివారం ఆర్టీసీ మిర్యాలగూడ డీఎం బొల్లెద్దు పాల్‌కు లేఖ అందించింది.

రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతి

- మరో మహిళ పరిస్థితి విషమం
- మెదక్ జిల్లా నార్సింగి మండలం వల్లూరు శివారులో ఘటన



ఇప్ప శేఖర్ (ఫైల్)



యశ్వంత్ (ఫైల్)



బాల్ నర్సయ్య (ఫైల్)



మణెమ్మ (ఫైల్)

రామాయంపేట(మెదక్): మెదక్ జిల్లా నార్సింగి మండలం వల్లూరు శివారులో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. నిజామాబాద్ జిల్లా ఆలూరు మండల కేంద్రానికి చెందిన ఇప్ప శేఖర్.. భార్య కవిత, కుమారులు అభిలాశ్, యశ్వంత్‌తో పాటు వారం రోజుల క్రితం వారి ఇంటికి వచ్చిన సిద్దిపేట జిల్లా గజ్వేల్‌కు చెందిన కవిత పెద్దనాన్న గుంటక బాల్‌నర్సయ్య, పెద్దమ్మ మణెమ్మను తీసుకొని ఇటీవల మృతిచెందిన తమ బంధువు దశదినకర్మలో పాల్గొనడానికి స్వంత ఆటోలో గజ్వేల్ వెళ్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. వారు ప్రయాణిస్తున్న ఆటోను హైదరాబాద్ వైపు వెళ్తున్న కారు వెనుక నుంచి వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇప్ప శేఖర్ (45), యశ్వంత్ (9), బాల్‌నర్సయ్య (75), మణెమ్మ (63) అక్కడికక్కడే మృతిచెందారు. గాయపడిన కవిత పరిస్థితి విషమంగా మారడంతో చికిత్స నిమిత్తం ఆమెను సిద్దిపేట ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో అభిలాశ్‌కు ఎలాంటి గాయాలు కాలేదు. తూప్రాన్ డీఎస్పీ యాదగిరిరెడ్డి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించారు. నార్సింగి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదం జరగగానే కారు డ్రైవర్ పారిపోయాడని నార్సింగి ఎస్సై నర్సింహులు తెలిపారు.

కుష్టు వ్యాధి నియంత్రణ యూనిట్ల ఎత్తివేత

- డిప్యూటీ డీఎంహెచ్‌వో కార్యాలయాలు మూసివేత... వాటిల్లోని వైద్య సిబ్బంది ఇతర చోట్లకు తరలింపు
- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖలో హేతుబద్ధీకరణ



సాక్షి, హైదరాబాద్: వైద్య ఆరోగ్యశాఖలో హేతుబద్ధీకరణ ప్రారంభమైంది. రాష్ట్ర క్యాబినెట్ ఇటీవల తీసుకున్న నిర్ణయం మేరకు వైద్యాధికారులు ఏర్పాట్లు మొదలుపెట్టారు. ప్రజారోగ్య సంచాలకుల పరిధిలో కుష్టు వ్యాధి నియంత్రణ, మెటర్నరీ హెల్త్, టెంపరరీ హాస్పిటలైజేషన్ తదితర సేవలు ఉన్నాయి. అయితే కాలక్రమేణా ఆయా సేవలన్నీ ఆసుపత్రుల్లో సాధారణ సేవలుగా ప్రధాన స్రవంతిలో కలిసిపోయాయి. దాంతో ఈ యూనిట్లు నిరుపయోగంగా మారాయని వైద్య ఆరోగ్యశాఖ భావించింది. అలాగే చిన్న జిల్లాల ఏర్పాటుతో సబ్-డివిజనల్ స్థాయిలో ఉన్న డిప్యూటీ డీఎంహెచ్‌వో కార్యాలయాలు కూడా నిరుపయోగంగా మారాయి. ఈ నేపథ్యంలో వాటిని కూడా ఎత్తివేసి అందులోని సిబ్బందిని ఇతర చోట్ల సర్దుబాటు చేయాలని నిర్ణయించారు. రాష్ట్రంలో 235 యూపీహెచ్‌సీల్లో వైద్యులు, నర్సులు, ఫార్మసిస్ట్ పోస్టులను కాంట్రాక్ట్ సిబ్బందితో భర్తీ చేసి నడిపిస్తున్నారు. కేసీఆర్ న్యూట్రిషన్ కిట్, వ్యాక్సినేషన్, అంటువ్యాధుల సమయంలో పర్యవేక్షించడం తదితర సేవల్లో యూపీహెచ్‌సీల సిబ్బంది కీలకం. దీంతో.. ఎత్తివేసే యూనిట్ల నుంచి సిబ్బందిని వీటిల్లో సర్దుబాటు చేయాలని నిర్ణయించారు.

40 మండలాల్లో పీహెచ్‌సీలు, 6 డీఎంహెచ్‌వోలు

ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం (పీహెచ్‌సీ) లేని మండలాలు రాష్ట్రంలో 40 ఉన్నాయి. సిబ్బందిని హేతుబద్ధీకరించడం, పునర్విభజించడం వల్ల ఆ 40 మండలాల్లోనూ పీహెచ్‌సీలను ప్రారంభించడానికి వీలు కలుగుతుందని వైద్య ఆరోగ్యశాఖ వర్గాలు వెల్లడించాయి. రాష్ట్ర ఏర్పాటు తర్వాత జిల్లాల సంఖ్య 10 నుంచి 33కి పెరిగింది. కొత్తగా రూపొందించిన 23 జిల్లాల్లోని డీఎంహెచ్‌వో కార్యాలయాలు కాంట్రాక్టు సిబ్బందితో నడుస్తున్నాయి. ఈ కార్యాలయాలను సమర్థవంతంగా అమలు చేసేందుకు పూర్తి స్థాయిలో సిబ్బందిని డీఎంహెచ్‌వో కార్యాలయాలకు తిరిగి పంపిస్తారు. జీహెచ్‌ఎంసీ జనాభా పెరుగుదలతో ప్రజారోగ్య పరిపాలనను బలోపేతం చేయాల్సిన అవసరం ఉంది. ఈ నేపథ్యంలో ఆరు డీఎంహెచ్‌వోలను కొత్తగా నియమిస్తారు.

80 శాతం డాక్టర్లు ఇతర ప్రాంతాల్లోనే నివాసం

గ్రామాల్లో వైద్య సేవలు అందించాల్సిన డాక్టర్లు పట్టణాలకే పరిమితమవుతున్నారు. ఈ విషయాన్ని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ప్రభుత్వానికి గతంలో ఓ నివేదిక సమర్పించింది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (పీహెచ్‌సీ), సామాజిక ఆరోగ్య కేంద్రాల (సీహెచ్‌సీ)లో పనిచేసే డాక్టర్లు, వైద్య సిబ్బందిలో 80 శాతం మంది ఇతర ప్రాంతాలు, పట్టణాల్లో నివాసం ఉంటున్నారని ఆ నివేదిక వెల్లడించింది. దీంతో వారు పనిచేసే ఆసుపత్రికి వెళ్లి రావడానికే ఎక్కువ సేపు ప్రయాణం చేయాల్సి వస్తోందని పేర్కొంది. ఎక్కువమంది విధులకు డుమ్మా కొడుతున్నారని, 40% గైర్హాజరు ఉంటోందని నివేదిక స్పష్టం చేసింది. దీంతో ప్రజలకు ప్రభుత్వ వైద్యం అందించడం ప్రధాన సవాల్‌గా మారిందని ఆ నివేదిక అభిప్రాయపడింది.

అధికంగా ఉన్న చోట నుంచి లేని చోటకు సిబ్బంది

ఇక రాష్ట్రంలో కొన్ని ఆసుపత్రుల్లో ఎక్కువ మంది, కొన్నిచోట్ల మరీ తక్కువ సిబ్బంది పనిచేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రాంతం, అక్కడి జనాభా అవసరాలకు అనుగుణంగా వైద్యులు, ఇతర సిబ్బందిని సర్దుబాటు చేయాలని ఆ నివేదిక సర్కారుకు ప్రతిపాదించింది. ఆ ప్రకారమే ఇప్పుడు వైద్య ఆరోగ్యశాఖ రంగం సిద్ధం చేసింది. ఎంతమంది సిబ్బందిని ఒకచోట నుంచి మరో చోటకు మార్చాలన్న దానిపై వైద్య ఆరోగ్యశాఖ వర్గాలు కసరత్తు ప్రారంభించాయి. త్వరలోనే సిబ్బందిని గుర్తించి వారిని అవసరమైనచోటకు పంపిస్తారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్ సహా పలు జిల్లా కేంద్రాల్లోనే ఏళ్లుగా పాతుకుపోయిన వారికి స్థానచలనం తప్పకపోవచ్చన్న వాదనలు వినిపిస్తున్నాయి.



“ఎవరు కథలు చెప్పగలరో వాళ్లు సమాజాన్ని పాలిస్తారు.”
– ప్లేటో

సాక్షి
సోమవారం, 22 మే 2023

భావి ఫలం

పాత కథే. కానీ కొత్త విషయానికి ప్రారంభంగా పనికొస్తుంది. చావు దగ్గరపడిన ఓ ముసలాయన ఎంతో శ్రద్ధగా మొక్క నాటడాన్ని చూసిన బాటసారి నవ్వడం మనకు తెలుసు. అది ఎప్పటికి పెరిగేనూ, ఎప్పటికి కాసేనూ! ప్రతి పనినీ మన కోసమే చేయం. ముందు తరాలకు పనికొచ్చేట్టుగా చేస్తాం. అదే వాళ్ల పూర్వీకులుగా మనం ఇవ్వగలిగే కానుక! బాటసారిలో గౌరవం పెరిగేలా వృద్ధుడు ఇదే చెబుతాడు. సరిగ్గా ఇలాంటి భావనతోనే నార్వేలో ‘ఫ్యూచర్ లైబ్రరీ ప్రాజెక్ట్’ ప్రారంభమైంది. దీనికి శ్రీకారం చుట్టింది స్కాట్‌లాండ్‌కు చెందిన విజువల్ ఆర్టిస్ట్ కేటీ పేటర్సన్. ఈమె వయసు 41 ఏళ్లు.

ఈ భవిష్యత్ గ్రంథాలయ ప్రాజెక్టు 2014లో ప్రారంభమైంది. వందేళ్ల పాటు అంటే 2114 వరకూ కొనసాగుతుంది. ఒక్కో ఏడాదికి ఒక్కో రచయిత తన సరికొత్త అముద్రిత రచనను ఈ గ్రంథాలయానికి బహూకరిస్తారు. మొదటి రచనగా 2014 సంవత్సరానికి మార్గరెట్ అట్‌వుడ్ (కెనడా) తన ‘స్క్రిబ్లర్ మూన్’ సమర్పించారు. 2015కు డేవిడ్ మిషెల్ (ఇంగ్లండ్) తన ‘ఫ్రమ్ మి ఫ్లోస్ వాట్ యు కాల్ టైమ్’ను ఇచ్చారు. 2016కు షిఖోన్ (ఐస్‌లాండ్), 2017కు ఏలిఫ్ షాఫక్ (టర్కీ) తమ రచనలు బహూకరించారు. 2018కి హాన్ కాంగ్ (దక్షిణ కొరియా), 2019కి కార్ల్ ఊవ్ నాస్‌గార్డ్ (నార్వే), 2020కి ఓసియన్ వువాంగ్ (వియత్నాం) ఇచ్చారు. ఈ రచనలన్నీ ఆంగ్లంలోనే ఉన్నాయని కాదు, అలా ఇవ్వాలని కూడా లేదు. సౌకర్యార్థం శీర్షికల వరకు ఆంగ్లంలో అనువదించి ఉంచారు.

విశేషం ఏమంటే– ఇందులోకి చేరే ‘పుస్తకాలు’ ఏమిటో కేటీకి గానీ, ఈ లైబ్రరీని నిర్వహించడానికి నెలకొల్పిన ‘ద ఫ్యూచర్ లైబ్రరీ ట్రస్టు’కు గానీ తెలీదు. సాహిత్యానికి గానీ కవిత్వానికి గానీ అద్భుతమైన చేర్పు అయిన, భవిష్యత్ తరాల ఊహలను అందుకోగలిగే శక్తి సామర్థ్యాలున్న రచయితను ఆ సంవత్సరపు రచయితగా ఎంపిక చేసుకుంటారు. వారు అంగీకరించాక, అది రాయడానికి ఒక ఏడాదైనా పడితే, ఆ పూర్తయిన రాతప్రతిని నార్వేలో జరిపే ప్రత్యేక వేడుక ద్వారా స్వీకరిస్తారు. అందుకే 2021కి గానూ సిత్సి దాంగెరెంబ్గా(జింబాబ్వే) ‘నారిని అండ్ హర్ డాంకీ’ని 2022లో ఇచ్చారు. 2022 సంవత్సరానికి జుడిత్ షలన్‌స్కీ (జర్మనీ) ఈ జూన్‌లో అందజేస్తారు. ఆ రాతప్రతిని ప్రత్యేకమైన వస్త్రాల్లో చుట్టి, ఓస్లో ప్రజా గ్రంథాలయంలో ప్రత్యేకంగా డిజైన్ చేసిన గదిలో ఉంచుతున్నారు. ఇవి వందేళ్ల తర్వాత ప్రచురితమవుతాయి. మరో విశేషం ఏమంటే, ఈ పుస్తకాలను అచ్చు వేయడానికే వెయ్యి చెట్లను ప్రత్యేకంగా అక్కడి నార్డ్‌మార్కా అటవీ ప్రాంతంలో పెంచుతున్నారు. ఈ వంద చేతిరాత ప్రతులను ఈ చెట్లతో తయారుచేసిన కాగితాలతో లిమిటెడ్–ఎడిషన్‌గా ప్రచురిస్తారు. అందుకే దీన్ని ప్రపంచపు అత్యంత రహస్య గ్రంథాలయం అని గార్డియన్ పత్రిక అభివర్ణించింది. అయితే వందేళ్ల పాటు వీటిని చదవకుండా పాఠకులకు దూరంగా ఉంచుతున్నారన్న విమర్శలు కూడా వచ్చాయి.

వందేళ్ల నాటికి ఈ ప్రాజెక్టును ప్రారంభించిన వాళ్లుగానీ, దీనికి పుస్తకాలు సమర్పించిన చాలామంది రచయితలుగానీ ఉండరు. మార్గరెట్ అట్‌వుడ్ వయసు 83 ఏళ్లు. అంతెందుకు, ఈ ప్రాజెక్టు రచయితలుగా పరిగణనలోకి వచ్చిన టోమాస్ ట్రాన్స్‌ట్రోమార్ (స్వీడన్), ఉంబెర్టో ఎకో (ఇటలీ) ఇప్పటికే మరణించారు కూడా. ‘‘అప్పటికి దీర్ఘకాలంగా నిశ్శబ్దంగా ఉన్న నా గొంతుక ఉన్నట్టుండి, ఒక వందేళ్ల తర్వాత మేల్కొంటుందన్న ఆలోచనే చిత్రంగా ఉంది. ఆ కంటెయినర్ లోంచి ఆ పుస్తకంలోని మొదటి పేజీ తెరిచే ఇప్పటికింకా శరీరంగా రూపుదిద్దుకోని ఆ చేతికి ఆ గొంతుక ఏం చెబుతుంది?’’ అని ఉద్విగ్నంగా మాట్లాడారు మార్గరెట్ అట్‌వుడ్. ‘‘భవిష్యత్తులో ఎప్పుడో చదువుతారని ఆశిస్తున్న ఒక రాతప్రతిని రాయడమనే ఆలోచనే ఒక ఉత్తరం రాసి నదిలో వేయడం లాంటిది. అది ఎటు పోతుందో మనకు తెలీదు, ఎవరు చదువుతారో తెలీదు– ఆ కాలప్రవాహాన్ని విశ్వసించడమే’’ అన్నారు ‘ద బాస్టర్డ్ ఆఫ్ ఇస్తాంబుల్’, ‘ద ఫార్టీ రూల్స్ ఆఫ్ లవ్’ లాంటి నవలలు రాసిన ఎలిఫ్ షఫాక్. ఆమె ఇచ్చిన ‘ద లాస్ట్ టాబూ’ కాల ప్రవాహంలో ఏ మలుపులు తీసుకుంటుందో!

‘‘నేనెట్లాగూ మరో వందేళ్లు ఉండను. నేను ప్రేమించేవాళ్లు కూడా ఉండరు. ఈ కనికరం లేని వాస్తవం నా జీవితంలోని అత్యంత ముఖ్యమైన విషయం గురించి ఆలోచించేట్టు చేసింది. నేనెందుకు రాస్తాను? నేను రాస్తున్నప్పుడు ఎవరితో సంభాషిస్తున్నాను? ఆ తర్వాత నేను ఒక ప్రపంచాన్ని ఊహించాను, అక్కడ నేను ప్రేమించేవాళ్లు ఎవరూ ఉండరు. కానీ ఆ ప్రపంచంలో నేను బతికి వుండగా కలిసిన నార్వేలోని చెట్లు ఇంకా ఉంటాయి. మనుషులకూ, చెట్లకూ మధ్య ఉన్న స్పష్టమైన ఈ అంతరం నన్ను తాకింది. ఈ ధ్యానం ఎంత తీవ్రమైనదంటే, మన నశించిపోయే జీవితాల అశాశ్వతత్వానికీ, విలువైన పెళుసుదనాల మన జీవితాలకూ నేరుగా కళ్లు తెరిపించింది’’ అంటారు దక్షిణ కొరియా రచయిత్రి హాన్ కాంగ్. ‘‘ఈ ఆలోచన అద్భుతం. ఇప్పటికింకా పుట్టని పాఠకులకు మన కాలం నుంచి వారి కాలానికి ఒక చిన్న పడవను పంపడమే ఇది’’ అన్నారు కార్ల్ ఓవ్ నాస్‌గార్డ్.

ఇప్పుడు పెరుగుతున్న ఈ చెట్ల నుంచి కాయనున్న పుస్తకాలను ఆరగించడానికి ప్రపంచంలోని ఏ మూలల్లో మనుషులు జీవం పోసుకోనున్నారో! వందేళ్ల తర్వాత ఏం జరుగుతుందో చూడాలని ఇప్పుడే కుతూహలంగా లేదూ!

ఇన్‌బాక్స్

సినీ పుంభావ సరస్వతి

తెలుగు చలనచిత్ర రంగంలో చిరస్థాయిగా ఉండిపోయే పేరు ‘వేటూరి సుందర రామమూర్తి’. ఆయన రాసిన పాటలు అనన్య సామాన్యం. చదువు పూర్తయిన తర్వాత మొదటగా ఆయన 1952 ‘ఆంధ్రప్రభ’ తెలుగు పత్రికలో జర్నలిస్టుగా చేరారు. ఉద్యోగ నిర్వహణలో భాగంగా 1962లో అప్పటి ప్రధానమంత్రి పండిట్ జవహర్ లాల్ నెహ్రూ ప్రసంగాన్ని యథాతథంగా అందించిన తెలుగు పాత్రికేయుడు ఆయన. ఆ సమయంలోనే సినిమా రంగానికి అవ్విని దేవతలైన బాపు రమణలతో స్నేహమేర్పడింది.

1974లో కళాతపస్వి విశ్వనాథ్ సినిమా ‘ఓ సీత కథ’లో ‘భారతనారి చరితము’ అనే హరికథ ద్వారా సినిమా ప్రపంచంలోకి అడుగుపెట్టారు. ఆయనకు అలవోకగా పాట రాయడం వెన్నతో పెట్టిన విద్య. ‘సాగర సంగమం’ చిత్రంలో ‘ఓం నమశ్శివాయ...’ అన్న పాటలో ‘అద్వైతమే నీ ఆది యోగమై...’ అని ఈ సృష్టిలో రెండు లేవు అన్నీ నువ్వే అని చెబుతూ త్రికాలములు, చతుర్వేదాలు, పంచభూతాలు, షట్ ఋతువులు, సప్తస్వరాలు... అన్నీ శివుడికే ఆపాదించారు. అలాగే ‘శంకరాభరణం’ సినిమాలో ‘శంకరా నాద శరీరా పరా...’ పాట ద్వారా ప్రకృతి స్వరూపుడైన పరమేశ్వరుడికే ఆ ప్రకృతిలోని మెరుపులను చిరునవ్వులుగా అద్ది, ఉరుములను కాలిమువ్వలుగా కట్టిన ఘనత వేటూరికే దక్కింది. అమాయకత్వపు కథానాయికను సీతతో పోల్చి, అన్యాయానికి గురౌతున్న ఆమెను కాపాడలేని పరిస్థితిలో కథానాయకుడు ‘రా దిగి రా దివినుంచి భువికి దిగిరా...’ అనే పాటని ‘సిరిసిరి మువ్వ’ సినిమాలో రాశారు. ‘అడవి రాముడు’ సినిమాలో ‘ఆరేసుకోబోయి పారేసుకున్నాను’ అని సునిశితమైన శృంగారాన్ని రాసిన కలమే ‘కృషివుంటే మనుషులు ఋషులవుతారు మహాపురుషులౌతారు..’ అన్న పాటలో బోయవాడు మహర్షిగా పరివర్తన చెందిన విధానాన్ని కళ్ళకు కట్టించారు.



వేటూరి సుందర రామమూర్తి

నవభారత యువత పెడతోవ పడుతున్న సందర్భాన్ని పురస్కరించుకొని ‘ప్రతిఘటన’ సినిమాలో ‘ఈ దుర్యోధన దుశ్శాసన దుర్వినీత లోకంలో...’ అనే గీతంలో చెడిపోతున్న యువతను మేలు కొలుపుతూ రాసిన పాటలో ‘ఎర్రని తన రక్తాన్నే తెల్లని నెత్తురు చేసి...’ అని రాశారు. ‘రక్తము’ ‘నెత్తురు’ సంస్కృతాంధ్ర పదాలైతే, సంస్కృత పదమైన రక్తాన్ని ‘రక్తం’ గానూ, తెలుగు పదమైన ‘తెల్లని నెత్తురు’ను తల్లి పాలతో పోల్చారు వేటూరి. పూర్తిగా కమర్షియల్ సినిమా అయిన ‘ఛాలెంజ్’లో ‘ఇందువదన కుందరదన మందగమన మధుర వచన గగన జఘన సొగసులలనవే’ అంటూ సంస్కృతంలో పల్లవిని ఎత్తుకొని చరణాలను తెలుగులో రాసిన ఘనత వేటూరికే దక్కుతుంది. 1993లో రాసిన ‘రాలి పోయే పువ్వా నీకు రాగాలెందుకే...’ అనే వేదాంత ధోరణిలో సాగే పాటకి వేటూరికి జాతీయ పురస్కారం లభించడం మన తెలుగుజాతి చేసుకున్న అదృష్టం. వేటూరి సుందర రామమూర్తి ఒక సాహిత్య సముద్రం. అందులో ఇప్పుడు ఏరినవన్నీ కొన్ని మాత్రమే. వెదికే కొద్దీ ఎన్నో ముత్యాలు, రత్నాలు, వెలకట్టలేని మణులు, మాణిక్యాలు దొరుకుతాయి.

– కె.ఎస్.ఎన్. మూర్తి । 99128 77114

ఆసుపత్రిలో చేరటంపైనా రోగిష్టి రాతలేనా?

అవినాశ్ రెడ్డి తల్లి అనారోగ్యంపై ‘ఈనాడు’ దారుణ కథనాలు

కర్నూలు ఆసుపత్రిలో చేరటంపైనా విషపూరిత కల్పనలు

- కోర్టు నోటీసులను ఎర్ర గంగిరెడ్డికి ఇవ్వటానికి సునీత ప్రయత్నించారా?
- నోటీసులివ్వాల్సింది కోర్టు కదా? ఇలా ‘కవర్’ చేయడానికి కాస్తయినా సిగ్గుండాలి కదా?
- దస్తగిరి మాదిరే ఎర్ర గంగిరెడ్డినీ ప్రలోభపెట్టాలని సునీత భావించటం అబద్ధమా?
- న్యాయ ప్రక్రియలోనే లేని విచిత్రాలు ఈ కేసులోనే ఎందుకు జరుగుతున్నాయి?
- ఎలా హత్య చేశాడో వివరంగా చెప్పిన వ్యక్తికి క్షమాభిక్ష పెట్టిందీ ఈ కేసులోనే..
- తండ్రిని హత్య చేసిన వ్యక్తితో కలిసి... కుమార్తె న్యాయపోరాటం చేస్తున్నదీ ఈ కేసులోనే
- ఇదంతా బాబు డైరెక్షన్లో జరుగుతోంది అనటానికి ఇంతకన్నా ఏం కావాలి?



వ్యక్తిత్వాన్ని చంపేయాలంటే రామోజీరావు తరవాతేఎవరైనా!!. తన ప్రయోజనాలకు అడ్డంగా ఉంటే ఎవరి పరిస్థితైనా అంతే!. అది ఎన్టీ రామారావయినా... లక్ష్మీ పార్వతయినా... సొంత పార్టీవారైనా.. ఇంకెవ్వరైనా అంతే!. తన ప్రయోజనాలు కాపాడినన్నాళ్లూ మహోన్నతుడిగా కీర్తించిన ఎన్టీఆర్‌ను... చంద్రబాబు డైరెక్షన్‌లో పనిచేయలేదన్న ఒకే ఒక కారణంతో చివరి రోజుల్లో ‘ఈనాడు’ ఎలా బ్రాండ్ చేసిందో ఈ రాష్ట్రంలో తెలియనిదెవరూ లేరు. అలాగే లక్ష్మీ పార్వతిని కూడా!. ఇక టీడీపీ నేతలు కాని వారి పరిస్థితి చెప్పక్కర్లేదు. చంద్రబాబుతో పొత్తులో లేనప్పుడు నరేంద్ర మోదీ వ్యక్తిత్వాన్ని సైతం వక్రీకరించి రాసిన కలం అది. ఇప్పుడు కడప ఎంపీ అవినాశ్ రెడ్డి విషయంలోనూ రామోజీరావు అదే చేస్తున్నారు. ఆయనకు సంబంధించిన ప్రతి అంశాన్నీ వక్రీకరిస్తూ... మెల్లగా జనం మెదళ్లలో విషం నింపుతున్నారు. ఆఖరికి ఆయన తన తల్లిని ఆసుపత్రిలో చేర్చడాన్ని సైతం రాజకీయం చేస్తున్నారు. ఆమెను చూడటానికి కడప నుంచి వ్యక్తులొస్తే అది కూడా రాజకీయమే. ఆసుపత్రిలో పరిచయం ఉన్న వైద్యుడున్నారంటూ... దానికీ విషం పులిమారు. మరీ ఇంత సిగ్గుమాలిన రాతలా రామోజీరావు గారూ? ఇంతటి మీ విషపూరిత మనస్తత్వాన్ని తట్టుకోలేకే... మీ తనయుడు సుమన్ సైతం మిమ్మల్ని ఇంట్లో ఉన్న క్యాన్సర్‌గా అభివర్ణించారని మరిచిపోయారా?

అయినా చంద్రబాబును మళ్లీ అధికారంలోకి తీసుకురావాలంటే ఇంతలా దిగజారిపోవాలా? ‘ఈనాడు’ కరపత్రానికన్నా ఘోరమైన స్థాయికి దిగజార్చేయాలా? బాబు అధికారంలో లేక... మీ అవినీతి సామ్రాజ్యం చిన్నబోతోందనా? అక్రమాలతో, చట్టవిరుద్ధంగా నిర్మించుకుని విస్తరించిన మీ ఆర్థిక సామ్రాజ్యానికి బీటలు పడుతున్నాయనా? కనీస మానవతా విలువలు లేకపోవటం దుర్మార్గం కాదా రామోజీరావు గారూ?

ఏ ఆసుపత్రిలో చేర్చాలో మీరే చెబుతారా?

ఎంపీ అవినాశ్‌రెడ్డి తల్లి లక్ష్మమ్మ హఠాత్తుగా తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. దీంతో ఆమెను పులివెందుల నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తీసుకు వెళదామనుకున్నారు. కానీ మార్గం మధ్యలోనే పరిస్థితి ఆందోళనకరంగా మారటంతో... కర్నూలులోని విశ్వభారతి ఆసుపత్రిలో చేర్పించి అత్యవసర వైద్యం అందిస్తున్నారు. అందులో తప్పుబట్టాల్సిందేముంటుంది? అత్యవసర పరిస్థితుల్లో ఎవరైనా దగ్గర్లోని మెరుగైన ఆసుపత్రికి తీసుకెళతారు. అది సహజమేగా! కానీ.. ‘ఈనాడు’

ఏది నిజం?

చూసే కోణం వేరు కదా. ప్రతి అక్షరాన్నీ చంద్రబాబు సంక్షేమం కోసం తాకట్టు పెట్టడం ఆ పత్రిక బాధ్యత మరి!. అందుకనే ఈ విషయాన్ని కూడా వక్రీకరించారు. తన పత్రికలో పెద్ద పెద్ద అక్షరాలతో అచ్చు వేస్తూ... దానికి తన సొంత పైత్యాన్ని కూడా కొంత జోడించారు. పులివెందులలో ఎవరికి ఆరోగ్యం బాగాలేకపోయినా బెంగళూరుకో, హైదరాబాద్‌కో తీసుకెళ్లాలని... మరెక్కడికీ తీసుకెళ్లకూడదని పెద రాయుడి తీర్పుని చ్చేశారు. ఆ రెండు ప్రాంతాలకూ కాకుండా మరెక్కడికి తీసుకెళ్లినా ఏదో మతలబు ఉన్నట్టేనంటూ పైత్యాన్ని తారస్థాయిలో చూపించారు. ఊహాజనితమైన కారణాలను జోడించేశారు.

కర్నూలులోని విశ్వభారతి ఆసుపత్రిలో ఓ వైద్యుడికి ముఖ్యమంత్రి కార్యాలయంతో సంబంధాలు ఉన్నాయంటూ... వైద్యం చేసిన కార్డియాలజిస్టు అవినాశ్ రెడ్డికి స్నేహితుడంటూ నీచపు రాతలకు దిగారు. కర్నూలులోని విశ్వభారతి ఆసుపత్రి కార్డియాలజీకి పేరున్న ఆసుపత్రి అని... డాక్టర్ హితేష్ కార్డియాలజీలో విశేషమైన ప్రఖ్యాతులున్న వైద్యుడనే వాస్తవాలను మాత్రం ఎక్కడా ప్రస్తావించలేదు. అయినా సీఎంఓ నిజంగా జోక్యం చేసుకుని ఉంటే... సూచనలు చేసి ఉంటే.. కర్నూలులోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో చేర్పిస్తారు కదా? ప్రయివేటు ఆసుపత్రిలో ఎందుకు చేర్పిస్తారు? ప్రయివేటు ఆసుపత్రులను కూడా ప్రభుత్వం నియంత్రించగలదా? ఇదెక్కడి తలకాయ లేని ఆరోపణ రామోజీ రావుగారూ? మంచి వైద్యం కావాలనుకున్నపుడు మంచి ఆసుపత్రిలో చేరుస్తారు. ఆ విభాగంలో నిపుణుడైన వైద్యుడికి చూపిస్తారు. ఇక్కడ జరిగింది అదే. దీనిక్కూడా విషపూరిత వక్రభాష్యాలేల? వైద్యుడి ఊరుపైనా విష ప్రచారమేనా?

డాక్టర్ హితేష్‌ది పులివెందుల కనక... ఆయన అవినాశ్‌కు మిత్రుడు కనక చేర్పించారనటం వెనక కనీస ఇంగితమైనా ఉందా? పులివెందుల వాసులెవరూ బాగా చదువుకుని నిపుణులైన డాక్టర్లుగా, ఉన్నతాధికారులుగా ఉండకూడదా? ఇవెక్కడి రాతలు? ‘ఈనాడు’, దాని మిత్ర ఎల్లో మీడియా... ఇదే తరహాలో పులివెందులపై, రాయలసీమపై మూడు దశాబ్దాలుగా దుష్ప్రచారం చేయటం తెలియని విషయం కాదు. దీనికి కారణమల్లా ఒక్కటే. తెలుగుదేశం పార్టీ లేనప్పుడు కూడా ఉమ్మడి రాష్ట్రంలో అధికారంలో ఉన్నవారిని రామోజీరావు తన రాతలతో భయపెట్టి తన దారికి తెచ్చుకోగలిగారు. ఒక్క వైఎస్ రాజశేఖరరెడ్డిని తప్ప. వైఎస్సార్‌ది పులివెందుల కనక. అంతే!.

సీఐడీ అంటే మంచమెక్కింది మీరేగా?

దర్యాప్తును తప్పించుకునేందుకు అనారోగ్యం అంటూ హఠాత్తుగా మంచం ఎక్కేయడం మీ మాదిరి ఎవరికి తెలుస్తుంది రామోజీరావు గారూ? అక్రమంగా చిట్స్ నడుపుతూ... చట్టాలన్నీ ఉల్లంఘిస్తున్న ‘మార్గదర్శి’పై మిమ్మల్ని ప్రశ్నించడానికి సీఐడీ అధికారులు మీ చిత్రపురి కోటకు వచ్చినపుడు జరిగిందేమిటో రాష్ట్రమంతా చూసింది కదా?. అప్పటికప్పుడు యశోద ఆసుపత్రి నుంచి అంబులెన్స్ రామోజీ నివాసానికి వచ్చింది. ఓ డాక్టర్, ఇతర సిబ్బంది కూడా వచ్చారు. అప్పటికప్పుడు ఆయన నడుముకు ఓ బెల్ట్ కట్టారు. ముక్కుకు మాస్కు పెట్టారు. చేతికి సెలైన్ తగిలించారు. మంచం పక్కనే ఆక్సిజన్ సిలిండర్ పెట్టారు. సినిమా సెట్టింగ్‌ను తలపిస్తూ ‘అనారోగ్యం’ కథను రక్తికట్టించేందుకు నానా తంటాలూ పడ్డారు. మార్గదర్శి చిట్స్ అక్రమాలపై సీఐడీ అధికారులు అడిగిన ప్రశ్నలన్నింటికీ అనారోగ్యం నటిస్తూ మాట్లాడలేనన్న రీతిలోనే సమాధానాలు చెప్పారు రామోజీరావు. కానీ ప్రశ్నల వీడియో షూటింగ్ ఆగినపుడల్లా మామూలు రామోజీలా తన అహాన్ని ప్రదర్శిస్తూనే వచ్చారు. అంటే.. ప్రశ్నలకు సమాధానాలు చెప్పకుండా తప్పించుకోవటానికే ఇంతటి డ్రామా నడిపారని తెలియటం లేదా? తాను అలా చేశాను కనక అంతా తనలానే ఉంటారనుకుంటే ఎలా?

బాలకృష్ణ ఇంట్లో కాల్పులపై పెన్ను మూసిన రామోజీ బాలయ్యకు మతిస్థిమితం లేదని ఎందుకు రాయలేదు?

తిరుగులేని ప్రజాభిమానాన్ని పొందిన వైఎస్సార్ కుటుంబమంటే... రామోజీరావుకు ఏమాత్రం పడదు. అందుకే హద్దుల్లేని విష ప్రచారానికి దిగుతారు. ఇదే రామోజీరావు... తనవాడు కాబట్టి అడ్డదారిలో వచ్చిన చంద్రబాబుకు భజన చేస్తూనే ఉంటారు. చంద్రబాబు వియ్యంకుడు బాలకృష్ణ ఇంట్లో కాల్పులు జరిపితే ... నిర్మాత బెల్లంకొండ సురేశ్, జ్యోతిష్యుడు సత్యనారాయణ చౌదరి తీవ్రంగా గాయపడ్డారు. ఆ తరవాత ఆ ఇంట్లో ఒక వాచ్‌మేన్ అనుమానాస్పదంగా మరణించాడు. దీనిపై రామోజీ అక్షరం ముక్క కూడా రాయలేదు. అరెస్టును తప్పించుకునేందుకు అప్పటికప్పుడు బాలకృష్ణ ఆసుపత్రిలో చేరినా... ఎన్టీఆర్ కుటుంబానికి సన్నిహితుడైన కాకర్ల సుబ్బారావు డైరెక్టర్‌గా ఉన్న నిమ్స్‌లోనే చేర్చినా... కేసు నుంచి బయటపడడానికి తనకు మతిస్థిమితం లేదని బాలకృష్ణ సర్టిఫికెట్ తెచ్చుకున్నా... ‘ఈనాడు’ పెన్ను కదిపితే ఒట్టు. ఎందుకంటే బాలకృష్ణ తమవాడు. కాబట్టి కాల్పులు జరపొచ్చు. అరెస్టు కాకుండా ఆసుపత్రిలో చేరొచ్చు. కేసు నుంచి బయటపడటానికి మతి స్థిమితంలేదని సర్టిఫికెట్ తెచ్చుకోవచ్చు. అదే ప్రత్యర్థులైతే... వారి చర్యల్లో ఎలాంటి తప్పూ లేకున్నా ‘ఈనాడు’ సందేహాలు వ్యక్తంచేస్తూనే ఉంటుంది. లేని దురుద్దేశాలు ఆపాదిస్తుంది. ఎందుకంటే ఆ పత్రికది జగమెరిగిన దౌర్భాగ్యపు పాత్రికేయం మరి!.

పరామర్శించేవారి కులాలూ రాస్తారా?

వైఎస్ కుటుంబంపై అక్కసు కొద్దీ రామోజీరావు నానాటికీ మరింత దిగజారిపోతున్నారు. వైఎస్సార్ జిల్లా ఎంపీ కనక ఆసుపత్రిలో ఉన్న అవినాశ్ రెడ్డి తల్లిని పరామర్శించేందుకు పులివెందులతో పాటు వైఎస్సార్ జిల్లాకు చెందిన చాలామంది కర్నూలు ఆసుపత్రికి వచ్చారు. అది సహజం. దాన్ని కూడా ‘ఈనాడు’ తనదైన కోణంలో వక్రీకరించింది. పైగా పరామర్శించిన వారి కులాలను ప్రస్తావిస్తూ సరికొత్త స్థాయికి దిగజారింది. పులివెందులకు చెందిన దంతలూరి కృష్ణ కర్నూలు ఆసుపత్రికి రాగా... ఆయన పేరును దంతులూరి కృష్ణ అని కాకుండా... ఆయన కులాన్ని ప్రస్తావిస్తూ ‘మంగలి కృష్ణ’అని రాయటమెందుకు? మరి రామోజీరావును పరామర్శించేందుకు చంద్రబాబు వచ్చినప్పుడు ‘కమ్మ చంద్రబాబు’అని రాయలేదే...! తనను పరామర్శించేందుకు వచ్చిన మురళీమోహన్, రాఘవేంద్రరావు తదితరుల పేర్ల ముందు ‘కమ్మ’ అని చేర్చలేదే? ఎందుకీ విపరీతపు రాతలు?

సీబీఐ దర్యాప్తును ప్రభావితం చేసేందుకే కుట్ర


వైఎస్ వివేకా హత్య కేసులో సీబీఐ దర్యాప్తు తాము నిర్దేశించినట్టే జరగాలన్నది చంద్రబాబు కుట్ర. దానికి అనుగుణంగా రామోజీరావు చేస్తున్న దుష్ప్రచారమే ఇది. నిజానికి కోర్టులో ఏదైనా పిటిషన్ దాఖలు చేస్తే ప్రతివాదులకు కోర్టే నోటీసులు పంపుతుంది. దానిపై కౌంటర్ వేయమని చెబుతుంది. అంతేగానీ పిటిషన్ వేసినవారే ఆ నోటీసులను తీసుకువెళ్లి ప్రతివాదులకు అందించరు కదా?. న్యాయ ప్రక్రియలోనే ఎక్కడా లేని ఈ వింత ఆచారానికి వివేకానందరెడ్డి కేసులో ఆయన కుమార్తె సునీత ఎందుకు ప్రయత్నిస్తున్నారు? దానికి ‘ఈనాడు’ ఎందుకు వత్తాసు పలుకుతోంది? ఇదంతా కుట్ర కాదా? ఇదంతా చంద్రబాబు డైరెక్షన్లో జరుగుతోందనటానికి ఇంకా ఏం కావాలి? వివేకా హత్య కేసు దర్యాప్తును జూన్ నెలాఖరుకు పూర్తి చేసి జులై 1న ఈ కేసులో ప్రధాన నిందితుడు ఎర్ర గంగిరెడ్డిని బెయిల్‌పై విడుదల చేయాలని హైకోర్టు ఆదేశించింది. దీన్ని సవాల్ చేస్తూ సునీత సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. దానిపై సుప్రీంకోర్టు ఎర్ర గంగిరెడ్డికి నోటీసులిచ్చింది. అవి కోర్టు ద్వారా ఆయనకు అందుతాయి. కానీ సునీత ఆ నోటీసులను తన లాయర్ ద్వారా ఎర్ర గంగిరెడ్డికి అందించేందుకు హైదరాబాద్‌లోని చంచల్‌గూడ జైలుకు వెళ్లారని ‘ఈనాడు’ రాసింది. ఇంత కవరేజీ అవసరమా రామోజీ?

ఇదీ... అసలు వాస్తవం

వాస్తవమేంటంటే... ఎర్ర గంగిరెడ్డిని కలవాలని సునీత ప్రయత్నించారు. తాను చెప్పినట్లుగా నడుచుకుంటే కేసు నుంచి తప్పించటంతో పాటు అదనపు లాభాలుంటాయని ప్రలోభపెట్టడానికి ఆమె ఎర్ర గంగిరెడ్డిని కలవాలనుకున్నారు. దస్తగిరి మాదిరే గంగిరెడ్డినీ ప్రలోభపెట్టి కుట్రలో కొత్త అంకానికి తెర లేపాలనుకున్నారు. జైలు అధికారులు అంగీకరించలేదు. కలవాలని ప్రయత్నించిన విషయం మాత్రం బయటకు పొక్కింది. ప్లాను బెడిసికొట్టడంతో దీంతో చంద్రబాబు డైరెక్షన్లో ‘ఈనాడు’ కవరేజీ మొదలుపెట్టింది. కోర్టు నోటీసులను అందించడానికే సునీత వెళ్లబోయారని చెత్త రాతలు రాసేసింది. సునీతకు అసలు అంత అవసరం ఏమొచ్చిందో చెప్పాలి కదా? కోర్టులు చేయాల్సిన పనిని ఆమే ‘వ్యయప్రయాసల కోర్చి’ చేస్తున్నారంటే దాని పరమార్థమేంటి? వివేకాను హత్య చేశానని అంగీకరించిన దస్తగిరికి ఇప్పటికే సునీత పూర్తి స్థాయిలో అండదండలిస్తున్నారు. అదే రీతిలో ఎర్ర గంగిరెడ్డినీ ప్రలోభపెట్టి ఈ కేసు నుంచి తన భర్త రాజశేఖరరెడ్డిని, బావ శివప్రకాశ్ రెడ్డిని పూర్తిగా తప్పించాలన్నది ఆమె ఉద్దేశం. అది బయటపడకుండా ‘ఈనాడు’ నోటీసుల రాగం అందుకోవటమే కుట్రకు నిదర్శనం.

అలనాటి వైభవాన్ని పునరుద్ధరిస్తూ...

సందర్భం




రేగుళ్ల మల్లికార్జునరావు

కృష్ణానది పరీవా హక ప్రదేశం ‘మయి సక’ దేశం. ఈ దేశం పరిపాలనా కేంద్రం ‘మైసోలియా’ లేక ‘మయి సోలియా.’ ప్రాచీన కాలంలో కృష్ణానదిని గ్రీకులు ‘మయి సోల్స్’ నదిగా పిలిచేవారు. మార్కోపోలో చెప్పిన ‘మౌసల’, యూరోపియన్ వాళ్ళు పిలిచిన ‘మసులీ పట్నం’, నవాబులు పిలిచిన ‘మచిలీ బందరు’– నేటి మచిలీపట్నం. దీనిని ప్రస్తుతం జనం ‘బందరు’ అని వ్యవహ రిస్తున్నారు. రెండవ శతాబ్దానికి చెందిన టోలెమీ రాసిన గ్రంథంలో మచిలీపట్నం గొప్పతనం వివరాలు ఉన్నాయి. ఓడరేవు, స్వర్గం అనే అర్థాలు ఉన్న ‘బందర్’ లేక ‘బుండెర్’ అనే పదం పార్శీ బాష నుంచి ఉద్భవించింది. పర్షియన్లు, అరబ్‌లు తూర్పు తీరంలో ఉన్న ఈ రేవును ‘బందర్ –ఎ– ముబారక్’ (శుభము కలిగించే ఓడరేవుగా) పిలిచేవారు.

ఆనాడు భారత దేశంతో వర్తకం చేసేందుకు ప్రపంచదేశాలు పోటీపడేవి. అందుకు తూర్పుతీరంలో ఉన్న ఓడరేవులను ఎక్కు వగా ఉపయోగించుకునేవి. వాటికి బందరు ఓడరేవు లాభాల పంట పండించేది. టోలెమీ ఈజిప్ట్‌లోని అలెగ్జాండ్రియా పట్టణ నివాసి. అతడు భారతదేశాన్ని ఎప్పుడూ చూడలేదు, వినడం తప్ప! రేవులో ఓడలు ఆగినప్పుడు, టోలెమీ స్వయంగా నావికులను యాత్రికు లను, ఓడ సిబ్బందిని ఆయా రేవుల వివరాలు తెలుసుకొని, గ్రంథస్థం చేసి భావితరాలకు అందించాడు. భారతదేశ తూర్పుతీర ఓడ రేవుల సమాచారం, దేశ ప్రజల సౌభాగ్యం, వనరుల గురించి, అక్కడ కథల గురించి ఆసక్తిగా విని గ్రంథస్థం చేశాడు.

క్రీ.పూ. 2వ శతాబ్దంలో రోమన్ సామ్రాజ్యం నుంచి ఓడ మీద బయలు దేరిన ఒక నావికుడు ‘పెరిప్లస్ ఆఫ్ ఎరిత్రియన్‌సీ’ అనే గ్రంథం రచించాడు. ఆ గ్రంథం మాసాలియా రేవు పట్టణం అందమైన మస్లిన్‌లకు ప్రసిద్ధమనీ, ఆ నగరం నుంచి చైనాకు, తూర్పు తీర దేశాలకు సుందరమైన వస్త్రాలు ఎగుమతి అవుతున్నాయనీ తెలిపింది. ఆ రోజుల్లో శాతవాహన రాజధాని ధాన్యకటకానికి ప్రతిష్ఠానాన్ని కలుపుతూ రవాణా మార్గాలున్నాయి. అంతేకాకుండా బందర్‌లో సన్నని



మస్లిన్ బట్టలు తయా రవుతాయని ఆ గ్రంథం తెలుపుతుంది. మైసా లియా పూర్వకాలం నుండి సన్నని రవ సెల్లా లకు, బంగారు పట్టుబట్టలకు ప్రసిద్ధమని ప్రాచీన గ్రంథాలు తెలుపుతున్నాయి. శాత వాహనుల హయాంలోనే ఇక్కడ నుంచి గంధకం, కర్పూరం, ఇనుప ఖనిజాల వ్యాపారం జరిగేది.

ఢిల్లీ సేనాని మాలిక్ కాఫర్ మచిలీపట్నం వచ్చి ఇనుకుదురు పేటలో మకాం వేసిన సమయంలో పర్షియా కలంకారీ కళను బందరు అద్దకం కళతో సమ్మిళతం చేసి అభివృద్ధి పరిచారంటారు. దానినే మనం ఇప్పుడు బందరు కలంకారీగా పిలుస్తున్నాము.

బహమనీ సుల్తానుల కాలంలో బార్బోసా అనే వ్యక్తి బందరు ఓడరేవు నుంచి గోధుమలు, అల్లం, సజ్జలు ఎగుమతి అయ్యేవి అని తెలియజేశాడు. మచిలీపట్నం ఓడరేవులో డచ్ వ్యాపారులకు కావల్సిన వర్తక సరుకులు మోసే భారీ వర్తకపు ఓడలు ‘మాచ్ పటం బోట్లు’, తుపాకులు అమర్చిన సంగారి బోట్ల తయారీ పరిశ్రమ ఉండేది. 1611లో ఆంగ్లేయులు, అంతకు ముందు డచ్ వారు, పోర్చుగీస్ వారు మచిలీపట్నంలో అడుగుపెట్టి దీన్ని తమ వ్యాపార స్థావరంగా మార్చుకున్నారు. బ్రిటిష్ వారి పాలనలో కీలకమైన పోర్టుగా ఇది భాసిల్లింది. 1864లో వచ్చిన ఒక ఉప్పెన పోర్టుకు తీవ్రమైన హాని జరిగింది.

ఒకప్పుడు ఎంతో వైభవంతో వెలుగొందిన బందరు పోర్టు కాలక్రమేణా ప్రాధాన్యం కోల్పోయింది. ఇప్పుడు మళ్లీ దానికి ప్రాభవాన్ని తీసుకురావడానికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పూను కున్నారు. అందుకు శ్రీకారంగా ఇవ్వాళ భూమిపూజ చేస్తున్నారు. సుమారు 11,500 కోట్ల రూపాయల వ్యయంతో 16 బెర్తులతో రెండు దశలలో రూపుదిద్దుకుంటున్న ఈ పోర్టు వల్ల సుమారు 25,000 మందికి ఉపాధి అవకాశాలు రానున్నాయి.

వ్యాసకర్త సంచాలకులు,ఏపీ భాషా సాంస్కృతిక శాఖ । 94916 59899

(మచిలీపట్నం పోర్టు నిర్మాణానికి ఏపీ సీఎం నేడు భూమి పూజ చేయనున్నారు.)

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, జ్యేష్ఠ మాసం, **తిథి:** శు.తదియ రా.10.06 వరకు, తదుపరి చవితి, **నక్షత్రం:** మృగశిర ఉ.9.53 వరకు, తదుపరి ఆరుద్ర, **వర్జ్యం:** సా.6.54 నుండి 8.37 వరకు, **దుర్ముహూర్తం:** ప.12.20, నుండి 1.14 వరకు, తదుపరి ప.2.55 నుండి 3.46 వరకు, **అమృతఘడియలు:** రా.12.54 నుండి 2.35 వరకు. ; **రాహుకాలం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **యమగండం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **సూర్యోదయం:** 5.30, **సూర్యాస్తమయం:** 6.22.

క్లుప్తంగా...



రాజీవ్‌గాంధీకి కాంగ్రెస్ ఘన నివాళి

సాక్షి, హైదరాబాద్: మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ 32వ వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. గాంధీభవన్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి రాజీవ్ సేవలను స్మరించుకున్నారు. అంతకు ముందు సోమాజీగూడలోని రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద కూడా నేతలు నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావు మాట్లాడుతూ దేశాభివృద్ధిలో రాజీవ్‌గాంధీ సేవలు చిరస్మరణీయ మన్నారు. శాస్త్ర, సాంకేతిక రంగాల అభివృద్ధితో పాటు టెలికాం, పంచాయతీరాజ్ రంగా ల్లో మెరుగైన సంస్కరణలు తెచ్చారని గుర్తు చేశారు. మహిళలకు రిజర్వేషన్లు కల్పించడంలోనూ, ఓటింగ్ వయసును 18 ఏళ్లకు తగ్గించడంలోనూ కీలక పాత్ర పోషించారని కొనియాడారు.

'మతోన్మాదంతో మానవాళికి ముప్పు'



పంజగుట్ట (హైదరాబాద్): మానవాళిని వినాశనం చేసేది మతోన్మాదమేనని తెలంగాణ ప్రజల పార్టీ వ్యవస్థాపకుడు జస్టిస్ బి.చంద్రకుమార్ అన్నారు. పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో 'కర్ణాటక ఎన్నికలు–గుణపాఠాలు'అనే అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి జస్టిస్ చంద్రకుమార్, మాజీ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి, కల్వకుంట్ల రమ్యారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా చంద్రకుమార్ మాట్లాడుతూ...ఏ మతమైనా మతోన్మాదం అనేది చాలా ప్రమాదకరమన్నారు. కులం, మతం పేరుతో రెచ్చగొడుతూ ఓట్లు అడగకూడదని చట్టాల్లో ఉన్నా ఒక ప్రధానమంత్రి స్థాయిలో ఉన్న నరేంద్రమోదీ జై బజరంగభళి అని ఓట్లు అడగటం ఆక్షేపణీయమన్నారు. ప్రజలు తలచుకుంటే డబ్బులు, అధికార దుర్వినియోగం, కులం, మతం, ఏదీ పనిచేయదని కర్ణాటక ఎన్నికల్లో నిరూపించారని దాన్నే తెలంగాణలో కూడా కొనసాగించాలని ఆకునూరి మురళి సూచించారు. సమావేశంలో తెలంగాణ ప్రజల పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మురళీధర్ గుప్తా, ప్రధానకార్యదర్శి ఇంద్రసేన తదితరులు పాల్గొన్నారు.

దళితుల కోసం వైఎస్సార్ టీపీ న్యాయ పోరాటం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో దళితులకు జరుగుతున్న అన్యాయంపై వారి న్యాయమైన హక్కుల కోసం వైఎస్సార్ తెలంగాణ పార్టీ పోరాడుతుందని ఆ పార్టీ అధినేత్రి వైఎస్ షర్మిల తెలిపారు. దళితబంధు అక్రమాలను ఎత్తిచూపిన అడ్వొకేట్ యుగేందర్ మీద బీఆర్ఎస్ గూండాల దాడిని ఆదివారం ట్విట్టర్‌లో షర్మిల తీవ్రంగా ఖండించారు. నడిరోడ్డుపై దళిత న్యాయవాది కారు అద్దాలు పగలగొట్టడమే కాకుండా రక్తం వచ్చేలా దాడి చేయడం బందిపోట్లకే సాధ్యమని విమర్శించారు. బీఆర్ఎస్ అంటే బందిపోట్ల రాష్ట్ర సమితి అని ఊరికే అనలేదని చురకలంటించారు.

ఆదివాసీల మీద దాడులు దుర్మార్గ చర్య



సుందరయ్య విజ్ఞానకేంద్రం: ఆదివాసీల మీద దాడులు అత్యంత దుర్మార్గమైన చర్యని ప్రొఫెసర్ హరగోపాల్ విమర్శించారు. విప్లవ రచయిత సంఘం (విరసం) ఆధ్వర్యంలో ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 'దండకారణ్యం శత్రు దేశమా? ఆదివాసీల మీద వైమానిక దాడులు ఎందుకు?'అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా 'ఇక ఆకాశ యుద్ధం' పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం హరగోపాల్ మాట్లాడుతూ దేశంలోని వనరులతో పాటు ప్రజలను ప్రేమించటమే జాతీయవాదమన్నారు. మానవ సంబంధాల్లో సంక్షోభంతో పాటు నిర్బంధం పెరిగిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్య విధానంలోనూ మార్పులు తెచ్చారని, సీబీఎస్ఈ సిలబస్‌లో ప్రజాస్వామ్యం అనే పదాన్ని తొలగించారని విమర్శించారు. అభివృద్ధి పేరుతో నడుస్తున్న ఆర్థిక వ్యవస్థ దుర్మార్గమైందని వారికి కూడా తెలుసని, అయినా అమానుషంగా అమలు చేస్తున్నారని మండిపడ్డారు. వారికి అడ్డొస్తుందనే ఉద్దేశంతోనే రాజ్యాంగాన్ని మార్చాలని కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. మానవ హక్కులను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో విరసం అధ్యక్షుడు అరసవిల్లి కృష్ణ, నగర కన్వీనర్ రాము, కార్యదర్శి రివేరా, ప్రొఫెసర్ సూరేపల్లి సుజాత, సీనియర్ పాత్రికేయులు కె.రామచంద్రమూర్తి, పౌరహక్కుల సంఘం నాయకులు నారాయణరావు, విప్లవ్, ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ, వీక్షణం ఎడిటర్ ఎన్.వేణుగోపాల్, డాక్టర్ చెరుకు సుధాకర్, డాక్టర్ టి.రమేష్, ప్రొఫెసర్ సమున్నత పాల్గొని ప్రసంగించారు.

రైతుబంధు చూపి అన్నిటికీ కోత

సీఎం కేసీఆర్‌పై కిషన్‌రెడ్డి ధ్వజం

- ఒక్కో రైతుకు రాష్ట్రం రూ.10 వేలు ఇస్తుంటే, కేంద్రం రూ.18,254 ఇస్తోంది
- రాష్ట్రంలో పంటల బీమా లేకపోవడం దురదృష్టకరం
- ముఖ్యమంత్రి ఇక్కడి పాలనను వదిలేశారు..
- ఫ్లెక్సీలు పెట్టుకున్నంత మాత్రాన 'దేశ్ కీ నేత' కాలేరు..



ఆదివారం బీజేపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో రైతుల జీవన శైలి మారిపోయిందంటూ సీఎం కేసీఆర్ గొప్పలు చెప్పుకుంటున్నారని కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి విమర్శించారు. వాస్తవానికి రాష్ట్ర ప్రభుత్వం రైతుబంధు పథకం కింద ఒక్కో రైతుకు రూ.10 వేల సాయం అందిస్తుంటే, కేంద్రం ఒక్కో రైతుకు ఎరువుల రాయితీ రూపంలో ఎకరానికి రూ.18,254 ఇస్తోందని చెప్పారు. రైతుబంధు పథకాన్ని చూపి పంట నష్టానికి పరిహారం, పంటల బీమా తదితరాలన్నిటికీ కోతపెట్టిన ముఖ్యమంత్రి.. రైతులను తీవ్ర నష్టాలపాలు చేశారని విమర్శించారు. ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు.

అకాల వర్ష బాధితులకు అందని సాయం

అకాల వర్షాలతో రాష్ట్రంలోని రైతాంగం తీవ్రంగా నష్టపోయిందని, కానీ సీఎం కేసీఆర్ రైతులకు ఎలాంటి సాయం చేయలేదని కిషన్‌రెడ్డి ధ్వజమెత్తారు. ఏపీతో పాటు ఇతర రాష్ట్రాల్లో ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు పంటల బీమా పథకం ద్వారా సాయం అందుతుండగా.. తెలంగాణలో ఈ పథకం అమలు చేయకపోవడం దురదృష్టకరమన్నారు. రాష్ట్రంలో పరిపాలనను సలహాదారులకు అప్పగించిన సీఎం.. తాను మహారాష్ట్రలోని బీఆర్ఎస్ బ్రాంచ్ ఆఫీస్‌లో బిజీగా గడుపుతున్నారన్నారు కేసీఆర్ తనకు తాను దేశ్ కీ నేత అని చెప్పుకుంటున్నారని, ఫ్లెక్సీలు పెట్టుకున్నంత మాత్రాన దేశ్ కీ నేత కాలేరని ఎద్దేవా చేశారు. మహారాష్ట్రలో బీఆర్ఎస్‌ను ఎంఐఎం పార్టీ నడిపిస్తోందని విమర్శించారు. అక్కడ ఒక్క వార్డు మెంబర్ గెలిచినందుకే సంబరపడుతున్నారన్నారు.

హామీలన్నీ తుంగలో తొక్కారు..: సీఎం అవ్వక ముందు కేసీఆర్ ఇచ్చిన హామీలను తుంగలో తొక్కారని కేంద్రమంత్రి విమర్శించారు. దళితుడిని సీఎం చేస్తానని చెప్పి మొదట్లోనే వారిని మోసం చేశారన్నారు. రైతులు, నిరుద్యోగులు, ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి, డబుల్ బెడ్ రూమ్, వైద్యం, మౌలిక వసతులు, గ్రామ పంచాయతీల అభివృద్ధి, మున్సిపాలిటీల అభివృద్ధి.. ఏ విషయంలోనూ మాట నిలబెట్టుకోలేదన్నారు. అలాంటి ముఖ్యమంత్రి మహారాష్ట్రకు వెళ్లి ప్రధాని మోదీని విమర్శిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మోదీ డిజిటల్ విప్లవం తీసుకురావడంతో పాటు సంక్షేమ పథకాలు వందకు వంద శాతం పేదలకు అందేలా చేస్తున్నారని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం రాయితీ కింద ట్రాక్టర్లు ఇస్తుంటే వాటిని బీఆర్ఎస్ నాయకులు వారి బంధువులకు ఇచ్చుకున్నారని విమర్శించారు. కేంద్రం ఇచ్చే సబ్సిడీల వల్ల ఉత్పత్తి పెరుగుతోందని, కేంద్రం నిర్మాణాత్మకంగా సబ్సిడీని అందిస్తోందని కిషన్‌రెడ్డి చెప్పారు. ఎరువుల సబ్సిడీతో కొలు రైతులకు లాభం చేకూరుతుందన్నారు. ధాన్యం కొనుగోలు ఒక్క కేంద్ర ప్రభుత్వం బాధ్యతే కాదని, రాష్ట్ర ప్రభుత్వం కూడా చూసుకోవాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని, కానీ తెలంగాణలో మాటల గారడీతో ప్రభుత్వాన్ని నడిపిస్తున్నారని కేంద్రమంత్రి విమర్శించారు.

అవినీతిపరులే వ్యతిరేకిస్తున్నారు

రెండు వేల రూపాయల నోట్ల ఉపసంహరణను కేవలం అవినీతిపరులే వ్యతిరేకిస్తున్నారని, ఈ నోట్ల రద్దులో తమ ప్లాన్ తమకు ఉందని కిషన్‌రెడ్డి చెప్పారు. కర్ణాటక ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు ప్రభావం తెలంగాణలో ఏమాత్రం ఉండదన్నారు. కాంగ్రెస్‌కు తెలంగాణలో భవిష్యత్తు లేదని, ఇక్కడ బీఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయం కేవలం బీజేపీ మాత్రమేనని అన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి మార్పుపై వస్తున్న వార్తలు పూర్తిగా నిరాధారమైనవని, ప్రస్తుతం దీనికి అవకాశం లేదని చెప్పారు.

కవిత అరెస్టు మా చేతుల్లో లేదు

ఎమ్మెల్సీ కవిత అరెస్టు అంశం తమ చేతుల్లో లేదని కిషన్‌రెడ్డి అన్నారు. ఇది ఈ కేసును పరిశోధిస్తున్న సీబీఐ పరిధిలోని అంశమని చెప్పారు. సీబీఐ వద్ద పక్కా ఆధారాలు ఉన్నందునే ఢిల్లీ ఉప ముఖ్యమంత్రిని అరెస్టు చేశారన్నారు. అదే విధంగా అవినీతికి పాల్పడిన కర్ణాటకకు చెందిన బీజేపీ శాసన సభ్యుడిని కూడా అరెస్టు చేసినట్లు తెలిపారు.

27న పరేడ్ గ్రౌండ్స్‌లో లక్షమందితో యోగా మహోత్సవం

ప్రతి మనిషి మానసిక, శారీరక ఆరోగ్యాన్ని పెంచే సాధనంగా యోగాను ప్రపంచం గుర్తించిందని, ఐక్యరాజ్యసమితితో పాటు 200కు పైగా దేశాల్లో యోగా ప్రజల జీవితాల్లో భాగమైందని కేంద్ర పర్యాటక శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి అన్నారు. జూన్ 21న నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవానికి 25 రోజుల కౌంట్ డౌన్‌గా సికింద్రాబాద్‌లోని పెరేడ్‌గ్రౌండ్స్‌లో ఈనెల 27న ప్రత్యేక యోగా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆదివారం టూరిజం ప్లాజాలో మీడియాతో ఆయన మాట్లాడారు. కౌంట్‌డౌన్ యోగా కార్యక్రమానికి హైదరాబాద్ జంట నగరాల నుంచి సుమారు లక్ష మంది వరకు హాజరవుతారని భావిస్తున్నామన్నారు. కేంద్ర మంత్రులతో పాటు యోగా సంస్థల ప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొంటారని తెలిపారు. జూన్ 21 కి వంద రోజుల ముందు నుంచే దేశంలోని ప్రజలందరినీ ఇందుకోసం సన్నద్ధం చేస్తున్నట్లు చెప్పారు.

సీఎం కేసీఆర్‌ను కూడా ఆహ్వానించాం

మే 27వ తేదీ ఉదయం 5 గంటలకు పరేడ్ గ్రౌండ్ లో జరిగే యోగా కార్యక్రమంలో అందరూ భాగస్వామ్యం కావాలని కిషన్‌రెడ్డి కోరారు. సీఎం కేసీఆర్‌కు కూడా ఆహ్వానం పంపినట్లు ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని పాతిపెడతాం

- తొమ్మిదేళ్లలో సీఎం కేసీఆర్ వేలకోట్లు దోచుకున్నారు
- ఖమ్మం ఆత్మీయ సమ్మేళనంలో మాజీ ఎంపీ పొంగులేటి ఫైర్
- ఎన్నికలు రాగానే బీసీలు గుర్తుకొచ్చారా అని ప్రశ్న



పొంగులేటి శ్రీనివాసరెడ్డి, జూపల్లి, ప్రొఫెసర్ కోదండరాంను సన్మానిస్తున్న అభిమానులు

సాక్షి ప్రతినిధి, ఖమ్మం: ''ఏ ఆశయం కోసం తెలంగాణ బిడ్డలు కలలు గన్నారో అవి నెరవేరలేదు. తొమ్మిదేళ్లలో సీఎం కేసీఆర్ వేలకోట్లు దోచుకుని రాష్ట్రాన్ని తాకట్టు పెట్టారు. ఇక తెలంగాణ బిడ్డలు ఉపేక్షించరు. బీఆర్ఎస్ పార్టీతోపాటు ప్రభుత్వాన్ని గొయ్యి తీసి పాతిపెట్టడం ఖాయం'' అని మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మండిపడ్డారు. ఖమ్మంలో ఆదివారం రాత్రి నిర్వహించిన ఖమ్మం నియోజకవర్గ ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాబోయే ఎన్నికల కురుక్షేత్రంలో ప్రజల సూచనలు, దీవెనలతో బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని సమాధి చేస్తామన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పది నియోజకవర్గాలే కాదు.. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 119 నియోజకవర్గాల్లో ప్రజల తీర్పు ముందు బీఆర్ఎస్ తలవంచక తప్పదన్నారు. కుట్రలు, కుతంత్రాలతో సీఎం కేసీఆర్ మూడోసారి అధికారంలోకి రావాలని చూస్తున్నారని విమర్శించారు. బీసీలకు రూ.లక్ష ఆర్థిక సాయం అని కేబినెట్ ప్రకటించడం మాటల గారడీ అన్నారు. గత తొమ్మిదేళ్లలో గుర్తుకురాని బీసీలు ఎన్నికల వేళ గుర్తుకొచ్చారా? అని ప్రశ్నించారు. మంత్రులే పేపర్లు లీక్ చేసి నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని ఆరోపించారు. హైదరాబాద్‌లో ఉన్న భూములను కొల్లగొట్టడానికి, వేల కోట్లు సంపాదించడానికే కేసీఆర్ ధరణిని తెచ్చారని విమర్శించారు. ఖమ్మంకు చెందిన మంత్రి దోపిడీ అందరికీ తెలుసని, ఆయన అనుచరులు మట్టికొండలను సైతం వదిలిపెట్టడం లేదని ఆరోపించారు.

మార్పునకు ఈ సభ సంకేతం: కోదండరామ్

తెలంగాణలో నెలకొన్న సంక్షోభం నుంచి ప్రజలు పరిష్కారం కోరుకుంటున్నారనడానికి ఖమ్మం సభ ఒక సంకేతమని తెలంగాణ జనసమితి అధ్యక్షుడు కోదండరామ్ పేర్కొన్నారు. ఖమ్మం ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇటీవలి అకాల వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.10 వేలు ఇస్తామని చెప్పిన సర్కార్.. ఇప్పటివరకు ఇవ్వలేదేమని నిలదీశారు. తెలంగాణను కాపాడుకోవడానికి అంతా ఒకతాటిపైకి వచ్చి కొట్లాడాల్సిన అవసరం ఉందన్నారు.

మరో ఉద్యమానికి సిద్ధం కావాలి: జూపల్లి

వందలాది మంది యువత బలిదానాలతో వచ్చిన తెలంగాణలో నిరంకుశ పాలన నెలకొందని మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆరోపించారు. తెలంగాణ పరిరక్షణ కోసం మరో ఉద్యమానికి సిద్ధంకావాలని పిలుపునిచ్చారు. ఈ సమ్మేళనంలో భద్రాద్రి జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య, మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, పిడమర్తి రవి, వైరా మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, పొంగులేటి ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నక్కలగండి ప్రాజెక్టు మ్యాపును పరిశీలిస్తున్న కేంద్ర మంత్రి మహేంద్రనాథ్‌పాండే

లిక్కర్ స్కాంపై ఉన్న ఆసక్తి ప్రాజెక్టులపై లేదు

- సీఎం కేసీఆర్‌పై కేంద్ర మంత్రి మహేంద్రనాథ్ పాండే విమర్శ

చందంపేట: సీఎం కేసీఆర్‌కు ఢిల్లీ లిక్కర్ స్కాంపై ఉన్న ఇంట్రెస్ట్.. ప్రాజెక్టులు పూర్తి చేయడంపై లేదని కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి మహేంద్రనాథ్‌పాండే విమర్శించారు. నల్లగొండ జిల్లా చందంపేట మండల పరిధిలోని నక్కలగండి ప్రాజెక్ట్‌ను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మూడేళ్లలో పూర్తి చేయాల్సిన నక్కలగండి ప్రాజెక్ట్‌ను కేసీఆర్ తన తొమ్మిదేళ్ల పాలనా కాలంలో ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. కొందరు రైతులు ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించి తమకు పరిహారం అందలేదని మంత్రికి విన్నవించారు. వాటికి స్పందిస్తూ ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ అందించకపోవడం రాష్ట్ర ప్రభుత్వ ఉదాసీనతకు అద్దంపడుతోందన్నారు. రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రాగానే ప్రాజెక్ట్‌ను పూర్తి చేస్తామని హామీనిచ్చారు. ఆ తర్వాత నేరేడుగొమ్ము మండలంలోని గుర్రపుతండాలో జరిగిన సభలో మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ మంత్రి రవీంద్రనాయక్ తదితరులున్నారు.

సర్కార్ బడుల్లో ఇక రాగి జావ

రాష్ట్రంలో పీఎం పోషణ్ పథకం అమలుకు సర్కారు ఓకే

- విద్యార్థులకు పోషకాహారం అందించే దిశగా చర్యలు
- ఏటా 110 రోజుల పాటు 16.82 లక్షల మందికి బ్రేక్ ఫాస్ట్
- ఇందుకోసం రూ.27.76 కోట్ల వ్యయం అంచనా
- వచ్చే విద్యా సంవత్సరం మధ్యాహ్న భోజన పథకానికి రూ.323.71 కోట్లు



సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ బడుల్లో చదివే విద్యార్థులకు పోషకాహారం అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సిద్ధమయ్యాయి. దీనికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన 'ప్రధాన మంత్రి పోషణ్'పథకాన్ని ఇక్కడ అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. విద్యార్థులకు ఐరన్, ఇతర సూక్ష్మ పోషకాలతో కూడిన ఆహారాన్ని ఇవ్వాలన్నది ఈ పథకం ఉద్దేశం. ఈ క్రమంలోనే పోషకాలతో కూడిన రాగి జావను అన్ని తరగతుల విద్యార్థులకు బ్రేక్ ఫాస్ట్‌గా అందించనున్నారు.

ఈ విద్యా సంవత్సరం నుంచే..

రాష్ట్రంలోని 16.82 లక్షల మంది విద్యార్థులకు ఏడాదిలో 110 రోజుల పాటు రాగిజావను పంపిణీ చేస్తారు. ఇప్పటికే స్కూళ్లలో ఇస్తున్న మధ్యాహ్న భోజనానికి అదనంగా.. ఉదయమే ఈ రాగి జావను అందిస్తారు. 2023–24 విద్యా సంవత్సరంలో దీని అమలుకు సంబంధించి ఇటీవల జరిగిన సమావేశంలో పీఎం పోషణ్ అభియాన్ ప్రాజెక్ట్ ఆమోదిత మండలి (పీఏబీ) ఆమోదం తెలిపింది. ఈ వివరాలను కేంద్ర విద్యాశాఖ ఇటీవల విడుదల చేసింది. ఈ సమావేశం సందర్భంగా ఎందరు విద్యార్థులకు రాగి జావ అందించాల్సి ఉంటుంది? ఇందుకోసం చేయాల్సిన ఏర్పాట్లు, ఇతర అంశాలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలను సమర్పించింది. ఈ ప్రతిపాదనలను పరిశీలించిన కేంద్రం.. 2023–24లో రాష్ట్రంలో మొత్తంగా 16.82 లక్షల మంది విద్యార్థులకు 110 రోజుల పాటు రాగి జావ అందజేసేందుకు ఆమోదం తెలిపింది. దీనికి రూ.27.76 కోట్లు వ్యయం కానుండగా.. కేంద్రం 16.18 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం రూ.11.58 కోట్లు భరించనున్నాయి.

మధ్యాహ్న భోజనం 231 రోజులు

సర్కారు బడుల్లో విద్యార్థులకు వచ్చే విద్యా సంవత్సరంలో 231 రోజుల పాటు మధ్యాహ్న భోజనాన్ని అందించనున్నారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత, బాల వాటికల్లో 231 రోజులు, స్పెషల్ ట్రెనింగ్ సెంటర్లలో 293 రోజులపాటు మధ్యాహ్న భోజన పథకం అమలుకు పీఏబీ ఆమోదం తెలిపింది. ఈ పథకం అమలుకు రూ.323.71 కోట్లను వెచ్చించనుండగా.. కేంద్రం రూ.203.76 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం 119.95 కోట్లను భరించనున్నాయి. కేంద్రం మధ్యాహ్న భోజనం కుక్ కమ్ హెల్పర్లకు నెలకు వెయ్యి రూపాయలు మాత్రమే పారితోషికం ఇస్తుండగా, రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.2 వేలు అదనంగా కలిపి.. 54,232 మంది సిబ్బందికి నెలకు రూ. 3వేల పారితోషికం ఇస్తోంది. ఈ చొరవను కేంద్రం ప్రశంసించింది.

ఆరోగ్య విశ్లేషణ అనంతరం..

కోవిడ్ తర్వాత దేశవ్యాప్తంగా విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై కేంద్ర ప్రభుత్వం ఓ సర్వే చేపట్టింది. విద్యార్థుల్లో పోషకాహార లోపం ఉందని, అందుకే చదువుపై సరైన శ్రద్ధ చూపలేకపోతున్నారని అందులో గుర్తించింది. ఈ క్రమంలో విద్యార్థులకు పౌష్టికాహారం ఇచ్చే దిశగా చర్యలు చేపట్టింది.

'పీపుల్స్ మార్చ్'కు అతిరథులు

- జడ్చర్లకు రాజస్తాన్ సీఎం అశోక్ గెహ్లాట్
- నల్లగొండకు ప్రియాంక, ఖమ్మంలో ముగింపు సభకు రాహుల్‌గాంధీ
- తేదీల ఖరారుకు కాంగ్రెస్ ముఖ్యనేతల కసరత్తు




సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: కాంగ్రెస్ శాసన సభా పక్ష నేత మల్లు భట్టి విక్రమార్క చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్రలో భాగంగా పలు నియోజకవర్గాల్లో భారీ బహిరంగ సభలు నిర్వహించేందుకు రంగం సిద్ధమైంది. ఆదిలాబాద్ జిల్లా బోథ్‌లో మార్చి 16న ప్రారంభమైన భట్టి యాత్ర ఖానాపూర్, ఆసిఫాబాద్, బెల్లంపల్లి, చెన్నూర్, మంచిర్యాల, రామగుండం, ధర్మపురి, పెద్దపల్లి, హుజూరాబాద్, హుస్నాబాద్, వర్ధన్నపేట, వరంగల్ వెస్ట్, స్టేషన్‌ఘన్‌పూర్, జనగామ, ఆలేరు, భువనగిరి, ఇబ్రహీంపట్నం, ఎల్బీనగర్, మహేశ్వరం, రాజేంద్రనగర్, చేవెళ్ల, షాద్‌నగర్, పరిగి మీదుగా ఈ నెల 16న రాత్రి మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల నియోజకవర్గంలోని నవాబుపేట మండలంలో అడుగుపెట్టింది. 17న యాత్ర ఇదే మండలంలోని రుక్కంపల్లికి చేరుకుంది. ఇప్పటివరకు 25 నియోజకవర్గాల్లో 800 కిలోమీటర్ల మేర యాత్ర కొనసాగింది. అయితే వడదెబ్బతో డాక్టర్ల సూచన మేరకు 18 నుంచి యాత్రకు విరామం ప్రకటించారు. నాలుగు రోజులుగా విశ్రాంతి తీసుకుంటున్న ఆయన ఆరోగ్యం కుదుటపడటంతో మళ్లీ పాదయాత్రను ప్రారంభించేందుకు సిద్ధమయ్యారు. ఇప్పటికే మంచిర్యాలలో బహిరంగ సభ నిర్వహించగా.. తాజాగా మరో మూడు చోట్ల బహిరంగ సభలకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు పార్టీ నేతలతో చర్చలు జరిపిన ఆయన జాతీయ నేతలను ఆహ్వానించినట్లు సమాచారం. ఈ నెల 25 లేదా 26న జడ్చర్లలో సభ నిర్వహణకు శ్రీకారం చుట్టగా.. ముఖ్యఅతిథిగా రాజస్తాన్ సీఎం అశోక్ గెహ్లాట్ రానున్నట్లు తెలిసింది. పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జ్ మాణిక్ రావు ఠాక్రేతోపాటు టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి తదితర ముఖ్యనేతలు ఈ సభకు హాజరుకానున్నారు. అదేవిధంగా నల్లగొండ జిల్లాకు చేరుకున్న తర్వాత ఈ నియోజకవర్గ పరిధిలో లక్ష మందితో బహిరంగ సభకు ప్రణాళిక సిద్ధం చేశారు. ఈ సభకు అగ్ర నేత ప్రియాంకాగాంధీని, ఖమ్మంలో ముగింపు సందర్భంగా మూడు లక్షల మందితో నిర్వహించే సభకు రాహుల్‌గాంధీని ఆహ్వానించనున్నట్లు సమాచారం. ఈ సభలకు సంబంధించి కాంగ్రెస్ ముఖ్యనేతలు ఇప్పటికే కసరత్తు ప్రారంభించగా.. తేదీల ఖరారుపై స్పష్టత రావాల్సి ఉంది. వడదెబ్బతో యాత్రకు కొంత విరామం ప్రకటించామని.. అయినా షెడ్యూల్ ప్రకారమే జరుగుతుందని భట్టి విక్రమార్క స్పష్టంచేశారు.

ధరణితో అతిపెద్ద భూ కుంభకోణం

- సీఎల్పీ నేత భట్టి విక్రమార్క



సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: సీఎం కేసీఆర్ కుటుంబం ధరణితో దేశంలోనే అతిపెద్ద భూకుంభకోణానికి తెరలేపిందని సీఎల్పీ నేత మల్లుభట్టి విక్రమార్క ధ్వజమెత్తారు. రూ.లక్షల కోట్ల అవినీతికి పాల్పడి దేశంలో జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో విపక్ష అభ్యర్థులకు ఖర్చును తానే భరిస్తా అంటూ బహిరంగంగా ప్రకటించే స్థాయికి ఆయన ఎదిగారని ఆరోపించారు. వడదెబ్బతో మహబూబ్ నగర్ జిల్లా నవాబుపేట మండలం రుక్కంపల్లిలో విశ్రాంతి తీసుకుంటున్న భట్టిని ఆదివారం పీసీసీ మాజీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ కుసుమకుమార్, ఏఐసీసీ కార్యదర్శి, ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తదితరులు పరామర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో భట్టి మాట్లాడుతూ దేశ సంపదను మోదీ సర్కారు సైతం అన్యాక్రాంతం చేస్తోందని మండిపడ్డారు. నోట్ల రద్దు లాంటి తుగ్లక్ చర్యలను ప్రజలు గమనిస్తున్నారన్నారు. కాంగ్రెస్ భావజాలం నచ్చి పార్టీలో చేరేందుకు పెద్ద పెద్ద నేతలు సిద్ధంగా ఉన్నారని.. త్వరలో పెద్దఎత్తున చేరికలు ఉంటాయన్నారు. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ తొమ్మిదిన్నరేళ్ల పాలనలో కేంద్రంలోని బీజేపీ, తెలంగాణలో బీఆర్ఎస్ మూలంగా మోసపోయామని ప్రజలు గుర్తించడం మొదలుపెట్టారన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌దే విజయమని ధీమా వ్యక్తంచేశారు. శ్రీధర్‌బాబు మాట్లాడుతూ ప్రజలకు కావాల్సిన అవసరాలను తీర్చేలా సరికొత్త మేనిఫెస్టో తయారు చేసి ప్రజల ముందుకు వెళ్తామన్నారు. కాంగ్రెస్ శ్రేణులు ఐకమత్యంతో పోరాడాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పీసీసీ ఉపాధ్యక్షుడు మల్లురవి, ప్రధాన కార్యదర్శి అనిరుద్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎడ్యుకేషన్ హబ్‌గా సిద్దిపేట

- నాడు కాలేజీల ఏర్పాటు కోసం సీఎంల చుట్టూ ప్రదక్షిణలు
- మంత్రి హరీశ్‌రావు వెల్లడి



సిద్దిపేటజోన్: సిద్దిపేట నియోజకవర్గంలో ఒక మహిళా డిగ్రీ కళాశాల, ఒక పీజీ కళాశాల మంజూరు చేయాలని అప్పట్లో తాను పడ్డ తపన, బాధ వర్ణనాతీతమని ఆ కాలేజీల ఏర్పాటుకోసం సీఎంలు, మంత్రుల చుట్టూ ప్రదక్షిణలు చేసినా మంజూరుకాలేదని నేడు అదే సిద్దిపేట ఎడ్యుకేషన్ హబ్‌గా మారిందని మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. ఇప్పుడు సిద్దిపేటలో లేని విద్య లేదని మంత్రి చెప్పారు. ఆదివారం జిల్లా కేంద్రంలో నియోజకవర్గ విద్యార్థి విభాగం నాయకులతో మంత్రి హరీశ్‌రావు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. పదేళ్ల కాలంలో వందేళ్ల అభివృద్ధిని ప్రజల ముందుంచామన్నారు. ప్రతీ పల్లెలోని ఇంటికి మనం చేసుకున్న అభివృద్ధిని వివరించే బాధ్యత యువత మీద ఉందన్నారు. ప్రస్తుతం సిద్దిపేటలో నాలుగు ప్రభుత్వ పాలిటెక్నిక్, ప్రభుత్వ ఐటీఐ, పీజీ, ప్రభుత్వ మెడికల్, నర్సింగ్ కళాశాలలు, ప్రైవేటు మెడికల్, కేంద్రీయ విద్యాలయం, మహిళా డిగ్రీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ గురుకులం, బీ ఫార్మసీ, వెటర్నరీ కాలేజీలు వచ్చాయని వివరించారు. అభివృద్ధిలో సిద్దిపేటను చూసి నేర్చుకునేలా అధ్యయన కేంద్రంగా మారిందన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు రాజనర్స్, వేణుగోపాల్‌రెడ్డి, సంపత్ రెడ్డి, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

దేశానికి అన్నం పెట్టే స్థాయికి తెలంగాణ

- ఐటీ ఉద్యోగాల కల్పనలోనూ రాష్ట్రానిదే పైచేయి
- ఖమ్మం మెగాజాబ్ మేళాలో మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్



యువతికి నియామకపత్రం అందజేస్తున్న మంత్రి పువ్వాడ, పక్కన సీపీ వారియర్ తదితరులు

ఖమ్మం మయూరిసెంటర్: దేశానికి అన్నం పెట్టే స్థాయికి ఎదిగిన తెలంగాణ.. మరోపక్క నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంలో మొదటి స్థానంలో నిలుస్తోందని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ చెప్పారు. ఖమ్మంలోని ఎస్‌బీఐటీ కళాశాల ప్రాంగణంలో పోలీస్ శాఖ ఆధ్వర్యాన ఆదివారం నిర్వహించిన మెగా జాబ్ మేళాను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒకప్పుడు తిండి గింజల కోసం పక్క రాష్ట్రాలవైపు చూడాల్సిన పరిస్థితి ఉండగా.. నేడు సీఎం కేసీఆర్ పాలనలో ఆహార ధాన్యాల ఉత్పత్తిలో తెలంగాణ ముందుందన్నారు. అందరూ ప్రభుత్వ ఉద్యోగం పొందలేరని, అలాంటి వారి కోసం జాబ్ మేళా నిర్వహించడం అభినందనీయమన్నారు. ఖమ్మంలో పోలీస్ శాఖ ఆధ్వర్యాన 140 కంపెనీలతో 8,120 మందికి ఉద్యోగాలు ఇప్పించేలా జాబ్ మేళా నిర్వహించడం అభినందనీయమన్నారు. ఖమ్మం సీపీ విష్ణు ఎస్. వారియర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ వీ.పీ.గౌతమ్‌తో పాటు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం

- అందుకే సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు
- మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి



సాక్షి, హైదరాబాద్: పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందించాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి కేసీఆర్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల నిర్మాణానికి పూనుకున్నారని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. ఆదివారం హైదరాబాద్ ఎర్రమంజిల్‌లోని ఆర్ అండ్ బీ కార్యాలయంలో అధికారులు, పలు నిర్మాణ సంస్థ ప్రతినిధులతో మంత్రి సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. వరంగల్ మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, టిమ్స్ ఎల్బీనగర్, టిమ్స్ అల్వాల్, సనత్‌నగర్ టిమ్స్ నిర్మాణంపై చర్చించారు. గత నెలలో సీఎం ఆదేశాల మేరకు పర్యటించిన మంత్రి, వరంగల్ సూపర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ప్రాంగణం కలియతిరిగి పలు సూచనలు చేశారు. ఆయా పనుల పురోగతిపై అధికారులను, వర్క్ ఏజెన్సీని అడిగి తెలుసుకున్నారు. హాస్పిటల్ స్ట్రక్చర్‌ను విజువల్ ప్రజెంటేషన్ ద్వారా పరిశీలించిన మంత్రి ప్రశాంత్‌రెడ్డి పలు సూచనలు చేశారు. నిర్మాణంలో వేగం పెంచాలని, అందుకు తగ్గట్టుగా మ్యాన్ పవర్ పెంచాలని ఆదేశించారు. జూన్ 22న హాస్పిటల్ సైట్‌ను సందర్శిస్తానని చెప్పారు. హైదరాబాద్ నగర నలువైపులా నిర్మిస్తున్న టిమ్స్ హాస్పిటల్స్ నిర్మాణంపైనా చర్చించారు. ఎల్బీనగర్ 1000 పడకల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి పనులు ఈనెల 26 వరకు ప్రారంభం కావాలని అధికారులకు, వర్క్ ఏజెన్సీకి స్పష్టం చేశారు. ఆ లోపు అన్ని రకాల టెక్నికల్ అంశాలు పూర్తి చేసుకోవాలని, 26న తాను సైట్‌ను సందర్శించి పనుల ప్రగతిని పరిశీలిస్తానని చెప్పారు. అల్వాల్ 1200 పడకల హాస్పిటల్ నిర్మాణ పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సనత్‌నగర్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ స్ట్రక్చరల్ డిజైన్స్‌ను పరిశీలించారు. ఈనెల 29న అల్వాల్, సనత్‌నగర్ హాస్పిటల్స్ నిర్మాణాలను పరిశీలిస్తానని మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి చెప్పారు. సమీక్షలో గణపతి రెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

రూ.270కి మూడు ఇళ్లు

రోమ్: ఇటలీలో నాలుగైదేళ్ల కిందటి వరకు కొన్ని గ్రామాలకు వెళితే కారు చౌకగా ఇళ్లు లభించేవి. ఒక డాలర్ ఇస్తే చాలు ఇక ఇల్లు వారి పేరు మీద రిజిస్టర్ అయిపోయేది. సిసిలీలో ఒక మారుమూల విసిరేసినట్టున్న ఇల్లు కొనడానికి ఒక డాలర్ ఖర్చు పెడితే చాలు. దీనికి కారణం ఆ ప్రాంతం నుంచి ప్రజల వలసలే. కాలిఫోర్నియాకు చెందిన రుబియా డేనియల్స్ అనే మహిళ 2019లో కేవలం 3.30 డాలర్లకి (రూ.270) మూడు ఇళ్లను కొనుగోలు చేసింది. ఈ నాలుగేళ్లలో పరిస్థితిలో మార్పు వచ్చింది. ప్రజలు మళ్లీ గ్రామాల బాటపడుతున్నారు. దీంతో ఆమె కొనుగోలు చేసిన ఇళ్లకు డిమాండ్ పెరిగింది. ప్రస్తుతం ఆమె ఆ ఇళ్లను పునరుద్ధరించే పనిలో ఉన్నారు. ఒక ఇంట్లో తానుంటానని, మరొకటి ఆర్ట్ గ్యాలరీగా మార్చి, ఇంకొకటి అద్దెకిస్తానని చెబుతున్నారు.

కేరళలో కాలనీయే ఖాళీ ..!

కొచి: కేరళలోని కొట్టాయం జిల్లా కై పుజా గ్రామంలో ఒక కాలనీలో ఇళ్లన్నీ ఖాళీగా ఉన్నాయి. ఆ కాలనీలో ఉన్న 100కి పైగా ఇళ్లు అమ్మకానికి పెట్టారు. ఇవన్నీ ఎన్నారైలకు చెందిన ఇళ్లే. ఒకప్పుడు ఈ ప్రాంతం నుంచి మెరుగైన జీవితం కోసం ప్రజలు వివిధ దేశాలకు వెళ్లిపోయారు. అక్కడ సంపాదించిన డబ్బులతో తమ ప్రాంతంలో అత్యాధునిక సౌకర్యాలతో ఇళ్లు నిర్మించారు. రిటైర్‌మెంట్ జీవితం ఆ ఇళ్లల్లోనే గడిపారు. వారి తదనంతరం పిల్లలు విదేశాల్లో స్థిరపడడంతో ఆ ఇళ్లన్నీ ఇప్పుడు ఖాళీగా ఉన్నాయి. సకల సౌకర్యాలు ఉన్న ఆ కాలనీ ఒకేసారి ఖాళీ అయిపోయింది. అయితే అక్కడ మంచి సదుపాయాలు ఉండడంతో చాలా మంది ఆ ఇళ్లను కొనడానికి మొగ్గు చూపిస్తున్నారు. దీంతో ఒక్కసారిగా అక్కడ రియల్ ఎస్టేట్ బూమ్ పెరిగింది.

ఆరేళ్ల క్రితం ఇల్లు లేదు... ఇప్పుడు మిలియనీర్

కాలిఫోర్నియా: ఆరేళ్ల క్రితం నిలువ నీడలేని అమెరికన్ మహిళ నక్కతోక తొక్కారు. అదృష్టం లాటరీ రూపంలో తలుపు తట్టి రాత్రికి రాత్రి కోట్లకు పడగలెత్తారు. లాటరీలో 50 లక్షల డాలర్లు గెలుచుకున్నానని తెలియగానే ఆమె మొదట నమ్మలేదు. అది నిజమేనని అర్థమయ్యాక ఆమె ఆనందానికి అంతేలేదు. కాలిఫోర్నియాకు చెందిన లూసియా ఫోర్‌సెథ్‌ను చాలా కాలంగా ఆర్థిక కష్టాలు వేధిస్తున్నాయి. ఆరేళ్ల క్రితం ఇల్లు కూడా లేదు. కష్టపడి చదివి డిగ్రీ సంపాదించారు. చిన్న ఉద్యోగం వచ్చింది. కారులో ఆయిల్ కొట్టించినప్పుడు చిల్లర లేక అయిష్టంగానే లాటరీ టిక్కెట్ తీసుకున్నారు. దాంతోనే ఆమె ఇంట డాలర్ల వర్షం కురిసింది. ఈ ఏడాది లూసియా పెళ్లి చేసుకోనున్నారు. జీవిత భాగస్వామితో పాటు ఈ లాటరీ టిక్కెట్ తన జీవితాన్నే మార్చేసిందని సంబరపడుతున్నారు.

మనది ఒకే మూలం కాదు



ఆధునిక మానవుని మూలాలు ఎక్కడున్నాయి? ఆఫ్రికా అన్నది అందరూ చెప్పే సమాధానం. తొలి మానవులు అక్కడే పుట్టి. అక్కణ్నుంచే ప్రపంచమంతా వ్యాపించారని దశాబ్దాలుగా వింటూ వస్తున్నాం కూడా. అంత వరకూ నిజమే అయినా మనమంతా ఒకే ఆదిమ జాతి నుంచి పుట్టుకొచ్చామన్న సిద్ధాంతం మాత్రం తప్పంటోంది ఓ తాజా అధ్యయనం. మన మూలాలు ఆఫ్రికాలోని కనీసం రెండు విభిన్న జాతుల్లో ఉన్నాయని చెబుతోంది. కనుక ఆధునిక మానవుని జన్మస్థలం ఫలానా అంటూ ఇదమిత్థంగా తేల్చి చెప్పలేమన్నది దాని సారాంశం..

– సాక్షి, నేషనల్ డెస్క్

ఆ ఆధారాలే ఉంటేనా...!

ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఉన్న మనుషులందరి మూలాలూ కచ్చితంగా 10 లక్షల ఏళ్ల నాటి ఈ రెండు ఆదిమ జాతుల్లోనే ఉన్నట్టు కచ్చితంగా చెప్పగలమని బృందం సభ్యుడైన విస్కాన్సిన్–మాడిసన్ వర్సిటీ పాపులేషన్ జెనెటిసిస్ట్ ఆరన్ రాగ్స్‌డేల్ అంటున్నారు. ఎలా చూసినా మనందరి జన్మస్థానం ఆఫ్రికాలోని ఒకే ప్రాంతమన్న వాదనకు కాలం చెల్లినట్టేనని ఆయన చెప్పుకొచ్చారు. ''కాకపోతే 10 లక్షల ఏళ్ల నాటి మానవ శిలాజ తదితర జన్యు ఆధారాలేవీ ఇప్పటి దాకా మనకు దొరకలేదు. లేదంటే ఆధునిక మానవుని (హోమోసెపియన్) ఆవిర్భావం, విస్తరణ తదితరాలపై ఈ పాటికే మరింత స్పష్టత వచ్చేది'' అన్నారాయన.

కనీసం రెండు ఆదిమ జాతుల నుంచి పుట్టుకొచ్చాం..

10 లక్షల ఏళ్ల కింద ఆఫ్రికాలోని భిన్న ప్రాంతాల్లో మూలాలు

ఆధునిక మానవుని పుట్టుకపై కొత్త అధ్యయనం వాదన

మన ఆవిర్భావానికి ఒకే మూలమంటూ లేదని తాజా అధ్యయనం ఒకటి చెబుతోంది. 10 లక్షల ఏళ్ల క్రితం ఆఫ్రికావ్యాప్తంగా ఉనికిలో ఉన్న పలు ఆదిమ మానవ జాతులు హోమోసెపియన్స్‌గా పిలిచే ఆధునిక మానవుని పుట్టుకకు కారణమని అంటోంది. ''ఆ కాలంలో ఆఫ్రికాలో నివసించి, క్రమంగా ఆ ఖండమంతటా వ్యాపించి పరస్పరం కలిసిపోయిన కనీసం రెండు ఆదిమ జాతులు మన ఆవిర్భావానికి మూలం. ఆఫ్రికాలో పలు ప్రాంతాల్లో నివసిస్తున్న వారి జన్యు డేటాను లోతుగా పరిశోధించిన మీదట ఈ నిర్ణయానికి వచ్చాం'' అని అధ్యయనంలో పాల్గొన్న పరిశోధకులు చెబుతున్నారు. దీని వివరాలను జర్నల్ నేచర్‌లో ప్రచురించారు. ''మన ఆవిర్భావానికి కారకుడైన ఆదిమ మానవులు ఒకే జాతికి చెందిన వారని మానవ వికాసంపై దశాబ్దాలుగా జరిగిన పరిశోధనల్లో చాలావరకు చెప్పుకొచ్చాయి. వారు ఆఫ్రికాలో తొలుత చెట్లపై నివసించి, అనంతరం క్రమంగా నేల మీదికి దిగారన్నది వాటి సారాంశం. కానీ ఆఫ్రికావ్యాప్తంగా మానవ ఆవాసాలకు సంబంధించిన శిలాజ, పురాతత్వ రికార్డులు ఈ వాదనతో సరిపోలడం లేదు. ఆఫ్రికాలో పలు ప్రాంతాల్లో సంచరించిన ఒకటికి మించిన ఆదిమ జాతులు వేలాది ఏళ్లపాటు పరస్పర వలసలు తదితరాల ద్వారా కలగలిసిపోయి క్రమంగా ఆధునిక మానవుని ఆవిర్భావానికి దారితీశాయన్నది మా పరిశోధనలో తేలింది. హేతుబద్ధంగా ఆలోచించినా 'ఒకే మూలం' సిద్ధాంతం కంటే ఇదే సమంజసంగా తోస్తోంది కూడా'' అని పరిశోధనకు నేతృత్వం వహించిన యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా జెనెటిసిస్ట్ డాక్టర్ బ్రెన్నా హెన్ వివరించారు.

ఇలా చేశారు...

డాక్టర్ హెన్ సారథ్యంలో ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల్లోని ప్రఖ్యాత సంస్థలకు చెందిన పరిశోధకులు ఈ అధ్యయనంలో పాలుపంచుకున్నారు. ఆఫ్రికాలోని పలు ప్రాంతాలకు చెందిన 290 మంది జన్యు అమరికను వారు లోతుగా విశ్లేషించారు. దాంతోపాటు ఆఫ్రికాలో ఉన్న భిన్న జాతుల వారి డీఎన్ఏను ఇందుకు ఎంచుకున్నారు. పశ్చిమ ఆఫ్రికాలో సియెరా లియోన్‌లో నివసించే మెండే రైతు జాతి, ఇథియోపియాలో ఆదిమ వేటగాళ్ల నుంచి రూపాంతరం చెందిన గుముజ్ జాతి, అమ్హరాగా పిలిచే అక్కడి రైతులతో పాటు నమా అనే దక్షిణాఫ్రికాలోని వేటగాళ్ల సంతతి నుంచి డీఎన్ఏ నమూనాలను సేకరించారు. వాటిలోని వైవిధ్యాన్ని బట్టి లక్షల ఏళ్ల క్రితం ఆ డీఎన్ఏలు ఎలా ఉండేవో, ఇన్నేళ్ల పరిణామక్రమంలో ఏ విధంగా మారుతూ వచ్చాయో అత్యాధునిక సాఫ్ట్‌వేర్ ఆధారంగా సిమ్యులేషన్ విధానంలో ఆవిష్కరిస్తూ వచ్చారు. ఇప్పటి దాకా లభించిన అతి పురాతన మానవ శిలాజం (3 లక్షల ఏళ్ల నాటిది) ఆఫ్రికాకు చెందినదే. అంతేగాక అతి పురాతన రాతి పనిముట్లు కూడా అక్కడే దొరికాయి. ప్రధానంగా ఈ రెండింటి ఆధారంగానే ఆఫ్రికానే మన జన్మస్థానమని గత అధ్యయనాల్లో చాలా వరకు నిర్ధారణకు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఆఫ్రికావాసుల డీఎన్ఏను బ్రిటిష్ వారి డీఎన్ఏతోనూ, క్రొయేషియాలో దొరికిన దాదాపు 50 వేల ఏళ్ల నాటి మన పూర్వీకుడైన నియాండర్తల్ మానవుని డీఎన్ఏతోనూ పోల్చి చూశారు. ఆఫ్రికావ్యాప్తంగా ఒకటికి మించిన ఆదిమ జాతులు వేల ఏళ్ల క్రమంలో తమలో తాము కలిసిపోయిన ఫలితంగానే మనం పుట్టుకొచ్చామని తేల్చారు. కనీసం రెండు ప్రధాన ఆదిమ జాతులు మన ఆవిర్భావానికి మూల కారకులని డాక్టర్ హెన్ సూత్రీకరించారు. వాటికి స్టెమ్1, స్టెమ్2గా పేరు పెట్టారు.

రూ.2 కోట్ల భారీ నష్టపరిహారం

రోడ్డు ప్రమాదంలో మరణించిన ఉద్యోగి కుటుంబానికి ట్రిబ్యునల్‌లో ఊరట

న్యూఢిల్లీ: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఒక ప్రభుత్వ ఉద్యోగి కుటుంబానికి రూ.2 కోట్లకు పైగా నష్టపరిహారం ఇవ్వాలని నేషనల్ ఇన్సూరెన్స్ కంపెనీకి ట్రిబ్యునల్ ఆదేశాలు జారీ చేసింది. మనీష్ గౌతమ్ అనే ప్రభుత్వ ఉద్యోగి ఢిల్లీలోని రోహిణి మార్గ్‌లో 2019 మే 31న రోడ్డు పక్కన నడుస్తుండగా వేగంగా వచ్చిన కారు ఢీ కొంది. ఆ ప్రమాదంలో తీవ్రంగా గాయాలపాలైన గౌతమ్ ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటూ ఆ మర్నాడు జూన్ 1న మరణించారు. అయితే బాధితుడు నిర్లక్ష్యంగా ఉండడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని, అందుకే నష్టపరిహారం ఇవ్వాల్సిన పని లేదని ఇన్సూరెన్స్ కంపెనీ చేసిన వాదనలను ట్రిబ్యునల్ న్యాయమూర్తి తోసిపుచ్చారు. గౌతమ్ కుటుంబ సభ్యులకు 2 కోట్ల 50 వేల రూపాయలు చెల్లించాల్సిందేనని ఆదేశించారు.

అమెరికాలో కాల్పులు.. ముగ్గురు దుర్మరణం

కన్సాస్ సిటీ: అమెరికాలో మిస్సోరి రాష్ట్రం కాన్సాస్‌లో ఆదివారం జరిగిన కాల్పుల్లో ముగ్గురు చనిపోగా మరో ఇద్దరు గాయాలపాలయ్యారు. ఇండియానా అవెన్యూలోని క్లైమాక్స్ లాంజ్ వద్ద జరిగిన ఈ ఘోరంలో మరణించిన వారి వివరాలు, కాల్పులకు కారణాలను అధికారులు వెల్లడించలేదు. దర్యాప్తు జరుపుతున్నట్లు చెప్పారు.

ఐరాసను సంస్కరించాల్సిందే

నేటి అవసరాలను తీర్చేలా లేదు: మోదీ

- జీ-7 సదస్సులో ప్రధాని వ్యాఖ్యలు
- ఇతరుల సార్వభౌమత్వాన్ని గౌరవించాలి
- అంతర్జాతీయ వేదికపై చైనాకు చురకలు



మోదీ, సునాక్ ఆత్మీయ పలకరింపు

హిరోషిమా: ఐక్యరాజ్యసమితి వంటి అంతర్జాతీయ సంస్థలను నేటి వాస్తవాలకు అద్దం పట్టేలా, అవసరాలను తీర్చేలా తక్షణం సంస్కరించుకోవాల్సిన అవసరముందని ప్రధాని నరేంద్ర మోదీ కుండబద్దలు కొట్టారు. లేదంటే ఐరాస, భద్రతా మండలి వంటివి కేవలం నామమాత్రపు చర్చా వేదికలుగా మారే ప్రమాదముందని హెచ్చరించారు. ఆదివారం జపాన్‌లోని హిరోషిమాలో జీ–7 సదస్సునుద్దేశించి ఆయన మాట్లాడారు. ''ప్రపంచ శాంతే ప్రధాన లక్ష్యంగా స్థాపించుకున్న ఐరాస యుద్ధాలు, సంక్షోభాలను ఎందుకు నివారించలేకపోతోంది? శాంతి గురించి పలు ఇతర వేదికలపై చర్చించుకోవాల్సిన అవసరం ఎందుకు తలెత్తుతోంది? ఉగ్రవాదపు నిర్వచనాన్ని కూడా ఐరాస ఎందుకు అంగీకరించడం లేదు? ఆలోచిస్తే తేలేదొక్కటే. ఐరాస ప్రస్తుత ప్రపంచపు వాస్తవాలకు అనుగుణంగా లేదు. గత శతాబ్దానికి చెందిన ఇలాంటి అంతర్జాతీయ సంస్థలు 21వ శతాబ్దపు అవసరాలను తీర్చలేకపోతున్నాయి. ఇవన్నీ చాలా సీరియస్‌గా దృష్టి సారించాల్సిన విషయాలు'' అని అభిప్రాయపడ్డారు. ఉక్రెయిన్ యుద్ధం మానవతకు సంబంధించిన సంక్షోభమని మోదీ పునరుద్ఘాటించారు. అంతర్జాతీయ చట్టాలను, దేశాల సార్వభౌమత్వాన్ని, ప్రాదేశిక సమగ్రతను అందరూ గౌరవించాలని రష్యా, చైనాలను ఉనుద్దేశించి పరోక్ష వ్యాఖ్యలు చేశారు. ఇలాంటి విషయాల్లో యథాతథ స్థితిని మార్చేందుకు జరిగే ఏకపక్ష ప్రయత్నాలపై దేశాలన్నీ ఉమ్మడిగా గళమెత్తాలని పిలుపునిచ్చారు. ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధానికి దిగడం, లద్దాఖ్ దురాక్రమణకు కొన్నేళ్లుగా చైనా చేస్తున్న యత్నాల నేపథ్యంలో మోదీ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. యుద్ధాన్ని ఆపేందుకు భారత్ సాధ్యమైన ప్రయత్నాలన్నీ చేస్తుందని హామీ ఇచ్చారు. దీనికి చర్చలు, రాయబారమే ఏకైక పరిష్కారమని తాము ముందునుంచీ చెబుతున్నామని గుర్తు చేశారు. నేటి ప్రపంచం ఎదుర్కొంటున్న అన్ని సమస్యలకూ బుద్ధుని బోధల్లో చక్కని పరిష్కారాలున్నాయన్నారు. హిరోషిమా పార్కులోని స్మారక మ్యూజియాన్ని దేశాధినేతలతో కలిసి మోదీ సందర్శించారు. అణుబాంబు దాడి మృతులకు నివాళులర్పించారు.

మీకు మహా డిమాండ్! | **మోదీతో బైడెన్, అల్బనీస్ వ్యాఖ్యలు**

- మీ ఆటోగ్రాఫ్ అడగాలేమో: బైడెన్

జీ–7 సదస్సులో భాగంగా జరిగిన క్వాడ్ దేశాధినేతల భేటీలో అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ప్రధాని మోదీ దగ్గరికి వచ్చి మరీ ఆత్మీయంగా ఆలింగనం చేసుకుని ముచ్చటించడం తెలిసిందే. మోదీ విషయమై తమకెదురవుతున్న గమ్మత్తైన ఇబ్బందిని ఈ సందర్భంగా బైడెన్ ఆయన దృష్టికి తెచ్చారట. వచ్చే నెల మోదీ వాషింగ్టన్‌లో పర్యటించనుండటం తెలిసిందే. ఆ సందర్భంగా మోదీ పాల్గొనే పలు కార్యక్రమాల్లో ఎలాగైనా ఆయనతో భేటీ ఏర్పాటు చేయించాల్సిందిగా అమెరికా ప్రముఖుల నుంచి లెక్కలేనన్ని 'రిక్వెస్టులు' వచ్చిపడుతున్నాయట! వాటిని తట్టుకోవడం తమవల్ల కావడం లేదని బైడెన్ చెప్పుకొచ్చారు. భేటీలో ఉన్న ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్ కూడా తామూ అచ్చం అలాంటి 'సమస్యే' ఎదుర్కొంటున్నామంటూ వాపో యారు! మోదీ మంగళవారం ఆస్ట్రేలియా రాజధాని సిడ్నీలో 20 వేల మంది సామర్థ్యమున్న స్టేడియంలో ఓ కార్యక్రమంలో ప్రసంగించనున్నారు. దానికి టికెట్లు కావాలని లెక్కకు మించిన డిమాండ్లు, రిక్వెస్టులు వచ్చి పడుతున్నాయని అల్బనీస్ చెప్పుకొచ్చారు. ఇటీవలి భారత్ పర్యటన సందర్భంగా గుజరాత్‌లో 90 వేల మంది సామర్థ్యంతో కిక్కిరిసిన స్టేడియంలో తామిద్దరం ఎలా ప్రజలకు అభివాదం చేసిందీ గుర్తు చేసుకున్నారు. దాంతో బైడెన్ స్పందిస్తూ బహుశా తాను మోదీ ఆటోగ్రాఫ్ తీసుకోవాలేమో అంటూ చమత్కరించారు! గత మార్చిలో భారత్–ఆస్ట్రేలియా టెస్ట్ మ్యాచ్‌ను మోదీ, అల్బనీస్ ప్రారంభించడం తెలిసిందే.



పపువా న్యూ గినియాలో మోదీకి నమస్కరిస్తున్న ప్రధాని జేమ్స్ మరాపే

పార్లమెంటు 2.0



సర్వాంగ సుందరంగా కొత్త భవనం

28న ప్రారంభించనున్న ప్రధాని నరేంద్ర మోదీ

ప్రజాస్వామ్య దేవాలయమైన పార్లమెంటు కొత్త భవనం సర్వాంగ సుందరంగా సిద్ధమైంది. త్రిభుజాకృతిలో నిర్మించిన ఈ భవనం దేశ సంస్కృతీ సంప్రదాయాలకు అద్దం పడుతూనే ఆధునిక హంగుల కలబోతగా కూడా నిలిచింది. ప్రధాని నరేంద్ర మోదీ ఈ నెల 28 ఆదివారం కొత్త భవనాన్ని ప్రారంభించనున్నారు. వందేళ్ల నాటి పాత పార్లమెంటు భవనం నేటి అవసరాలకు అనుగుణంగా లేకపోవడంతో కొత్త భవన నిర్మాణం అవసరమైంది. సెంట్రల్ విస్టా రీడెవలప్‌మెంట్ ప్రాజెక్టులో భాగంగా కొత్త భవనాన్ని టాటా ప్రాజెక్ట్స్ లిమిటెడ్ కేవలం రెండున్నరేళ్లలో నిర్మించింది. ఆర్కిటెక్ట్ బిమల్ పటేల్ నేతృత్వంలో నిర్మాణం సాగింది. ప్రస్తుతం పార్లమెంటు పక్కనే నిర్మించిన కొత్త భవనంలో అతి పెద్ద హాళ్లు, కమిటీ రూములు, సెంట్రల్ హాలు, అతి పెద్ద లైబ్రరీ, విశాలమైన పార్కింగ్ వంటి సదుపాయాలన్నీ ఉన్నాయి.

- రూ.20 వేల కోట్లతో కూడిన సెంట్రల్ విస్టా ప్రాజెక్టులో భాగంగా రూ.970 కోట్లతో పార్లమెంటు భవనాన్ని నిర్మించారు.
- లోక్‌సభ హాలును జాతీయ పక్షి నెమలి థీమ్‌తో నిర్మించారు. 888 మంది సభ్యులు కూర్చోవచ్చు. సభ్యుల సంఖ్య పెరిగినా ఇబ్బంది లేకుండా ప్రస్తుత లోక్‌సభ హాలు కంటే మూడు రెట్లు పెద్దగా రూపొందించారు. పార్లమెంటు సంయుక్త సమావేశాలకు కూడా చక్కగా సరిపోతుంది. 1,272 మంది సందర్శకులు సమావేశాలను తిలకించవచ్చు.
- రాజ్యసభ హాలును జాతీయ పుష్పం తామర థీమ్‌తో నిర్మించారు. 384 మంది సభ్యులు కూర్చునేలా సీటింగ్ ఏర్పాట్లున్నాయి.
- పార్లమెంటు భవన మూడు ప్రధాన ద్వారాలకు జ్ఞాన, శక్తి, కర్మ ద్వారాలని పేర్లు పెట్టారు. వీఐపీలు, ఎంపీలు, సందర్శకులకు మరో మూడు ప్రవేశ ద్వారాలున్నాయి.
- అత్యున్నత నాణ్యత ప్రమాణాలతో 150 ఏళ్ల పాటు చెక్కు చెదరకుండా ఉండేలా భవన డిజైన్‌ను అహ్మదాబాద్‌కు చెందిన హెచ్‌సీపీ డిజైన్ ప్లానింగ్ అండ్ మేనేజ్‌మెంట్ రూపొందించింది. ఇది భూకంపాల్ని కూడా తట్టుకుంటుంది.
- రాజస్తాన్‌కు చెందిన ధోల్‌పూర్ రాళ్లతో భవనానికి అద్భుతమైన లుక్ వచ్చింది.
- పార్లమెంటు భవనంలోని ఇంటీరియర్స్ భారత సంస్కృతీ సంప్రదాయాలు ప్రతిబింబించేలా, భిన్నత్వంలో ఏకత్వాన్ని గుర్తుకు తెచ్చేలా పలు ప్రాంతీయ కళా రూపాలతో రూపొందాయి.
- భవన నిర్మాణంలో అడుగడుగునా పర్యావరణ పరిరక్షణకు పెద్ద పీట వేశారు. గ్రీన్ ఎనర్జీతో 30% దాకా విద్యుత్ ఆదా అవుతుంది. అత్యాధునిక టెక్నాలజీ వాడటంతో భవన నిర్వహణ ఖర్చులో ఏడాదికి రూ.1,000 కోట్లకు పైగా ఆదా అవుతుందట.
- పార్లమెంటు భవనం పైకప్పు మీద కాంస్యంతో తయారు చేసిన మన జాతీయ చిహ్నం నాలుగు సింహాలను ఏర్పాటు చేశారు. ఇది 9,500 కిలోల బరువుతో 6.5 మీటర్ల ఎత్తుంది.
- భవన నిర్మాణంలో ప్రత్యక్షంగా 2 వేల మంది కార్మికులు, పరోక్షంగా 9 వేల మంది, వివిధ రాష్ట్రాలకు చెందిన 200 మంది కళాకారులు పాలుపంచుకున్నారు.
- ఆవరణలో రెండు మర్రి చెట్లు నాటారు.
- దివ్యాంగులకు అనుకూలంగా, వారు స్వేచ్ఛగా తిరిగేలా నిర్మాణం జరిగింది.
- భవనం గోడలపై పలు శ్లోకాలను రాశారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

చరిత్రలోకి తొంగి చూస్తే..

ప్రస్తుత పార్లమెంటు భవనం బ్రిటిష్ కాలం నాటిది. న్యూఢిల్లీ నగర రూపకర్తలైన ఎడ్విన్ ల్యూటెన్స్, హెర్బర్ట్ బేకర్ దీన్ని డిజైన్ చేశారు. 1921 నుంచి ఆరేళ్ల పాటు భవన నిర్మాణం సాగింది. ఈ వృత్తాకార భవనానికి 83 లక్షలు ఖర్చు అయింది. 1927 జనవరి 18న గవర్నర్ జనరల్ లార్డ్ ఇర్విన్ దీన్ని ప్రారంభించారు. దీన్ని మ్యూజియంగా మార్చనున్నారు.



లోక్‌సభ



రాజ్యసభ

ఎందుకీ నిర్మాణం?

ప్రస్తుత పార్లమెంటు భవనం అవసరాలు తీర్చేలా లేదు. నియోజకవర్గాల పునర్విభజన జరిగి సభ్యుల సంఖ్య పెరిగితే సరిపోదు. మంత్రులు, మీటింగ్ హాల్స్ కొరత ఉంది. భవనంలో మార్పులు చేర్పులు చేస్తే నిర్మాణం దెబ్బతినే ప్రమాదముంది. దానికి భూకంపాల్ని తట్టుకునే సామర్థ్యం లేదు. ఢిల్లీ ఏమో అత్యంత ప్రమాదకరమైన భూకంప జోన్–4లో ఉంది. అగ్నిప్రమాదాలను ఎదుర్కొనే ఆధునిక సౌకర్యాలూ లేవు.

రాష్ట్రపతి ప్రారంభించాలి: రాహుల్

న్యూఢిల్లీ: పార్లమెంటు నూతన భవన ప్రారంభోత్సవంపై రాజకీయ రగడ మొదలైంది. భవనాన్ని రాష్ట్రపతి ప్రారంభించాలే తప్ప ప్రధాని కాదని కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఆయన ట్వీట్ చేశారు. ప్రధాని ప్రారంభించడం రాజ్యాంగపరంగా సరైంది కాదంటూ కాంగ్రెస్ సీనియర్ నేత ఆనంద్ శర్మ కూడా ట్వీట్లు చేశారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 79 ప్రకారం లోక్‌సభ, రాజ్యసభలతో కూడిన పార్లమెంటుకు రాష్ట్రపతే అధిపతి గనుక నూతన భవనాన్ని ఆయనే ప్రారంభించాలన్నారు. ఆర్‌జేడీ, ఎంఐఎం కూడా ప్రధాని ప్రారంభించడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. అంతేగాక హిందూత్వవాది వి.డి. సావర్కర్ జయంతి నాడే (ఈ నెల 28న) ప్రారంభోత్సవం జరపనుండటాన్నీ విపక్షాలు తీవ్రం ఆక్షేపిస్తున్నాయి.



ఇదేమిటో గుర్తు పట్టారా? తొలి ప్రయాణమే తుది ప్రయాణంగా మారి 1,500కు పైగా ప్రాణాలను బలిగొన్న టైటానిక్. వందేళ్లుగా సముద్ర గర్భంలో దాదాపు 4 కిలోమీటర్ల లోతులో ఉంది. దాని శిథిలావస్థను అత్యంత స్పష్టంగా, పూర్తి స్థాయిలో కళ్లకు కట్టిన తాజా ఫొటో ఇది...

బెంగళూరులో ఆకస్మిక వరదలు

తెలుగు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ దుర్మరణం

యశవంతపుర/ఉంగుటూరు(గన్నవరం): కర్ణాటక రాజధాని బెంగళూరులో ఆదివారం సాయంత్రం గంటకు పైగా భారీ వర్షం కురిసింది. ఓ కారు వరద నీటిలో చిక్కుకుని ఆంధ్రప్రదేశ్‌కు చెందిన 22 ఏళ్ల తెలుగు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ భానురేఖా రెడ్డి దుర్మరణం పాలయ్యారు. కుటుంబసభ్యులతో కలిసి ఆమె వెళ్తున్న ట్యాక్సీ కేఆర్ సర్కిల్ అండర్ పాస్‌లో భారీగా నిలిచిన వరద నీటిలో చిక్కింది. నీరు పెరిగి కారును ముంచెత్తింది. కారును బయటకు తీసి డ్రైవర్, మరో నలుగురిని ఆస్పత్రికి తరలించారు. భాను అప్పటికే చనిపోయింది. సీఎం సిద్ధరామయ్య ఆస్పత్రిని సందర్శించి బాధితులను ఓదార్చారు. రూ.5 లక్షల పరిహారం ప్రకటించారు.



అండర్‌పాస్‌లో మునిగిన కారు. (ఇన్‌సెట్లో) ఆస్పత్రిలో సీఎం సిద్ధరామయ్య పరామర్శ

రక్షణ వలయంలో శ్రీనగర్

శ్రీనగర్: శ్రీనగర్‌లో నేటి నుంచి జీ–20 టూరిజం వర్కింగ్ గ్రూప్ మూడో సమావేశాలు మొదలవుతున్న విషయం తెలిసిందే. ఉగ్ర బెడద నేపథ్యంలో భద్రతా బలగాలు అత్యంత అప్రమత్తత ప్రకటించాయి. నేషనల్ సెక్యూరిటీ గ్రూప్(ఎన్ఎస్‌జీ) కౌంటర్ డ్రోన్ బృందాలు గగనతలంపై కన్నేసి ఉంచాయి. సుందర దాల్ సరస్సుపై నేవీ మెరైన్ కమాండోలు గస్తీ చేపట్టారు. పలు కీలక ప్రాంతాల్లో భారీగా మోహరింపులు, తనిఖీలు ముమ్మరమయ్యాయి. వివిధ దేశాల నుంచి హాజరయ్యే 60 మంది ప్రతినిధులు, 20 మంది జర్నలిస్టుల కోసం సమావేశాల వేదికైన షేర్–ఇ–కశ్మీర్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్(ఎస్‌కేఐసీసీ) వద్ద యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేసింది. ఆర్టికల్ 370 రద్దు, కశ్మీర్‌ను జమ్మూకశ్మీర్, లద్దాఖ్ అనే కేంద్రపాలిత ప్రాంతాలుగా విభజించాక జరుగుతున్న మొట్టమొదటి అంతర్జాతీయ సమావేశమిది. దీంతో, సమావేశ వేదికతోపాటు, వారు బస చేసే ప్రాంతం, ఆ పక్కనే ఉన్న జబర్వాన్ పర్వతశ్రేణిపై ఆర్మీ బలగాలను రంగంలోకి దించారు. ఉగ్రమూకలు ఐఈడీలతో విధ్వంసానికి పాల్పడే అవకాశముందన్న హెచ్చరికల నేపథ్యంలో సోదాలు ముమ్మరం చేశారు. పాక్ కేంద్రంగా పనిచేసే జైషెమొహ్మద్‌కు చెందిన ఓ వ్యక్తిని ఆదివారం కుప్వారా జిల్లాలో సోదాల సమయంలో బలగాలు అదుపులోకి తీసుకున్నాయి. సైన్యం కదలికల సమాచారాన్ని అతడు పాక్‌కు చేరవేస్తున్నట్లు గుర్తించారు. పూంఛ్‌లో సరిహద్దులకు సమీపంలో మెంధార్ సెక్టార్ వద్ద అనుమానాస్పద కదలికలతో బలగాలు కాల్పులు జరిపాయి. ఈ ఘటనలో ఎవరూ గాయపడలేదని సమాచారం. ఆ చుట్టుపక్కల అటవీ ప్రాంతాల్లో విస్తృతంగా గాలింపు చేపట్టాయి. సోదాలు పూర్తయ్యేదాకా ఎవరూ ఇల్లు వదిలి బయటకు రావద్దని ప్రజలను అధికారులు కోరారు.

రూ.31.67 కోట్ల అంబర్‌గ్రిస్ స్వాధీనం

న్యూఢిల్లీ: డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్(డీఆర్ఐ) అధికారులు తమిళనాడులోని ట్యుటికోరన్‌లో అత్యంత ఖరీదైన అంబర్‌గ్రిస్(తిమింగలం వాంతి)ని పట్టుకున్నారు. ట్యుటికోరన్‌లోని హార్బర్ బీచ్ ఏరియా నుంచి శ్రీలంకకు ఓ ముఠా అంబర్‌గ్రిస్‌ను తరలించేందుకు ప్రయత్నిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు అధికారులు సోదాలు చేపట్టారు. ఈ తనిఖీల్లో ఓ వాహనంలో తరలిస్తున్న 18.1కిలోల బరువైన అంబర్ గ్రిస్ సంచీ దొరికింది. ఇందుకు సంబంధించి తమిళనాడు, కేరళలకు చెందిన నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. స్వాధీనమైన అంబర్‌గ్రిస్ విలువ రూ.31.67 కోట్లని అంచనా. సుగంధ ద్రవ్యాల తయారీలో వాడే అంబర్‌గ్రిస్‌కు అంతర్జాతీయ మార్కెట్‌లో ఎక్కువ గిరాకీ ఉంది. వన్యప్రాణి సంరక్షణ చట్టం ప్రకారం స్పెర్మ్ వేల్ ఉత్పత్తుల ఎగుమతి, రవాణాలపై నిషేధం ఉంది. గత రెండేళ్లలో ట్యుటికోరన్ తీరంలో స్మగ్లర్ల నుంచి రూ.54 కోట్ల విలువైన 40.52 కిలోల అంబర్‌గ్రిస్‌ను పట్టుకున్నట్లు డీఆర్ఐ తెలిపింది.

కేంద్రంతో వివాదంలో మా మద్దతు మీకే

ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌తో బిహార్ సీఎం నితీశ్ మంతనాలు

న్యూఢిల్లీ: దేశ రాజధానిలో ప్రభుత్వాధికారుల అజమాయిషీ విషయంలో ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌కు తమ పూర్తి మద్దతు ఉంటుందని జేడీయూ నేత, బిహార్ సీఎం నితీశ్‌కుమార్ భరోసా ఇచ్చారు. ఆదివారం నితీశ్ ఢిల్లీలో కేజ్రీవాల్‌ను ఆయన నివాసంలో కలిశారు. ఆయన వెంట బిహార్ డిప్యూటీ సీఎం, ఆర్‌జేడీ నేత తేజస్వీ యాదవ్ కూడా ఉన్నారు. ఢిల్లీలోని ప్రభుత్వాధికారులపై అజమాయిషీ రాష్ట్ర ప్రభుత్వానిదేనంటూ ఈనెల 11న సుప్రీంకోర్టు తీర్పు వెలువరించడం, ఆ తీర్పును పూర్వపక్షం చేసేలా కేంద్రం శుక్రవారం ఆర్డినెన్స్ జారీ చేయడం తెలిసిందే. నితీశ్‌తో చర్చల అనంతరం సీఎం కేజ్రీవాల్ మీడియాతో మాట్లాడారు. ఆర్డినెన్స్ స్థానంలో కేంద్రం ప్రవేశపెట్టే బిల్లును రాజ్యసభలో తిప్పికొట్టేందుకు మద్దతివ్వాలంటూ అన్ని ప్రతిపక్ష పార్టీల నేతలను కలిసి కోరుతానన్నారు. రెండు, మూడు రోజుల్లో బెంగాల్ సీఎం మమతా బెనర్జీ, మహారాష్ట్ర మాజీ సీఎం ఉద్ధవ్ ఠాక్రే, ఎన్సీపీ చీఫ్ శరద్ పవార్‌లను కలుస్తానన్నారు. ప్రతిపక్ష పార్టీలతో మాట్లాడాలంటూ నితీశ్ కుమార్‌కు కూడా విజ్ఞప్తి చేశానన్నారు.

ఉష్ణోగ్రత
గరిష్టం 40.3° | కనిష్టం 26.9°

సాక్షి హైదరాబాద్

సోమవారం ၊ 22 ၊ మే ၊ 2023

కుక్కకు భయపడి..
డెలివరీ పార్సిల్‌ను అందించేందుకు వచ్చిన ఓ యువకుడు.. పెంపుడు కుక్క అరవడంతో భయపడి అపార్టుమెంట్ మూడో అంతస్తు నుంచి దూకేశాడు. -8లో





నకిలీ లావాదేవీలు!
కస్టమర్ కేర్ ఫోన్ నంబర్లు, వెబ్‌సైట్లు, ఈ-మెయిల్ ఐడీలను స్పూఫింగ్ చేసి మోసాలకు పాల్పడుతున్న సైబర్ నేరస్తులు.. కొత్తగా యూపీఐ పేమెంట్ అప్లికేషన్లు (యాప్)లను కూడా నకిలీవి సృష్టిస్తున్నారు. -8లో

తల్లిదండ్రులే ప్రత్యక్ష దైవాలు
తల్లిదండ్రులే ప్రత్యక్ష దైవాలని.. వారిని పిల్లలు పూజించాలని రామకృష్ణమఠం అధ్యక్షుడు స్వామి బోధమయానంద పిలుపునిచ్చారు. -8లో



న్యూస్‌రీల్

కోహెడ మార్కెట్‌కు రూ.350 కోట్లు

సాక్షి, సిటీబ్యూరో: అంతర్జాతీయ ప్రమాణాల మేరకు నిర్మించనున్న కోహెడ మోడ్రన్ మార్కెట్ కోసం ప్రభుత్వం రూ.350 కోట్ల నిధులను రుణం రూపంలో మంజూరు చేసింది. ఈ మేరకు హైదరాబాద్ వ్యవసాయ మార్కెటింగ్ సంచాలకులకు నిధులను విడుదల చేస్తున్నట్లు వెల్లడించింది. ఈ నిధులతో మార్కెట్ మొదటి దశ అభివృద్ధి పనులను చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. కొత్తపేటలో ఉన్న గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్‌ను ప్రభుత్వం కోహెడకు తరలించిన సంగతి తెలిసిందే. సుమారు వంద ఎకరాలను మార్కెట్ కోసం కేటాయించారు. తాత్కాలికంగా షెడ్‌లను ఏర్పాటు చేశారు. ఆ షెడ్లులన్నీ గాలివానకు కొట్టుకుపోవడంతో అప్పట్లో మార్కెట్ కార్యకలాపాలు స్తంభించాయి. దీంతో బాటసింగారానికి తరలించారు. ప్రస్తుతం రుణ ప్రాతిపదికపై ప్రభుత్వం ఇవ్వనున్న నిధులతో కోహెడ్ మార్కెట్ నిర్మాణ పనులను త్వరలో ప్రారంభించనున్నారు. వీలైంత తక్కువ కాలంలో మార్కెట్ నిర్మించి కార్యకలాపాలను పునరుద్ధరించాలని భావిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

న'గరం'.. కాసింత ఉపశమనం!

సాక్షి, సిటీబ్యూరో: మహానగరం కాసింత చల్లబడింది. వారం రోజులుగా భగభగ మండే ఎండలు ఉక్కిరిబిక్కిరి చేస్తుండగా.. ఆదివారం సాయంత్రం పలు ప్రాంతాల్లో ఆకాశం మేఘావృతమై చిరుజల్లులు కురవడంతో కాస్త ఉపశమనం కలిగింది. సగటు గరిష్ఠ ఉష్ణోగ్రత 40.3 డిగ్రీల నమోదు కాగా.. గచ్చిబౌలి, బీహెచ్ఈఎల్ ప్రాంతాల్లో 2 డిగ్రీలు అధిక ఉష్ణోగ్రత నమోదైంది. జూబ్లీహిల్స్, మాదాపూర్, ఫిలింనగర్, పంజాగుట్ట, గచ్చిబౌలి, మణికొండ, శేరిలింగంపల్లి, పటాన్‌చెరు, మెహిదీపట్నం కొండాపూర్, కేపీహెచ్‌బీ, లింగంపల్లి తదితర ప్రాంతాల్లో వర్షం కురిసింది. పలు ప్రాంతాల్లో భారీగా ట్రాఫిక్‌జాం ఏర్పడటంతో వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు. వర్షం నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరమైతేనే ఇళ్ల నుంచి బయటకు రావాలని జీహెచ్ఎంసీ హెచ్చరించింది. రాబోయే మూడు రోజుల్లో తేలిక పాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది.

వైదేహి ఆశ్రమ సేవలు అభినందనీయం: గవర్నర్



వైదేహి ఆశ్రమ బాలికలతో గవర్నర్ తమిళిసై

సైదాబాద్: మూడు దశాబ్దాలుగా నిరాశ్రయ బాలికలను చేరదీసి చక్కగా తీర్చిదిద్దుతున్న వైదేహి సేవా సమితి నిర్వాహకుల సేవలు ఎంతో అభినందనీయమని గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ కొనియాడారు. ఆదివారం ఐఎస్‌సదన్ డివిజన్ సరస్వతీనగర్‌లోని వైదేహి ఆశ్రమ 30వ వార్షికోత్సవాల్లో గవర్నర్ ముఖ్య అతిథిగా మాట్లాడుతూ.. సేవాభారతి ఆధ్వర్యంలోని వైదేహి ఆశ్రమంలో ఇప్పటి వరకు 17 మంది ఆశ్రమ యువతులకు వివాహాలు జరిపించడమే కాకుండా ప్రస్తుతం 66 మంది బాలికల ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేసేలా చదివిస్తుండటం ఆదర్శనీయమన్నారు. కార్యక్రమంలో తెలంగాణ ప్రాంత సేవాభారతి అధ్యక్షుడు దుర్గారెడ్డి, తెలంగాణ ప్రాంత ఆర్ఎస్ఎస్ సంఘచాలకులు బూర్ల దక్షిణామూర్తి, బీజేపీ భా గ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి, కార్పొరేటర్లు జంగం శ్వేతమధుకర్‌రెడ్డి, కొత్తకాపు అరుణ రవీందర్ రెడ్డి, భాగ్యలక్ష్మి, నగర మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్‌చందర్జీ పాల్గొన్నారు.

క్వారీ గుంతలో యువకుడి గల్లంతు



ఘట్‌కేసర్: స్నేహితులతో కలిసి ఈత కొట్టడానికి వచ్చిన ఓ యువకుడు క్వారీ గుంతలో గల్లంతైన ఘటన ఆదివానం ఘట్‌కేసర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ అశోక్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని వినాయక్ నగర్, ఆర్టీసీ కాలనీ, నేరేడ్‌మెట్ మల్కాజిగిరికి చెందిన అంకిరెడ్డి మహేశ్ కిరాణా దుకాణం నడుపుతుంటాడు. ఆదివారం మధ్యాహ్నం స్నేహితులు సమీర్, నయన్‌రాజ్, రోహిత్, జాఫర్‌లతో కలిసి అన్నోజిగూడ టోల్ ప్లాజా సర్వీస్ రోడ్డు సమీపంలోని క్వారీ గుంతలో ఈత కొట్టడానికి వచ్చారు. ఈ క్రమంలో మహేశ్ నీటి గుంతలోకి జారిపోయి గల్లంతయ్యాడు. సమాచారం తెలియడంతో అడ్మిన్ ఎస్సై నాగార్జునరెడ్డి, ఎస్సై అశోక్ వెంటనే నగరం నుంచి విపత్తు స్పందన, ఫైర్, జీహెచ్ఎంసీ సిబ్బందిని రంగంలోకి దించి గుంతలో గాలించారు. ఎంత వెతికినా యువకుడి ఆచూకీ లభించలేదు. చీకటి కావడంతో గాలింపు నిలిపి వేశారు. సోమవారం ఉదయం తిరిగి గాలింపు ప్రారంభిస్తామని వారు తెలిపారు.



జలవిహార్‌లో హాయ్.. హాయ్





అసలే ఆదివారం. ఎండలో తిరగలేం.. ఇంట్లో ఉండలేం. సెలవు రోజును సద్వినియోగం చేసుకునేందుకు పలువురు నగరవాసులు జలవిహార్ బాట పట్టారు. ఇలా నీటిలో ఎంజాయ్ చేశారు. వాటర్ గేమ్స్, రెయిన్ డ్యాన్స్‌లతో ఇలా ఉపశమనం పొందారు. – బంజారాహిల్స్





ఉత్సాహంగా.. 'వైటథాన్'

పిల్లల్లో వచ్చే రెటినోబ్లాస్టోమా (కంటి కేన్సర్)పై అవగాహన, నిధుల సేకరణ లక్ష్యంగా ఎల్‌వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో ఆదివారం చేపట్టిన 'వైటథాన్- 2023 రన్'ను డీజీపీ అంజనీకుమార్ ప్రారంభించారు. గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఈ రన్‌ను నిర్వహించారు. ఎయిర్‌ఫోర్స్, ఆర్మీ సిబ్బంది సహా 2200 మందికిపైగా ఔత్సాహిక రన్నర్లు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి ఎగ్జిక్యూటివ్ చైర్మన్ డాక్టర్ ప్రశాంత్‌గార్గ్, డాక్టర్ స్వాతి తదితరులు పాల్గొన్నారు. - రాయదుర్గం



మాసబ్ చెరువుపై మాఫియా!

- నక్షబాట పునరుద్ధరణ పేరుతో చెరువు మధ్యలోంచి రోడ్డు
- భారీ బండరాళ్లు.. లారీలతో మట్టి నింపుతున్న రియల్టర్లు
- చుట్టూ ప్రైవేటు సైన్యం పహారా.. రాత్రికి రాత్రే పూడ్చివేతలు
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు
- చెరువు శిఖం పూడ్చివేతల్లో పెద్దల హస్తం?



చెరువు శిఖం భూమిలో వేస్తున్న రోడ్డు

సాక్షి, సిటీబ్యూరో: మాసబ్ చెరువుపై రియల్ మాఫియా ముప్పేట దాడి చేస్తోంది. చుట్టూ ప్రైవేటు సైన్యాన్ని పహారాగా ఏర్పాటు చేసి చెరువును చెరబట్టేస్తోంది. అడ్డుకోవాల్సిన రెవెన్యూ, ఇరిగేషన్ యంత్రాంగం చేష్టలుడిగి చూస్తుండటంతో స్థానికులే చెరువు పరిరక్షణ కమిటీగా ఏర్పడి రాత్రింబవళ్లు కాపలా కాస్తున్నారు. అయినా అక్రమార్కుల ఆగడాలు మాత్రం ఆగడం లేదు. మట్టి తరలింపు లారీలను లోనికి రాకుండా స్థానికులు ప్రధాన రోడ్డు వైపు నిఘా పెడితే .. అర్ధరాత్రి చెరువు వెనుక భాగం నుంచి పూడ్చివేతను యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు సహా జిల్లా కలెక్టర్, రెవెన్యూ, ఇరిగేషన్ ఉన్నతాధికారులు, మున్సిపల్ కమిషనర్లు నిత్యం ఈ చెరువుకట్టపై నుంచే రాకపోకలు సాగిస్తుంటారు. కానీ.. వీరిలో ఇప్పటి వరకు ఏ ఒక్కరూ కూడా ఇటువైపు కన్నెత్తి చూడకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ అంశంపై స్థానికులు ఇటీవల ప్రభుత్వ ముఖ్య కార్యదర్శికి ఫిర్యాదు చేసినా పట్టించుకున్న నాథుడే లేకుండాపోయాడు.

రెండు నెలలుగా పూడ్చివేతలు..

తుర్కయంజాల్ రెవెన్యూ పరిధిలో 495 ఎకరాల విస్తీర్ణంలో మాసబ్ చెరువు విస్తరించి ఉంది. దీనిలో ప్రభుత్వ భూమి 342.32 ఎకరాలు. మరో 152.38 ఎకరాలు ప్రైవేటు పట్టా భూములు. ఈ భూములన్నీ చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలోనే ఉన్నాయి. బఫర్ జోన్‌లో మరో 31.35 ఎకరాలు ఉంది. బఫర్‌జోన్‌లో 9.30 ఎకరాల ప్రభుత్వ భూమి ఉండగా, 22.5 ఎకరాల పట్టా భూమి ఉంది. ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ పరిధిలో ఉన్న పట్టా భూములను ఏక్ ఫసల్ భూములుగా పిలుస్తుంటారు. చెరువులో నీరు తగ్గినప్పుడు మాత్రమే ఈ భూములను సాగు చేసుకునే అవకాశం ఉంది. నిజానికి ఇక్కడ ఎలాంటి నిర్మాణాలు, వాణిజ్య కార్యకలాపాలు చేపట్టకూడదు. కానీ ఇప్పటికే ఇక్కడ ఎఫ్‌టీఎల్ భూముల్లో రియల్ ఎస్టేట్ వెంచర్లు, నిర్మాణాలు వెలిశాయి. గత మూడేళ్లుగా కురుస్తున్న వర్షాలకు వరదనీరు భారీగా వచ్చి చెరువులోకి చేరింది. దీంతో ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు పట్టా భూములన్నీ నీటమునిగాయి. ప్రభుత్వ శిఖం భూమిని ఆనుకుని ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ పరిధిలో ఉన్న ఈ పట్టా భూములను కొనుగోలు చేసిన కొంత మంది రియల్టర్లు రెండు నెలలుగా పూడ్చివేస్తున్నాయి. ప్రభుత్వ పెద్దలు, ఉన్నతాధికారుల కనుసన్నల్లోనే ఇదంతా జరుగుతోందనే ఆరోపణలున్నాయి.



చర్యలు తీసుకోవాలని అధికారులను నిలదీస్తున్న పరిరక్షణ సమితి సభ్యులు

కళ్లుగప్పి.. లారీల్లో మట్టి తరలించి..

చెరువు ఆనవాళ్లను దెబ్బతీస్తున్న రియల్టర్లపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కొంత మంది స్థానికులు మున్సిపల్ కమిషనర్, రెవిన్యూ, ఇరిగేషన్ అధికారులతో పాటు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అప్పటికే శిఖం, ఎఫ్‌టీఎల్ పరిధిలో భారీగా మట్టిని నింపారు. రియల్టర్లు నింపిన ఆ మటిని మళ్లీ ఎత్తిపోయించాలని అధికారులు నిర్ణయించారు. ఒకవైపు స్థానిక మున్సిపల్ అధికారులు ఇందుకు ఏర్పాట్లు చేస్తుండగా, ఈ విషయాన్ని గమనించిన సదరు రియల్టర్ కోర్టును ఆశ్రయించారు. ఒకవైపు ఈ వివాదం కొనసాగుతుండగా.. మరో వైపు మరో రియల్టర్ నక్షబాటను లక్ష్యంగా చేసుకుని చెరువు పూడ్చివేతకు పాల్పడుతున్నారు.

కాగా.. సదరు కోర్టు స్టేటస్ కో విధించినట్లు సమాచారం. కోర్టు తమకు అనుకూలంగా తీర్పు ఇచ్చిందని పేర్కొంటూ ప్రధాన రహదారి వైపు ఏర్పాటు చేసిన గేటుకు ఓ నోటీసును కూడా అతికించారు. గేటుకు అతికించిన నోటీసు బోర్డును చూసి అధికారులు అటువైపు వెళ్లేందుకు జంకుతున్నారు.

- కళ్ల ముందే చెరువు శిఖం కబ్జాకు గురవుతుండటం, ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మాణాలు వెలుస్తుండటాన్ని జీర్ణించుకోలేని స్థానికులు వాట్సాప్ గ్రూప్ వేదికగా ఒక్కటయ్యారు. గత పదిహేను రోజులుగా ఆందోళన నిర్వహిస్తున్నారు. మట్టి లోడుతో కూడిన లారీలు లోపలికి వెళ్లకుండా రాత్రి పగలు తేడా లేకుండా అక్కడే కాపు కాస్తున్నా రు. ప్రధాన రహదారిపై నిఘా పెరగడంతో రియల్టర్లు ప్రత్యామ్నాయంగా, గతంలో రైతులు తమ పొలాలకు వెళ్లేందుకు గుర్రంగూడ నుంచి ఏర్పాటు చేసుకున్న నక్షబాటను ఇందుకు వేదికగా ఎంచుకున్నారు. అందరి కళ్లుగప్పి శనివారం అర్ధరాత్రి దాటాక పెద్ద ఎత్తున మట్టి డంప్ చేస్తుండటంతో చెరువు పరిరక్షణ సమితి సభ్యులు టిప్పర్లను అడ్డుకుని, మీర్‌పేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

చర్యలు తీసుకుంటాం

స్థానికుల ఫిర్యాదుతో ఆదివారం పూడ్చివేతలను పరిశీలించాం. నక్షబాట పేరుతో పెద్ద ఎత్తున మట్టి, బండరాళ్లను వేసి పూడ్చివేస్తున్న వారిపై వాల్టా చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటాం. చెరువు పరిసరాల్లో రెవెన్యూ, పోలీసు నిఘా పెంచుతాం.
– గంగమ్మ, ఏఈఈ, ఇరిగేషన్

'ఎనిమి' సంగతి ఏమాయే?

- 111 జీఓ ఎత్తేసినా ప్రయోజనం లేని కొత్వాల్‌గూడ
- ఇప్పటికీ అక్కడ రైతుబంధు, రైతు బీమా లేదు
- 650 ఎకరాలు ఎనిమి ప్రాపర్టీలోనే
- ఎటూ తేల్చని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు



కొత్వాల్‌గూడ మున్సిపాలిటీ కార్యాలయం

శంషాబాద్: రాష్ట్ర సర్కారు ఇటీవల జీఓ 111ను పూర్తి స్థాయిలో ఎత్తివేసినట్లు చేసిన ప్రకటన.. ఈ పరిధిలోని అన్ని గ్రామాలు, బస్తీల్లోని ప్రజలకు ఎంతో కొంత సంతోషాన్ని కలిగించింది. కానీ శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని కొత్వాల్‌గూడ రైతులు, భూ యజమానుల్లో మాత్రం ఆ ఛాయలు ఏ మాత్రం లేవు. దశాబ్దాలుగా భూములు సాగు చేస్తున్న రైతులకు సర్కారు జారీ చేస్తున్న రైతుబంధు, రైతుబీమాలు కూడా లేవు. అత్యవసరాల కోసం భూమిని విక్రయించుకునే కనీస వెసులుబాటు కూడా లేదు. జీఓ 111 మించిన సమస్య కొత్వాల్‌గూడ వాసులకు శత్రువుగా మారింది. అదే 'ఎనిమి ప్రాపర్టీ' సమస్య అసలు సమస్య ఇది.. 'ఎనిమి ప్రాపర్టీ' పేరులాగే అక్కడి రైతుల పాలిట శత్రువుగా మారింది. అరవై ఏళ్లుగా సాగుచేస్తున్న రైతులు అవస్థల పాలయ్యేలా చేస్తోంది.

అసలు విషయం ఏమిటి?

అప్పట్లో కొత్వాల్‌గూడ జాగీర్దారుగా ఉన్న సయ్యద్ హసన్ అబేదీ వారసుడు ఖమ్రుద్దీన్ వారసత్వంగా తనకు దక్కిన 650 ఎకరాల భూమిని 1967లో ముంబైలోని కస్టోడియన్ ప్రాపర్టీకి అప్పగించి పాకిస్థాన్ వెళ్లి స్థిరపడ్డాడు. ఇలా అప్పగించిన సదరు భూములను కేంద్ర హోం శాఖ పరిధిలోని ఎనిమి ప్రాపర్టీ కింద కస్టోడియన్ ఆఫ్ ఎనిమి ప్రాపర్టీ పరిధిలోకి వెళ్లిపోయాయి. మరోవైపు 1969 వరకు స్థానికంగా ఉన్న సయ్యద్ హసన్ అబేదీ ఇక్కడి రైతులకు తన భూములను విక్రయించాడు. ఆయన వద్ద భూములు కొనుగోలు చేసిన సుమారు 200 పైచిలుకు రైతులు పట్టా, పహణీలతో పాటు 38ఈ భూ యజమాన్య హక్కుపత్రాలను రాష్ట్ర రెవిన్యూ విభాగం నుంచి పొందడంతో పాటు ఏళ్లుగా పన్ను లు సైతం చెల్లిస్తూ భూములను సాగు చేసుకోవడం ఇతరత్రా పనులతో జీవనోపాధి పొందుతున్నారు.

ఏడేళ్ల కిందట పిడుగులా..

ఏడు సంవత్సరాల క్రితం కేంద్ర హోంశాఖ పరిధిలోని కస్టోడియన్ ప్రాపర్టీ బోర్డు నుంచి కొత్వాల్‌గూడలోని సర్వేనంబరు 1 నుంచి 174 పరిధిలో మొత్తం 650 ఎకరాలు ఎనిమి ప్రాపర్టీ ఉందని జిల్లా కలెక్టర్ కార్యాలయంతో పాటు స్థానిక రెవిన్యూ అధికారులక లేఖలు అందాయి. దీంతో ఒక్కసారిగా రైతుల గుండెల్లో పిడుగు పడింది. సదరు భూములకు కొత్త పాస్‌బుక్‌లు సైతం రాష్ట్ర సర్కారు జారీ చేసింది. కస్టోడియన్ ఆఫ్ ఎనిమి ప్రాపర్టీ ఆదేశాల మేరకు మూడేళ్ల క్రితం కొత్వాల్‌గూడకు సంబంధించిన భూముల రిజిస్ట్రేషన్‌లను సైతం నిలిపివేశారు. అప్పటి నుంచి భూములు ఎక్కడ కోల్పోతామోననే దిగులుతో రైతులు బతుకులీడిస్తున్నారు.

ఏడాదిన్నర క్రితం మళ్లీ..

- 2021 అక్టోబరులో ముంబై కస్టోడియన్ ప్రాపర్టీ కార్యాలయం నుంచి అధికారులు మరోసారి రంగంలో దిగారు. ఎనిమి ప్రాపర్టీలో ఉన్న రైతులు కొందరికి నోటీసులు సైతం జారీ చేశారు. కొత్వాల్‌గూడ వార్డు కార్యాలయం వద్ద ప్రత్యేక సమావేశాన్ని సైతం ఏర్పాటు చేశారు. ఎనిమి ప్రాపర్టీ సూచిస్తున్న సర్వే నంబర్లలోని భూ యజమానులు ఈ మెయిల్, లేదా రిజిస్టర్ పోస్టు ద్వారా పూర్తి వివరాలను పంపాల్సిందిగా సూచించారు.
- భూ యజమానులకు సగం యజమాన్య హక్కులు కచ్చితంగా దక్కుతాయని మిగతా సగం భూములకు సంబంధించి వేలంలో కొనుగోలు చేయడానికి ప్రాధాన్యత కల్పిస్తామని సూచించారు. దీనిపై కొత్వాల్‌గూడ వాసులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చే శారు. వివిధ పార్టీల నేతలతో పాటు అధికార పార్టీ నుంచి ఎంపీ, ఎమ్మెల్యే సహా రైతులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో కొత్వాల్‌గూడ వాసులు ఆందోళన విరమించారు. కస్టోడియన్ ప్రాపర్టీ అధికారులు మరోసారి ఇక్కడికి రాలేదు. సదరు భూముల్లో క్రయవిక్రయాలకు ఇప్పటి వరకు గ్రీన్ సిగ్నల్ రాలేదు. తాజాగా జీఓ 111 తొలగిస్తున్నట్లు ప్రకటించినా ఎనిమి ప్రాపర్టీ సమస్య తీరేంతవరకు ఎలాంటి ప్రయోజనం లేదని స్థానికులు తీవ్ర నిరాశలో ఉన్నారు.













జూలో కూల్‌గా..

నగరంలోని నెహ్రూ జూలాజికల్ పార్క్‌లోని వన్యప్రాణులను వేసవి తాపం నుంచి ఉపశమనం కోసం అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. జంతువులు ఉండే ప్రదేశాలతో పాటు వాటి ఆవరణను, చుట్టుపక్కల చల్లదనం కోసం పచ్చికలు, గార్డెన్‌లపై రోజుకు మూడుసార్లు నీళ్లు చల్లుతున్నారు. జంతువులు, పక్షులు, సరీసృపాలు సహా వివిధ రకాల జాతులను వేడి నుంచి రక్షించడానికి ప్రత్యేక దృష్టి పెట్టారు. స్ప్రింక్లర్లు, కూలర్లు, చిన్న రెయిన్ గన్‌లను ఎన్‌క్లోజర్‌లలో అమర్చారు. ఎన్‌క్లోజర్ నైట్ హౌస్‌ల పైకప్పుపై తుంగ గడ్డిని ఏర్పాటు చేశారు. డక్ పాండ్, కొంగ చెరువు ప్రాంతానికి షేడ్ నెట్ అమర్చినట్లు జూ పార్క్ క్యూరేటర్ ప్రశాంత్ బాజీరావు పాటిల్ పేర్కొన్నారు. - సాక్షి, సిటీబ్యూరో



నకిలీ లావాదేవీలు!

- స్పూఫింగ్ పేమెంట్ యాప్‌లతో డేంజర్
- మెసేజ్ వచ్చినా ఖాతాలో నగదు జమకాని వైనం..
- దీంతో ఆర్థికంగా నష్టపోతున్న దుకాణదారులు



సాక్షి, సిటీబ్యూరో: కస్టమర్ కేర్ ఫోన్ నంబర్లు, వెబ్ సైట్లు, ఈ-మెయిల్ ఐడీలను స్పూఫింగ్ చేసి నకిలీవి సృష్టించి మోసాలకు పాల్పడుతున్న సైబర్ నేరస్తులు..కొత్తగా యూపీఐ పేమెంట్ అప్లికేషన్లు (యాప్)లను కూడా నకిలీవి సృష్టిస్తున్నారు. డీమానిటైజేషన్ తర్వాతి నుంచి నగదు లభ్యత తగ్గడంతో చాలా మంది డిజిటల్ పేమెంట్స్ వైపు మొగ్గు చూపిస్తున్నారు. దీంతో ఫోన్‌పే, గూగుల్ పే, పేటీఎం వంటి యూపీఐ లావాదేవీలు బాగా పెరిగాయి. చిన్న కిరాణా షాపులు, కూరగాయల బండ్ల మీద కూడా యూపీఐ పేమెంట్ అప్లికేషన్లు కనిపిస్తున్నాయి. యాప్ పేమెంట్ వినియోగం విరివిగా అందుబాటులోకి రావటంతో మోసగాళ్లు వీటినీ అవకాశంగా మలుచుకుంటున్నారు.

ఎలా చేస్తారంటే?

కొందరు కస్టమర్లు రిటైల్ షాపులలో ఈ స్పూఫింగ్ యాప్‌లతో లావాదేవీలు జరిపి దుకాణదారులను మోసాలకు గురి చేస్తున్నారు. ముందుగా కస్టమర్లు వారి సెల్‌ఫోన్‌లో గూగుల్ స్టోర్ వంటి యాప్ డౌన్‌లోడ్ ప్లాట్‌ఫామ్‌ల నుంచి స్పూఫింగ్ యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకుంటారు. షాపింగ్ చేశాక కొనుగోలుదారుల మొబైల్‌లోని స్పూఫింగ్ ఈ-వ్యాలెట్‌లో షాప్ పేరు, ఫోన్ నంబర్, అమౌంట్ వంటి వివరాలను నమోదు చేసి ఎంటర్ చేస్తారు. దీంతో షాప్ యజమాని ఫోన్ నంబర్‌కు పేమెంట్ పూర్తయినట్లు నకిలీ నోటిఫికేషన్ వెళుతుంది. వాస్తవానికి ఓనర్ బ్యాంక్ ఖాతాలో మాత్రం నగదు జమ కాదు.

ఏం చేయాలంటే..

సాధారణంగా షాపు యజమానులు సెల్‌ఫోన్‌లో సందేశం చూసుకొని నగదు వచ్చేసిందనుకుంటారు. బ్యాంక్ అకౌంట్‌ను ఓపెన్ చేసి నగదు జమ అయిందో లేదో యజమాని చూసుకునే సమయం ఉండదు. తీరా ఖాళీ సమయంలో అకౌంట్‌లో చూసుకుంటే ఆ నోటిఫికేషన్ తాలుకు పేమెంట్ జమై ఉండదు. దీంతో తాను మోసపోయానని తెలుసుకుంటాడు. ఒకవేళ షాప్ యజమాని పేమెంట్ జరిగిన వెంటనే ఖాతాలో చూసుకున్నా.. డేటా, సాంకేతిక సమస్య వల్ల ఖాతాలో అప్డేట్ ఆలస్యమవుతుందని కస్టమర్లు యజమానిని ఒప్పిస్తున్నారు. ఇలాంటి నకిలీ లావాదేవీలకు సౌండ్ బాక్స్‌తో చెక్ పెట్టొచ్చని యూపీఐ నిర్వాహకులు సూచిస్తున్నారు. పేమెంట్ జరిగిందా లేదో తక్షణమే తెలుసుకునేందుకు సౌండ్ బాక్స్‌ను ఏర్పాటు చేసుకోవాలని సూచిస్తున్నారు. క్యూఆర్ కోడ్ స్కానింగ్, వాలెట్, డెబిట్, క్రెడిట్ కార్డ్స్, నెట్ బ్యాంకింగ్, యూపీఐ యాప్‌లు ఏ మాధ్యమం ద్వారా అయినా సరే పేమెంట్ చేయగానే, ఖాతాలో నగదు జమ కాగానే సంబంధిత లావాదేవీ జరిగినట్లు సౌండ్ బాక్స్‌లో వాయిస్ వస్తుంది.







ఆకట్టుకుంటున్న రాతి చిత్తరువులు

నెక్లెస్ రోడ్డులోని పీవీమార్గ్‌లో ఏర్పాటు చేసిన లేడికూనల 8 రాతి చిత్తరువులు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ప్రముఖ శిల్పి హరిప్రసాద్ బృందం రాతితో చెక్కిన ఈ ఆకృతులు అంబేడ్కర్ విగ్రహం వైపు వెళ్లే మార్గంలో సందర్శకులకు కనువిందు చేస్తున్నాయి. హెచ్‌ఎండీఏ కమిషనర్ అర్వింద్‌కుమార్ ఈ చిత్రాలను ట్విట్టర్ ద్వారా పంచుకున్నారు.

– సాక్షి, సిటీబ్యూరో

కుక్కకు భయపడి.. మూడో అంతస్తు పైనుంచి దూకి..

- తీవ్రంగా గాయపడిన డెలివరీ బాయ్
- ఆసుపత్రికి తరలింపు



గాయపడిన ఇలియాజ్

మణికొండ: డెలివరీ పార్సిల్‌ను అందించేందుకు వచ్చిన ఓ యువకుడు...పెంపుడు కుక్క అరవడంతో భయపడి అపార్టుమెంట్ మూడో అంతస్తు నుంచి దూకేశాడు. దీంతో తీవ్రగాయాలపాలవగా ఆస్పత్రిలో చేర్పించారు. ఆదివారం సాయంత్రం మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని పంచవటి కాలనీలోని శ్రీనిధి హైట్స్ అపార్టుమెంట్‌లోని మూడవ అంతస్తులో అద్దెకు ఉంటున్న నీలారాణి మూడు రోజుల క్రితం అమెజాన్‌లో పరుపు(బెడ్)ను ఆర్డర్ చేసింది. దాంతో ఆదివారం దాన్ని తీసుకుని డెలివరీ బాయ్ ఇలియాజ్ వారి ఇంటికి లిఫ్ట్‌లో వచ్చాడు. అతను తెచ్చిన బెడ్‌ను తలుపు తెరచి ఉండటంతో ఇంట్లోకి నేరుగా వచ్చి హాల్‌లో వేశాడు. దాని చప్పుడుకు ఇంట్లో ఉన్న లాబ్ జాతి కుక్క ఒక్కసారిగా అరవటంతో అతను భయపడి పోయాడు. ఆ సమయంలో కుక్క ఎక్కడ కరుస్తుందో అనే భయంతో ఏకంగా మూడవ అంతస్తు బాల్కనీ నుంచి కిందకు దూకాడు. నేరుగా అపార్ట్‌మెంట్ ప్రహరీగోడపై పడటంతో నడుము భాగంలో గాయమయ్యింది. దీంతో నీలారాణి భర్త డాక్టర్ సుబ్బరామిరెడ్డి సపర్యలు చేసి 108కు సమాచారం ఇచ్చి ఆసుపత్రికి పంపారు. డెలివరీ బాయ్ ఉదయం ఫోన్ చేసి ఈరోజు డెలివరీ చేస్తామని చెప్పాడని, వచ్చే ముందు ఎలాంటి ఫోన్ చేయటం, ఇంటి ముందుకు వచ్చి బెల్ కొట్టడం చేయలేదని, నేరుగా ఇంట్లోకి రావడం వల్లే కుక్క అరిచిందని నీలారాణి తెలిపారు. బాధితుడు తన అన్నకు ఫోన్ చేయటంతో ఓవైసీ ఆసుపత్రికి తీసుకుని రావాలని చెప్పటంతో 108 సిబ్బంది అతన్ని అక్కడకు తరలించినట్టు సమాచారం. రాయదుర్గం పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చి సమాచారం సేకరించారు. అనంతరం నీలారాణిపై కేసు నమోదు చేశారు.

నేటి నుంచి సీఎం కప్ జిల్లాస్థాయి పోటీలు

గన్‌ఫౌండ్రీ: సీఎం కప్ జిల్లా స్థాయి పోటీలు సోమవారం నుంచి జరుగనున్నట్లు తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాట్స్) చైర్మన్ డాక్టర్ ఆంజనేయగౌడ్ తెలిపారు. ఆదివారం ఎల్బీస్టేడియంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీన ప్రారంభమైన సీఎం కప్ పోటీలు 2వ దశకు చేరుకున్నాయన్నారు. 33 జిల్లా కేంద్రాలలో ప్రారంభమయ్యే పోటీలకు స్థానిక జిల్లా మంత్రులు, శాసన సభ్యులు, ప్రభుత్వ అధికారులు హాజరవుతారని తెలియజేశారు. స్థానిక జిల్లా కలెక్టర్లు చైర్మన్‌గా వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో కూడిన జిల్లా స్థాయి పోటీల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. వేసవి ఎండలను దృష్టిలో పెట్టుకుని ఉదయం 7 గంటలకు పోటీలను ప్రారంభించి 10 గంటలకు ముగించేలా పలు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

బఫ్తా టాలెంట్ ప్రోగ్రామ్‌కు దరఖాస్తుల ఆహ్వానం..

సాక్షి, సిటీబ్యూరో: ప్రతిభ కల కళాకారులను ప్రోత్సహించే బఫ్తా (బీఏఎఫ్‌టీఏ) ప్రముఖ ఓటీటీ వేదిక నెట్‌ఫ్లిక్స్ సహకారంతో దేశవ్యాప్తంగా విభిన్న రంగాల్లో ప్రతిభావంతుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. యానిమేటర్, కొరియాగ్రాఫర్, కంపోజర్, సినిమాటోగ్రాఫర్, డైరెక్టర్, కాస్ట్యూమ్ డిజైనర్... ఇలా ఏ అంశంలోనైనా తమకు ఉన్న ప్రతిభకు తగిన వేదిక, మద్దతు కావాలని కోరుకునే వారు దరఖాస్తు చేయవచ్చునని బఫ్తా నగర ప్రతినిధులు తెలిపారు. కనీసం 18 ఏళ్లు నిండి, ఆంగ్ల భాషా ప్రావీణ్యం ఉండి ఆసక్తి కలిగిన వారు తమ పేర్లను www.bafta.org/supportingtalent/breakthrough చిరునామాలో నమోదు చేసుకోవాలని కోరారు.

ద్విచక్ర వాహనం అదుపు తప్పి యువకుడి మృతి

భాగ్యనగర్‌కాలనీ: ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఓ యువకుడు మృతి చెందిన సంఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం హైదర్‌నగర్ శ్రీరాంనగర్ కాలనీకి చెందిన పసునూరి ఆంజనేయులు కుమారుడు గణేష్ (17) పని నిమిత్తం ద్విచక్ర వాహనంపై విజయ్‌నగర్ కాలనీలోని అపోలో ఫార్మసి వద్దకు రాగానే వాహనం అదుపుతప్పి పడిపోయింది. ఈ క్రమంలోనే మరో వైపు నుంచి వస్తున్న వాహనం ఢీ కొట్టడంతో గణేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు గణేష్‌ని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా డ్యూటీలో ఉన్న వైద్యులు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు పేర్కొన్నారని పోలీసులు తెలిపారు. సోదరుడు వంశీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు.

తల్లిదండ్రులే ప్రత్యక్ష దైవాలు

రామకృష్ణ మఠం అధ్యక్షుడు స్వామి బోధమయానంద



తల్లిదండ్రులకు పాదపూజ నిర్వహిస్తున్న విద్యార్థులు

కవాడిగూడ: తల్లిదండ్రులే ప్రత్యక్ష దైవాలు అని, వారిని పిల్లలు పూజించాలని రామకృష్ణమఠం అధ్యక్షుడు స్వామి బోధమయానంద పిలుపునిచ్చారు. లోయర్‌ట్యాంక్‌బండ్‌లోని రామకృష్ణమఠంలో గత 15 రోజులుగా నిర్వహించిన వేసవి సంస్కార్ శిబిరం ముగింపు సందర్భంగా ఆదివారం సమ్మర్ క్యాంపులో పాల్గొని విద్యార్థినీ విద్యార్థులు తల్లిదండ్రులకు పాదపూజ చేసి వారి ఆశీర్వాదం పొందారు. నాలుగవ తరగతి నుంచి 10వ తరగతి చదివే విద్యార్థులకు గత 15 రోజులుగా సమ్మర్ క్యాంపులో పాల్గొన్న విషయం విదితమే. చివరిరోజు వారి తల్లిదండ్రులకు విద్యార్థిని విద్యార్థుల చేత పాదపూజ చేయించి నిర్వాహకులు శిబిరాన్ని ముగించారు. స్వామి బోధమయానంద మాట్లాడుతూ..తల్లిదండ్రులకు పాదపూజ చేయడం మంచి సంప్రదాయమన్నారు. ఇది తరతరాలుగా వస్తున్న భారతీయ సంస్కృతి అని చెప్పారు. కార్యక్రమంలో బంగ్లాదేశ్ రాజధాని ఢాకాలోని రామకృష్ణ మిషన్ నుంచి స్వామి హరిప్రేమానంద, రామకృష్ణ మఠంలో స్వాములు, ప్రముఖులు, వాలంటీర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన వడ్డెర సంఘం నేతలు

మీర్‌పేట: మహేశ్వరం నియోజకవర్గంలోని అన్ని మండల కేంద్రాలకు వడ్డెర సంఘం కమ్యూనిటీ భవనాల మంజూరుకు మంత్రి సబితారెడ్డి హామీ ఇవ్వడంపై ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శివరాత్రి అయిలమల్లు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు సంఘం ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకార్యదర్శి, మీర్‌పేట కార్పొరేటర్ వేముల నర్సింహా ఆధ్వర్యంలో ఆదివారం మీర్‌పేటలోని క్యాంపు కార్యాలయంలో మంత్రిని కలిశారు. నియోజకవర్గంలో దాదాపు 28 వేలకు పైగా జనాభా కలిగి ఉన్న వడ్డెరులు నేటికీ సొంత ఇల్లు లేకుండా ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం అందజేసే డబుల్ బెడ్‌రూం పథకంలో వడ్డెరులకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో నాయకులు వరికుప్పల శ్రీశైలం, సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పల్లపు అశోక్, మంజల నగేష్, కార్యదర్శి వరికుప్పల వెంకటేష్, పల్లపు శంకర్, జిల్లా నాయకులు దేరంగుల నర్సింహా, గండికోట యాదయ్య, మాగని అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

మలబార్‌లో అన్‌కట్ జ్యువెలరీ ఎగ్జిబిషన్



మలబార్ షోరూంలో అన్‌కట్ వజ్రాభరణాలను ప్రదర్శిస్తున్న దృశ్యం

చైతన్యపురి: దిల్‌సుఖ్‌నగర్‌లోని మలబార్ గోల్డ్ అండ్ డైమండ్ షోరూంలో ఈ నెల 28 వరకు అన్‌కట్ ఆభరణాల ప్రదర్శన అందుబాటులో ఉంటుందని షోరూం హెడ్ రితీష్ తెలిపారు. వినియోగదారులు, షోరూం మేనేజ్‌మెంట్ టీం సమక్షంలో ఆదివారం ఇక్కడ ప్రత్యేక ప్రదర్శన ప్రారంభించారు. అన్‌కట్ ఆభరణాలు అద్వితీయమైన కళా నైపుణ్యం..హుందాతనంతో కూడి ఉంటాయన్నారు. నగిషీ చెక్కిన ప్రతి ఆభరణం కళాత్మకతకు నిదర్శనగా నిలుస్తుందన్నారు. వివాహం, పార్టీ సంబరాల కోసం ఎరా అన్‌కట్ వజ్రాభరణాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు.పాత బంగారు ఆభరణాలను తిరిగి విక్రయించేటప్పుడు 100 శాతం విలువ, బంగారం మార్పిడి సౌకర్యం కల్పిస్తున్నామన్నారు.

క్లుప్తంగా...

అంబేడ్కర్ విగ్రహానికి ఉద్యమకారుల వినతులు



ఫిలింనగర్: తెలంగాణ ఉద్యమకారులు డాక్టర్ సీమ శ్రీనివాసరావు పిలుపు మేరకు జూబ్లీ హిల్స్, ఖైరతాబాద్ నియోజకవర్గాలకు చెందిన పలువురు నేతలు తమ సమస్యలతో కూడిన వినతి పత్రాలను ఆదివారం ఫిలింనగర్‌లోని మహనీయుల చౌరస్తాలో అంబేడ్కర్ విగ్రహానికి సమర్పించారు. ప్రభుత్వ పథకాల్లో 20 శాతం కేటాయించాలని ఉచిత బస్సు, ట్రైన్ పాసులు ఇవ్వాలని ఆరోగ్యశ్రీ కార్డులు అందించాలని ఒక్కొక్కరికి 300 గజాల ఇంటి నివేశిత స్థలాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ ఉద్యమకారులకు నామినేటెడ్ పదవులు కూడా కేటాయించాలని కోరారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌కు రాసిన ఈ వినతి పత్రాన్ని అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించిన అనంతరం అంబేడ్కర్ విగ్రహం వద్ద ఉంచినట్లు బాబూరావు, ఎస్.మాణిక్యం, ఎం.జగన్, జి. హన్మంతుగౌడ్, వి.మోహనాచారి, వై.భాస్కర్‌నాయి, ఆర్.దుర్గేష్, ఎస్.పి.సురేష్, వి.వెంకటరమణ, డి.రామకృష్ణ, ఎల్.నర్సింగ్‌రావు, శ్రీనివాస్ తదితరులు వెల్లడించారు.

బాలికలకు శిక్షణ

ఖైరతాబాద్: రాష్ట్ర సేవికా సమితి ప్రవేశ శిక్ష వర్గ బాలికలకు స్వసంరక్షణ, క్షమతతో పాటు సమాజ సేవ, జాగరణ తదితర కార్యక్రమాలలో ఆదివారం శిక్షణ ఇచ్చారు. ఖైరతాబాద్‌లో ఈ నెల 6 ప్రారంభమైన శిక్షణ కార్యక్రమం ఆదివారం వరకు నిర్వహించారు. తెలంగాణ ప్రాంతంలోని 26 జిల్లాల నుంచి 116 మంది బాలికలు శిక్షణలో భాగస్వాములు అయ్యారు.

హమాలీల కూలీ రేట్లు పెంచాలి

బన్సీలాల్‌పేట్: సికింద్రాబాద్ మోండా మార్కెట్‌లోని హమాలీల కూలీ రేట్లు పెంచాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి నరసింహా డిమాండ్ చేశారు. మోండా మార్కెట్‌లోని గ్రేస్ వర్తకుల సంఘం కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు జరిగిన హమాలీ యూనియన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రేస్ మార్కెట్‌లో హమాలీలను రోజు 12 గంటల పాటు పనిచేయించుకుంటూ శ్రమకు తగ్గ కూలీ ఇవ్వడం లేదని ఆరోపించారు. హమాలీలకు రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలన్నారు.

రేషన్ డీలర్ల సమ్మెకు మద్దతు

ముషీరాబాద్: తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం జూన్ 5 నుంచి సమ్మె చేస్తున్న రేషన్ డీలర్లకు మద్దతు ఇస్తున్నట్లు పీవైఎల్, పీఓడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు కాశీనాథ్, కే.ఎస్ ప్రదీప్, బి.స్వరూప, సీ.హెచ్ శిరోమణిలు ఓ ప్రకటనలో తెలిపారు. రేషన్ డీలర్లకు గౌరవ వేతనం ఇవ్వాలన్నారు. 50 కేజీల రేషన్ బియ్యం బస్తా తరుగుతో వస్తున్న అధికారుల దృష్టికి తీసుకెళ్లినా వారు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కరోనా సమయంలో సేవలు అందించి 99 మంది మరణించిన వారి కుటుంబాలను ఆదుకోలేదన్నారు. 17 వేలకుపైగా ఉన్న రేషన్ షాపుల ద్వారా 12 రకాల నిత్యావసరాలను అందించాలన్నారు.

ఆధ్యాత్మిక భావనను అలవర్చుకోవాలి

ముషీరాబాద్: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావనను అలవర్చుకున్నప్పుడే మానసిక ప్రశాంతత లభిస్తుందని రాంనగర్ మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ముషీరాబాద్ డివిజన్‌లోని బ్రహ్మాగారి ఆలయ వీధిలోని కళా గోలమ్మ అమ్మవారి బోనాలను ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి పెద్ద ఎత్తున బోనంతో భక్తులు నైవేద్యం సమర్పించారు. ఆయన అమ్మవారికి పూజలు నిర్వహించారు. విద్యార్థి విభాగం ఇన్‌చార్జ్ కార్తీక్‌యాదవ్, ముషీరాబాద్ డివిజన్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు సదా, నాయకులు సిరిగిరి శ్యామ్, బ్రహ్మం, అశోక్‌చారి, కిరణ్ అనంతచారి, సత్యనారాయణ పాల్గొన్నారు.

పాదచారి.. సారీ!

- అలంకారప్రాయంగా ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు
- నిర్మించినది పని చేయదు.. కొత్తదాని పనులు సాగవు
- నిర్వహణలో రాజ్యమేలుతున్న నిర్లక్ష్యం
- పట్టించుకోని అధికారగణం
- పాదచారులకు తప్పని ఇబ్బందులు

పాదచారుల భద్రతకు పెద్ద పీట వేస్తున్నామని ప్రకటించుకునే ప్రభుత్వం ఆ దిశగా చిత్తశుద్ధితో పనులను చేపట్టలేకపోతోంది. అరకొర పనులతో పాదచారులకు చుక్కలు చూపిస్తున్నారు. కోట్లాది రూపాయలు వెచ్చిస్తూ పాదచారుల వంతెనలు నిర్మిస్తుండగా ఇవి కాస్త మూన్నాళ్ల ముచ్చటగానే మిగులుతున్నాయి.



పంజగుట్ట చౌరస్తాలో పాదచారుల వంతెనలో పని చేయని ఎస్కలేటర్



జీవీకే వన్ చౌరస్తాలో నిర్మాణంలో ఉన్న పాదచారులు వంతెన

బంజారాహిల్స్: పంజగుట్ట చౌరస్తా... నగరంలోనే అత్యంత రద్దీగా ఉండే ప్రాంతాల్లో ఒకటి. నిత్యం ఎంతో రద్దీగా ఉండే ఈ చౌరస్తాలో రోడ్డు దాటేందుకు పాదచారులకు ఓ సవాలు లాంటిదే అనడం నిర్వివాదాంశం. పాదచారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూసేందుకు పంజగుట్ట పోలీస్ స్టేషన్ ఎదుట నిర్మించి ఫుట్ ఓవర్ బ్రిడ్జి అలంకారప్రాయంగా మిగిలింది.

- రూ. 1.50 కోట్ల వ్యయంతో అన్ని హంగులతో ఇక్కడ పాదచారుల వంతెన నిర్మించారు. లిఫ్ట్‌తో పాటు ఎస్కలేటర్లను కూడా రెండు వైపులా నిర్మించారు.
- ఇవి పట్టుమని పది రోజులు కూడా పని చేయకుండానే మూలనపడ్డాయి. అటు లిఫ్ట్ పనిచేయక, ఇటు ఎస్కలేటర్ తిరగక పాదచారులు యధావిధిగా మెట్లను ఆశ్రయిస్తున్నారు.
- ఈ సమస్యపై ఎవరికి ఫిర్యాదు చేయాలో స్థానికులు, పాదచారులకు అంతుబట్టడం లేదు.
- జీహెచ్ఎంసీ ఈ వంతెనను నిర్మించి ఏజెన్సీకి నిర్వహణ బాధ్యతలు అప్పగించింది. నిర్వహణ లోపంతో వంతెన వద్ద సమస్యలు రాజ్యమేలుతున్నాయి.
- నెల దాటుతున్నా పని చేయని ఎస్కలేటర్‌కు మరమ్మతులు చేపట్టడం లేదు.

సా...గుతున్న వంతెన నిర్మాణ పనులు...

- బంజారాహిల్స్ రోడ్ నెం. 1లో జీవీకే వన్ ముందు పాదచారుల వంతెన నిర్మాణానికి నాలుగేళ్ల క్రితం పునాది పడింది. నత్తనడకన నిర్మాణ పనులు సాగుతున్నాయి. రూ. 1.50 కోట్ల వ్యయంతో ఇక్కడ వంతెన నిర్మాణం చేపడుతుండగా పనుల్లో మాత్రం తీవ్ర జాప్యం జరుగుతున్నది. ఇప్పటికి ఇంకా 75 శాతం పనులు మాత్రమే పూర్తయ్యాయి.
- ఇక్కడ కూడా నిత్యం రద్దీగా ఉంటూ వందలాది మంది రోడ్డు దాటే క్రమంలో ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ సమస్య పరిష్కారం కోసం వంతెన నిర్మాణం చేపట్టిన జీహెచ్ఎంసీ పనుల్లో వేగం పెంచడం లేదు.
- ఏళ్ల తరబడి సాగుతున్న ఈ పనులు ఇప్పట్లో పూర్తయ్యే పరిస్థితి కూడా కనిపించడం లేదు. తవ్వకాల్లో పెద్ద ఎత్తున డ్రెయినేజీ, మంచినీటి పైప్‌లైన్లు, ఎలక్ట్రిసిటీ కేబుళ్లు అడ్డుగా వచ్చాయని దీంతోనే తీవ్ర జాప్యం జరిగిందని జీహెచ్ఎంసీ ఇంజినీర్లు చెబుతున్నారు.

చేనేత ఉత్పత్తులను ఆదరించాలి

నటి ప్రియాంక రామన్



సాక్షి, సిటీబ్యూరో: బంజారాహిల్స్ రోడ్ నెంబర్-12లోని కళింగ కల్చరల్ హాల్‌లో హ్యాండ్ లూమ్ ఇండియా 2023 పేరిట క్రాఫ్ట్ అండ్ వీవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వస్త్ర ప్రదర్శన ఏర్పాటైంది. దీనిని టాలీవుడ్ నటి ప్రియాంక రామన్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... భారతీయ సంస్కృతిలో సిల్క్, హ్యాండ్ లూమ్ వస్త్ర ఉత్పత్తులకు ప్రత్యేకత ఉందని, ఎప్పటికీ అవి వన్నె తగ్గనివి అన్నారు. యువత, డిజైనర్లు కూడా చేనేత వస్త్రాలు, ఉత్పత్తులను ఆదరిస్తున్నా ఆ ఆదరణ మరింత పెరగాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. నిర్వాహకులు జయేష్ మాట్లాడుతూ... ఈ నెల 28వ తేదీ వరకు కొనసాగనున్న ఈ ప్రదర్శనలో దేశంలోని 14 నగరాలకు చెందిన చేనేత కళాకారులు, చేతి వృత్తుల వారు రూపొందించిన సిల్క్ హ్యాండ్ లూమ్ చీరలు, డ్రెస్ మెటీరియల్ వంటి 50 వేల రకాల ఉత్పత్తులను అందుబాటులో ఉంచామని వివరించారు.

త్వరలో యువతకు ఆన్‌లైన్‌లో క్విజ్

బంజారాహిల్స్: కాంగ్రెస్ పార్టీ హైదరాబాద్ యూత్ డిక్లరేషన్ స్ఫూర్తిగా తెలంగాణ యువశక్తిని మేల్కొలిపే దిశగా త్వరలో రాజీవ్‌గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ పోటీలను నిర్వహించనున్నట్లు ఖైరతాబాద్ కాంగ్రెస్ నాయకురాలు పి.విజయారెడ్డి తెలిపారు. క్విజ్ కాంపిటీషన్ పోటీలకు సంబంధించి రూపొందించిన పోస్టర్‌ను ఆదివారం బంజారాహిల్స్ రోడ్ నెం. 12లోని ఎన్బీటీనగర్‌లో పీజేఆర్ విగ్రహం వద్ద ఆమె కాంగ్రెస్ ముఖ్య నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, ఎన్ఎస్‌యూఐ నాయకులతో కలిసి ఆవిష్కరించారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

శాస్త్రీనగర్ అధ్యక్షుడిగా నర్సింగరావు



నర్సింగరావుకు ధ్రువీకరణ పత్రాన్ని అందిస్తున్న ఎన్నికల అధికారులు

శ్రీనగర్‌కాలనీ: ఎర్రగడ్డ డివిజన్ శాస్త్రీనగర్ ఎన్నికలు ఆదివారం నిర్వహించారు. అధ్యక్షుడిగా బస్తీ నేత కె.నర్సింగరావు ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఈ మేరకు ధ్రువపత్రాన్ని ఎన్నికల అధికారులు అన్నాదొర, నర్సింగరావు ఆయనకు అందజేశారు. బస్తీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఈ సందర్భంగా అధ్యక్షుడు నర్సింగరావు వెల్లడించారు. కార్యక్రమంలో స్థానిక నేతలు వీరస్వామి, దుర్గారాజ్, హరేకృష్ణ, సత్యనారాయణ, మురళి, విశ్వనాథ్, రాజేష్, రవి తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్ గాంధీకి నివాళి



నివాళులర్పిస్తున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి విజయారెడ్డి



పంజగుట్ట చౌరస్తాలో కాంగ్రెస్ నాయకులు...



వెంగళరావునగర్ చౌరస్తాలో కాంగ్రెస్ నేతలు...



ఏజీ కాలనీలో...

బంజారాహిల్స్: మాజీ ప్రధాని దివంగత రాజీవ్‌గాంధీ వర్ధంతి సందర్భంగా ఖైరతాబాద్ నియోజకవర్గంలో వాడవాడలా ఆయనకు నివాళులు అర్పించారు. రాజీవ్ జ్ఞాపకాలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ఆదివారం సోమాజిగూడ సర్కిల్‌లోని రాజీవ్ గాంధీ విగ్రహానికి ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు సి.రోహిణ్‌రెడ్డి, టీ పీసీసీ ప్రధాన కార్యదర్శి విజయారెడ్డి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. నియోజకవర్గం పరిధిలోని కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో విచ్చేసి రాజీవ్ విగ్రహం వద్ద శ్రద్ధాంజలి ఘటించారు. రాజీవ్ అమర్ రహే అంటూ నినాదాలతో సర్కిల్ మార్మోగింది.

కాంగ్రెస్ నేతల నివాళి...

పంజగుట్ట: మాజీ ప్రధాని దివంగత రాజీవ్‌గాంధీ వర్ధంతి సందర్భంగా ఆదివారం సోమాజిగూడ కూడలిలోని రాజీవ్‌గాంధీ విగ్రహానికి పలువురు కాంగ్రెస్ నేతలు నివాళులు అర్పించారు. ఏఐసీసీ సెక్రటరీ రోహిత్ చౌదరి, పీసీసీ మాజీ అధ్యక్షుడు హనుమంతరావు, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్, టీ పీసీసీ ప్రధాన కార్యదర్శి, ఖైరతాబాద్ కార్పొరేటర్ పి.విజయారెడ్డి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజీవ్ దేశానికి చేసిన సేవలు గుర్తుచేసుకున్నారు. యువత రాజీవ్‌ను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.

వెంగళరావునగర్ చౌరస్తాలో...

వెంగళరావునగర్: మాజీ ప్రధాని దివంగత రాజీవ్ గాంధీకి కాంగ్రెస్ నాయకురాలు జింకా ఆలీస్ నివాళులర్పించారు. వెంగళరావునగర్ చౌరస్తాలోని రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... రాజీవ్‌గాంధీ దేశాభివృద్ధికి చేసిన సేవలు మరువలేనివన్నారు. కాంగ్రెస్ నేతలు సుశీల్‌కుమార్, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

ఏజీకాలనీలో...

శ్రీనగర్‌కాలనీ: ఎర్రగడ్డ డివిజన్ ఏజీకాలనీలో రాజీవ్‌గాంధీ వర్ధంతి నిర్వహించారు. కాంగ్రెస్ నేతలు రవిగౌడ్, మోసిన్‌ఖురేషిలు రాజీవ్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

క్రైస్తవుల ప్రత్యేక ప్రార్థనలు

ఖైరతాబాద్: అన్ని మతాల వారికి సమాన హక్కులు కల్పించినందుకు ముఖ్యమంత్రి కేసీఆర్‌కు అభినందనలు, క్రైస్తవ కమ్యూనిటీ నుంచి సత్ సంబంధాలను కొనసాగిస్తున్న వ్యక్తికి ఎమ్మెల్సీ పదవికి నామినేట్ చేయాలంటూ ఆదివారం ఖైరతాబాద్ చర్చిలో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మొత్తం 33 జిల్లాల క్రైస్తవుల మధ్య ఐక్యతను తెచ్చి, సమాజ భద్రత, శ్రేయస్సును పెంపొందించే కమ్యూనిటీ సమస్యలపై స్పందిస్తూ వస్తున్న తెలంగాణ యునైటెడ్ క్రిస్టియన్ అండ్ పాస్టర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ గోనె సోలమన్ రాజ్‌ని మేము సిఫారస్సు చేస్తున్నామన్నారు. పాస్టర్ ఆర్.కిషోర్, అభిరాం, నవ జీవన్ కుమార్, పి.కృష్ణ ప్రసాద్, మహేష్ రాజ్ పాల్గొన్నారు.



ప్రార్థనల్లో పాల్గొన్న క్రైస్తవులు

బస్తీల్లో వసతుల కల్పనకు కృషి

జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్



సీవరేజ్ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గోపీనాథ్

రహమత్‌నగర్: బస్తీల్లో మౌలిక వసతుల కల్పనకు తన వంతు కృషి చేస్తానని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అన్నారు. ఎస్పీఆర్‌హిల్స్‌లోని బ్రహ్మశంకర్‌నగర్ బస్తీ, ఫేజ్-2 బస్తీల్లో ఆదివారం సీవరేజ్ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాగంటి మాట్లాడుతూ... రహమత్‌నగర్ డివిజన్‌ను అన్ని రంగాల్లో ముందుంచాలనే లక్ష్యంతో ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయించి అభివృద్ధి పనుల చేయించామన్నారు. బ్రహ్మశంకర్‌నగర్ బస్తీ సమస్యల పరిష్కారం కోసం త్వరలోనే జీహెచ్ఎంసీ అధికారులతో పర్యటించనున్నట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. బస్తీలో నెలకొన్న తాగునీటి సమస్యను స్థానిక మహిళలు ఎమ్మెల్యేను వివరించారు. స్పందించిన ఆయన జలమండలి అధికారులకు ఫోన్ ద్వారా సమస్యను వివరించి పరిష్కరించాలని ఆదేశించారు. కార్పొరేటర్ సి.ఎన్.రెడ్డి, బస్తీ నేతలు మల్లేశ్, బసవరాజు, సరిత, డివిజన్ నాయకులు ధనూజ, నజీర్, గఫూర్, ఫయాజ్, విలియమ్స్ తదితరులు పాల్గొన్నారు.



బంజారాహిల్స్ డివిజన్‌లో సమస్యలు కోకొల్లలు



ఎన్బీటీ నగర్‌లో సమస్యలను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే చింతల

బంజారాహిల్స్: సామాన్య, మధ్య తరగతి ప్రజలంటే ఈ ప్రభుత్వానికి లెక్క లేకుండా పోయిందని ఎన్నో సమస్యలతో సతమతమవుతున్నా ఏ మాత్రం స్పందించడం లేదని ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి దుయ్యబట్టారు. బూత్ దర్శన్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం బంజారాహిల్స్ డివిజన్ పరిధిలోని రోడ్ నెం. 12 ఎన్బీటీ నగర్‌లో బస్తీలో పర్యటించారు. అడుగడుగునా మురుగు పారుతుండగా గుంతలు, మట్టి దిబ్బల మీదుగా ఆయన పాదయాత్ర నిర్వహించారు. ఎక్కడికక్కడ సమస్యలు కళ్లకు కడుతుండటంతో ప్రభుత్వ పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బూత్ దర్శన్ కార్యక్రమం 14వ రోజుకు చేరుకుందని ఆయన తెలిపారు. వాడవాడలా తనకు స్థానికులు బ్రహ్మరథం పడుతున్నారని తమ సమస్యలు విన్నవించుకుంటున్నారని వెల్లడించారు. బంజారాహిల్స్ డివిజన్ పరిధిలోనే సమస్యలు కోకొల్లలుగా ఉన్నట్లుగా ప్రజలనుంచి తనకు ఫిర్యాదులు అందాయన్నారు. తనకు వచ్చిన విజ్ఞప్తులను ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నానని వెల్లడించారు. బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని నమ్ముకుంటే సమస్యలతోనే ఉండాల్సి వస్తుందని దుయ్యబట్టారు.

వీధి కుక్క మరణానికి కారణమైన డాగ్ క్యాచర్‌పై ఫిర్యాదు

పంజగుట్ట: వీధికుక్క మరణానికి కారణమైన జీహెచ్ఎంసీ డాగ్ క్యాచర్‌పై చర్యలు తీసుకోవాలని జంతు సంక్షేమ కార్యకర్త పంజగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... అమీర్‌పేట, నాగార్జున నగర్‌లో నివాసముండే న్యాయవాది పి.పి.వర్ధనమ్మ కొన్ని సంవత్సరాలుగా జంతు సంక్షేమ కార్యకర్తగా పనిచేస్తున్నారు. ఈ నెల 11వ తేదీన వారి కాలనీలో ఉన్న రెండు నల్లరంగు కుక్కలను జీహెచ్ఎంసీ డాగ్ క్యాచర్ క్యాచ్‌చేసి తీసుకువెళ్లాడు. వాటికి సర్జరీ చేసి 17వ తేదీన తిరిగి వదిలేశాడు. తీసుకెళ్లే సమయంలో ఎంతో ఆరోగ్యంగా ఉన్న కుక్కలు వదిలేసే సమయంలో నీరసంగా, నడవలేకుండా ఉన్నాయి. దీంతో వర్ధనమ్మ కుక్కలను ఆస్పత్రికి తరలించారు. ఈ నెల 19న ఆస్పత్రి నుంచి ఒక కుక్క చనిపోయిందని సమాచారం అందింది. మరో కుక్క కూడా తీవ్ర అనారోగ్యంతో ఉందని జంతువుల పట్ల క్రూరంగా వ్యవహరించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పంజగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటింటికీ ఓటరు జాబితాను తీసుకెళ్లాలి

జూబ్లీహిల్స్ మాజీ కార్పొరేటర్ కాజా సూర్యనారాయణ



ఫిలింనగర్: జీహెచ్ఎంసీ కమిషనర్ లోకేష్ కుమార్ గూగుల్ మీట్‌లో భాగంగా సిస్టమెటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టరోల్ పార్టిసిపేషన్ (స్వీప్) ప్రోగ్రామ్ నిర్వహించారు. గుర్తించిన పలువురు సీనియర్ సిటిజన్‌లు, పౌరులతో ఆయన ఈ మీట్‌లో మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో ఓటర్లను పోలింగ్ బూత్‌ల వరకు తీసుకొచ్చి ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు సలహాలు, సూచనలు తీసుకున్నారు. ఇందులో భాగంగా జూబ్లీహిల్స్ మాజీ కార్పొరేటర్, ఫిలింనగర్ సొసైటీ కార్యదర్శి కాజా సూర్యనారాయణతో పది నిమిషాల పాటు ఆయన ఈ విషయంపై మాట్లాడారు. ఓటింగ్ శాతం పెరిగేందుకు ఆయన పలు సూచనలు చేశారు. ముఖ్యంగా చాలా ఇళ్లల్లో అద్దెకు ఉండేవారి ఓట్లను ఎలాంటి విచారణ లేకుండానే తొలగిస్తున్నారని ఆ ఇంటి యజమాని ఖాళీ చేశారని చెప్పగానే సిబ్బంది వెళ్లిపోతున్నారని అలా కాకుండా ఆ ఓటర్లను గుర్తించడం ద్వారా వారు ఓటు వేసేందుకు అవకాశం కల్పించవచ్చన్నారు. చాలా మంది పోలింగ్ రోజున తమ ఓటరు కార్డులు పట్టుకొని బూత్‌ల చుట్టూ తిరుగుతున్న దృశ్యాలను తాను గమనించానని వెల్లడించారు. బస్తీలు, మురికివాడల్లో ఉండే యువతకు తాము ఓటు నమోదు ఎక్కడ చేసుకోవాలో తెలియకుండా పోతున్నదని సిబ్బంది అక్కడికే వెళ్లి నమోదు చేయించాలని అన్నారు. ఓటరు జాబితాలను ప్రతి బూత్‌కు పంపించి మీ ఓటు ఉందో లేదో సరి చూసుకోవాలని చెప్తున్నారని అయితే క్లాస్ ఓటర్లు ఎవరూ బూత్‌లకు వెళ్లి చూసుకోవడం లేదని ముఖ్యంగా అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీ వాళ్ళు పోలింగ్ బూత్‌లకు వెళ్ళడం లేదని ఇలాంటి సమయంలో బీఎల్‌వోలు ఇంటింటికి ఓటరు జాబితాను తీసుకొని మీ ఓటు ఉందో లేదో సరిచూసుకోండి అని చెప్పడం ద్వారా మెరుగైన ఫలితాలు వస్తాయని సూచించారు. కోవిడ్ సమయంలో ఎన్నికల్లో చాలా మంది క్లాస్ ఓటర్లు ఓటు వేయడానికి రాలేదని ఈసారి వారందరు ఓటు వేసే విధంగా అవగాహన కలిగించాలని సూచించారు. జీహెచ్ఎంసీ కమిషనర్ స్పందించి తమ అధికారులకు ఈ విషయాలను చేరవేస్తామని పేర్కొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



సమస్యలు తెలుసుకుంటున్న ఉపేందర్‌రెడ్డి

శ్రీనగర్‌కాలనీ: ఎర్రగడ్డ డివిజన్‌లోని ఓల్డ్‌సుల్తాన్‌నగర్‌లో ఆదివారం 13వ రోజు నిర్వహించిన పాదయాత్రలో టీ హోప్ చైర్మన్ కె.ఉపేందర్ రెడ్డి పర్యటించి స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. టీ హోప్ ద్వారా విద్యార్థులకు ఉచితంగా స్కాలర్‌షిప్స్‌తో పాటు వారి విద్యను అభ్యసించడానికి సహకరిస్తున్నామన్నారు. బస్తీలు, కాలనీల్లో సమస్యలకు తనవంతుగా సహాయ సహకారాలు అందిస్తానని ఆయన తెలిపారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో పాదయాత్రను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నేతలు సంపత్, సతీష్, వెంకటేష్, విరూపాక్ష, భాస్కర్‌రెడ్డి, రాజు, చంద్రమౌళి, యాదగిరి, నందకిషోర్ పాల్గొన్నారు.



'సన్'డే.. మండే!

బంజారాహిల్స్: ఎండ వేడిమికి జనం విలవిల్లాడారు. ఆదివారం ఉదయం నుంచే భానుడు తన ప్రతాపాన్ని చూపించాడు. మధ్యాహ్నానికి సుర్రుమంటున్న ఎండతో జనం బెంబేలెత్తిపోయారు. వేడి తీవ్రత ఎక్కువగా ఉంటుందని ముందే హెచ్చరికలు జారీ కావడంతో చాలా మంది ఇళ్లకే పరిమితం అయ్యారు. అయితే చిరు వ్యాపారులు, దినసరి కూలీలు, అడ్డా కూలీలు ఎండకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రోడ్లన్నీ నిర్మానుష్యంగా కనిపించాయి.





మధ్యాహ్నం ఖాళీగా కనిపిస్తున్న జూబ్లీహిల్స్ రోడ్ నెం.10...

'డబుల్' ఇళ్ల పేరుతో మహిళలకు టోకరా

ఆరుగురిని మోసగించిన వ్యక్తిపై కేసు నమోదు

బంజారాహిల్స్: ఖైరతాబాద్ మండలం జూబ్లీహిల్స్ నియోజకవర్గం పరిధిలోని ఎస్పీఆర్ హిల్స్ కమలానగర్‌లో ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను విక్రయించిన వ్యక్తిపై జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదైంది. వివరాలివీ... ఎల్లారెడ్డిగూడకు చెందిన నీరజ అనే మహిళకు నాలుగు సంవత్సరాలుగా బోరబండకు చెందిన నరసింహరాజుతో పరిచయం ఉంది. 2019లో నరసింహ రాజు ఆమె వద్దకు వచ్చి కమలానగర్‌లో ప్రభుత్వం నిర్మిస్తున్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల లబ్ధిదారులకు కేటాయించగా ఇంకా మిగిలి ఉన్నాయని తనకున్న పరిచయాలతో ఆ ఇళ్లల్లో ఒక ఇల్లు ఇప్పిస్తానని నమ్మించాడు. ఈ డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు అలాట్ చేయాలంటే కొంత మంది రాజకీయ నాయకులకు, అధికారులకు డబ్బులు ఇవ్వాల్సి ఉంటుందని రూ. 7 లక్షలు ఇస్తే కమలానగర్‌లో డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు ఇప్పిస్తానని మభ్యపెట్టాడు. నమ్మిన ఆమె రూ. 7 లక్షలు నరసింహ రాజుకు ఇచ్చింది. ముందే తయారు చేయించుకున్న అగ్రిమెంట్, సేల్ డీడ్, అలాట్‌మెంట్ లెటర్‌ను కూడా ఆమెకు ఇచ్చాడు. మూడేళ్ల నుంచి ఇల్లు గురించి అడగగా ఇది ప్రభుత్వ పని నెమ్మదిగా జరుగుతుంది, ఒత్తిడి తేవొద్దంటూ దాట వేస్తూ వచ్చాడు. ఈ నెల 18వ తేదీన ఈ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల ప్రారంభం అవుతున్నాయని తెలిసి అక్కడికి వెళ్లి అధికారులతో తన పేరు మీద అలాట్ అయిన ఇంటి గురించి వాకబు చేసింది. అయితే ఆమెకు ఎలాంటి ఇల్లు అలాట్ కాలేదని తేలింది. నరసింహరాజు గత 15 సంవత్సరాలుగా ఆ ప్రాంతంలో ఉండటం లేదని స్థానికుల ద్వారా తెలుసుకుంది. ఫోన్ చేస్తే సమాధానం చెప్పడం లేదు. తాను మోసపోయానని తెలుసుకొని నిందితుడి గురించి విచారించగా తనలాగే మరో అయిదు మంది మహిళలు రూ. 8 లక్షలు, రూ. 7 లక్షలు ఇచ్చినట్లుగా వెల్లడైంది. తామంతా కలిసి అధికారులను నిలదీయగా మోసపోయినట్లుగా వారు వెల్లడించారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇప్పిస్తానని చెప్పి తనతో పాటు మరికొందరు మహిళలను మోసం తప్పుడు పత్రాలు ఇచ్చిన నరసింహ రాజుపై చర్యలు తీసుకోవాల్సిందిగా బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితుడిపై ఐపీసీ 406, 420, 467, 471 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బందరు పోర్టు పనులకు
నేడే శుభారంభం

- రూ.5,156 కోట్లతో నిర్మాణ పనులకు సీఎం జగన్ భూమిపూజ

సాక్షి, అమరావతి/సాక్షి ప్రతినిధి, విజయవాడ: మచిలీపట్నం ప్రజల దశాబ్దాల కలను నెరవేరుస్తూ రూ.5,156 కోట్ల వ్యయంతో చేపడుతున్న పోర్టు నిర్మాణ పనులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం కృష్ణా జిల్లా మచిలీపట్నంలో ప్రారంభించనున్నారు. భూసేకరణ పూర్తిచేసి, అన్ని అనుమతులు సాధించి, న్యాయ వివాదాలు పరిష్కరించి, టెండర్లు ఖరారుచేసి, ఫైనాన్షియల్ క్లోజర్ పూర్తిచేసి కొబ్బరికాయ కొట్టిన తర్వాత పనులు ఆగకుండా శరవేగంగా జరిగేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికను సిద్ధంచేసింది. పూర్తిగా ప్రభుత్వ వ్యయంతో నిర్మిస్తున్న ఈ పోర్టు రాకతో వాణిజ్య కార్యకలాపాలు విస్తరించి రానున్న కాలంలో కృష్ణాజిల్లా ముఖచిత్రం మారనుంది. ఆంధ్రప్రదేశ్ చరిత్రలో నవశకానికి నాంది పలుకుతూ అధికారంలోకి వచ్చిన కేవలం నాలుగేళ్లలోపే మరో నాలుగు పోర్టుల నిర్మాణానికి సీఎం వైఎస్ జగన్ శ్రీకారం చుట్టారు. ఇప్పటికే రామాయపట్నం, కాకినాడ గేట్‌వే పోర్టుల్లో పనులు శరవేగంగా జరుగుతుండగా, మూలపేట పోర్టు పనులు కూడా ఇటీవలే ప్రారంభమయ్యాయి. ఇక సోమవారం నుంచి ఈ జాబితాలో మచిలీపట్నం పోర్టు కూడా చేరనుంది. 35.12 మిలియన్ టన్నుల వార్షిక సామర్థ్యంతో రెండు జనరల్ కార్గోకు, ఒకటి బొగ్గుకు, మరొకటి మల్టీపర్పస్-కంటైనర్‌తో ఎగుమతి, దిగుమతులకు ఉపయోగపడేలా మొత్తం నాలుగు బెర్తులతో మచిలీపట్నం పోర్టును 24-30 నెలల్లో పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ పోర్టు పనుల పూర్తితో ప్రత్యక్షంగా, పరోక్షంగా 25వేల మందికి ఉపాధి లభించనుంది. ఈ పోర్టు ద్వారా రాష్ట్రంలోని గుంటూరు, కృష్ణా, ఎన్టీఆర్, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలతో పాటు తెలంగాణలోని ఖమ్మం, కరీంనగర్, ఆదిలాబాద్, నల్గొండ, వరంగల్ జిల్లాలకు ఎరువులు, బొగ్గు, వంటనూనె, కంటైనర్ల దిగుమతులు, వ్యవసాయ ఉత్పత్తులు, సిమెంట్, సిమెంట్ క్లింకర్, గ్రానైట్, ముడి ఇనుము ఎగుమతులకు వేదికగా మారనుంది. సుమారు రూ.16,000 కోట్ల వ్యయంతో రామాయపట్నం, మచిలీపట్నం, కాకినాడ గేట్‌వే, మూలపేట పోర్టుల నిర్మాణాల ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 75 వేల మందికి ఉపాధి లభించనుంది.


పోర్టు నిర్మాణ పనులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ భూమిపూజ చేసే ప్రాంతం


శరవేగంగా పూర్తవుతున్న జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్

పారిశ్రామిక దూకుడు!

ఏపీ ప్రభుత్వ కృషికి అవార్డుతో జాతీయ స్థాయిలో గుర్తింపు

మూడు ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్ అడుగులు

- కొత్తగా 4 పోర్టు నగరాలు రామాయపట్నం, మూలపేట, కాకినాడ, బందరు
- వీటికి అదనంగా మినీ పోర్టుల తరహాలో తొమ్మిది ఫిషింగ్ హార్బర్ల నిర్మాణం
- పోర్టులను ఆనుకుని పారిశ్రామిక పార్కుల అభివృద్ధి
- పరిశ్రమలకు 80% ఉత్పత్తి వ్యయం తగ్గేలా రూ.18,897 కోట్లు వెచ్చిస్తున్న సర్కార్
- అనుమతులు, ఆర్థిక వనరులు సిద్ధమయ్యాకే పక్కాగా పనులు ప్రారంభం
- మూడు పారిశ్రామిక కారిడార్లు కలిగిన ఏకైక రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ రికార్డు
- ప్రభుత్వ తోడ్పాటుతో రాష్ట్రంలో పెట్టుబడులకు ముందుకొస్తున్న దిగ్గజ కంపెనీలు
- విశాఖ గ్లోబల్ ఇన్వెస్టర్ సమ్మిట్‌లో రూ.13.11 లక్షల కోట్ల పెట్టుబడులే నిదర్శనం

సాక్షి, అమరావతి: పారిశ్రామిక మౌలిక వసతుల కల్పనలో ఏపీ వేగంగా దూసుకెళుతోంది. దేశంలో ఎక్కడా లేనివిధంగా మూడు పారిశ్రామిక కారిడార్లతోపాటు 974 కి.మీ సుదీర్ఘ తీర ప్రాంతాన్ని కలిగి ఉండటం లాంటి అనుకూలతలను అందిపుచ్చుకుంటూ పురోగమిస్తోంది. విద్యుత్, నీరు, రోడ్లు, లాజిస్టిక్స్‌తో పాటు వివాద రహితంగా అభివృద్ధి చేసిన భూములను సమకూర్చడం ద్వారా పెట్టుబడులను ఆకర్షించేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందుచూపుతో తీసుకున్న నిర్ణయాలు సత్ఫలితాలనిస్తున్నాయి. పారిశ్రామిక రాయితీలతోపాటు మౌలిక వసతులపై అధికంగా దృష్టిసారించాలని అధికార యంత్రాంగాన్ని ఆదేశించిన సీఎం జగన్ కోవిడ్ సంక్షోభ సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ చర్యలు తీసుకున్నారు. రాష్ట్రం గుండా వెళ్తున్న మూడు పారిశ్రామిక కారిడార్లు విశాఖ-చెన్నై, చెన్నై-బెంగళూరు, హైదరాబాద్-బెంగళూరు కారిడార్లలో రూ.11,753 కోట్లతో ఆరు పారిశ్రామిక పార్కులను అభివృద్ధి చేయడంతో పాటు రూ.18,897 కోట్లతో నాలుగు పోర్టులు, తొమ్మిది ఫిషింగ్ హార్బర్ల నిర్మాణాన్ని కోవిడ్ సమయంలో ఏకకాలంలో చేపట్టారు. అంతేకాకుండా విశాఖ, అనంతపురంలో మల్టీ మోడల్ లాజిస్టిక్ పార్కుల నిర్మాణాన్ని చేపట్టడమే కాకుండా కొప్పర్తి, ఓర్వకల్లు వద్ద మరో రెండు మల్టీ మోడల్ లాజిస్టిక్ పార్కుల కోసం ప్రతిపాదనలు పంపారు. మరో వైపు కాకినాడ వద్ద రూ.1,000 కోట్లతో బల్క్‌డ్రగ్ పార్క్‌ను అభివృద్ధి చేస్తున్నారు. వీటివల్ల అభివృద్ధి చేసిన 50,000 ఎకరాలు అందుబాటులోకి రావడంతో పాటు రాష్ట్రంలో ఏర్పాటైన పరిశ్రమల ఉత్పత్తి వ్యయం 80 శాతం వరకు తగ్గనుంది. తద్వారా అంతర్జాతీయ కంపెనీలతో పోటీపడే స్థాయికి ఎదగనున్నట్లు పారిశ్రామిక వర్గాలు విశ్లేషిస్తున్నాయి. పారిశ్రామిక మౌలిక వసతుల కోసం ఈ స్థాయిలో వ్యయం చేస్తున్న రాష్ట్రం దేశంలో మరెక్కడా లేదని పేర్కొంటున్నాయి.


శరవేగంగా సాగుతున్న రామాయపట్నం ఫిషింగ్ హార్బర్ పనులు

■ కోవిడ్‌లోనే కొప్పర్తి నోడ్ రెడీ

ఒకపక్క కోవిడ్ సంక్షోభం వెంటాడుతున్నా విశాఖ-చెన్నై కారిడార్ పరిధిలోని కొప్పర్తి నోడ్‌ను రాష్ట్ర ప్రభుత్వం శరవేగంగా అందుబాటులోకి తెచ్చింది. విశాఖ-చెన్నై కారిడార్‌లో భాగంగా కొప్పర్తి వద్ద 6,739 ఎకరాలను రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి చేస్తోంది. ఇందులో 801 ఎకరాల్లో వైఎస్సార్ ఈఎంసీ, 3,053 ఎకరాల్లో వైఎస్సార్ జగనన్న మెగా ఇండస్ట్రియల్ హబ్‌ను అభివృద్ధి చేసి అందుబాటులోకి తెచ్చింది. ఇదే కారిడార్‌లో భాగంగా నక్కపల్లి, రాంబిల్లి, శ్రీకాళహస్తి, కొప్పర్తి నోడ్‌లను ఏడీబీ, నిక్‌డిక్ట్ నిధులతో అభివృద్ధి చేస్తోంది. ఏడీబీ నిధులతో తొలిదశలో రూ.2,900 కోట్లతో అభివృద్ధి చేయగా రెండోదశలో రూ.1,633 కోట్లతో అభివృద్ధి పనులకు సూత్రప్రాయంగా అంగీకారం తెలిపింది. దీనికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వంతో ఈనెల 23న ఒప్పందం కుదుర్చుకోనుంది. ఈ ఒక్క కారిడార్ పరిధిలోనే 26,182 ఎకరాలు అందుబాటులోకి రానున్నాయి. ఇక చెన్నై-హైదరాబాద్ కారిడార్ కింద కృష్ణపట్నం వద్ద 11,096 ఎకరాల్లో క్రిస్ సిటీని, హైదరాబాద్ -బెంగళూరు కారిడార్‌లో ఓర్వకల్లు వద్ద 9,305 ఎకరాలను అభివృద్ధి చేయనుంది. ఈ పారిశ్రామిక పార్కులకు అవసరమైన నీటి వసతికి సంబంధించిన పనులను కూడా ఏపీఐఐసీ మొదలు పెట్టింది. మరోవైపు ఇప్పటికే కర్నూలు ఎయిర్‌పోర్టును అందుబాటులోకి తేగా భోగాపురంతోపాటు రామాయపట్నం తెట్టు వద్ద మరో ఎయిర్‌పోర్టు నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

■ గత ప్రభుత్వానికి భిన్నంగా..

టీడీపీ అధికారంలో ఉండగా తీరప్రాంతాన్ని సద్వినియోగం చేసుకోకుండా ఎన్నికలకు నెలన్నర ముందు ఎలాంటి అనుమతులు లేకుండా చంద్రబాబు కొబ్బరికాయ కొట్టి షూటింగ్ ముగించారు. ఇలాంటి వ్యవహారాలకు తావులేకుండా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పోర్టుల నిర్మాణానికి అవసరమైన అన్ని కీలక అనుమతులు సాధించడంతో పాటు ఆర్థిక వనరులు (ఫైనాన్షియల్ క్లోజర్) సమకూరిన తర్వాతే పనులు ప్రారంభిస్తున్నారు. ఇప్పటికే రామాయపట్నం, మూలపేట, కాకినాడ గేట్‌వే పోర్టుల నిర్మాణం మొదలు కాగా ఈనెల 22వతేదీన మచిలీపట్నం పోర్టు పనులకు శ్రీకారం చుట్టనున్నారు. ఇందుకోసం ఏపీ మారిటైమ్ బోర్డును నెలకొల్పడమే కాకుండా మూడు పోర్టులకు ప్రత్యేక కంపెనీలను ఏర్పాటు చేశారు. 2022 జూలైలో పనులు ప్రారంభించిన రామాయపట్నం శరవేగంగా సాకారమవుతోంది. ఈ ఏడాది చివరి నాటికల్లా తొలి ఓడను ఇక్కడకు రప్పించే లక్ష్యంతో ముందుకువెళుతున్నారు.

■ 60,000 మత్స్యకార కుటుంబాలకు ఉపాధి

పోర్టులకు అదనంగా 60,000 మత్స్యకార కుటుంబాలకు ఉపాధి కల్పించేలా తొమ్మిది ఫిషింగ్ హార్బర్లను రాష్ట్ర ప్రభుత్వం నిర్మిస్తోంది. తొలిదశలో చేపట్టిన జువ్వలదిన్నె, నిజాంపట్నం, మచిలీపట్నం, ఉప్పాడ ఫిషింగ్ హార్బర్లలో పనులు వేగంగా జరుగుతుండటంతో త్వరలో ప్రారంభానికి సిద్ధమవుతున్నాయి. జువ్వలదిన్నె పనులు 86 శాతానికి పైగా పూర్తి కాగా నిజాంపట్నంలో 62 శాతం జరిగాయి. మచిలీపట్నం, ఉప్పాడ ఫిషింగ్ హార్బర్ల పనులు 50 శాతం దాటాయి. ప్రైవేట్ రంగంలో నిర్మిస్తున్న కాకినాడ గేట్‌వే పోర్టుతో కలిసి రాష్ట్ర ప్రభుత్వం నిర్మిస్తున్న మూడు పోర్టులు, తొమ్మిది ఫిషింగ్ హార్బర్ల కోసం రూ.18,897 కోట్లు వ్యయం చేస్తోంది. ఈ పోర్టులను ఆనుకుని భారీ పారిశ్రామిక నగరాలను నిర్మించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇందుకోసం ముగ్గురు ఐఏఎస్ అధికారులతో కమిటీని నియమించారు. రాష్ట్రంలో నెలకొల్పే పరిశ్రమలకు అవసరమైన నిపుణులైన మానవ వనరులను సమకూర్చడంపై కూడా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టిసారించింది. ఇందుకోసం 192 స్కిల్ హబ్స్ ఏర్పాటుతోపాటు 26 స్కిల్ కాలేజీలను ఏర్పాటు చేసింది.

అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందేలా..



పోర్టులు, పారిశ్రామిక పార్కుల నిర్మాణం ద్వారా రాష్ట్రంలో అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టమైన ప్రణాళికతో ముందుకు వెళుతున్నారు. సహజ వనరులను వినియోగించుకుంటూ మూడు ప్రాంతాల అభివృద్ధిపై దృష్టి పెట్టారు. రామాయపట్నం పోర్టుతో ప్రకాశం, నెల్లూరు జిల్లాలు, మచిలీపట్నంతో కృష్ణా, ఎన్టీఆర్, మూలపేటతో శ్రీకాకుళం జిల్లాలు వేగంగా అభివృద్ధి చెందనున్నాయి. దేశంలో ఎక్కడా లేనివిధంగా మూడు పారిశ్రామిక కారిడార్ల ద్వారా 50,000 ఎకరాల భూమిని అందుబాటులోకి తెస్తున్నాం. అన్ని అనుమతులు, ఆర్థిక వనరులు సమకూరిన తర్వాతే సీఎం జగన్ పనులు ప్రారంభిస్తున్నారు. శంకుస్థాపన మరుసటి రోజునుంచే పనులు నిర్విఘ్నంగా కొనసాగాలన్నది సీఎం ఆకాంక్ష.

– గుడివాడ అమర్నాథ్, పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి

జాతీయ స్థాయిలో గుర్తింపు..

అత్యంత ప్రతిష్టాత్మకంగా తీరప్రాంత అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషికి జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. ప్రముఖ బిజినెస్ దినపత్రిక 'ఎకనామిక్ టైమ్స్'దేశీయ ఇన్‌ఫ్రా రంగంపై ఏటా ప్రకటించే అవార్డుల్లో ఈసారి మనకు చోటు దక్కింది. దేశంలో పోర్టు ఆధారిత మౌలిక వసతుల కల్పనలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సాధించిన అత్యున్నత ప్రగతిని గుర్తిస్తూ ఇన్‌ఫ్రా ఫోకస్ అవార్డుకు ఎంపిక చేసినట్లు పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వం పారిశ్రామిక మౌలిక వసతులకు పెద్దపీట వేస్తుండటంతో దిగ్గజ సంస్థలైన అదానీ, అంబానీ, మిట్టల్, బిర్లా, భంగర్, భజాంకా, సంఘ్వీ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొస్తున్నాయి. ఈ ఏడాది మార్చిలో విశాఖ వేదికగా జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్ సమ్మిట్‌లో 386 ఒప్పందాల ద్వారా రూ.13,11,468 కోట్ల విలువైన పెట్టుబడులు రావడమే దీనికి నిదర్శనం. గతేడాది చివరి త్రైమాసికంలో అత్యధిక పెట్టుబడులను ఆకర్షించిన రాష్ట్రంగా ఏపీ మొదటి స్థానంలో ఉన్నట్లు ప్రాజెక్ట్స్ టుడే సర్వే వెల్లడించింది.

నగర వార్తలు

నిజాం కాలేజీ అధ్యాపకుడికి డాక్టరేట్


నలిగంటి శరత్

ఉస్మానియా యూనివర్సిటీ: నిజాం కాలేజీలో పార్ట్‌టైం అధ్యాపకుడిగా పని చేస్తున్న నలిగంటి శరత్ చమర్‌కు ఓయూ డాక్టరేట్ లభించింది. ఆర్ట్స్ కాలేజీ తెలుగు శాఖ అధ్యాపకురాలు ప్రొ.సూర్యధనుంజయ్ పర్యవేక్షణలో తెలంగాణ గాయక కవులు సాహిత్య పరిశీలన 1970–2003 అనే అంశంపై పరిశోధనకు డాక్టరేట్‌ను అందుకున్నారు. ఖిలా వరంగల్‌కు చెందిన శరత్ తెలంగాణ విద్యార్థి ఉద్యమంతో పాటు దళిత బహుజన రాజ్యాధికారం కోసం పోరాడుతున్నారు. రాష్ట్రం ఏర్పాటు అనంతరం 2014లో అంబర్‌పేట నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీచేసి రెండో స్థానంలో నిలిచాడు. పీహెచ్‌డీకి సహకరించిన అధ్యాపకులకు, మిత్రులకు కృతజ్ఞతలు తెలిపారు.

బీఆర్ఎస్ పార్టీకి అండగా ఉంటాం

బాలానగర్: ప్రజల తరఫున పోరాటం చేసే వ్యక్తులకు సమాజంలో ఎప్పుడూ ఆదరణ ఉంటుందని ఐడీపీఎల్ రిటైర్డ్ ఉద్యోగులు అన్నారు. ఐడీపీఎల్ రిటైర్డ్ ఉద్యోగుల శాశ్వత నివాసంపై సానుకూల స్పందన వచ్చింది. 20 ఏళ్ల నిరీక్షణకు రాని ఫలితం, కేసీఆర్ పోరాట స్ఫూర్తితో ఐడీపీఎల్ మాజీ ఉద్యోగులు గత పది రోజులుగా సంఘటిత పోరాటంతో కేంద్ర ప్రభుత్వం కదలిక వచ్చింది. ఐడీపీఎల్‌లో జరిగిన స్క్రాప్ అవకతవకలపై ఉద్యోగుల శాశ్వత నివాసంపై టీఎస్‌టీఎస్ చైర్మన్ పాటిమీది జగన్‌మోహన్‌రావు అండగా నిలిచారు. దీంతో ఆదివారం ఐడీపీఎల్ రిటైర్డ్ ఉద్యోగులు ఆయన కార్యాలయంలో కలిసి ధన్యవాదాలు తెలియజేశారు. వృద్ధాప్యంలో ఉన్న మాకు అండగా నిలిచారని అన్నారు. బీఆర్ఎస్ వెంటే ఉంటామని వారు అన్నారు. ఈ సందర్భంగా పాటిమీది జగన్‌మోహన్‌రావు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఐడీపీఎల్ రిటైర్డ్ ఉద్యోగులు పలువురు పాల్గొన్నారు.


జగన్మోహన్‌రావును కలిసిన ఐడీపీఎల్ రిటైర్డ్ ఉద్యోగులు

సర్కారు స్కూళ్లల్లో టీచర్ల కొరత..!



సాక్షి సిటీబ్యూరో: మహానగరంలో సర్కారు బడులకు సబ్జెక్టు టీచర్ల కొరత వెంటాడుతోంది. పదవీ విరమణ చేసిన వారి స్థానంలో కొత్తవారి భర్తీ లేక ఖాళీలు వెక్కిరిస్తున్నాయి. సబ్జెక్టు టీచర్లతో పాటు భాష పండితుల పోస్టులు కూడా ఖాళీగా ఉండటం విస్మయానికి గురిచేస్తోంది. కరోనా నేపథ్యంలో వరసగా రెండేళ్ల పాటు ఆన్‌లైన్ చదువులు మొక్కుబడిగా సాగడంతో ప్రభుత్వ నిర్ణయంతో పరీక్షలు లేకుండా విద్యార్థులందరూ ఉత్తీర్ణత సాధించగా.. ఇటీవల సబ్జెక్టు టీచర్లు లేకుండానే 2022–23 విద్యా సంవత్సరం గడిచిపోయింది. ఫలితంగా పది విద్యార్థులు పలు సబ్జెక్టుల్లో తప్పారు. నూతన విద్యా సంవత్సరం గడువు సమీపిస్తున్నా టీచర్ల భర్తీ ఊసే లేకుండా పోయింది.

పడిపోయిన 'పది' ఫలితాలు

హైదరాబాద్ జిల్లా పరిధిలోని సర్కారు బడుల్లో పది ఫలితాలు మరింత అధ్వానంగా ఉన్నాయి. జిల్లా మొత్తం మీద 72 శాతం నమోదయ్యింది. 7244 మంది పరీక్షలకు హాజరు కాగా, 2009 మంది ఉత్తీర్ణత సాధించలేకపోయారు. నాంపల్లి, బహదూర్‌పురా, చార్మినార్, బండ్లగూడ, సికింద్రాబాద్ మండలాల్లోని బడుల్లో 63 శాతం మించి ఉత్తీర్ణత లేకపోగా, మారేడుపల్లి, హిమాయత్‌నగర్, గోల్కొండ, ముషీరాబాద్ మండలాల్లో 75 శాతం మించలేదు. కేవలం తొమ్మిది బడుల్లోనే వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. సబ్జెక్టు వారీగా ఫలితాలను పరిశీలిస్తే గణితం 9425, సైన్స్ 6321, ఇంగ్లిష్‌లో 1129, సాంఘికశాస్త్రంలో 1021 మంది ఉత్తీర్ణత సాధించలేకపోయారు. ఇక ప్రథమ, ద్వితీయ భాషల్లోనూ కొందరు తప్పారు. ప్రథమ భాష తెలుగులో 1331, హిందీలో 845, ఉర్దూలో 685, ద్వితీయ భాష తెలుగులో 1390, హిందీలో 117, మంది ఉత్తీర్ణత సాధించలేకపోయినట్లు అధికార గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

సర్కారు బడుల్లో పదో తరగతి ఫలితాలు ఇలా..

మండలం	మొత్తం విద్యార్థులు	పాస్	ఫెయిల్
అంబర్‌పేట	172	153	19
సైదాబాద్	331	265	65
ఖైరతాబాద్	1200	964	236
ముషీరాబాద్	302	238	64
గోల్కొండ	1236	935	301
మారేడుపల్లి	755	564	191
హిమయత్‌నగర్	566	418	148
నాంపల్లి	379	243	136
బహదూర్‌పురా	798	451	257
చార్మినార్	520	330	190
బండ్లగూడ	531	335	196
సికింద్రాబాద్	544	338	206

ఒకే గ్రామంలో 15 మందికి హెడ్ కానిస్టేబుళ్లుగా పదోన్నతి


హెడ్ కానిస్టేబుళ్లను అభినందిస్తున్న ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి తదితరులు

ఘట్‌కేసర్: ఒకే గ్రామంలో 15 మంది ఒకేసారి హెడ్ కానిస్టేబుళ్లుగా పదోన్నతి అందుకోవడం అభినందనీయమని ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి అన్నారు. చౌదరిగూడకు చెందిన వారు ఒకేసారి హెడ్ కానిస్టేబుళ్లుగా ప్రమోషన్ పొందడంతో ఆదివారం ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమానికి సర్పంచ్ రమాదేవి, ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డితో కలిసి ముఖ్యఅతిథిగా ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టుదలతో సమయం వృథా చేయకుండా నిరంతర కృషితో ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని నిరూపించారన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు స్వామిదాస్, భోజిరెడ్డి, సుధాకర్, మాజీ సర్పంచ్ రాములుగౌడ్, పదోన్నతి పొందిన హెడ్ కానిస్టేబుళ్లు రాము, మహేందర్‌రెడ్డి, లక్ష్మణ్, చంద్రసేనారెడ్డి, ఇంద్రసేనారెడ్డి, సత్తిరెడ్డి, రామ్, అశోక్‌గౌడ్, సురేందర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: ప్రముఖ రచయిత డాక్టర్ జిలుకర శ్రీనివాస్ రచించిన 'విరుద్ధ'సామిత్య ప్రమేయాలు పుస్తకాన్ని హర్యాలీ ముస్లీ రచయితల వేదిక ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రముఖ రచయిత సుంకిరెడ్డి నారాయణరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుంకిరెడ్డి నారాయణ రెడ్డి మాట్లాడుతూ.. సమాజాన్ని కదిలించే ఇలాంటి పుస్తకాలు మరిన్ని రావాలని అన్నారు. సభకు అధ్యక్షతన వహించిన టీఎస్‌పీఎస్సీ మాజీ చైర్మన్ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి మాట్లాడుతూ.. సమాజాన్ని లోతుగా అధ్యయనం చేసే విధంగా పుస్తకం ఉందన్నారు. పాఠకులను చదివించగల్గే విధంగా జిలుకర ఈ పుస్తకాన్ని రాశారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ విమర్శకులు జి.లక్ష్మీనర్సయ్య, రచయితలు జూపాక సుభద్ర, సామిడి జగన్‌రెడ్డి, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బాలబోయిన సుదర్శన్, డాక్టర్ చెరుకుసుధాకర్, డాక్టర్ పసునూరి రవీందర్ పాల్గొన్నారు.

కుల మతాలకు అతీతంగా విద్యాబోధన జరగాలి

లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపకుడు జయప్రకాశ్ నారాయణ్

బండ్లగూడ: కుల మతాలకు అతీతంగా విద్యాబోధన జరగాలని లోక్ సత్తా పార్టీ వ్యవస్థాపకుడు జయప్రకాశ్ నారాయణ్ అన్నారు. బండ్లగూడలోని శ్రీ సరస్వతి విద్యాపీఠంలో జరిగిన శిశుమందిరాల్లో పనిచేస్తున్న ఆచార్యుల ప్రశిక్షణ వర్గ ముగింపు కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. స్వాతంత్య్రం వచ్చి 75 ఏళ్లు దాటినా దేశంలో విద్య అందరికీ అందడం లేదన్నారు. ఇప్పటి విద్యావ్యవస్థను అందరూ అమలు పరిస్తే మంచి ఫలితాలు వస్తాయన్నారు. ఇంగ్లిష్‌పై మోజుతో తెలుగును బోధించడం మర్చిపోవద్దన్నారు. ఇప్పటి విద్యార్థులు గడియారం చూసి 80 శాతం మంది సమయం చెప్పలేకపోతున్నారన్నారు. విద్యతో పాటు శారీరక శ్రమ కూడా ఎంతో అవసరమన్నారు. సరస్వతి శిశుమందిరాల్లో విద్యాబోధన సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తుందని.. కుటుంబ వ్యవస్థ, మన సంస్కృతి, సాంప్రదాయాలను నేర్పిస్తుందన్నారు. దేశ నిర్మాణంలో విద్యార్థి దశ కీలకమని చెప్పారు. ఈ కార్యక్రమంలో విద్యావేత్త ధనుంజయ, విద్యా భారతి దక్షిణ మధ్య క్షేత్ర సంఘటనా కార్యదర్శి లింగం సుధాకర్‌రెడ్డి, మణిపూర్ సెంట్రల్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ తిరుపతిరావు, ప్రాంత కార్యదర్శి సీతారాములు, వాసిరెడ్డి, వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఆల్ ఇండియా 'స్విమ్మింగ్' అసోసియేషన్ అధ్యక్షుడిగా చంద్రశేఖర్‌రెడ్డి

మణికొండ: రాష్ట్ర స్విమ్మింగ్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఉన్న పి. చంద్రశేఖర్‌రెడ్డి ఆదివారం చెన్నైలో జరిగిన ఎన్నికల్లో ఆల్ ఇండియా మాస్టర్స్ స్విమ్మింగ్ ఫెడరేషన్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. హైదరాబాద్ నగర శివారు కోకాపేట గ్రామానికి చెందిన చంద్రశేఖర్‌రెడ్డి దేశ వ్యాప్తంగా, ప్రపంచ వ్యాప్తంగా జరిగిన అనేక స్విమ్మింగ్ పోటీల్లో పాల్గొని పథకాలను సాధించారు. నార్సింగి మార్కెట్ కమిటీ చైర్మన్‌గాను పనిచేశారు. ఈ మధ్య కాలంలో రాజకీయాలకు దూరంగా ఉంటూ తనకు నచ్చిన స్విమ్మింగ్ అసోసియేషన్‌కే ఎక్కువ సమయం ఇస్తున్నారు. గత సంవత్సరం జరిగిన ఎన్నికల్లో రాష్ట్ర స్విమ్మింగ్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికై కొనసాగుతున్నారు. ఆదివారం చెన్నైలో అన్ని రాష్ట్రాల స్విమ్మింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. గతంలో ఉన్న కమిటీ కాల పరిమితి ముగియటంతో కొత్త కమిటీని ఎన్నుకునే క్రమంలో నూతన ఆల్ ఇండియా అధ్యక్షుడిగా తనను ఎన్నుకున్నట్టు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు బంధు, మిత్రులు, స్నేహితులు శుభాకాంక్షలు తెలియజేశారు.


మాజీ జాతీయ అధ్యక్షుడు జయప్రకాశ్‌తో నూతన అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి

పద్మశాలీలు సంఘటితమై సత్తాచాటాలి


శ్రీనివాస్‌ను గజమాలతో సత్కరిస్తున్న దృశ్యం

ముషీరాబాద్: పద్మశాలీలు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా ముందుండాలని పద్మశాలి సేవా సమితి యువజన విభాగం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఆదివారం పద్మశాలి యువజన విభాగం నాయకులు దుర్గం బాలేష్‌కుమార్ ఆధ్వర్యంలో నూతనంగా రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన అంబటి శ్రీనివాస్ అభినందన సభ ఈస్ట్ మార్నిగుట్ట ఇండోర్ స్టేడియంలో జరిగింది. ముఖ్యఅతిథులుగా హాజరైన అంబటి శ్రీనివాస్ మాట్లాడుతూ.. పద్మశాలీలు సంఘటితమై సత్తాచాటాలని సమాజసేవలో యువకులు ముందుండాలని కోరారు. అంతకుముందు అంబటి శ్రీనివాస్‌ను గజమాలతో సత్కరించి ఛత్రపతి శివాజీ మహారాజు చిత్రపటాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో గౌరవ అతిథులుగా అఖిల భారత పద్మశాలి సేవా సమితి అధ్యక్షుడు కందగట్ల స్వామి, కోశాధికారి కొప్పుల దేవేందర్ ప్రసంగించి పద్మశాలీల ఐక్యత గురించి చాటిచెప్పారు. ఈ కార్యక్రమంలో యువజన విభాగం నాయకులు రాము, వెంకటేష్, ఉపేందర్, పరమేశ్, బాలరాజులతోపాటు రాంనగర్, ముషీరాబాద్, పార్శిగుట్ట తదితర ప్రాంతాల నుంచి పద్మశాలి సంఘం కార్యవర్గ సభ్యులు యువకులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఏసియా పసిఫిక్ మాస్టర్ గేమ్స్‌లో కూకట్‌పల్లి వాసుల సత్తా


స్వాగతం పలుకుతున్న రాంకీ పెరల్స్ నివాసితులు

కూకట్‌పల్లి: కొరియాలో జరిగిన ఏసియా పసిఫిక్ మాస్టర్ గేమ్స్‌లో కూకట్‌పల్లికి చెందిన సీనియర్ సిటిజన్ కపుల్స్ బంగారు పతకాలు సాధించటం విశేషం. షటిల్ బాడ్మింటన్ పోటీల్లో సుమారు 20 దేశాల క్రీడాకారులు పాల్గొనగా భారతదేశానికి చెందిన క్రీడాకారులు చురుకంటి పవన్‌రెడ్డి, ఆయన సతీమణి సుమతి సీనియర్ సిటిజన్స్ ఆటలో వేర్వేరుగా గోల్డ్ మెడల్, సిల్వర్ మెడల్, కంచు మెడల్‌లను సాధించారు. వారం రోజుల క్రితం కొరియా దేశంలో జరిగిన 60+ మహిళల సింగిల్స్‌లో చురుకంటి సుమతి పాల్గొని సుమారు 6 దేశాలతో పోటీపడ్డారు. కొరియా దేశంపై ఫైనల్‌లో గెలుపొంది గోల్డ్ మెడల్ సాధించింది. అదే విధంగా మరో ఆటలో సిల్వర్ మెడల్‌ను కూడా సాధించింది. ఇదిలా ఉండగా ఆమె భర్త చురుకంటి పవన్‌రెడ్డి షటిల్ బాడ్మింటన్ పోటీల్లో పాల్గొని రెండు కంచు పతకాలను సాధించారు. ఈ సందర్భంగా ఆమెకు కూకట్‌పల్లి రాంకీ పెరల్స్ పలువరు నివాసితులు శంషాబాద్ ఎయిర్‌పోర్టులో జాతీయ జెండాతో స్వాగతం పలికి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పోటీల్లో పాల్గొన్న తెలంగాణకు చెందిన ఆరుగురు పతకాలను సాధించటం విశేషం. ఇప్పటి వరకు చురుకంటి సుమతి 11 మెడల్స్ సాధించినట్లు వారి కుటుంబ సభ్యులు తెలిపారు.

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
సోమవారం ॥ 22-5-2023



సన్నిధి

మంచి మాట

నొప్పి.. బాధ.. దుఃఖం.. శోకం

మనకు నొప్పి తెలుస్తుంది ఆ నొప్పి మనతో ఉన్నప్పుడు. మనం బాధను అనుభవిస్తాం ఆ బాధ మనతో ఉన్నప్పుడు. మనం దుఃఖిస్తాం ఆ దుఃఖం మనతో ఉన్నప్పుడు. మనం ఉన్నందుకు లేదా మనం ఉన్నాం కాబట్టి మనకు నొప్పి, బాధ, దుఃఖం, ఉంటాయి. ఇంకా చెప్పాలంటే మనం ఉన్నాం కాబట్టే అవి ఉంటాయి. ఇవే కాదు శోకం కూడా ప్రతి మనిషికీ ఉంటుంది. ఏదో శోకమో, శోకం ఏదో రకంగానో మనకు ఉంటుంది. నొప్పి, బాధ, దుఃఖం, శోకం ఉన్నాయని, ఉంటాయని మనం ఉండకుండా పోలేం.

ప్రతిమనిషికీ కన్నీరు వస్తుంది. హృదయ వీణ తీగలు తెగిపోయేట్టుగా వ్యథల వేళ్లు మీటిన కారణంగా పలికే అపశ్రుతుల స్వరాలుగా జలజలా కన్నీరు ఒలుకుతుంది. ఆ కన్నీరు మనలో కదలాడుతూ ఉన్న నొప్పి, బాధ, దుఃఖం, శోకం వీటిని మౌనంగా పలికిస్తుంది. నొప్పి, బాధ, దుఃఖం, శోకం తమను తాము తీర్చుకోవడమే లేదా కరిగించుకోవడమే కన్నీరు రావడమేమో?

నొప్పికి కూడా నొప్పి ఉంటుందేమో? బాధ కూడా బాధ పడుతుందేమో? దుఃఖం కూడా దుఃఖిస్తుందేమో? శోకం కూడా శోకిస్తుందేమో? అందుకే అవి కన్నీరుగా బయటకొచ్చేస్తాయేమో? తాము లేకపోతేనే మంచిదని తమంత తాముగా అవి కన్నీరుగా వెళ్లిపోతాయేమో?

కన్నీరు వచ్చేశాక మనిషి మనసు కుదుట పడుతుంది లేదా మనసులోకి ఒక రకమైన ప్రశాంతత వస్తుంది. దానికి కారణం నొప్పి, బాధ, దుఃఖం, శోకం ఇవి పూర్తిగానో, పాక్షికంగానో కన్నీరుగా కరిగి బయటకు వెళ్లిపోవడమేనేమో? లోపల ఉష్ణాలుగా ఉండే నొప్పి, బాధ, దుఃఖం, శోకం కన్నీరుగా వస్తూ ఉండడం వల్లే కన్నీరు వేడిగా ఉంటుందేమో?

నొప్పి, బాధ, దుఃఖం, శోకం కన్నీరుగా బయటకు వచ్చి మన నుంచి తొలగిపోతూ అవి మనకు పాఠం చెప్పి పోతాయి. ఈ పరిణామాన్ని మనం సరిగ్గా గమనించాలి. ఆ పాఠాన్ని అర్థం లేదా అవగతం చేసుకుంటే మనకు ప్రయోజనం కలుగుతుంది, పరిణతి వస్తుంది అటుపైన పరితోషం కూడా ప్రాప్తిస్తుంది.

మనుగడ పదునెక్కాలన్నా, ఫలించాలన్నా మన నొప్పి, బాధ, దుఃఖం, శోకం తెలియజెప్పిన లేదా తెలియజెబుతున్న పాఠాన్ని మనం హృదయస్థం చేసుకోవాలి; బుద్ధికి అద్దుకోవాలి; మనకు మనం ప్రయోజనాన్ని చేకూర్చుకోవాలి.

మనిషికి నొప్పి, బాధ, దుఃఖం, శోకం లేకుండా ఉండవు అని అనడం ఎంత సత్యమో అవి లేకుండా ఉంటే మనిషికి పరిణామం, పరిణతి ఉండవు అని అనడం కూడా అంతే సత్యమే. నిజమే నొప్పి, బాధ, దుఃఖం, శోకం వీటిని ఎవరూ కోరుకోరు. కానీ అవి ఏ మనిషిని వదలవు. అవి మనిషిని గట్టిగా పట్టుకుని మరీ పాఠం చెబుతాయి. మనిషికి మరో రకంగా తెలియరాని పాఠం చెబుతాయి. ఆ పాఠం మనిషికి ఎంతో అవసరం. మనిషి ఆ పాఠాన్ని సరిగ్గా చదువుకోవాలి.

> నొప్పి, బాధ, దుఃఖం, శోకం కన్నీరుగా బయటకు వచ్చి మన నుంచి తొలగిపోతూ అవి మనకు పాఠం చెప్పి పోతాయి. ఈ పరిణామాన్ని మనం సరిగ్గా గమనించాలి. ఆ పాఠాన్ని అర్థం లేదా అవగతం చేసుకుంటే మనకు ప్రయోజనం కలుగుతుంది. పరిణతి వస్తుంది అటు పైన పరితోషం కూడా ప్రాప్తిస్తుంది.

నొప్పి, బాధ, దుఃఖం, శోకం... వీటిని కన్నీరు కరిగిస్తుంది. అటు తరువాత మనసులో ఖాళీ ఏర్పడుతుంది. ఆ ఖాళీ సంతోషం కోసమే! మనంత మనం ఆ ఖాళీని సంతోషంతో నింపుకోవాలి.

మనం ప్రాణంతో ఉంటాం మనలో ప్రాణం ఉన్నప్పుడు. మనం సంతోషంగా ఉంటాం మనలో సంతోషం ఉన్నప్పుడు. మనం సంతోషంగా ఉందాం మనలో సంతోషాన్ని నింపుకుని. సంతోషాన్ని పొందడం, నిలుపుకోవడం మనం నేర్చుకోవాలి.

ఉనికి ఒక అనుభవం; అనుభవం ఒక ఉనికి. మన ఉనికి సంతోషంతో ఉండాలి; సంతోషాన్ని మనం అనుభవంగా సాధించుకుంటూ ఉండాలి.

– రోచిష్మాన్

గురువాణి

కంటికి కనబడని ఆభరణం

ఒకనాడు యవ్వనంలో ఎంతో మిసమిసలాడుతున్న వ్యక్తి... వృద్ధాప్యం వచ్చేసరికి ఒళ్ళంతా ముడతలు పడిపోయి, దవడలు జారిపోయి, జుట్టు తెల్లబడిపోయి ఉండవచ్చు. కానీ భౌతికంగా ఎంత అందంగా ఉన్నారన్నది కాదు, కాలక్రమంలో అది నిలబడదు. భగవంతుడిచ్చిన విభూతులను వయసులో ఉన్నప్పుడే సక్రమంగా వాడుకుని ఆ అందాన్ని పెంచుకోవాల్సి ఉంటుంది. అందువల్ల ఆ చివరి సమయంలో మనిషికి అందం – ఆయన అనుభవం, గతంలో ఆయన ప్రవర్తించిన తీరు, ఆయన నడవడిక మాత్రమే.

''హస్తస్య భూషణం దానం, సత్యం కంఠస్య భూషణం, కర్ణస్య భూషణం శాస్త్రం, భూషణైః కిం ప్రయోజనం'' చేతికి కంకణములు, కేయూరములు, అంగదములు, ఉంగరములు... ఇవన్నీ కూడా అలంకారాలే.. భగవంతుడిచ్చినప్పుడు వేసుకోవడంలో తప్పేమీ లేదు.



కానీ అన్ని ప్రాణులలో ఉన్న ఆత్మ ఒక్కటే...అని.. అవతలి ప్రాణి కష్టాన్ని తన కష్టంగా భావించి ఆదుకోవడం కోసం తన చేతితో తనదైన దానిని ఇవ్వగలిగిన వాడు ప్రాజ్ఞుడు. ఆ చేతికి దానమే అతి పెద్ద అలంకారం. మిగిలిన అలంకారాలు తొలగిపోయినా... పైకి కనబడకపోయినా అది శాశ్వతంగా నిలిచిపోయే, వెలిగిపోయే అలంకారం. దానం చేయడం అంటే ఏమీ మిగుల్చుకోకుండా అని కాదు. తనకున్న దానిలో తన శక్తికొద్దీ ప్రతిఫలాన్ని ఆశించకుండా చేయడం... అలా ఎందుకు? అంటే అలా చేయకుండా ఉండలేకపోవడమే మానవత్వం.

శరీరంలో ఎక్కువగా ఆభరణాలు అలంకరించుకునే అవయవం కంఠం.



బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

వాటిలో మంగళప్రదమైనవి, ఐశ్వర్య సంబంధమైనవి ఉంటాయి.. సత్యం జ్ఞానం అనంతం బ్రహ్మ... మనిషిని భగవంతుడికి దగ్గరగా తీసుకెళ్ళేది... సత్య భాషణం. నిజాన్ని నిర్భయంగా, ప్రియంగా మాట్లాడడం. సత్యాన్ని మించిన ఆభరణం మరేదీ కంఠానికి అంత శోభనివ్వదు. ఇతర ఆభరణాలను తీసినట్లుగా ఈ ఆభరణాన్ని తీయడం అసాధ్యం. భగవంతుడు మనకు రెండు చెవులిచ్చాడు. మన అందాన్ని పెంచడానికి వీటిని కూడా అలంకరించుకుంటూ ఉంటాం. కానీ వాటికి నిజమైన ఆభరణం.. శాస్త్రాన్ని ఎప్పుడూ వింటూ ఉండడం, అంటే మన అభ్యున్నతికి దోహదపడే మంచి విషయాలను వినడం, అలా విన్న వాటితో సంస్కరింపబడి ఉన్నతిని పొందడం. నోటితో తిన్నది శరీర పుష్టికి కారణమవుతున్నది. చెవులద్వారా విన్నది... మనిషి సౌశీల్యానికి కారణం కావాలి.

ఆయన ఊపిరి వదలడు, ఊపిరి తియ్యడు..అని నిర్ధారించుకున్న తరువాత చిట్టచివరన శరీరాన్ని పంచభూతాల్లో కలిపివేసేటప్పుడు ఇక ఆ శరీరం మీద ఏ ఒక్క ఆభరణాన్ని కూడా ఉంచరు.. అన్నీ తీసేస్తారు... అప్పుడు తీయలేనివి, పైకి కనపడనివి కొన్ని ఉంటాయి... తన జీవిత కాలంలో దానగుణంచేత, సత్యభాషణం చేత, తన ఉన్నతికి పనికొచ్చే విషయాలను శాస్త్రాల ద్వారా వినడం చేత సమకూర్చుకున్న ఆభరణాలు మాత్రం ఉండిపోతాయి. ఇవి నీ పేరు శాశ్వతంగా ఉండిపోవడానికి, కాలంతో సంబంధం లేకుండా నిన్ను పదిమంది ఎప్పుడూ స్మరిస్తూ ఉండడానికి, నిన్ను చాలా మంది ఆదర్శంగా తీసుకోవడానికి, నిన్ను పరమాత్మకు చేరువ చేయడానికి ఎప్పుడూ నిన్ను అలంకరించి నీ అందాన్ని, వైభవాన్ని పెంచుతుంటాయి.

బౌద్ధవాణి

గద్దలు నేర్పిన పాఠం

పూర్వం జంబూ ద్వీపాన్ని ఏసుకారి అనే రాజు పాలిస్తూ ఉండేవాడు. అతను మంచివాడే కానీ, కొద్దిగా లోభి. ఆయనకు సంతానం లేదు. ఆ కొద్దిపాటి లోభితనాన్ని వదులుకోమని ఆయన పట్టపు రాణి పదే పదే చెప్పేది. అయినా ఏసుకారి తన పద్ధతి మార్చుకునేవాడు కాదు.

అయాచితంగా వచ్చిన సొమ్ముతో తన బొక్కసాన్ని నింపుకోవాలని చూసేవాడు. ఒకసారి రాజుకు మిత్రుడైన ఒక వ్యాపారి సంపదను కూడా ఏసుకారి రాబట్టి, ధనాగారాన్ని నింపాడు. ఈ చర్య రాణికి నచ్చలేదు. ఆమె వెంటనే ఒక ఉపాయం ఆలోచించింది. రాజు భవనం ప్రక్కనే ఉన్న ఖాళీ ప్రదేశంలో కొన్ని మాంసపు ముక్కలు చల్లించి వాటిపై వల పన్నించింది.

ఆమె అనుకున్నట్లే కొద్దిసేపటికి గద్దల గుంపు అటుకేసి వచ్చేసింది. ఇంక అప్పుడు రాజుగారిని తీసుకుని భవనం పై భాగానికి వచ్చింది.

''మహారాజా! అటు చూడండి'' అంటూ గ్రద్దల్ని చూపింది. కొన్ని గ్రద్దలు వలకు దూరంగా నిలబడి వెళ్ళి ముక్కల్ని తినాలా వద్దా' అని ఆలోచిస్తూ అటూ ఇటూ తిరుగుతున్నాయి. లేచి వలమీదకి వెళ్తున్నాయి గానీ, కిందకు దిగడం లేదు. మరలా వచ్చి వలకు బయట నేలమీద వాలుతున్నాయి.

''రాణీ! ఏమిటిది'' అని అడిగాడు ఏసుకారి.

''ప్రభూ! చూడండి!'' అంది చిరునవ్వుతో మహారాణి.

కొన్ని గ్రద్దలు అప్పటికీ ఆత్రంగా వల మీద వాలాయి. అందినంత మెక్కాయి. పొట్ట నిండింది. బరువెక్కాయి. ఎగరడానికి ప్రయత్నించాయి. రెక్కలు టపటప లాడాయి. కానీ, వాటి బరువుకి అవే లేవలేకపోయాయి. అటూ ఇటూ కదిలి తమ కాళ్ళకి వలను చుట్టుకున్నాయి.

''ప్రభూ! చూశారా! వాటి దురవస్థ. దురాశ ఫలితం ఇది. అజ్ఞానం, అనాలోచన, అతి దురాశ ఆ స్థితికి తెచ్చాయి'' అంది. వారు ఇంకా మాట్లాడుకుంటూనే ఉన్నారు. అంతలో కొన్ని గ్రద్దలు తిన్న ఆహారాన్ని వాంతి చేసుకుంటున్నాయి. దాని వల్ల అవి కాస్త తేలికపడి పైకి లేవడానికి ఇబ్బంది తగ్గింది. అవి మెల్లగా పైకి లేచి వలలో చిక్కుపడకుండా చివరకు బయటపడ్డాయి.



అంతలో కొందరు రాజభటులు వల దగ్గరకు పరుగులు తీస్తూ వెళ్లారు. వలలో చిక్కుబడని గ్రద్దలు ఎగిరి వెళ్ళిపోయాయి. ఎగరలేక, చిక్కుబడ్డవి దొరికిపోయాయి. వాటిలో కొన్నింటిని పట్టుకుని, కాళ్ళు కట్టి వాటిని కావడిలా కర్రకు దూర్చి తీసుకుపోయారు భటులు.

''మహారాజా! చూశారా! దురాశకు పోయేవారు ప్రమాదాన్ని గుర్తించలేరు. చివరికి ప్రాణాల మీదకి తెచ్చుకుంటారు. మనలో కూడా అయాచితంగా వచ్చే సంపదని పోగు చేసుకునే వారికి చివరికి ఇదే గతి. మరి కొందరు కొంత నష్టం జరిగాక అనుభవం ద్వారా తెలుసుకుంటారు. తప్పుని సరిదిద్దుకుంటారు. ఇంకొందరు రాబోయే ప్రమాదాన్ని గుర్తించి, దురాశలకు పోక తగినంతలోనే జీవనం సాగిస్తారు. వీరు వలలో చిక్కుకోనివారు. ప్రాజ్ఞులు'' అని చెప్పింది.

రాణి ఎందుకు అలా చెప్పిందో, ఎవరి కోసం చెప్పిందో, దేనిని ఉద్దేశించి చెప్పిందో రాజుకి అర్థమైంది. మరునాడు ఖజానా తెరిపించాడు. తాను అనాయాసంగా సంపాదించినదంతా రాజ్య సంక్షేమానికి వినియోగించాడు. ఇవ్వవలసిన వారికి తిరిగి ఇచ్చేశాడు.

తృష్ణారహితులకు ఎప్పుడూ ఆపదలు ఆమడ దూరంలో ఉంటాయి అని బుద్ధుడు చెప్పిన ఏసుకారి కథ ఇది.

– డా. బొర్రా గోవర్ధన్

సంగీత రాజ్ ఇక లేరు



● రాజ్

తెలుగు చలనచిత్ర పరిశ్రమలో విషాదం చోటు చేసుకంది.ప్రముఖ సంగీత దర్శకుడు రాజ్(68) ఆదివారం కన్నుమూశారు. హైదరాబాద్‌లోని స్వగృహంలో గుండెపోటుతో ఆయన తుదిశ్వాస విడిచినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

రాజ్ అసలు పేరు తోటకూర సోమరాజు. ప్రముఖ సంగీత దర్శకుడు టీవీ రాజు, సావిత్రి దంపతులకు ఇద్దరు కుమారులు. వారిలో వెంకట సూర్యనారాయణ రాజు పెద్దవాడు కాగా, తోటకూర సోమరాజు(రాజ్) చిన్నవాడు. 1954 జూలై 27న రాజ్ జన్మించారు. టీవీ రాజు స్వస్థలం రాజమండ్రి సమీపంలోని రఘుదేవపురం. అయితే ఆయన చెన్నైలో స్థిరపడటంతో రాజ్ అక్కడే పుట్టి, పెరిగారు. చిన్నప్పటి నుంచి సినిమా వాతావరణంలో, ముఖ్యంగా సంగీత నేపథ్యంలో పెరగటంతో రాజ్‌కి సంగీతంపై అవగాహన ఉండేది. చదువులో యావరేజ్ స్టూడెంట్ అయిన రాజ్‌కి చిన్నతనం నుంచే సంగీతం నేర్పించారు టీవీ రాజు. ఓ వైపు ఇంటర్ చదువుతూనే మరోవైపు ప్రముఖ సంగీత దర్శకుడు సాలూరి హనుమంతరావు వద్ద అసిస్టెంట్‌గా చేరారు రాజ్. ఆ సమయంలో తన తండ్రి టీవీ రాజు 1973 ఫిబ్రవరి 20న యాభైఏళ్ల వయసులో హఠాన్మరణం చెందారు. దీంతో కొద్ది రోజులు ఏం చేయకుండా అలాగే ఉండిపోయిన రాజ్ ఆ తర్వాత ప్రముఖ సంగీత దర్శకుడు ఎస్పీ కోదండపాణి వద్ద అసిస్టెంట్‌గా చేరారు. ఓ ఏడాది తర్వాత సాలూరి రాజేశ్వరరావు వద్ద అసిస్టెంట్‌గా చేరి, ఆరేళ్ల పనిచేశారు. సాలూరి రాజేశ్వరరావు కుమారుల్లో ఒకరైన కోటితో రాజ్‌కి మంచి స్నేహం ఏర్పడింది. ఆ తర్వాత 1980లో సంగీత దర్శకుడు చక్రవర్తి వద్ద అసిస్టెంట్‌గా చేరారాయన. అప్పుడు చేతినిండా పని ఉండేది.. జేబు నిండా డబ్బులు వచ్చేవి. ఆ సమయంలో 1982 మార్చి 11న రాజ్ వివాహం ఉషతో జరిగింది.

రాజ్–కోటి ద్వయం...

సంగీత దర్శకునిగా రాజ్ అందుకున్న తొలి అవకాశం 'ప్రళయగర్జన'(1983). మోహన్ బాబు హీరోగా పీసీ రెడ్డి దర్శకత్వం వహించిన ఆ చిత్రానికి రాజ్‌కి తొలి సోలో సంగీత దర్శకునిగా అవకాశం వచ్చింది. అయితే తన మిత్రుడు, కొలీగ్ అయిన కోటిని కలుపుకొని సంగీతం అందించాలని నిర్ణయించుకున్నారు రాజ్. ఆ విషయాన్ని కోటికి చెప్పడం.. ఆయన కూడా ఒప్పుకోవడంతో సంగీత ప్రపంచంలో రాజ్–కోటి ద్వయం ప్రారంభమైంది. 'సంసారం, యముడికి మొగుడు, ఖైదీనంబర్ 786, త్రినేత్రుడు, లంకేశ్వరుడు, ముఠామేస్త్రి, బాలగోపాలుడు, బంగారు బుల్లోడు, హలో బ్రదర్, అన్న–తమ్ముడు, శత్రువు' వంటి ఎన్నో సినిమాలకు వారిద్దరూ సంగీతం అందించారు.

సోలో మ్యూజిక్ డైరెక్టర్‌గా...

అనుకోని కారణాల వల్ల కోటి నుంచి విడిపోయిన రాజ్ సోలో మ్యూజిక్ డైరెక్టర్‌గానూ తనదైన శైలిలో సంగీతం అందించి శ్రోతలను మైమరపించారు. 'సిసింద్రీ, రాముడొచ్చాడు, ప్రేమంటే ఇదేరా(నేపథ్య సంగీతం)'.. ఇలా తెలుగు, తమిళ, కన్నడ భాషల్లో దాదాపు 70 సినిమాలకు పనిచేశారాయన. అలాగే పలు టీవీ సీరియల్స్‌కి కూడా సంగీతం అందించారు. అదేవిధంగా నటుడిగానూ పలు సినిమాల్లో మెరిశారు రాజ్. బెస్ట్ మ్యూజిక్ డైరెక్టర్‌గా 'హలో బ్రదర్' సినిమాకి 1994లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి రాజ్–కోటి ద్వయం నంది అవార్డు అందుకున్నారు.



● రాజ్ భౌతికకాయం

మ్యూజిక్ డైరెక్టర్, నేపథ్య సంగీత దర్శకుడు, నటుడు.. ఇలా తనదైన శైలిలో ప్రేక్షకులను అలరించిన రాజ్ మృతితో చిత్రపరిశ్రమలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఆయన మృతికి చిరంజీవితో పాటు పలువురు సినీ ప్రముఖులు సంతాపం ప్రకటించి, ఆయన కుటుంబానికి సానుభూతి తెలియజేశారు. రాజ్‌కి భార్య ఉష, కుమార్తెలు దివ్య, దీప్తి, శ్వేత ఉన్నారు. కాగా హైదరాబాద్‌లోని మహాప్రస్థానంలో నేడు (సోమవారం) రాజ్ అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

మాకూ షాకింగ్‌గానే ఉంది

– దివ్య, రాజ్ కుమార్తె

ఆదివారం మధ్యాహ్నం మూడు గంటల ప్రాంతంలో కార్డియాక్ అరెస్ట్‌తో నాన్న మృతిచెందారు. ఫ్యామిలీని, అభిమానులను ఎప్పుడూ సంతోషపరిచారాయన. నాన్నగారికి చిరంజీవిగారు ఎప్పుడూ ఓ బ్రదర్‌లా సపోర్ట్‌గా ఉన్నారు. నాన్న మరణంపై స్పందించినందుకు ఆయనకు థ్యాంక్స్. ఇటీవల ఓ సినిమా ఫంక్షన్‌లో కలిసిన నాన్న. కోటి అంకుల్ కబుర్లు చెప్పుకున్నారు. నాన్న మరణవార్త చెప్పగానే అంకుల్ షాక్ అయ్యారు.

మా పాటల రూపంలో బతికే ఉంటారు

– కోటి, సంగీత దర్శకుడు

నేను చెన్నైలో ఉండగా రాజ్ చనిపోయారనే చేదు వార్తను విన్నాను. ఇటీవలే ఓ సినిమా ఫంక్షన్‌లో కలుసుకున్నాం. తనకు ఆరోగ్య సమస్యలున్నట్టు నాకు అనిపించలేదు. రాజ్ కూడా నాతో చెప్పలేదు. చక్రవర్తి గారి వద్ద మేమిద్దరం అసిస్టెంట్లుగా పనిచేశాం. రాజ్–కోటిగా ఎన్నో బ్లాక్ బస్టర్ హిట్స్ ఇచ్చాం. మేం విడిపోయిన తర్వాత కూడా నేను ఎన్ని సినిమాలు చేసినా.. వాటిని కూడా రాజ్–కోటి పాటలు అనేవారు. అలాంటిది ఈ రోజు నా రాజ్ లేడంటే ఎంతో బాధగా ఉంది. మా పాటల రూపంలో నా రాజ్ ఎప్పటికీ బతికే ఉంటాడు.

సినిమా

క్రేజీ కాంబినేషన్



● విజయ్

తమిళ హీరో విజయ్, దర్శకుడు వెంకట్ ప్రభు కాంబినేషన్‌లో సినిమా ఖరారైంది. ఈ క్రేజీ కాంబినేషన్‌లో మూవీని ఆదివారం అధికారికంగా ప్రకటించారు. ఏజీఎస్ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై కల్పాతి యస్. అఘోరం, యస్. గణేష్, యస్. సురేష్ ఈ సినిమాను నిర్మించనున్నారు. 'బిగిల్' చిత్రం తర్వాత విజయ్‌తో ఏజీఎస్ ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మిస్తున్న రెండో చిత్రం ఇది. పైగా ఏజీఎస్ ఎంటర్‌టైన్‌మెంట్స్‌కు ఇది 25వ చిత్రం కావడం విశేషం. ఈ మూవీకి యువన్ శంకర్ రాజా సంగీతం అందించనున్నారు. వచ్చే ఏడాది విడుదల కానున్న ఈ సినిమా గురించి మరిన్ని వివరాలను త్వరలోనే వెల్లడించనున్నట్లు యూనిట్ పేర్కొంది. కాగా విజయ్ ప్రస్తుతం 'లియో' సినిమా చేస్తున్నారు. లోకేష్ కనగరాజ్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా అక్టోబరు 19న విడుదల కానుంది.

కొత్త కథ విన్నారా?



● రవితేజ

'డాన్ శీను(2010)', 'బలుపు (2013)', 'క్రాక్ (2021)' చిత్రాల తర్వాత హీరో రవితేజ, దర్శకుడు గోపీచంద్ మలినేని కాంబినేషన్‌లో మరో సినిమా సెట్స్‌పైకి వెళ్లేందుకు రంగం సిద్ధమవుతున్నట్లుగా తెలుస్తోంది. ఇటీవల గోపీచంద్ మలినేని చెప్పిన ఓ కథ రవితేజకు నచ్చిందట. దీంతో ఈ సినిమాను వీలైనంత త్వరగా సెట్స్‌పైకి తీసుకుని వెళ్లాలనుకుంటున్నారట రవితేజ. ఈ సినిమాను మైత్రీమూవీ మేకర్స్ నిర్మించనుందని భోగట్టా. ఇక ప్రస్తుతం ఫ్యామిలీతో కలిసి యూరప్ ట్రిప్‌లో ఉన్నారు రవితేజ. ఆయన నటించిన 'టైగర్ నాగేశ్వరరావు' చిత్రం అక్టోబరు 20న రిలీజ్‌కు రెడీ అవుతుండగా, మరో చిత్రం 'ఈగిల్' (వర్కింగ్ టైటిల్) సెట్స్‌పై ఉంది.

కొరియాలో దృశ్యం



● జే వోన్, మంగత్ పాఠక్

భారతీయ 'దృశ్యం' కొరియా తెరపైకి వెళ్లనుంది. మోహన్ లాల్ హీరోగా, మీనా, ఆశా శరత్, అన్సిబా హాసన్, సిద్దిఖ్ ప్రధాన పాత్రల్లో నటించిన మలయాళ చిత్రం 'దృశ్యం'. జీతూ జోసెఫ్ దర్శకత్వంలో ఆంటోనీ పెరుంబవూర్ నిర్మించిన ఈ చిత్రం 2013లో విడుదలై అద్భుత విజయం సాధించింది. ఈ సినిమా తెలుగు, తమిళ, హిందీ భాషల్లోనూ రీమేక్ అయి హిట్ అయింది. 'దృశ్యం' తర్వాత మోహన్‌లాల్–జీతూజోసెఫ్ కాంబోలో వచ్చిన 'దృశ్యం 2' కూడా వీక్షకుల నుంచి మంచి స్పందనను రాబట్టుకుంది. ఇక దృశ్యం సినిమా హిందీ రీమేక్‌లో అజయ్ దేవగన్ హీరోగా నటించిన విషయం తెలిసిందే. కాగా 'దృశ్యం' ఫ్రాంచైజీ కొరియాలో రీమేక్ కానుంది. సౌత్ కొరియా ఆంథాలజీ స్టూడియోస్, ఇండియన్ పనోరమ స్టూడియోస్ పతాకాలపై చోయ్ జే వోన్, కుమార్ మంగత్ పాఠక్ హిందీ 'దృశ్యం' ని కొరియాలో రీమేక్ చేయనున్నారు. ఫ్రాన్స్‌లో జరుగుతున్న 76వ కాన్స్ చలన చిత్రోత్సవాల్లో ఈ విషయాన్ని చోయ్ జే, మంగత్ పాఠక్ ప్రకటించారు. ఇండియన్, కొరియన్ ప్రొడక్షన్ హౌస్‌లు కలిసి ఓ సినిమాను నిర్మిస్తుండటం ఇదే తొలిసారి. ''సాధారణంగా కొరియన్ చిత్రాలు భారతీయ భాషల్లో రీమేక్ అవుతుంటాయి. కానీ, ఇప్పుడు ఓ ఇండియన్ సినిమా కొరియాలో రీమేక్ అవుతుంది'' అన్నారు పాఠక్.

పరేషాన్ హిట్ కావాలి

– రానా దగ్గుబాటి



● పావని, తిరువీర్, రానా

''యంగ్ టీమ్ అంతా ప్రేమించి ప్యూర్ ఎనర్జీతో 'పరేషాన్' సినిమా తీశారు. ఈ చిత్రంలో నేనూ భాగమైనందుకు గౌరవంగా భావిస్తున్నాను. ఈ చిత్రం మంచి హిట్ కావాలి. అలాగే నా తమ్ముడు అభిరామ్ నటించిన 'అహింస' కూడా జూన్ 2న రిలీజ్ అవుతోంది. అన్ని సినిమాలు బాగా ఆడాలి'' అని హీరో రానా దగ్గుబాటి అన్నారు. 'మసూద' ఫేమ్ తిరువీర్ హీరోగా, పావని కరణం హీరోయిన్‌గా రూపక్ రోనాల్డ్‌సన్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'పరేషాన్'. రానా దగ్గుబాటి సమర్పణలో వాల్తేర్ ప్రొడక్షన్స్‌పై విశ్వతేజ్ రాచకొండ, సిద్ధార్థ్ రాళ్లపల్లి నిర్మించారు. ఈ చిత్రం సురేష్ ప్రొడక్షన్స్ ద్వారా జూన్ 2న విడుదలవుతోంది. ఈ సందర్భంగా ఈ మూవీ ట్రైలర్‌ను రానా దగ్గుబాటి విడుదల చేశారు. ''వినోదాత్మకంగా రూపొందిన చిత్రమిది'' అన్నారు తిరువీర్. ''పరేషాన్' అందర్నీ నవ్విస్తుంది'' అన్నారు విశ్వతేజ్ రాచకొండ, సిద్ధార్థ్ రాళ్ళపల్లి. ''కుటుంబంతో కలిసి మా సినిమాకి రండి'' అన్నారు రూపక్ రోనాల్డ్‌సన్. ఈ కార్యక్రమంలో పావని కరణం, సంగీత దర్శకుడు యశ్వంత్ నాగ్, సినిమాటోగ్రాఫర్ వాసు, నటుడు మురళి, గీత రచయిత చంద్రమౌళి పాల్గొన్నారు.

ఓ రైతు కథ



● రోహిణీ, సన్నీ నవీన్

సన్నీ నవీన్, రోహిణీ రేచల్ జంటగా తోట మల్లికార్జున దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'జైత్ర'. అల్లం సుభాష్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 26న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేశారు చిత్రయూనిట్. అనంతరం తోట మల్లికార్జున మాట్లాడుతూ– ''మట్టితో చుట్టరికం చేసే ఓ రైతు కథే ఈ చిత్రం. రాయలసీమ యాస, నేపథ్యంతో తెరకెక్కించాం'' అన్నారు. ''సాధారణంగా రాయలసీమ నేపథ్యంలో సినిమా అంటే ఫ్యాక్షన్ అనుకుంటారు. కానీ, ఇందుకు విభిన్నంగా రాయలసీమలో నివసించే ఒక రైతు కుటుంబానికి చెందిన కథ, కథనాలతో 'జైత్ర' ప్రేక్షకుల ముందుకు వస్తోంది'' అన్నారు సన్నీ నవీన్. ''ఓ రైతు కథతో చాలా సహజంగా మంచి రాయలసీమ స్లాంగ్‌తో ఈ సినిమా రాబోతోంది'' అన్నారు అల్లం సుభాష్.

ప్రేమ.. సందేశం



● పృథ్వీ, సుమయ

పృథ్వీ అంబర్, సుమయా రెడ్డి జంటగా నటిస్తున్న ఫీల్ గుడ్ లవ్‌స్టోరీ ఫిల్మ్ 'డియర్ ఉమ'. సాయి రాజేష్ మహాదేవ్ దర్శకత్వంలో సుమయా రెడ్డి నిర్మిస్తున్న ఈ సినిమా ఆదివారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి ఏపీలోని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి కెమెరా స్విచ్చాన్ చేయగా, ఏపీ శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ్ రెడ్డి క్లాప్ ఇచ్చారు. తొలి సన్నివేశానికి విజయ్ కనకమేడల గౌరవ దర్శకత్వం వహించగా, రచయిత కోన వెంకట్ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సాయి రాజేష్ మహాదేవ్ మాట్లాడుతూ– ''ప్రతి వ్యక్తి జీవితంలో ఉండే ఓ అంశం మా చిత్ర కథలో ఉంటుంది. స్క్రిప్ట్‌పై నమ్మకంతోనే పాన్ ఇండియా మూవీగా తెరకెక్కిస్తున్నాం'' అన్నారు. ''ఈ కథపై నమ్మకంతో నేను సినిమా నిర్మించడంతో పాటు హీరోయిన్‌గా నటిస్తున్నాను'' అన్నారు సుమయా రెడ్డి. ''ఫీల్ గుడ్ లవ్‌స్టోరీతో పాటు మంచి సందేశం ఉంటుంది'' అన్నారు పృథ్వీ అంబర్.



శైలీ సింగ్‌కు కాంస్య పతకం

సేకో గోల్డెన్ గ్రాండ్‌ప్రి అంతర్జాతీయ అథ్లెటిక్స్ మీట్‌లో భారత యువ లాంగ్‌జంపర్ శైలీ సింగ్ కాంస్య పతకం సాధించింది. జపాన్‌లోని యోకోహామాలో ఆదివారం జరిగిన ఈ మీట్‌లో ఉత్తరప్రదేశ్‌కు చెందిన 19 ఏళ్ల శైలీ 6.65 మీటర్ల దూరం దూకి మూడో స్థానంలో నిలిచింది. అంతర్జాతీయ సీనియర్ స్థాయిలో శైలికిదే తొలి టోర్నీ. భారత స్పోర్ట్స్ అథారిటీ (సాయ్) హై పర్ఫార్మెన్స్ కోచ్ రాబర్ట్ బాబీ జార్జి వద్ద శిక్షణ తీసుకుంటున్న శైలీ 2021లో ప్రపంచ అండర్-20 అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో రజత పతకం దక్కించుకొని వెలుగులోకి వచ్చింది.



రన్నరప్ సిక్కి రెడ్డి జోడీ

స్లొవేనియా ఓపెన్ ఇంటర్నేషనల్ చాలెంజ్ బ్యాడ్మింటన్ టోర్నీ మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో తెలంగాణ అమ్మాయి సిక్కి రెడ్డి రన్నరప్‌గా నిలిచింది. ఆదివారం జరిగిన ఫైనల్లో టాప్ సీడ్ సిక్కి రెడ్డి-రోహన్ కపూర్ (భారత్) జోడీ 12-21, 13-21తో మూడో సీడ్ జెస్పర్ టాఫ్ట్-క్లారా గావర్సన్ (డెన్మార్క్) ద్వయం చేతిలో ఓడిపోయింది. సెమీఫైనల్లో సిక్కి-రోహన్ 21-15, 21-19తో మాడ్స్ వెస్టర్‌గార్డ్-క్రిస్టిన్ బుష్ (డెన్మార్క్)లపై గెలిచారు.

మనిక శుభారంభం



దర్బన్: ప్రపంచ టేబుల్ టెన్నిస్ (టీటీ) చాంపియన్‌షిప్ మహిళల సింగిల్స్ విభాగంలో భారత నంబర్‌వన్ మనిక బత్రా శుభారంభం చేసింది. ఆదివారం జరిగిన తొలి రౌండ్‌లో మనిక 11-1, 11-3, 11-2, 11-5తో లిండా లోగ్రైబి (అల్జీరియా)పై గెలిచి రెండో రౌండ్‌లోకి ప్రవేశించింది. పురుషుల సింగిల్స్‌లో ఆచంట శరత్ కమల్, సత్యన్ జ్ఞానశేఖరన్ కూడా రెండో రౌండ్‌లోకి అడుగు పెట్టారు. తొలి రౌండ్‌లో శరత్ కమల్ 11-8, 9-11, 11-9, 11-6, 11-6తో డేవిడ్ సెర్డారోగ్లు (ఆస్ట్రియా)పై నెగ్గగా... సత్యన్ 11-9, 11-8, 7-11, 11-2, 13-15, 11-13, 11-6తో టామ్ జార్విస్ (ఇంగ్లండ్)ను ఓడించాడు. పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో శరత్ కమల్-సత్యన్ ద్వయం 11-6, 11-9, 11-6తో ఎల్బెలీ-షామస్ (ఈజిప్ట్) జోడీపై విజయం సాధించింది.

‘డ్రా’తో గట్టెక్కిన భారత్



అడిలైడ్: ఆస్ట్రేలియా మహిళల జట్టుతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను భారత జట్టు ‘డ్రా’తో ముగించింది. తొలి రెండు మ్యాచ్‌ల్లో ఓడిపోయి సిరీస్‌ను కోల్పోయిన భారత్ ఆదివారం జరిగిన మూడో మ్యాచ్‌ను 1-1తో ‘డ్రా’ చేసుకుంది. మాడిసన్ బ్రూక్స్ (25వ ని.లో) చేసిన గోల్‌తో ఆస్ట్రేలియా 1-0తో ఆధిక్యంలోకి వెళ్లగా... దీప్ గ్రేస్ ఎక్కా (42వ ని.లో) గోల్‌తో భారత్ స్కోరును సమంచేసింది. ఈ మ్యాచ్‌తో భారత కెప్టెన్ సవితా పూనియా, డిఫెండర్ నిక్కీ ప్రధాన్ తమ కెరీర్‌లో 250 మ్యాచ్‌లు పూర్తి చేసుకున్నారు.

హారిక గేమ్ ‘డ్రా’



నికోసియా (సైప్రస్): మహిళల గ్రాండ్‌ప్రి సిరీస్ అంతర్జాతీయ చెస్ టోర్నీలో తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ద్రోణవల్లి హారిక నాలుగో ‘డ్రా’ నమోదు చేసింది. కాటరీనా లాగ్నో (రష్యా)తో ఆదివారం జరిగిన ఆరో రౌండ్ గేమ్‌ను హారిక 85 ఎత్తుల్లో ‘డ్రా’ చేసుకుంది. ప్రస్తుతం హారిక నాలుగు పాయింట్లతో మరో ఇద్దరితో కలిసి ఉమ్మడిగా అగ్రస్థానంలో ఉంది.

ముంబైకి ‘గ్రీన్’ కార్డ్

- రోహిత్ బృందానికి ప్లే ఆఫ్ బెర్త్
- గ్రీన్ అజేయ శతకం
- 8 వికెట్లతో ముంబై జయభేరి
- 200 చేసినా హైదరాబాద్‌కు నిరాశ



ముంబై: బెంగళూరులో వడగండ్ల వాన కురుస్తున్న సమయంలో... వాంఖెడే స్టేడియంలో ముంబై ఇండియన్స్ జట్టు పరుగుల తుఫాను సృష్టించింది. దీంతో కీలకమైన మ్యాచ్‌లో కఠినమైన లక్ష్యం ఎదురైనప్పటికీ ముంబై ఇండియన్స్ ఒత్తిడికి తావివ్వకుండా ఛేదించింది. హైదరాబాద్‌పై 8 వికెట్ల తేడాతో రోహిత్ శర్మ బృందం ఘనవిజయం సాధించింది. మరోవైపు బెంగళూరులో డిఫెండింగ్ చాంపియన్ గుజరాత్ టైటాన్స్ జట్టు చేతిలో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు ఓడిపోవడంతో ముంబై ఇండియన్స్ 16 పాయింట్లతో నాలుగో స్థానంలో నిలిచి ప్లే ఆఫ్ బెర్త్‌ను ఖరారు చేసుకుంది. మొదట సన్‌రైజర్స్ 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 200 పరుగుల భారీస్కోరు చేసింది. మయాంక్ అగర్వాల్ (46 బంతుల్లో 83; 8 ఫోర్లు, 4 సిక్సర్లు), వివ్రాంత్ శర్మ (47 బంతుల్లో 69; 9 ఫోర్లు, 2 సిక్స్‌లు) చెలరేగారు. తొలి వికెట్‌కు 13.5 ఓవర్లలో 140 పరుగుల భాగస్వామ్యం జోడించారు. ఆకాశ్ మధ్వాల్ (4/37) ఇంకా దంచేయకుండా కట్టడి చేశాడు. అనంతరం ముంబై 18 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 201 పరుగులు చేసి గెలిచింది. రోహిత్ శర్మ (37 బంతుల్లో 56; 8 ఫోర్లు, 1 సిక్స్) రాణించగా, ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’ కామెరాన్ గ్రీన్ (47 బంతుల్లో 100 నాటౌట్; 8 ఫోర్లు, 8 సిక్సర్లు) ‘శత’క్కొట్టి మ్యాచ్‌ను లాగేశాడు.

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ర	పా	నె.ర.
గుజరాత్	14	10	4	0	20	0.809
చెన్నై	14	8	5	1	17	0.652
లక్నో	14	8	5	1	17	0.284
ముంబై	14	8	6	0	16	-0.044
రాజస్తాన్	14	7	7	0	14	0.148
బెంగళూరు	14	7	7	0	14	0.135
కోల్‌కతా	14	6	8	0	12	-0.239
పంజాబ్	14	6	8	0	12	-0.304
ఢిల్లీ	14	5	9	0	10	-0.808
హైదరాబాద్	14	4	10	0	8	-0.590

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, ర-రద్దు పా-పాయింట్లు, నె.ర.-నెట్ రన్‌రేట్

201 ఉఫ్...

హైదరాబాద్‌కు భారీస్కోరు చేసిన ఆనందం తర్వాత బౌలింగ్‌లో ఇషాన్ కిషన్ (14)ను అవుట్ చేసిన సంబరమే ఆఖరు! తర్వాత ఎంత శ్రమించినా ఉరుకులు, పరుగులే తప్ప వికెట్లయితే రాలనే లేదు. ‘హిట్‌మ్యాన్’ రోహిత్, వన్‌డౌన్‌లో వచ్చిన గ్రీన్ పరుగుల తుఫాను సృష్టించారు. ముఖ్యంగా గ్రీన్ సుడిగాలి ఇన్నింగ్స్‌తో 20 బంతుల్లో ఫిఫ్టీ చేశాడు. దీంతో సగం (10) ఓవర్లు పూర్తవగానే ముంబై 114/1 స్కోరుతో గెలుపుట్రాక్‌లో పడింది. అప్పుడు 60 బంతుల్లో 87 పరుగుల సమీకరణం ముంబై బ్యాటర్లు ఇంకాస్త యథేచ్ఛగా ఆడేలా చేసింది. 31 బంతుల్లో రోహిత్ కూడా అర్ధసెంచరీ సాధించాడు. కాసేపటికి ముంబై కెప్టెన్ వికెట్ చిక్కినా... అప్పటికే హైదరాబాద్‌కు జరగాల్సిన నష్టం జరిగిపోయింది. మయాంక్ డాగర్... రోహిత్‌ను అవుట్ చేసి 128 పరుగుల రెండో వికెట్ భాగస్వామ్యాన్ని ముగిస్తే... 47 బంతుల్లో శతకం చేసిన గ్రీన్ రెండు ఓవర్లు మిగిలుండగానే మ్యాచ్‌ను ముగించాడు.

స్కోరు వివరాలు

సన్‌రైజర్స్ హైదరాబాద్ ఇన్నింగ్స్: వివ్రాంత్ శర్మ (సి) సబ్-రమణ్‌దీప్ (బి) ఆకాశ్ 69; మయాంక్ (సి) ఇషాన్ (బి) ఆకాశ్ 83; క్లాసెన్ (బి) ఆకాశ్ 18; ఫిలిప్స్ (సి) కార్తికేయ (బి) జోర్డాన్ 1; మార్క్‌రమ్ (నాటౌట్) 13; బ్రూక్ (బి) ఆకాశ్ 0; శాన్‌వీర్ (నాటౌట్) 4; ఎక్స్‌ట్రాలు 12; **మొత్తం (20 ఓవర్లలో 5 వికెట్లకు) 200. వికెట్ల పతనం:** 1-140, 2-174, 3-177, 4-186, 5-186. **బౌలింగ్:** బెహ్రెన్‌డార్ఫ్ 3-0-36-0, గ్రీన్ 1-0-2-0, జోర్డాన్ 4-0-42-1, ఆకాశ్ మధ్వాల్ 4-0-37-4, పీయూష్ చావ్లా 4-0-39-0, కార్తికేయ 4-0-39-0.

ముంబై ఇండియన్స్ ఇన్నింగ్స్: ఇషాన్ (సి) బ్రూక్ (బి) భువనేశ్వర్ 14; రోహిత్ శర్మ (సి) నితీశ్ కుమార్ రెడ్డి (బి) మయాంక్ డాగర్ 56; గ్రీన్ (నాటౌట్) 100; సూర్యకుమార్ (నాటౌట్) 25; ఎక్స్‌ట్రాలు 6; **మొత్తం (18 ఓవర్లలో 2 వికెట్లకు) 201. వికెట్ల పతనం:** 1-20, 2-148. **బౌలింగ్:** భువనేశ్వర్ 4-0-26-1, నితీశ్ కుమార్ రెడ్డి 3-0-35-0, మయాంక్ డాగర్ 4-0-37-1, కార్తీక్ త్యాగి 2.5-0-41-0, ఉమ్రాన్ 3-0-41-0, వివ్రాంత్ 1-0-19-0, మార్క్‌రమ్ 0.1-0-1-0.

బెంగళూరు ఖేల్‌ఖతం

గిల్ జిగేల్ సెంచరీతో గుజరాత్ గెలుపు • కోహ్లి ‘రికార్డు’ శతకం వృథా





బెంగళూరు: కోహ్లి తన జట్టు గెలిచేందుకు చేయాల్సిందంతా చేశాడు. కానీ బెంగళూరు చెత్త బౌలింగ్, అడ్డూఅదుపు లేని ఎక్స్‌ట్రాలు అతని శ్రమను నీరుగార్చింది. దీంతో గుజరాత్ 6 వికెట్ల తేడాతో రాయల్ చాలెంజర్స్ బెంగళూరుపై గెలిచింది. ఈ ఓటమితో బెంగళూరు ప్లే ఆఫ్ దశకు అర్హత పొందలేకపోయింది. ముందుగా బెంగళూరు 20 ఓవర్లలో 5 వికెట్లకు 197 పరుగులు చేసింది. కోహ్లి (61 బంతుల్లో 101 నాటౌట్; 13 ఫోర్లు, 1 సిక్స్) అజేయ సెంచరీ చేశాడు. ఈ సెంచరీతో ఐపీఎల్ టోర్నీ చరిత్రలో అత్యధికంగా ఏడు సెంచరీలు చేసిన ప్లేయర్‌గా కోహ్లి రికార్డు నెలకొల్పాడు. తర్వాత గుజరాత్ 19.1 ఓవర్లలో 4 వికెట్లకు 198 పరుగులు చేసింది. శుబ్‌మన్ గిల్ (52 బంతుల్లో 104 నాటౌట్; 5 ఫోర్లు, 8 సిక్సర్లు) అజేయ శతకంతో గుజరాత్‌ను గెలిపించాడు. విజయ్ శంకర్ (35 బంతుల్లో 53; 7 ఫోర్లు, 2 సిక్సర్లు) రాణించాడు. వీరిద్దరు రెండో వికెట్‌కు 123 పరుగులు జోడించారు.

ఆఖరి దాకా కోహ్లినే...

మొన్న హైదరాబాద్ ఆటనే కోహ్లి బెంగళూరులో రిపీట్ చేశాడు. ఓపెనింగ్‌లో డుప్లెసిస్ (19 బంతుల్లో 28; 5 ఫోర్లు)తో మంచి ఆరంభం ఇచ్చాడు. డుప్లెసిస్ అవుటయ్యాక మ్యాక్స్‌వెల్ (11), మహిపాల్ (1) వికెట్లను కోల్పోయిన ఆర్సీబీకి కోహ్లినే పెద్దదిక్కయి నడిపించాడు. బ్రేస్‌వెల్ (16బంతుల్లో 26; 5 ఫోర్లు) అండతో కోహ్లి మళ్లీ వేగంగా పరుగులు రాబట్టాడు. 35 బంతుల్లో ఫిఫ్టీ పూర్తిచేసుకున్నాడు. ధాటిగా ఆడుతున్న బ్రేస్‌వెల్‌ను షమీ రిటర్న్ క్యాచ్‌తో అవుట్ చేయగా, దినేశ్ కార్తీక్ (0) నిరుత్సాహపరిచాడు. అనూజ్ రావత్ (15 బంతుల్లో 23 నాటౌట్; 1 ఫోర్, 1 సిక్స్) అండతో కోహ్లి 60 బంతుల్లో సెంచరీ సాధించాడు.

ప్లే ఆఫ్స్ షెడ్యూల్

మే 23: క్వాలిఫయర్-1
గుజరాత్ టైటాన్స్ X చెన్నై సూపర్ కింగ్స్
వేదిక: చెన్నై: రాత్రి గం. 7:30 నుంచి

మే 24: ఎలిమినేటర్
లక్నో సూపర్ జెయింట్స్ X ముంబై ఇండియన్స్
వేదిక: చెన్నై: రాత్రి గం. 7:30 నుంచి

మే 26: క్వాలిఫయర్-2
క్వాలిఫయర్-1లో ఓడిన జట్టు X ఎలిమినేటర్ విజేత
వేదిక: అహ్మదాబాద్: రాత్రి గం. 7:30 నుంచి

మే 28: ఫైనల్
క్వాలిఫయర్-1 విజేత X క్వాలిఫయర్-2 విజేత
వేదిక: అహ్మదాబాద్: రాత్రి గం. 7:30 నుంచి

స్కోరు వివరాలు

రాయల్ చాలెంజర్స్ బెంగళూరు ఇన్నింగ్స్: కోహ్లి (నాటౌట్) 101; డుప్లెసిస్ (సి) తెవాటియా (బి) నూర్ అహ్మద్ 28; మ్యాక్స్‌వెల్ (బి) రషీద్ 11; మహిపాల్ (స్టంప్డ్) సాహా (బి) నూర్ అహ్మద్ 1; బ్రేస్‌వెల్ (సి అండ్ బి) షమీ 26; కార్తీక్ (సి) సాహా (బి) యశ్ 0; అనూజ్ (నాటౌట్) 23; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం (20 ఓవర్లలో 5 వికెట్లకు) 197. వికెట్ల పతనం:** 1-67, 2-80, 3-85, 4-132, 5-133. **బౌలింగ్:** షమీ 4-0-39-1, యశ్ 4-0-39-1, రషీద్ 4-0-24-1, నూర్ 4-0-39-2, మోహిత్ 4-0-54-0. **గుజరాత్ టైటాన్స్ ఇన్నింగ్స్:** సాహా (సి) పార్నెల్ (బి) సిరాజ్ 12; గిల్ (నాటౌట్) 104; విజయ్ (సి) కోహ్లి (బి) వైశాక్ 53; షనక (సి) సబ్-ప్రభుదేశాయ్ (బి) హర్షల్ 0; మిల్లర్ (సి) సబ్-ప్రభుదేశాయ్ (బి) సిరాజ్ 6; తెవాటియా (నాటౌట్) 4; ఎక్స్‌ట్రాలు 19; **మొత్తం (19.1 ఓవర్లలో 4 వికెట్లకు) 198. వికెట్ల పతనం:** 1-25, 2-148, 3-150, 4-171. **బౌలింగ్:** సిరాజ్ 4-0-32-2, పార్నెల్ 3.1-0-42-0, వైశాక్ 4-0-40-1, హిమాన్షు 3-0-28-0, హర్షల్ 4-0-29-1, బ్రేస్‌వెల్ 1-0-16-0.

భవిత

టీఎస్‌పీఎస్సీ గ్రూప్-1 స్టడీమెటీరియల్, సిలబస్, ప్రీవియస్ పేపర్స్, మోడల్ పేపర్స్, గైడెన్స్, బిట్‌బ్యాంక్, కరెంట్ అఫైర్స్, ఆన్‌లైన్ టెస్టులు మొదలైన వాటి కోసం www.sakshieducation.com చూడొచ్చు.

• గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం- కరెంట్ అఫైర్స్ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

యూపీఎస్సీ-కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్ ఎగ్జామినేషన్-2023

యూపీఎస్సీ.. ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్సుల్లో ఉద్యోగాలకు కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్ ఎగ్జామినేషన్(సీడీఎస్ఈ)ని నిర్వహిస్తోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 349
» **పోస్టుల వివరాలు:** ఇండియన్ మిలిటరీ అకాడమీ(ఐఎంఏ), డెహ్రాడూన్-100, ఇండియన్ నేవల్ అకాడమీ(ఐఎన్ఏ), ఎజిమల-32, ఎయిర్ ఫోర్స్ అకాడమీ (ఏఎఫ్ఏ), హైదరాబాద్-32, ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీ, చెన్నై(మద్రాస్), ఓటీఏ ఎస్ఎస్‌సీ మెన్ నాన్ టెక్నికల్-169, ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీ, చెన్నై(మద్రాస్), ఓటీఏ ఎస్ఎస్‌సీ ఉమెన్ నాన్ టెక్నికల్-16.
» **అర్హత:** మిలిటరీ అకాడమీ, ఆఫీసర్స్ ట్రైయినింగ్ అకాడమీ పోస్టులకు ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణుల వ్వాలి.నేవల్ అకాడమీ ఉద్యోగాలకు ఇంజనీరింగ్ ఉత్తీర్ణులు అర్హులు. ఎయిర్‌ఫోర్స్ ఉద్యోగాలకు ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణతతోపాటు ఇంటర్‌లో మ్యాథ్స్,ఫిజిక్స్ చదివి ఉండాలి.ఓటీఏ ఎస్ఎస్‌సీ నాన్ టెక్నికల్ పోస్టులకు మాత్రమే మహిళలు అర్హులు. అర్హత పరీక్ష చివరి సంవత్సరం పరీక్షలు రాసి, ఫలితాల కోసం ఎదురుచూస్తున్నవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

వయసు

» ఇండియన్ మిలిటరీ అకాడమీ, నేవల్ అకాడమీలకు 02.07.2000 కంటే ముందు, 01.07.2005 తర్వాత జన్మించినవారు అనర్హులు.
» ఎయిర్‌ఫోర్స్ అకాడమీ పోస్టులకు 2024 జూలై 1 నాటికి వయసు 20-24ఏళ్ల మధ్య ఉండాలి.
» ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీ పోస్టులకు 02.07.1999 కంటే ముందు, 01.07.2005 తర్వాత జన్మించినవారు అనర్హులు.
» **ఎంపిక విధానం:** రెండు దశల్లో ఉంటుంది. మొదటి దశలో రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఫర్ ఇంటెలిజెన్స్ అండ్ పర్సనాలిటీ టెస్ట్, ఇంటర్వ్యూ, వైద్య పరీక్షలు తదితరాల ఆధారంగా ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం

» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 06.06.2023
» దరఖాస్తు సవరణ తేదీలు: 07.06.2023 నుంచి 13.06.2023 వరకు. »పరీక్ష తేది: 03.09.2023.
» వెబ్‌సైట్: http://upsc.gov.in

యూపీఎస్సీ-ఎన్‌డీఏ అండ్ ఎన్ఏ పరీక్ష(2)-2023

యూపీఎస్సీ.. నేషనల్ డిఫెన్స్ అకాడమీ అండ్ నేవల్ అకాడమీ(ఎన్‌డీఏ అండ్ ఎన్ఏ) (2)- 2023 నోటిఫికేషన్ విడుదల చేసింది. దీని ద్వారా త్రివిధ దళాల్లో నియామకాలు చేపడతారు.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 395(నేషనల్ డిఫెన్స్ అకాడమీ పోస్టులు 370(ఆర్మీ-208, నేవీ-42, ఎయిర్ ఫోర్స్-120)ఉన్నాయి. వాటిలో 28 గ్రౌండ్ డ్యూటీకి సంబంధించిన ఖాళీలు, నేవల్ అకాడమీ(10+2 క్యాడెట్ ఎంట్రీ స్కీమ్) ఖాళీలు 25 ఉన్నాయి.
» **అర్హత:** ఆర్మీ వింగ్ పోస్టులకు దరఖాస్తు చేసుకునే వారు ఏదైనా గ్రూపులో ఇంటర్ ఉత్తీర్ణులై ఉండాలి. ఎయిర్‌ఫోర్స్, నేవీ పోస్టులకు 10+2 క్యాడెట్ ఎంట్రీ స్కీమ్(ఇండియన్ నేవల్ అకాడమీ)కు దరఖాస్తు చేయాలనుకుంటే.. ఫిజిక్స్, మ్యాథ్స్ సబ్జెక్టులతో ఇంటర్ లేదా తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. దీనితోపాటు నిర్దిష్ట శారీరక ప్రమాణాలు కలిగి ఉండాలి. ప్రస్తుతం ద్వితీయ సంవత్సరం చదువుతున్నవారు కూడా అర్హులే.
» **వయసు:** అవివాహిత పురుష, మహిళా అభ్యర్థులు 02.01.2005కి ముందు, 01.01.2008కి తర్వాత జన్మించి ఉండకూడదు.
» **ఎంపిక విధానం:** అభ్యర్థుల ఎంపిక రెండు దశల్లో ఉంటుంది. రాతపరీక్ష, ఇంటెలిజెన్స్-పర్సనాలిటీ టెస్ట్,ఎస్ఎస్‌బీ టెస్ట్/ఇంటర్వ్యూ,మెడికల్ టెస్ట్ తదితరాల ఆధారంగా ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం

» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 06.06.2023.
» దరఖాస్తు సవరణ తేదీలు: 07.06.2023 నుంచి 13.06.2023 వరకు .
» ఆన్‌లైన్ రాతపరీక్ష: 03.09.2023.
» తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు: అనంతపురం, హైదరాబాద్, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం, వరంగల్.
» వెబ్‌సైట్: www.upsconline.nic.in

ఏపీ ఆదర్శ పాఠశాలల్లో ఆరో తరగతి ప్రవేశాలు

ఏపీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్, ఏపీ మోడల్ స్కూల్ సొసైటీ.. 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రవేశ పరీక్ష ద్వారా ఆదర్శ పాఠశాలల్లో ఆరో తరగతి(ఆంగ్ల మాధ్యమం)లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

» **అర్హత:** సంబంధిత జిల్లాలో ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 2022-23 విద్యా సంవత్సరానికి సంబంధించి అయిదో తరగతి చదివి ఉండాలి.
» **వయసు:** ఓసీ, బీసీ విద్యార్థులు 01.09.2011 నుంచి 31.08.2013 మధ్య జన్మించి ఉండాలి. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 01.09.2009 నుంచి 31.08.2023 మధ్య జన్మించి ఉండాలి.
» **ఎంపిక విధానం:** ప్రవేశ పరీక్షలో ప్రతిభ, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**25.05.2023.
» **ప్రవేశ పరీక్షతేది:** 11.06.2023.
» **వెబ్‌సైట్:** www.apms.ap.gov.in

ఇంటర్‌తోనే కేంద్ర కొలువు

ఇంటర్మీడియెట్‌తోనే కేంద్ర ప్రభుత్వ శాఖల్లో కొలువుదీరే అవకాశం వచ్చింది. స్టాఫ్ సెలక్షన్ కమిషన్(ఎస్ఎస్‌సీ) 1600 పోస్టుల భర్తీకి కంబైన్డ్ హయ్యర్ సెకండరీ లెవల్ ఎగ్జామినేషన్ (సీహెచ్ఎస్ఎల్) నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ పరీక్షలో ఉత్తీర్ణత సాధించి.. ఆ తర్వాత నిర్వహించే స్కిల్ టెస్ట్‌లోనూ సత్తా చాటితే.. కేంద్ర ప్రభుత్వ శాఖల్లో కొలువు ఖాయం! తాజాగా ఎస్ఎస్‌సీ సీహెచ్ఎస్ఎల్-2023 దరఖాస్తు ప్రక్రియ మొదలైంది. ఈ నేపథ్యంలో.. సీహెచ్ఎస్ఎల్‌కు దరఖాస్తుకు అర్హతలు, ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానం, ప్రిపరేషన్ తదితర వివరాలు..

» 1600 పోస్టులతో ఎస్ఎస్‌సీ సీహెచ్ఎస్ఎల్ నోటిఫికేషన్
» ఇంటర్మీడియెట్ అర్హతతోనే పోటీ పడే అవకాశం
» విజయం సాధిస్తే.. గ్రూప్-సి హోదాలో కేంద్ర కొలువులు



ఎస్ఎస్‌సీ సీహెచ్ఎస్ఎల్-2023

పోస్టుల సంఖ్య 1600

స్టాఫ్ సెలక్షన్ కమిషన్ తాజాగా విడుదల చేసిన కంబైన్డ్ హయ్యర్ సెకండరీ లెవల్ ఎగ్జామినేసన్ నోటిఫికేషన్ ద్వారా మొత్తం 1600 పోస్టులను భర్తీ చేయనుంది. పలు కేంద్ర ప్రభుత్వ శాఖలు, విభాగాలు, రాజ్యాంగ సంస్థలు, ట్రిబ్యునల్స్ తదితరాల్లో లోయర్ డివిజన్ క్లర్క్/జూనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్, డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టులకు నియామకాలు చేపట్టనుంది.

అర్హతలు

- ఆగస్టు 1, 2023 నాటికి ఇంటర్మీడియెట్, తత్సమాన కోర్సు ఉత్తీర్ణత ఉండాలి.
- కాగ్, కన్సూమర్ అఫైర్స్ శాఖ, ఫుడ్ అండ్ పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్, మినిస్ట్రీ ఆఫ్ కల్చర్‌లలోని డేటా ఎంట్రీ ఆపరేటర్ గ్రేడ్-ఎ పోస్టులకు ఇంటర్మీడియెట్ ఎంపీసీ ఉత్తీర్ణులను అర్హులుగా పేర్కొన్నారు.

వయసు

ఆగస్టు 1, 2023 నాటికి 18-27 సంవత్సరాలు ఉండాలి. గరిష్ఠ వయో పరిమితిలో ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు అయిదేళ్లు, ఓబీసీ అభ్యర్థులకు మూడేళ్ల సడలింపు ఇస్తారు.

వేతనం

- **లోయర్ డివిజన్ క్లర్క్ (ఎల్‌డీసీ)/జూనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్(జేఎస్ఏ):** పే లెవల్-2; వేతన శ్రేణి రూ.19,900-రూ.63,200.
- **డేటాఎంట్రీ ఆపరేటర్:** పే లెవల్-4; వేతన శ్రేణి రూ.25,500-రూ.81,100.
- **డేటాఎంట్రీ ఆపరేటర్:** పే లెవల్-5; వేతన శ్రేణి రూ.29,200-రూ.92,300.
- **డేటా ఎంట్రీ ఆపరేటర్:** గ్రేడ్-ఎ; పే లెవల్-4; వేతన శ్రేణి రూ.25,500 - రూ.81,100.

ఎంపిక.. రెండు దశల్లో ఎంపిక

ఎస్ఎస్‌సీ సీహెచ్ఎస్ఎల్ ఎంపిక ప్రక్రియను రెండు దశల్లో నిర్వహిస్తారు. ఇందులో టైర్-1, టైర్-2 పేరుతో పరీక్షలు ఉంటాయి.

ప్రాంతీయ భాషల్లో పరీక్ష

ఎస్ఎస్‌సీ సీహెచ్ఎస్ఎల్ పరీక్షకు ప్రాంతీయ భాషల్లో హాజరుకావచ్చు. ఇంగ్లిష్, హిందీతోపాటు అస్సామీ, బెంగాలీ, గుజరాతీ, కన్నడ, కొంకణి, మళయాళం,మణిపురి, మరాఠి, ఒడియా, పంజాబీ, తెలుగు, ఉర్దూ మాధ్యమాల్లో పరీక్ష నిర్వహిస్తున్నారు. స్కిల్ టెస్ట్ మాత్రం ఇంగ్లిష్‌లోనే ఉంటుంది.

టైర్-1 ఇలా

ఎంపిక ప్రక్రియలో మొదటి దశ టైర్-1 పరీక్ష. దీన్ని పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో, కంప్యూటర్ బేస్డ్ టెస్ట్‌గా నిర్వహిస్తారు. ఇందులో నాలుగు విభాగాల నుంచి ఆబ్జెక్టివ్ తరహా ప్రశ్నలు ఉంటాయి. ఇంగ్లిష్ లాంగ్వేజ్, జనరల్ ఇంటెలిజెన్స్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్,జనరల్ అవేర్‌నెస్ విభాగాల నుంచి 25 ప్రశ్నలు చొప్పున వంద ప్రశ్నలు అడుగుతారు. ఒక్కో ప్రశ్నకు రెండు మార్కులు చొప్పున మొత్తం 200 మార్కులకు పరీక్ష జరుగుతుంది. నెగెటివ్ మార్కింగ్ నిబంధన ఉంది. ప్రతి తప్పు సమాధానానికి అర మార్కు కోత విధిస్తారు. పరీక్ష సమయం ఒక గంట.

మాడ్యూల్స్, సెక్షన్ల విధానంలో టైర్-2

- టైర్-1 పరీక్షలో చూపిన ప్రతిభ ఆధారంగా నిర్దిష్ట కటాఫ్ నిబంధనల మేరకు మెరిట్ జాబితా రూపొందిస్తారు. వీరికి రెండో దశ.. టైర్-2 పరీక్ష నిర్వహిస్తారు. ఈ పరీక్షలో రెండు సెషన్‌లు, మూడు సెక్షన్లు, ప్రతి సెక్షన్‌లో రెండు మాడ్యూల్స్ ఉంటాయి. టైర్ -2 పరీక్ష వివరాలు...
- సెషన్-1లో సెక్షన్-1: మాడ్యూల్-1లో..మ్యాథమెటికల్ ఎబిలిటీస్ 30 ప్రశ్నలు- 90 మార్కులు, మాడ్యూల్-2లో..రీజనింగ్ అండ్ జనరల్ ఇంటెలిజెన్స్ 30 ప్రశ్నలు-90 మార్కులకు పరీక్ష జరుగుతుంది. పరీక్ష సమయం ఒక గంట.
- సెషన్ 1లో సెక్షన్-2: మాడ్యూల్-1లో..ఇంగ్లిష్ లాంగ్వేజ్ అండ్ కాంప్రహెన్షన్ 40 ప్రశ్నలు-120 మార్కులు, మాడ్యూల్-2లో..జనరల్ అవేర్‌నెస్ 20 ప్రశ్నలు- 60 మార్కులకు పరీక్ష ఉంటుంది. పరీక్ష సమయం ఒక గంట.
- సెషన్ 1లో సెక్షన్-3: మాడ్యూల్-1లో.. కంప్యూటర్ నాలెడ్జ్ 15 ప్రశ్నలు-45 మార్కులకు పరీక్ష జరుగుతుంది. పరీక్ష సమయం 15 నిమిషాలు.
- సెషన్2 సెక్షన్-3:మాడ్యూల్-2లో.. స్కిల్ టెస్ట్/టైపింగ్ టెస్ట్‌ను పార్ట్-ఎ, పార్ట్-బిలుగా నిర్వహిస్తారు.
- పార్ట్-ఎ ప్రకారం- డేటా ఎంట్రీ ఆపరేట్ పోస్టుల అభ్యర్థులకు 15 నిమిషాల వ్యవధిలో స్కిల్ టెస్ట్ ఉంటుంది.
- పార్ట్-బి ప్రకారం-ఎల్‌డీసీ, జేఎస్ఏ పోస్టుల అభ్యర్థులకు పది నిమిషాల వ్యవధిలో టైపింగ్ టెస్ట్ నిర్వహిస్తారు.
- స్కిల్ టెస్ట్, టైపింగ్ టెస్ట్ మాడ్యూల్ మినహా మిగతా విభాగాల్లోని ప్రశ్నలన్నీ ఆబ్జెక్టివ్ విధానంలోనే ఉంటాయి.
- డేటాఎంట్రీ ఆపరేట్ పోస్టులకు నిర్వహించే స్కిల్ టెస్ట్‌లో గంటకు 8000 క్యారెక్టర్స్‌ను కంప్యూటర్‌పై టైప్ చేయాల్సి ఉంటుంది.
- ఎల్‌డీసీ, జేఎస్ఏ పోస్టులకు నిర్వహించే టైపింగ్ టెస్ట్‌లో అభ్యర్థులు ఇంగ్లిష్ టైపింగ్‌లో నిమిషానికి 35 పదాలు, హిందీ టైపింగ్‌లో నిమిషానికి 30 పదాలు టైప్ చేయాల్సి ఉంటుంది.
- డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టుల అభ్యర్థులకు ఏదైనా ఒక ఇంగ్లిష్ ప్యాజేస్‌ను ఇచ్చి కంప్యూటర్‌పై టైప్ చేయమని అడుగుతారు.

పటిష్ట ప్రణాళికతోనే సక్సెస్

ఇంగ్లిష్ లాంగ్వేజ్

ఈ విభాగంలో రాణించాలంటే.. బేసిక్ గ్రామర్‌పై పట్టు సాధించాలి. అదే విధంగా యాంటానిమ్స్, సినానిమ్స్, ఇడియమ్స్ అండ్ ఫ్రేజెస్, సెంటెన్స్ ఇంప్రూవ్‌మెంట్, యాక్టివ్/ప్యాసివ్ వాయిస్, డైరెక్ట్-ఇన్‌డైరెక్ట్ స్పీచ్, స్పెల్లింగ్స్, స్పాటింగ్ ద ఎర్రర్స్ వంటి అంశాలపై అవగాహన పెంచుకోవాలి.

జనరల్ ఇంటెలిజెన్స్

ఇందులో సిరీస్(నంబర్/ఆల్ఫా న్యూమరిక్) విభాగం, అనాలజీస్, ఆడ్ మెన్ ఔట్, సిలాజిజమ్, మ్యాట్రిక్స్, డైరెక్షన్, వర్డ్ ఫార్మేషన్, బ్లడ్ రిలేషన్స్, నాన్ వెర్బల్(వాటర్ ఇమేజ్, మిర్రర్ ఇమేజ్), కోడింగ్ డీకోడింగ్ అంశాలపై పట్టు సాధిస్తే మంచి మార్కులు స్కోర్ చేసే అవకాశముంది.

క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్

అభ్యర్థుల్లోని గణిత నైపుణ్యాలను పరీక్షించే ఈ విభాగంలో రాణించాలంటే.. సింపుల్ ఇంట్రెస్ట్, కంపౌండ్ ఇంట్రెస్ట్, లాభ నష్టాలు, ప్రాఫిట్ అండ్ లాస్, శాతాలపై ఎక్కువ సంఖ్యలో ప్రశ్నలు ప్రాక్టీస్ చేయాలి. అదే విధంగా, త్రికోణమితి, ఆల్జీబ్రా, జామెట్రీ, డేటా ఇంటర్‌ప్రిటేషన్, టైం అండ్ వర్క్, టైం అండ్ డిస్టెన్స్‌లకు సంబంధించిన ప్రశ్నలపై పట్టు సాధించాలి.

జనరల్ అవేర్‌నెస్

జనరల్ అవేర్‌నెస్‌లో జాతీయ, అంతర్జాతీయ సమకాలీన అంశాలు మొదలు జనరల్ సైన్స్, ఎకానమిక్స్, హిస్టరీ, జాగ్రఫీ, పాలిటీ విభాగాలపై దృష్టి పెట్టాలి. హిస్టరీకి సంబంధించి ఆధునిక భారత దేశ చరిత్ర, స్వాతంత్ర్యోద్యమ ఘట్టాలపై ప్రత్యేక దృష్టితో చదవాలి. జాగ్రఫీ విషయంలో సహజ వనరులు, నదులు, పర్వతాలు వంటి వాటి గురించి తెలుసుకోవాలి. ఎకనామిక్స్‌లో ఇటీవల కాలంలో ఆర్థిక వాణిజ్య రంగాల్లో కీలక పరిణామాలపై దృష్టి పెట్టాలి. ఆయా విభాగాలకు సంబంధించి ముఖ్యమైన పదజాలంపై పట్టు సాధించాలి. సీహెచ్ఎస్ఎల్ అభ్యర్థులు కరెంట్ అఫైర్స్‌ను ఎంతో కీలకమని గుర్తించాలి. దీంతోపాటు స్టాక్ జీకేలో ముఖ్యమైన వ్యక్తులు, తేదీలు, సదస్సులు, సమావేశాలు వాటి తీర్మానాలు, అవార్డులు-విజేతలు వంటి సమాచారాన్ని ఔపోసన పట్టాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** జూన్ 8, 2023
- **ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లింపు చివరి తేదీ:** జూన్ 10, 2023
- **ఆన్‌లైన్ దరఖాస్తుల్లో సవరణ అవకాశం:** జూన్ 14, 15 తేదీలు
- **టైర్-1 పరీక్ష తేదీ:** 2023 ఆగస్ట్‌లో నిర్వహించే అవకాశం
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** చీరాల, గుంటూరు, కాకినాడ, కర్నూలు, నెల్లూరు, తిరుపతి, రాజమండ్రి, విజయనగరం, విజయవాడ, విశాఖపట్నం, హైదరాబాద్, కరీంనగర్, వరంగల్
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://ssc.nic.in/, https://ssc.nic.in/Portal/Notices

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	298	61,730
నిఫ్టీ ▲	73	18,203

విదేశీ సూచీలు			
నాస్‌డాక్	12,658	▽	31
డోజోన్స్	33,427	▽	109
ఎఫ్‌టీఎస్ఈ 100	7,757	▲	15
డాక్స్	16,275	▲	112
షాంఘై	3,284	▽	14
నికాయ్	30,808	▲	234

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

జీవిత బీమా.. రాబడి చూడొద్దు



- సంప్రదాయ ప్లాన్లలో నికర రాబడి శూన్యం!
- వచ్చే రాబడి ద్రవ్యోల్బణాన్ని మించదు
- మెరుగైన కవరేజీ కూడా తక్కువే
- బీమా, పెట్టుబడి వేర్వేరు
- టర్మ్ ప్లాన్లలో తక్కువ ప్రీమియంతో మెరుగైన రక్షణ
- ముందుగా తీసుకోవాల్సిన ప్లాన్ ఇదే

జీవిత బీమా అనగానే.. ప్రీమియం ఎంత.. రాబడి ఎంత..? అన్న ప్రశ్న వస్తుంది. ఇప్పటికీ జీవిత బీమా విషయంలో ఎక్కువ మంది ఎంపిక సంప్రదాయ ఎండోమెంట్ పాలసీలే. ఇందుకోసం భారీగా ప్రీమియం చెల్లిస్తుంటారు. ఒకవైపు బీమా కవరేజీ. మరోవైపు రాబడి. ఇదే ఎక్కువ మందిని ఆకర్షించే అంశం. బ్యాంక్ డిపాజిట్‌లో మాదిరిగా, లేదంటే అంతకంటే ఎక్కువ రాబడి బీమా పాలసీలో వస్తుందని నమ్ముతుంటారు. దీనికి అదనంగా బీమా రక్షణ ఉంటుందన్న కారణంతో దీనివైపే మొగ్గు చూపిస్తుంటారు. రాబడి ఇవ్వని టర్మ్ ఇన్సూరెన్స్ ప్లాన్లను అర్థం చేసుకుని తీసుకునే వారు మొత్తం మీద తక్కువ. కానీ, సంప్రదాయ బీమా పాలసీల్లో రాబడి విషయమై ఎక్కువ మందిలో ఉండే అంచనా తప్పు. రాబడి రేటు చాలా తక్కువ. సగటు ద్రవ్యోల్బణం కంటే కూడా తక్కువేనని గణాంకాలు పరిశీలిస్తే తెలుస్తుంది. మార్కెటింగ్‌లో భాగంగా సంప్రదాయ బీమా పాలసీలను ఆకర్షణీయంగా చూపించే ప్రయత్నాన్ని బీమా సంస్థలు, ఏజెంట్లు చేస్తుంటారు. కానీ, ఇక్కడ స్పష్టంగా తేల్చుకోవాల్సింది ఏమిటంటే.. కావాల్సింది బీమా రక్షణా? లేక రాబడా? ఈ అంశాలను వివరించే కథనం ఇది...

సంప్రదాయ బీమా పాలసీలు రెండు రకాల ప్రయోజనాలను ఆఫర్ చేస్తుంటాయి. మరణించినప్పుడు పరిహారాన్ని చెల్లిస్తాయి. పాలసీ కాలం పూర్తయ్యే వరకు జీవించి ఉన్నా ప్రయోజనం లభిస్తుంది. పాలసీదారు ఏదైనా కారణంతో దురదృష్టవశాత్తూ పాలసీ కాల వ్యవధిలో మరణిస్తే నామినీ ప్రయోజనాన్ని క్లెయిమ్ చేసుకోవచ్చు. పాలసీదారు జీవించి ఉంటే చివర్లో అన్ని ప్రయోజనాలనూ కలిపి బీమా సంస్థ చెల్లిస్తుంది. బీమా ప్లాన్ బ్రోచర్‌లో ఈ వివరాలు ఉంటాయి. ఉదాహరణకు ఎల్ఐసీ బీమా జ్యోతి ప్లాన్ పరిశీలిస్తే.. ఇది పొదుపు, బీమాతో కూడిన ప్లాన్. 15–20 ఏళ్ల కాలానికి తీసుకోవచ్చు. పాలసీ కాల వ్యవధి అంతటా ప్రీమియం చెల్లించక్కర్లేదు. 5 ఏళ్లు తగ్గించి మిగిలిన కాలానికి ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. ఉదాహరణకు 20 ఏళ్ల టర్మ్ ప్లాన్ తీసుకుంటే 15 ఏళ్లపాటు ప్రీమియం చెల్లించాలి.

•••

ఉదాహరణకు 35 ఏళ్ల వ్యక్తి 20 ఏళ్ల కాలానికి బీమా జ్యోతి పాలసీని రూ.15 లక్షల సమ్ అష్యూరెన్స్‌పై (బీమా రక్షణ/కవరేజీ) తీసుకుంటే అప్పుడు ఏటా చెల్లించాల్సిన ప్రీమియం సుమారు రూ.80వేలు. ఇలా 15 ఏళ్లపాటు చెల్లించాల్సి ఉంటుంది. జీవించి ఉంటే రెండు రూపాల్లో ఈ ప్లాన్ ప్రయోజనాలను చెల్లిస్తుంది. 55 ఏళ్ల వరకు జీవించి ఉంటే అప్పుడు రూ.10 లక్షల సమ్ అష్యూరెన్స్‌తోపాటు గ్యారంటీడ్ అడిషన్స్ పొందొచ్చు. గ్యారంటీడ్ అడిషన్ అనేది ప్రతి రూ.1,000పై రూ.50 చొప్పున వస్తుంది. అంటే మొత్తం మీద 20 ఏళ్ల కాలంలో ప్రీమియం రూపేణా రూ.12 లక్షలు చెల్లిస్తారు. అంటే రూ.10 లక్షల కవరేజీ కోసం అంతకంటే ఎక్కువ చెల్లిస్తున్నారు. జీవించి ఉంటే 20 ఏళ్ల తర్వాత వచ్చే మొత్తం రూ.20 లక్షలు. అంటే రాబడి రూ.8 లక్షలే. అది కూడా 20 ఏళ్ల కాలానికి. ఇందులో ఇంటర్నల్ రేట్ ఆఫ్ రిటర్న్ (రాబడి రేటు) 4 శాతమే. ఇదనే కాదు. జీవిత బీమా ఎండోమెంట్ ప్లాన్లు అన్నింటిలోనూ దాదాపు ఇదే స్థాయిలో రాబడి ఉంటుంది. ఒకవేళ 30–40 ఏళ్ల కాలానికి తీసుకుంటే ఈ రాబడి రేటు 4.5–5 శాతం మధ్య ఉంటుంది. కానీ, మన దేశంలో సగటు వార్షిక ద్రవ్యోల్బణం 6 శాతం స్థాయిలో ఉండడాన్ని గమనించొచ్చు. ద్రవ్యోల్బణం రేటు, అంతకంటే తక్కువ రాబడి రేటు ఏదైనా.. నికరంగా అది మనకు రాబడిని ఇచ్చినట్టు కాదని అర్థం చేసుకోవాలి.

•••

ఒకవేళ ప్లాన్ కాల వ్యవధిలో పాలసీదారు మరణించినట్టయితే, సమ్ అష్యూరెన్స్‌తోపాటు అప్పటి వరకు సమకూరిన గ్యారంటీడ్ అడిషన్స్ చెల్లిస్తారు. బేసిక్ సమ్ అష్యూరెన్స్‌పై 125 శాతం, వార్షికంగా చెల్లించే ప్రీమియానికి ఏడు రెట్లు, లేదంటే అప్పటి వరకు చెల్లించిన ప్రీమియంకు 105 శాతం.. వీటిల్లో ఏది ఎక్కువ అయితే అది చెల్లిస్తారు. ఉదాహరణకు 35 ఏళ్ల వయసులో తీసుకుని 50 ఏళ్ల సమయంలో మరణం సంభవించినట్టయితే రూ.20 లక్షలు పరిహారంగా ముడుతుంది.



ప్రత్యామ్నాయం...

బీమా, పెట్టుబడి ఈ రెండింటినీ కలిపి చూడొద్దని నిపుణులు తరచూ చెబుతుంటారు. ఈ రెండూ కలిపి తీసుకోవడం వల్ల అటు సరైనా బీమా రక్షణ, ఇటు సరైన రాబడి పొందలేని పరిస్థితికి సంప్రదాయ బీమా పాలసీలు అచ్చమైన ఉదాహరణ. అలా కాకుండా అచ్చమైన జీవిత బీమా రక్షణను ఆఫర్ చేసే టర్మ్ ప్లాన్ తీసుకుని, మరోవైపు మెరుగైన రాబడినిచ్చే సాధనంలో పెట్టుబడి పెట్టుకోవడమే మంచి నిర్ణయం అవుతుంది. పై ఉదాహరణ ఆధారంగా బీమా, పెట్టుబడిని వేరు చేస్తే వచ్చే ప్రయోజనం ఏ మేరకు ఉంటుందో చూద్దాం. 35 ఏళ్ల వయసున్న వ్యక్తి 25 ఏళ్ల కాలానికి అంటే 60 ఏళ్లు వచ్చే వరకు (రిటైర్మెంట్ వయసు/బాధ్యతలు ముగిసే సగటు వయసు) రూ.50 లక్షల సమ్ అష్యూరెన్స్‌తో టర్మ్ ప్లాన్ తీసుకుంటే చెల్లించాల్సిన ప్రీమియం రూ.10వేల లోపే. ఎక్కువ కంపెనీల్లో ప్రీమియం రూ.7,400 నుంచి 9,800 మధ్య ఉంది. పొగతాగడం, మద్యపానం, అనారోగ్య సమస్యలు లేని వారికి ఈ ప్రీమియం అని అర్థం చేసుకోవాలి. బీమా జ్యోతి ప్లాన్‌లో ఏటా చెల్లించే ప్రీమియం రూ.80వేలు. కానీ బీమా రక్షణ రూ.10 లక్షలే. ఈ ప్రీమియంలో కేవలం 12 శాతం చెల్లించడం ద్వారా టర్మ్ ప్లాన్‌లో రూ.50 లక్షల బీమా కవరేజీని, అది కూడా 25 ఏళ్ల కాలానికి పొందొచ్చు. కేవలం 12 శాతం ప్రీమియానికే ఐదు రెట్లు అధిక బీమా రక్షణ తీసుకోవడం మెరుగైన నిర్ణయం అనిపించుకుంటుంది. అప్పుడు మిగిలిన రూ.70వేలను 15 ఏళ్ల కాలానికి ఇన్వెస్ట్ చేసుకోవచ్చు.

బీమా జ్యోతితో ప్రీమియం చెల్లింపు 15 ఏళ్లే కనుక దాన్నే పరిగణనలోకి తీసుకుని చూద్దాం. 12 శాతం రాబడి ఇచ్చే మ్యూచువల్ ఫండ్ పథకంలో ఏడాదికోసారి రూ.70వేల చొప్పున ఇన్వెస్ట్ చేసుకుంటూ వెళితే 15 ఏళ్ల చివరికి రూ.29.22 లక్షలు సమకూరుతుంది. ఇందులో అసలు రూ.10.5 లక్షలు అయితే, రాబడి రూ.18.72 లక్షలు. ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్ పథకాల్లో దీర్ఘకాలానికి వార్షిక రాబడి 12 శాతం ఉన్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. ఒకవేళ 10 శాతం రాబడి ఆధారంగా అంచనా వేసుకున్నా.. 15 ఏళ్లలో రూ.24.46 లక్షలు సమకూరుతుంది. విడిగా బీమా ప్లాన్, పెట్టుబడి ప్లాన్ ఎంపిక చేసుకోవడం వల్ల మెరుగైన కవరేజీకితోడు, మెరుగైన సంపద సృష్టి సాధ్యపడుతుందని ఈ ఉదాహరణ తెలియజేస్తోంది.

గ్యారంటీడ్/ పార్టిసిపేటింగ్

బీమా సంస్థలు సంప్రదాయ పాలసీలను ఆకర్షణీయంగా చూపించేందుకు బోనస్‌లను ప్రకటిస్తుంటాయి. బీమా సంస్థ పనితీరుపైనే ఇది ఆధారపడి ఉంటుంది. సంప్రదాయ బీమా ప్లాన్లు సింపుల్ రివర్షనరీ బోనస్, ఫైనల్ మెచ్యూరిటీ బోనస్, లాయల్టీ అడిషన్‌ను ఆఫర్ చేస్తుంటాయి. ఇవన్నీ బీమా సంస్థ వద్ద మిగులు నిల్వలపైనే ఆధారపడి ఉంటాయనే షరతు విధిస్తారు. మిగులు ఉంటే అప్పుడు సింపుల్ రివర్షనరీ బోనస్ ను చెల్లిస్తారు. కొన్ని ప్లాన్లలో సింపుల్ రివర్షనరీ బోనస్ అని కాకుండా, పాలసీ కాల వ్యవధి ముగింపు సమయంలో లాయల్టీ అడిషన్స్ పేరుతో చెల్లిస్తారు. ఇదే తరహా సంప్రదాయ ప్లాన్లు కొన్ని చివర్లో అడిషనల్ బోనస్ చెల్లింపునకు హామీ ఇస్తాయి. పార్టిసిపేటింగ్ బీమా ప్లాన్ తీసుకుంటున్నట్టు అయితే, కాల వ్యవధి ముగిసే వరకు జీవించి ఉన్న సందర్భంలో సమ్ అష్యూరెన్స్‌కు అదనంగా ఏదో ఒక రూపంలో చెల్లింపు ఉంటుంది. అదే నాన్ పార్టిసిపేటింగ్ ప్లాన్ తీసుకుంటుంటే జీవించి ఉంటే చివర్లో ఏమీ రాదు. టర్మ్ ఇన్సూరెన్స్‌ను నాన్ పార్టిసిపేటింగ్ ప్లాన్‌గా పేర్కొంటారు. ఇప్పుడు ప్రీమియం వెనక్కి ఇచ్చే టర్మ్ ప్లాన్లు కూడా వస్తున్నాయి. కనుక ఇక్కడ పొరపాటు పడొద్దు. ప్రీమియం వెనక్కి రాని టర్మ్ ప్లాన్ ప్రీమియంతో పోలిస్తే, చివర్లో ప్రీమియం వెనక్కి ఇచ్చే టర్మ్ ప్లాన్ ప్రీమియం చాలా అధికంగా ఉంటుంది.



కాంపౌండింగ్ ఉండదు..

విడిగా ఇన్వెస్ట్ చేసుకుంటే కాంపౌండింగ్ ఉంటుంది. అంటే రాబడిపై రాబడి తోడవుతుంది. కానీ, సంప్రదాయ బీమా ప్లాన్లలో చెల్లించే గ్యారంటీడ్ అడిషన్స్, రివర్షనరీ బోనస్, సింపుల్ అడిషన్స్ మొత్తంపై కాంపౌండింగ్ ఉండదు. అదే బ్యాంక్ ఫిక్స్‌డ్ డిపాజిట్ లేదా బాండ్లను తీసుకుంటే, మొదటి ఏడాది రాబడిపై తర్వాతి కాలంలో రాబడి జమ అవుతుంది. ఇలా కాంపౌండింగ్ ప్రయోజనం లభిస్తుంది. పైకి కనిపించదు కానీ, సంపద సృష్టిలో కాంపౌండింగ్‌కు చాలా ప్రాధాన్యం ఉంది. సంప్రదాయ పెట్టుబడి సాధనాల్లో రాబడి రేటు ముందే చెబుతారు. అదే, సంప్రదాయ ఎండోమెంట్ ప్లాన్లలో రాబడి రేటు ముందు చెప్పరు. సమ్ అష్యూరెన్స్‌తోపాటు ఇతర ప్రయోజనాలు చెల్లించే విధంగా ప్లాన్ ఉంటుంది. ఇందులో నికర రాబడి ఏ మేరకు అన్నది అర్థం చేసుకోవడం సామాన్యుల వల్ల అయ్యే పని కాదు. సమ్ అష్యూరెన్స్‌కే హామీ ఉంటుంది. ఇతర చెల్లింపులకు హామీ ఉండదు. బీమా సంస్థ పనితీరు (అది చేసే పెట్టుబడులపై రాబడులు)పైనే ఆధారపడి ఉంటాయని అర్థం చేసుకోవాలి. అందుకే అన్నింటికంటే కుటుంబానికి మెరుగైన జీవిత బీమా రక్షణ కల్పించుకోవడం ముందుగా చేయాలి. రాబడి కోసం దీర్ఘకాలంలో ఈక్విటీలే మెరుగైన సాధనమని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు. ఇలాంటి అన్ని ఏర్పాట్లు చేసుకున్న తర్వాత, ఇంకా ఆర్థిక వెసులుబాటు ఉంటే అప్పుడు మీకు నచ్చిన ప్లాన్‌ను కొనుగోలు చేసుకోవచ్చు.

లాభాల్లో పీఎస్‌యూ బ్యాంకుల జోరు

- గతేడాది రూ. లక్ష కోట్లకు అప్
- ఎస్‌బీఐ వాటా రూ. 50,000 కోట్లు



న్యూఢిల్లీ: కొంతకాలంగా ప్రభుత్వ రంగ బ్యాంకుల లాభదాయకత భారీగా మెరుగుపడింది. దీంతో గత ఆర్థిక సంవత్సరం(2022–23)లో మొత్తం పీఎస్‌యూ బ్యాంకుల నికర లాభాలు రూ. లక్ష కోట్ల మార్క్‌ను తాకాయి. దీనిలో ఒక్క ఎస్‌బీఐ వాటానే రూ. 50,000 కోట్లు కావడం గమనార్హం! 2017–18లో పీఎస్‌యూ బ్యాంకులు ఉమ్మడిగా రూ. 85,390 కోట్ల నికర నష్టాలు ప్రకటించాక టర్న్‌అరౌండ్ బాట పట్టాయి. దీనిలో భాగంగా గతేడాదికల్లా రూ. 1,04,649 కోట్ల లాభాలు సాధించాయి. 2021–22తో పోలిస్తే మొత్తం 12 పీఎస్‌బీల నికర లాభం 57 శాతం వృద్ధి చూపింది. రూ. 66,540 కోట్లకు చేరింది. బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర అత్యధికంగా 126 శాతం పురోగతి సాధించి రూ. 2,602 కోట్లు ఆర్జించింది. ఈ బాటలో యుకో బ్యాంక్ లాభం రెట్టింపై రూ. 1,862 కోట్లను తాకింది. బ్యాంక్ ఆఫ్ బరోడా(బీవోబీ) 94 శాతం వృద్ధితో రూ. 14,110 కోట్లు సాధించగా.. నంబర్ వన్ దిగ్గజం ఎస్‌బీఐ 59 శాతం అధికంగా రూ. 50,232 కోట్లు ఆర్జించింది. కెనరా బ్యాంకు రూ. 10,604 కోట్లు అందుకుంది. కాగా.. పంజాబ్ నేషనల్ బ్యాంక్(పీఎన్‌బీ) మినహా ఇతర పీఎస్‌బీలు ఆకర్షణీయ స్థాయిలో లాభాలు ప్రకటించాయి. పీఎన్‌బీ నికర లాభం 27 శాతం క్షీణించి రూ. 2,507 కోట్లకు పరిమితమైంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

22-5-2023	
విశాఖ	495–00
చిత్తూరు	523–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	487–00
విజయవాడ	487–00
రిటైల్ ధర (డజను)	72.00
21-5-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	465–00
వరంగల్	467–00
రిటైల్ ధర	5.25

మారుతీ సుజుకీ | జేఎం ఫైనాన్షియల్ | కొనొచ్చు

స్టాక్ వ్యూ

ప్రస్తుత ధర: రూ. 9,108 టార్గెట్: రూ. 11,500

ఎందుకంటే: పూర్తిస్థాయిలో మార్పుచేసి ప్రవేశపెట్టిన మోడళ్లు బాలెనో, బ్రెజ్జా కార్లకు డిమాండ్ కనిపిస్తోంది. దీనికి జతగా ఇటీవల విడుదల చేసిన గ్రాండ్ విటారా అమ్మకాలు సైతం జోరు మీదున్నాయి. వెరసి కార్ల తయారీ దిగ్గజం మారుతీ సుజుకీ దేశీ అమ్మకాలలో ఈ మూడు మోడళ్ల కార్లే 15 శాతం వాటాను ఆక్రమిస్తున్నాయి. కస్టమర్ల నుంచి లభిస్తున్న స్పందన ఆధారంగా చూస్తే ప్రస్తుత ప్రొడక్ట్ సైకిల్‌లో విడుదల చేసిన అన్ని మోడల్ కార్లూ భారీగా విజయవంతమయ్యాయి. ఇక చానల్ చెక్స్ ద్వారా లభించిన సమాచారం ప్రకారం తాజా మోడల్ ఫ్రాంక్స్ కారుకూ సానుకూల స్పందన నమోదవుతోంది. ప్రాథమిక సమాచారం(ఫీడ్‌బ్యాక్)మేరకు మధ్యస్థాయి మోడళ్లలో ఆవిష్కరించిన ఈ కారుకు కస్టమర్ల నుంచి ఆసక్తి వ్యక్తమవుతోంది. ఇందుకు ప్రధానంగా కారు స్టైలింగ్, ఆకర్షణీయ ధర ప్రభావం చూపుతున్నాయి. కారు విడుదలతో పాటు, ధర వివరాలు వెల్లడికావడంతో కస్టమర్ల నుంచి ఎంక్వైరీలు ఊపందుకున్నాయి. ఇక ఈ బాటలో మే లేదా జూన్‌లో జిమ్నీ మోడల్ విడుదలను అంచనా వేస్తున్నారు. పటిష్ట బ్రాండు ప్రాచుర్యం నేపథ్యంలో జిమ్నీ వాహనానికి సైతం డిమాండ్ కనిపించే అవకాశముంది. తాజా మోడళ్ల విడుదలతో బీ సెగ్మెంట్(విభాగం)లో మారుతీ ముందడుగు వేయనుంది. రెండు, మూడు పోటీ బ్రాండ్లతో పోలిస్తే ఆరు మోడళ్లను ప్రవేశపెట్టడం ద్వారా బీ సెగ్మెంట్‌లో కంపెనీ మరింత పటిష్టంకానుంది. రెండేళ్లపాటు మార్కెట్ వాటాను కోల్పోతూ వస్తున్న కంపెనీ తిరిగి రికవరీ బాటలో సాగే వీలుంది. పటిష్ట ఆర్డర్‌బుక్, విభిన్న మోడళ్లు వంటి అంశాలు కంపెనీకి బలాన్నిస్తున్నాయి.



బ్లూడార్ట్ ఎక్స్‌ప్రెస్ | ఎలారా సెక్యూరిటీస్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 6,052 టార్గెట్: రూ. 7,700

ఎందుకంటే: సమీకృత లాజిస్టిక్స్ దిగ్గజం బ్లూడార్ట్ ఎక్స్‌ప్రెస్ లిమిటెడ్ యాజమాన్యం ఇటీవల కంపెనీ భవిష్యత్ ప్రణాళికలను ఆశావహ రీతిలో ఆవిష్కరించింది. కంపెనీ ఒక్కొక్కటీ 22 టన్నుల రవాణా సామర్థ్యాన్ని కలిగిన రెండు 737 బోయింగ్ రవాణా విమానాలను జత చేసుకుంది. కంపెనీ వద్ద ఇప్పటికే గల 33 టన్నుల సామర్థ్యం కలిగిన ఆరు బోయింగ్ 757 రవాణా విమానాలకు ఇవి అదనం. నియంత్రణ సంస్థల నుంచి అనుమతులు లభించాక టైర్–2, టైర్–3 పట్టణాలలో జూన్ నుంచి కొత్త విమానాల రవాణా సర్వీసులు ప్రారంభం కానున్నాయి. ఎయిర్ కార్గో కార్యకలాపాలకు గువాహటిని 8వ బేస్‌స్టేషన్‌గా వినియోగించుకోనుంది. తద్వారా ఈశాన్య రాష్ట్రాల కార్గో అవసరాల కోసం రోజువారీ విమానాల నిర్వహణలో గువాహటి మద్దతుగా నిలవనుంది. అయితే మొత్తంగా చూస్తే సమీప భవిష్యత్‌లో ఎయిర్ ఎక్స్‌ప్రెస్ ఈల్డ్ నీరసించనుంది. కొత్త రవాణా విమానాలు సైతం తక్కువ ఈల్డ్‌నే సాధించనున్నాయి. విమానాశ్రయం నుంచి విమానాశ్రయానికి నిర్వహించే వస్తు రవాణాకు ప్రాథమిక దశలో విమాన సామర్థ్యాన్ని భర్తీ చేయవలసి ఉంటుంది. వస్తు రవాణాకు అత్యధిక డిమాండును అంచనా వేస్తున్న కారణంగా భూమిమీద సామర్థ్య విస్తరణను కొనసాగించనుంది. ఇందుకు అనుగుణంగా 55కుపైగా సొంత రిటైల్ స్టోర్లను కొత్తగా ఏర్పాటు చేస్తోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023–24)లో దేశీయంగా రూ. 70 కోట్లు, వైమానిక అవసరాలపై రూ. 150 కోట్ల పెట్టుబడులను వెచ్చించే ప్రణాళికల్లో ఉంది. రెండేళ్ల కాలంలో వార్షికంగా కంపెనీ ఆదాయం 15 శాతం, లాభార్జన 19 శాతం చొప్పున వృద్ధి చెందగలవని భావిస్తున్నాం.




గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజీ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

స్మాల్ క్యాప్ కంటే మిడ్ క్యాప్ బెటరా?

నేను దీర్ఘకాలం కోసం మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులు పెట్టాలని అనుకుంటున్నాను. అయితే, మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ పథకాల్లో ఏవి ఎంపిక చేసుకోవాలి? – వరుణ్ మిశ్రా

స్మాల్‌క్యాప్ మాదిరే మిడ్‌క్యాప్‌లోనూ రాబడులు, సవాళ్లు ఉంటాయి. పేరుకు తగినట్టుగా ఈ పథకాల పెట్టుబడులు ఉండడాన్ని గమనించొచ్చు. మిడ్‌క్యాప్ పథకాలు ఎక్కువ శాతం పెట్టుబడులను మిడ్‌క్యాప్ కంపెనీల్లోనే ఇన్వెస్ట్ చేస్తాయి. అదే విధంగా లార్జ్‌క్యాప్ స్టాక్స్‌లో చెప్పుకోతగ్గ మేర, స్వల్పంగా స్మాల్‌క్యాప్‌లో పెట్టుబడులు కలిగి ఉంటాయి. అదే స్మాల్‌క్యాప్ ఫండ్ అయితే ఎక్కువగా స్మాల్‌క్యాప్ స్టాక్స్‌కు పెట్టుబడులు కేటాయిస్తుంది. అలాగే, మిడ్‌క్యాప్‌లోనూ ఎక్స్‌పోజర్ తీసుకుంటుంది. మార్కెట్ విలువ పరంగా టాప్ –100 కంపెనీలను లార్జ్‌క్యాప్‌గా, తదుపరి 150 కంపెనీలను మిడ్‌క్యాప్‌గా వర్గీకరించారు. మిగిలినవన్నీ స్మాల్‌క్యాప్ కంపెనీల కిందకే వస్తాయి. కానీ, మ్యూచువల్ ఫండ్స్ కంపెనీలు తదుపరి 250 కంపెనీల నుంచి పెట్టుబడులకు ఎంపిక చేసుకుంటాయి. అయితే, 101 నుంచి 250 వరకు ఉన్న కంపెనీలన్నీ ఎల్లప్పుడూ మిడ్‌క్యాప్‌లోనే ఉంటాయని కాదు అర్థం. మార్కెట్ విలువ ఆధారంగా ఒక కంపెనీని మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ అని చెప్పడమే. ఒకవేళ అది చిన్న కంపెనీయే అయినప్పటికీ గొప్పది అయి ఉండొచ్చు. చక్కని నిర్వహణతో, ఎంతో వేగంగా వృద్ధి చెందుతున్న వ్యాపారంతో, భరోసానిస్తూ ఉండొచ్చు. ఇలాంటి సానుకూల బలాలున్న కంపెనీల విషయంలో అది మిడ్ లేదా స్మాల్ క్యాప్ అన్న నిర్వచనం జోలికి వెళ్లక్కర్లేదు. ఉదాహరణకు ఒక మిడ్‌క్యాప్ ఫండ్ పథకంలో ఇన్వెస్ట్ చేస్తున్నారు. కొంత కాలానికి నిర్వహణ ఆస్తుల పరంగా అది పెద్ద పథకంగా మారొచ్చు. అప్పుడు అవి మిడ్‌క్యాప్ విభాగంలో ఉన్న పెద్ద కంపెనీల్లో ఎక్కువగా ఇన్వెస్ట్ చేస్తాయి. ఉదాహరణకు 101 నుంచి 125 వరకు ఉన్న కంపెనీలను ఎంచుకుంటాయి. అవి పేరుకు మిడ్‌క్యాప్ కంపెనీలుగా ఉన్నప్పటికీ, భవిష్యత్తులో లార్జ్‌క్యాప్‌లోకి వెళ్లే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.



Q & A

ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

డెట్ మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులకు అనుకూల సమయం ఏది? – రాధాకృష్ణమూర్తి

డెట్ మ్యూచువల్ ఫండ్స్ పథకాల్లో పెట్టుబడులు పెట్టుకునేందుకు సరైన సమయం అంటూ ప్రత్యేకంగా ఉండదు. డెట్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసే ముందు మీ పెట్టుబడుల కాల వ్యవధికి అనుకూలమైన పథకాన్ని ఎంపిక చేసుకోవడం మొదటగా చేయాల్సిన పని. చాలా మంది ఇన్వెస్టర్లు దీర్ఘకాల లక్ష్యాల కోసం డెట్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేస్తుంటారు. మీరు ఎంపిక చేసుకునే పథకం రక్షణ ఎక్కువగా ఉండే సెక్యూరిటీల్లో ఇన్వెస్ట్ చేస్తుందా? లేదా అన్నది నిర్ధారించుకోవాలి.

ఫండ్ ఆఫ్ ఫండ్స్ (ఎఫ్‌వోఎఫ్) వల్ల లాభాలేంటి? – రవీంద్రన్

ఫండ్ ఆఫ్ ఫండ్ అంటే సమీకరించిన పెట్టుబడులను తీసుకెళ్లి మరో మ్యూచువల్ ఫండ్ పథకంలో ఇన్వెస్ట్ చేసేది. సాధారణంగా ఎఫ్‌వోఎఫ్‌లను ఆయా ఫండ్స్ హౌస్‌లు వాటికి సంబంధించిన ఈటీఎఫ్‌ల్లో ఇన్వెస్ట్ చేసేందుకు ప్రారంభిస్తుంటాయి. ఎఫ్‌వోఎఫ్‌లు ఇతర మ్యూచువల్ ఫండ్స్ పథకాల మాదిరే పనిచేస్తాయి. వీటిల్లోనూ సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్) రూపంలో పెట్టుబడి పెట్టుకోవచ్చు. విదేశీ సూచీలు, విదేశీ మ్యూచువల్ ఫండ్స్ పథకాల్లో ఇన్వెస్ట్ చేసే ఎఫ్‌వోఎఫ్‌లు కూడా ఉన్నాయి. ఎఫ్‌వోఎఫ్‌లు వేరే మ్యూచువల్ ఫండ్ పథకాల్లో ఇన్వెస్ట్ చేస్తాయి కనుక రెండంచెల్లో ఎక్స్‌పెన్స్ రేషియో భారాన్ని మోయాల్సి వస్తుంది. ఉదాహరణకు ఎఫ్‌వోఎఫ్‌లో 1 శాతం ఎక్స్‌పెన్స్ రేషియో ఉందనుకుంటే, అది ఇన్వెస్ట్ చేసే పథకం ఎక్స్‌పెన్స్ రేషియో 0.50 శాతం ఉంటే మొత్తం 1.5 శాతం ఎక్స్‌పెన్స్ రేషియో చెల్లిస్తున్నట్టు అర్థం చేసుకోవాలి. ఎఫ్‌వోఎఫ్ ఇన్వెస్ట్ చేసే పథకంలో నేరుగా ఇన్వెస్టర్లు పెట్టుబడులకు అవకాశం లేనప్పుడు వీటిని పరిశీలించొచ్చు. ఎఫ్‌వోఎఫ్‌లను నాన్ ఈక్విటీ పథకాలుగా పరిగణిస్తారు. కనుక డెట్ పథకాలకు మాదిరే మూలధన లాభాలపై పన్ను అమలవుతుంది. ఒకవేళ ఎఫ్‌వోఎఫ్ దేశీయ ఈక్విటీ పథకాల్లో 90 శాతానికిపైగా పెట్టుబడి పెడితే ఈక్విటీకి మాదిరే మూలధన లాభాల పన్ను వర్తిస్తుంది.

భారత్ నుంచి వాల్‌మార్ట్ మరిన్ని ఎగుమతులు

- బొమ్మలు, పాదరక్షలు, సైకిల్స్‌పై దృష్టి



న్యూఢిల్లీ: భారత్ నుంచి మరిన్ని ఉత్పత్తులను అంతర్జాతీయ మార్కెట్‌కు ఎగుమతి చేయాలన్న లక్ష్యంతో దిగ్గజ రిటైల్ సంస్థ వాల్‌మార్ట్ ఉంది. ఆట బొమ్మలు, సైకిళ్లు, పాద రక్షలను భారత సరఫరాదారుల నుంచి సమీకరించుకోవాలని చూస్తోంది. ఆహారం, ఫార్మాస్యూటికల్, కన్జ్యూమబుల్, హెల్త్, వెల్‌నెస్, అప్పారెల్, హోమ్ టెక్స్‌టైల్ విభాగాల్లో భారత్ నుంచి కొత్త సరఫరాదారులను ఏర్పాటు చేసుకోవడంపైనా దృష్టిపెట్టింది. భారత్ నుంచి ఎగుమతులను 2027 నాటికి 10 బిలియన్ డాలర్లకు (రూ.82,000 కోట్లు) పెంచుకోవాలన్న లక్ష్యాన్ని ఈ సంస్థ లోగడే విధించుకుంది. ఈ దిశగా తన చర్యలను వేగవంతం చేస్తోంది. ఈ సంస్థ ఇటీవలే భారత్‌కు చెందిన పలువురు బొమ్మల తయారీదారులతో వర్చువల్ సమావేశాన్ని నిర్వహించింది. తమకు ఎంత మేర ఉత్పత్తి కావాలి, ఎలాంటి నాణ్యత ప్రమాణాలు పాటించాలనే విషయాలను వారికి తెలియజేసింది.

ఐకియా సైతం...

మరో ప్రముఖ అంతర్జాతీయ రిటైలింగ్ సంస్థ ఐకియా సైతం తన అంతర్జాతీయ విక్రయ కేంద్రాల కోసం భారత్ నుంచి ఆటబొమ్మలను సమీకరిస్తోంది. ఈ చర్యలు ఆట బొమ్మల విభాగంలో పెరుగుతున్న భారత్ బలాలను తెలియజేస్తోందని విశ్లేషకులు పేర్కొంటున్నారు. కొన్నేళ్ల క్రితం వరకు మన దేశం ఆటబొమ్మల కోసం దిగుమతులపైనే ఎక్కువగా ఆధారపడేది. చైనా నుంచి చౌక ఆట ఉత్పత్తులు మన మార్కెట్‌ను ముంచెత్తేవి. కేంద్ర సర్కారు దీనికి చెక్ పెట్టేందుకు దిగుమతి అయ్యే ఆట బొమ్మల నాణ్యతా ప్రమాణాలను పెంచడం, టారిఫ్‌లను పెంచడం వంటి చర్యలు తీసుకుంది. ఇవి ఫలితమిస్తున్నాయి. సరఫరా వ్యవస్థ బలోపేతం ఈ నెల మొదట్లో వాల్‌మార్ట్ ఐఎన్‌సీ ప్రెసిడెంట్, సీఈవో డగ్ మెక్‌మిల్లన్ భారత పర్యటన సందర్భంగా సంస్థ ప్రణాళికలను పునరుద్ఘాటించారు. భారత్‌లోని వినూత్నమైన సరఫరాదారుల వ్యవస్థ అండతో 2027 నాటికి ఇక్కడి నుంచి 10 బిలియన్ డాలర్ల ఎగుమతుల లక్ష్యాన్ని చేరుకుంటామన్న ధీమాను వ్యక్తం చేశారు. తన పర్యటనలో భాగంగా ప్రధాని నరేంద్రమోదీని సైతం ఆయన కలిశారు. ఆ తర్వాత సంస్థ లక్ష్యాలను పేర్కొంటూ ట్వీట్ చేశారు. లాజిస్టిక్స్, నైపుణ్యాల అభివృద్ధి, సరఫరా వ్యవస్థ బలోపేతం ద్వారా భారత్‌ను ఆటబొమ్మలు, సముద్ర ఉత్పత్తులు, ఇతర విభాగాల్లో అంతర్జాతీయ ఎగుమతి కేంద్రంగా చేస్తామని ప్రకటించారు.

క్లుప్తంగా...

తెలుగువారి వెలుగు దీప్తి ఎన్టీఆర్
జస్టిస్ ఈవీ వేణుగోపాల్



ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న జస్టిస్ వేణుగోపాల్

కరీంనగర్ క్రైం: మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు తెలుగు ప్రజలకు వెలుగు దీప్తిగా భాసిల్లుతున్నారని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఈవీ వేణుగోపాల్ కొనియాడారు. అమెరికా పర్యటనలో ఉన్న ఆయన కాలిఫోర్నియా బే ఏరియాలో నిర్వహించిన ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో అమెరికా తెలుగు సంఘాల సమాఖ్య చైర్మన్ కోమటి జయరాం, దౌత్యకార్యాలయ అధికారి టీవీ నాగేంద్ర ప్రసాద్, మిల్‌పిటాస్ నగర డిప్యూటీ మేయర్ ఎవెలిన్ చువ పాల్గొన్నారు. ఈనెల 28న మిల్‌పిటాస్‌లో ఎన్టీఆర్ డే (తేదీ)గా గుర్తిస్తూ అధికారిక పత్రం అందజేశారు.

ఎవరెస్ట్ బేస్ క్యాంపును అధిరోహించిన యశ్వంత్



ఎవరెస్ట్ బేస్ క్యాంపుపై జాతీయ పతాకాన్ని ఎగురవేస్తున్న యశ్వంత్

మరిపెడ రూరల్: మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం భూక్యతండాకు చెందిన పర్వతారోహకుడు భూక్య యశ్వంత్ నేపాల్‌లోని ఎవరెస్ట్ బేస్ క్యాంపును (ఈబీసీ) అధిరోహించాడు. యశ్వంత్ ఇప్పటికే ప్రపంచంలో పేరుగాంచిన పలు పర్వతశ్రేణులను అధిరోహించాడు. ఈనెల 12వ తేదీన ఎవరెస్ట్ బేస్ క్యాంపు నుంచి ట్రెక్ ప్రారంభించి.. 17న బేస్ క్యాంపు శిఖరం చేరుకున్నట్లు యశ్వంత్ 'సాక్షి'కి ఆదివారం ఫోన్‌లో తెలిపాడు. 5,364 మీటర్ల బేస్ క్యాంపు యాత్ర పూర్తి చేయడానికి 10 రోజులు పట్టిందని పేర్కొన్నాడు. మైనస్ 10 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతల్లో ట్రెక్ చేసినట్లు యశ్వంత్ వెల్లడించాడు.

దుబాయ్ వాసులకు కూచిపూడి విందు



కల్యాణశ్రీనివాస నృత్యరూపకంలో ఓ ఘట్టం

సాక్షి, హైదరాబాద్: తన్మయి ఆర్ట్ స్టూడియో ఆధ్వర్యంలో దుబాయ్‌లోని హైట్స్ అకాడమీలో నిర్వహించిన కూచిపూడి నృత్య సమ్మేళనం స్థానికులను మంత్రముగ్ధులను చేసింది. ప్రీతి తాటంభొట్ల ఆధ్వర్యంలో 90 నిమిషాలపాటు సాగిన 'కల్యాణ శ్రీనివాస' నృత్య రూపకం అమితంగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ప్రముఖ నటులు తనికెళ్ల భరణి, దుబాయ్‌లో భారత కాన్సుల్ జనరల్ అమన్‌పురి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

హలో.. మీ పేరుతో ఓ పార్సిల్ వచ్చింది

మీ పేరిట ఫెడెక్స్‌లో డ్రగ్స్ పార్సిల్ ఉందంటూ బాధితులకు ఫోన్లలో బెదిరింపులు

నకిలీ ఐడీ కార్డులు, పార్సిళ్ల ఫొటోలను వాట్సాప్ చేస్తున్న వైనం

కేసు పెట్టకుండా ఉండాలంటే అధికారులతో మాట్లాడుకోవాలని సూచన

భయపడిన వారి నుంచి అందినకాడికి దండుకుంటున్న సైబర్ ముఠా

రాజస్తాన్, హరియాణా నుంచి ఎక్కువగా ఈ తరహా మోసాలు

దర్యాప్తు సంస్థల పేరుతో దగా.. సైబర్ నేరగాళ్ల కొత్త దందా

➤ "మీ పేరు, చిరునామాతో ఉన్న 'ఫెడెక్స్' పార్సిల్‌లో మాదక ద్రవ్యాలు ఉన్నాయి. దర్యాప్తు నిమిత్తం మీపై ఎన్‌డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు చేస్తున్నాం. ఒకవేళ మీపై కేసు నమోదు కాకుండా ఉండాలంటే కస్టమ్స్ అధికారులతో 'ఒప్పందం' కుదుర్చుకోండి" ఇదీ హైదరాబాద్‌కు చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగినికి వచ్చిన సైబర్ నేరగాళ్ల ఫోన్‌కాల్! యువతిని నమ్మించేందుకు ఆమె వాట్సాప్‌కు డ్రగ్స్ ఉన్న పార్సిల్, కస్టమ్స్ అధికారి ఐడీ కార్డు కూడా పంపించారు. దీంతో భయపడిన ఆమె... కేసు నమోదు చేయొద్దంటూ వేడుకొని ఆన్‌లైన్ ద్వారా రూ. లక్షలు సమర్పించుకుంది.



సాక్షి, హైదరాబాద్: సైబర్ నేరగాళ్లు దోపిడీలకు ఇటీవల కాలంలో దర్యాప్తు అధికారుల అవతారమెత్తుతున్నారు. ముంబై, ఢిల్లీ పోలీసులమని, సీబీఐ, ఈడీ, కస్టమ్స్ అధికారులమంటూ అమాయ కులకు ఫోన్లు చేసి బెదిరిస్తున్నారు. భయపడిపోతున్న సామాన్యులు రూ. లక్షల్లో ముట్టజెప్పి మోసపోతున్నారు. గ్రేటర్ హైదరాబాద్‌లో ఈ తరహా కేసులు పెద్ద సంఖ్యలో నమోద వుతున్నాయని సైబర్ పోలీసులు తెలిపారు.

ఎలా చేస్తున్నారంటే..

సామాజిక మాధ్యమాలు, డేటా ప్రొవైడర్ల ద్వారా సైబర్ నేరస్తులు ప్రజల వ్యక్తిగత సమాచారాన్ని సేకరిస్తారు. ఎంపిక చేసుకున్న వ్యక్తులకు ఫోన్ చేసి ఢిల్లీ, ముంబై కస్టమ్స్ అధికారులమని పేరు, చిరునామా చెబుతూ సంభాషిస్తారు. మీ పేరు, అడ్రస్‌తో ఉన్న పార్సిల్ కస్టమ్స్‌లో అనుమానాస్పదంగా కనిపించి నిలిపివేసినట్లు, తెరిచి చూస్తే అందులో మాదకద్రవ్యాలు, ఇతరత్రా చట్ట వ్యతిరేక ఉత్పత్తులు ఉన్నాయని గుర్తించినట్లు బెదిరిస్తారు. ఫోన్‌లో ఏమాత్రం బెరుకుగా మాట్లాడుతున్నట్లు అనిపించగానే బెదిరింపులు రెట్టింపు చేస్తారు. మనీలాండరింగ్, మాదక ద్రవ్యాల కేసులు నమోదు చేస్తామని వరుసగా ఫోన్లు చేస్తూ భయభ్రాంతులకు గురిచేస్తారు.

కేసు వద్దంటే స్వాహా..

అమాయకులను నమ్మించేందుకు నకిలీ పోలీసు అధి కారుల గుర్తింపు కార్డులు సైతం కేటుగాళ్లు వాట్సాప్ చేస్తారు. ఈ వ్యవహారం నుంచి బయట పడాలంటే దర్యాప్తు సంస్థల అధికారులతో మాట్లాడి ఒప్పందం చేసుకో వాలని సలహా ఇస్తారు. ఆపై కొద్దిసేపటికి మరో నకిలీ అధికారి ఫోన్ చేసి కేసు లేకుండా ఉండాలంటే కొంత నగదు చెల్లించాల్సి ఉంటుందని సూచిస్తారు. ఇలా బాధితులను బెదిరించి రూ. లక్షల్లో నగదు కొట్టేస్తున్నారు.

ఈ రాష్ట్రాల నుంచే ఎక్కువ

ఈ తరహా మోసాలు ఎక్కువగా ఫెడెక్స్ పార్సిల్ సంస్థ పేరుతో జరుగుతున్నాయని సైబర్ పోలీసులు విచారణలో గుర్తించారు. రాజస్తాన్, హరియాణా, జార్ఖండ్‌కు చెందిన సైబర్ ముఠాలు ఎక్కువగా ఇలాంటి నేరాలకు పాల్పడుతున్నాయని ఓ పోలీసు అధికారి తెలిపారు.

ఎయిర్‌పోర్టుల్లో 'బిచ్చగాడు'!

విమానాశ్రయాలే లక్ష్యంగా ఓ యువకుడి నకిలీ యాచన

- టికెట్ కొనుక్కొని ప్రయాణ సమయానికి 4–5 గంటల ముందే లోనికి..
- ఒంటరి ప్రయాణికులతో మాట కలిపి.. తండ్రికి అనారోగ్యం పేరుతో వసూళ్లు
- హైదరాబాద్ సహా ఎనిమిది ఎయిర్‌పోర్టుల్లో దందా.. ఆ సొమ్ముతో జల్సాలు
- ఎట్టకేలకు అరెస్టు చేసిన బెంగళూరు పోలీసులు



సాక్షి, హైదరాబాద్: రోడ్డు కూడళ్లు, ప్రార్థనా స్థలాలు, ఫంక్షన్ హాళ్లు తదితర చోట్ల యాచకులను చూస్తూనే ఉంటాం. వృద్ధాప్యం వల్లో లేదా శారీరక వైకల్యం వల్లో యాచించే వారు కొందరైతే దీన్నే దందాగా మార్చుకొని జీవించే వారు ఇంకొందరు కనిపిస్తుంటారు. కానీ ఇలా రోజంతా అడుక్కున్నా ఎవరికైనా లభించేది చిల్లరే... అందుకే సులువుగా నోట్ల కట్టలు సంపాదించేందుకు ఓ యువకుడు ఏకంగా ఎయిర్‌పోర్టులనే లక్ష్యంగా చేసుకొని 'బిచ్చగాడి'అవతారం ఎత్తాడు! శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ సహా ఎనిమిది విమానాశ్రయాల్లో నాలుగేళ్లుగా 'యాచిస్తూ'విదేశీయులు, ప్రవాస భారతీయులు సహా అనేక మంది నుంచి భారీగా నగదు వసూలు చేశాడు. చివరకు బెంగళూరు అంతర్జాతీయ విమానాశ్రయంలో పట్టుబడ్డాడు. అక్కడి సీఐఎస్‌ఎఫ్ అధికారుల విచారణలో ఆసక్తికర అంశాలు వెలుగులోకి వచ్చాయి.

పర్సు పోవడంతో ఎదురైన అనుభవంతో..

చెన్నైకు చెందిన విఘ్నేష్ బీటెక్ పూర్తి చేసి కొన్నాళ్లు బెంగళూరులోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేశాడు. అప్పట్లో అతనికి నాలుగంకెల జీతం కూడా వచ్చేది. ఓసారి బెంగళూరు నుంచి చెన్నై రావడానికి ఫ్లైట్ టికెట్ బుక్ చేసుకొని విమానాశ్రయానికి వస్తుండగా విఘ్నేష్ పర్సు పోగొట్టుకున్నాడు. విమాన టికెట్ తన ఫోన్‌లోనే ఉన్నప్పటికీ చెన్నైలో దిగాక ఇంటికి వెళ్లేందుకు రూపాయి కూడా లేని పరిస్థితిని బెంగళూరు విమానాశ్రయం లాంజ్‌లో ఓ విదేశీయుడితో పంచుకున్నాడు. అతనిపై జాలిపడ్డ విదేశీయుడు రూ. 10 వేలు ఇచ్చాడు. ఆ తర్వాత కరోనా వ్యాప్తి నేపథ్యంలో ఉద్యోగం కోల్పోవడంతో రోడ్డునపడ్డ విఘ్నేష్... బెంగళూరు ఎయిర్‌పోర్టు అనుభవంతో ఈజీ మనీపై దృష్టిపెట్టాడు.

ముందస్తు షెడ్యూల్‌తో ముష్టి కోసం..

విమానాశ్రయాలనే టార్గెట్‌గా చేసుకొని ప్రయాణికులకు వివిధ పేర్లతో టోకరా వేసి డబ్బు దండుకోవాలని నిర్ణయించుకున్నాడు. దీనికోసం విఘ్నేష్ నిర్ణీత సమయానికి ముందే తక్కువ ధరకు వచ్చేలా డొమెస్టిక్ విమాన టికెట్లు బుక్ చేసుకొనేవాడు. ఖరీదైన క్యాజువల్స్ ధరించి, చేతిలో లగేజ్ బ్యాగ్‌తో ఎవరికీ అనుమానం రాకుండా ఫ్లైట్ షెడ్యూల్ టైమ్‌కు దాదాపు 4–5 గంటల ముందే ఎయిర్‌పోర్టులోకి ప్రవేశించేవాడు. ఒంటరిగా ప్రయాణిస్తున్న ప్యాసింజర్‌ను ఎంచుకుని మాటలు కలిపేవాడు. ఆపై ఫోన్ (సైలెంట్ మోడ్‌లో ఉంచి) మాట్లాడినట్లు నటించేవాడు. తన తండ్రి తీవ్ర అనారోగ్యంపాలైనట్లు ఫోన్లో కుటుంబ సభ్యులు చెప్పారని... వెంటనే శస్త్రచికిత్స చేయించేందుకు తన వద్ద డబ్బు లేదని ప్యాసింజర్‌కు చెప్పి సాయం కోరేవాడు. దీంతో ఆ ప్యాసింజర్ జాలిపడి వీలైనంత సొమ్ము ఇచ్చేవాడు. ఆ తర్వాత విమానం ఎక్కి మరో నగరంలో దిగి అక్కడ కూడా ఇదే పంథాలో దండుకొనేవాడు. ఇలా విఘ్నేష్ ఒక్కోరోజు రూ. 50 వేల నుంచి రూ.60 వేల వరకు సంపాదించేవాడు. నిర్ణీత మొత్తం సంపాదించాకే చెన్నైలోని ఇంటికి తిరిగొళ్లేవాడు. ఆ డబ్బు ఖర్చయ్యే వరకు జల్సాలు చేసేవాడు.

ఇప్పటివరకు ఫిర్యాదులు లేకపోవడంతో..

ఈ పంథాలో విఘ్నేష్ హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, ముంబై, ఢిల్లీ సహా ఎనిమిది నగరాల్లోని అంతర్జాతీయ విమానాశ్రయాల్లో తన జేబు నింపుకున్నాడు. విఘ్నేష్ మోసగించిన వారిలో అత్యధికులు విదేశీయులే కావడంతో వారికి ఇది మోసమని తెలిసే అవకాశం లేదు. ఈ కారణంగానే 2021 నుంచి విఘ్నేష్ దందా నిరాటంకంగా కొనసాగుతోంది. ఇప్పటివరకు ఎవరూ పోలీసులకు ఫిర్యాదు చేయలేదు. అయితే ఈ నెల 11న బెంగళూరులోని కెంపెగౌడ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టులో ఇద్దరికి టోకరా వేసి మూడో వ్యక్తి దగ్గరకు విఘ్నేష్ వెళ్లడాన్ని గమనించిన ఓ సీఐఎస్‌ఎఫ్ అధికారి అతనిపై అనుమానంతో అదుపులోకి తీసుకొని ప్రశ్నించగా అసలు బండారం బయటపడింది. దీంతో ఎయిర్‌పోర్టు అధికారులు విఘ్నేష్‌ను పోలీసులకు అప్పగించారు. ఈ నేపథ్యంలో విఘ్నేష్ హైదరాబాద్‌లో సాగించిన 'భిక్షాటన'గురించి నిఘా వర్గాలు ఆరా తీస్తున్నాయి.

యాసిర్ ఖానే మానవ బాంబు!



మానవ బాంబుగా మారతానన్న ఉగ్ర సూత్రధారి

- భోపాల్ శివార్లలోని ఫామ్‌హౌస్‌ల్లోనూ శిక్షణ
- హైదరాబాద్ మాడ్యూల్ ఉగ్రవాదులూ హాజరు
- సమాచారమార్పిడికి సహకరించిన వారి భార్యలు
- పది మందిని విచారిస్తున్న మధ్యప్రదేశ్ ఏటీఎస్

సాక్షి, హైదరాబాద్: దేశవ్యాప్తంగా ఏకకాల దాడులకు కుట్రపన్ని, మధ్యప్రదేశ్ ఏటీఎస్‌కు హైదరాబాద్–భోపాల్‌లలో చిక్కిన ఉగ్రవాదుల విచారణలో కీలక విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఆడియోల ద్వారా రెచ్చగొట్టిన అజ్ఞాత వ్యక్తి మాటలు విన్న సూత్రధారి, భోపాల్‌వాసి యాసిర్ ఖాన్ మానవబాంబుగా మారడానికి సిద్ధమయ్యాడని వెలుగులోకి వచ్చింది. భోపాల్ మాడ్యూల్‌లో కీలకంగా వ్యవహరించిన అతను ప్రస్తుతం ఏటీఎస్ కస్టడీలో ఉన్నాడు. ఈ నెల 9న అరెస్టు చేసిన 16 మందిలో 10 మందిని ఏటీఎస్ అధికారులు శుక్రవారం అదనపు కస్టడీకి తీసుకున్న విషయం విదితమే. ఈ కేసు దర్యాప్తు కోసం ఏటీఎస్ అధీనంలో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేశారు. భోపాల్ ఉగ్రవాదులకు అక్కడి చుట్టుపక్కల ఫామ్‌హౌస్‌లలో శిక్షణ శిబిరాలు నిర్వహించారు. వాటిని హైదరాబాద్‌కు చెందిన మహ్మద్ సలీం, రెహ్మాన్ తదితరులు హాజరైనట్లు వెలుగులోకి వచ్చింది. ఈ శిబిరాలు జరిగిన ప్రాంతాల్లో సెల్‌ఫోన్ సిగ్నల్స్ లేకపోవడంతో సమాచార మార్పిడికి, హైదరాబాద్ నుంచి వచ్చిన వారిని ఆ ప్రాంతాలకు చేర్చడానికి భోపాల్ మాడ్యూల్ ఉగ్రవాదుల భార్యలు సహకరించినట్లు ఏటీఎస్ అధికారులు చెబుతున్నారు. శిక్షణ శిబిరాలు, సమావేశాలు జరిగిన సమయాల్లో ఉగ్రవాదులతోపాటు వారి భార్యల సెల్‌ఫోన్ల టవర్ లొకేషన్లతోపాటు ఇతర సాంకేతిక ఆధారాలను బట్టి దీన్ని నిర్ధారించినట్లు స్పష్టం చేస్తున్నారు. ఇప్పటికే కొన్ని ఫామ్‌హౌస్‌లను గుర్తించిన ఏటీఎస్ అధికారులు.. వాటి యజమానులను విచారించాలని నిర్ణయించారు. వారికి తెలిసే ఈ శిబిరాలు జరిగాయా? లేక వేరే పేరుతో తీసుకొని ఇలా దుర్వినియోగం చేశారా అనేది తేల్చనున్నారు.

ఎన్నికల వేళ ఆత్మాహుతి దాడికి ప్లాన్...

ఫిదాయీగా పిలిచే ఆత్మాహుతి దాడులకు సిద్ధమైన ఈ ఉగ్రవాదుల్లో భోపాల్ మాడ్యూల్‌లో కీలకంగా వ్యవహరించిన జిమ్ ట్రైనర్ యాసిర్ ఖాన్ మానవబాంబుగా మారడానికి సిద్ధమయ్యాడు. దాని కోసం ఇంటర్‌నెట్‌లో కొన్ని వీడియోలను సెర్చ్ చేశాడని ఏటీఎస్ అధికారులు నిర్ధారించారు. మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలకు కొన్ని రోజుల ముందు రద్దీ ప్రాంతంలో తనను తాను పేల్చుకోవాలని యాసిర్‌ఖాన్ కుట్ర పన్నినట్లు ఆధారాలు సేకరించారు. ఈ ఉగ్రవాదుల్లోని భోపాల్ మాడ్యూల్‌కు దుబాయ్ సహా మరికొన్ని దేశాల నుంచి నిధులు వచ్చినట్లు ఏటీఎస్ ప్రాథమికంగా తేల్చింది. ఈ అంశంపై లోతుగా దర్యాప్తు చేయాల్సిందిగా కోరుతూ ఫైనాన్షియల్ ఇంటెలిజెన్స్ యూనిట్‌ను (ఎఫ్‌ఐయూ) రంగంలోకి దింపాలని కోరుతూ కేంద్రానికి లేఖ రాసింది. అందుకు అంగీకరించిన కేంద్ర ఆర్థిక శాఖ... ఆ మేరకు ఎఫ్‌ఐయూకి ఆదేశాలు జారీ చేసింది. ఆయుధాలు, డ్రోన్లు, శిక్షణ శిబిరాలు సహా వివిధ అంశాలకు ఈ ఉగ్రవాదులు ఖర్చు పెట్టిన నగదు ఎంత? అది వారికి ఎలా వచ్చింది? విదేశాల నుంచి వారికి సహకరిస్తున్నది ఎవరు? నిధులు పంపింది ఎవరు? తదితర అంశాలపై ఎఫ్‌ఐయూ దృష్టి పెట్టనుంది. అవసరమైతే ఈడీని రంగంలోకి దింపాలని, ప్రివెన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్ యాక్ట్‌తోపాటు ఫెమా కింద కేసులు నమోదు చేసి దర్యాప్తు చేయించాలని ఎఫ్‌ఐయూ భావిస్తోంది. ఒకట్రెండు రోజుల్లో ఈ విభాగం అధికారులు భోపాల్‌లో చిక్కిన యాసిర్ ఖాన్‌తోపాటు హైదరాబాద్‌లో అరెస్టు అయిన మహ్మద్ సలీంను ప్రశ్నించనున్నట్లు సమాచారం.

కానిస్టేబుల్ తుది రాత పరీక్ష ప్రాథమిక కీ విడుదల

- నేటి నుంచి వెబ్‌సైట్‌లో అందుబాటులో..
- అభ్యంతరాలు తెలిపేందుకు ఈనెల 24 వరకు గడువు
- టీఎస్‌ఎల్పీఆర్బీ చైర్మన్ వీవీ శ్రీనివాసరావు వెల్లడి



సాక్షి, హైదరాబాద్: యూనిఫాం సర్వీసెస్ కొలువుల భర్తీలో భాగంగా వివిధ విభాగాల్లోని కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి నిర్వహించిన తుది రాత పరీక్ష ప్రాథమిక కీ సోమవారం నుంచి వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉండనుంది. ఈ మేరకు టీఎస్‌ఎల్పీఆర్బీ చైర్మన్ వీవీ శ్రీనివాసరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు www. tslprb. in వెబ్‌సైట్‌లో ప్రాథమిక కీ ని చూడవచ్చని తెలిపారు. ప్రాథమిక కీపై ఏవైనా అభ్యంతరాలుంటే ప్రతి ప్రశ్నకు వేర్వేరుగా అభ్యంతరాలు వెబ్‌సైట్‌లో సూచించిన వెబ్ టెంప్లేట్ ఫార్మట్‌లో ఈనెల 24 సాయంత్రం 5 గంటలలోపు ఆన్‌లైన్‌లో సమర్పించాలని సూచించారు. అభ్యంతరాలున్న ప్రతి ప్రశ్నకు వేర్వేరుగా సూచించిన ఫార్మట్‌లోనే అభ్యంతరాలు పంపాలని, లిఖితపూర్వకంగా నేరుగా పంపే అభ్యర్థనలు పరిగణనలోకి తీసుకోమని స్పష్టం చేశారు. అభ్యర్థుల ఓఎంఆర్ షీట్ల స్కాన్ కాపీలను తుది కీ విడుదల చేసిన తర్వాత మాత్రమే అభ్యర్థుల యూజర్ అకౌంట్లకు పంపుతామని తెలిపారు.

ఓయూ ఎంకాం సిలబస్‌లో మార్పులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలో ఎంకాం కోర్సులో సిలబస్‌ను మార్చనున్నట్లు కామర్స్ విభాగం హెడ్ ప్రొ.చెన్నప్ప ఆదివారం తెలిపారు. కామర్స్ విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించేల ఎంకాం కోర్సును తీర్చిదిద్దుతున్నట్లు చెప్పారు. గత ఏడాది ఎంకాం మొదటి సంవత్సరం సిలబస్‌ను మార్చగా..ఈ ఏడాది నుంచి ద్వితీయ సంవత్సరం పాఠ్యాప్రణాళికలో ఐటీ, కంప్యూటర్, ఆధునిక సాంకేతిక విజ్ఞానంతో కూడిన అంశాలను చేర్చనున్నట్లు వివరించారు.

కామర్స్‌లో కొత్త కోర్సులు

ఎంకాంలో రెండు కొత్త కోర్సులను ప్రవేశపెట్టనున్నట్లు ప్రొ.చెన్నప్ప తెలిపారు. ఎంకాం కంప్యూటర్స్ అప్లికేషన్స్, ఎంకాం బిజినెస్ ఎనాలిటికల్, బీకాం ఫైనాన్స్ కోర్సును ప్రవేశపెట్టనున్నట్లు ఆయన వెల్లడించారు.

చూపు సమస్యతోనే రోడ్డు ప్రమాదాలు

డ్రైవర్లకు కంటి పరీక్షలు ● ప్రభుత్వానికి పోలీస్ శాఖ సూచన

సాక్షి, హైదరాబాద్: 'అకస్మాత్తుగా అడ్డంగా వచ్చారు.. నాకు సరిగ్గా కనిపించలేదు..' అంటూ ఎక్కువ రోడ్డు ప్రమాదాల్లో డ్రైవర్లు చెబుతున్నారని.. ఒక సీనియర్ పోలీస్ అధికారి తెలిపారు. చాలా వరకు ప్రమాదాల్లో డ్రైవర్ల దృష్టి లోపం సైతం ఎదుటి వారి ప్రాణాలు బలిగొంటోంది. వాహన డ్రైవర్ కంటి చూపు సమస్యను నిర్లక్ష్యం చేయడంతో.. ఆ వాహనంలో ప్రయాణించే వారి ప్రాణాలు ప్రమాదంలో పడుతున్నాయి. పోలీస్, ఆరోగ్యశాఖలు సంయుక్తంగా ప్రతి జిల్లాలో కంటి వెలుగు శిబిరాలను డ్రైవర్ల కోసం నిర్వహించేలా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపనున్నట్లు తెలిపారు.

ఆర్టీసీ.. టార్గెట్ మండే

- స్వతహాగా ఓఆర్ ఎక్కువగా ఉండే రోజుపై ప్రత్యేక దృష్టి
- గత సోమవారం రికార్డు స్థాయిలో రూ.20 కోట్ల ఆదాయం
- ప్రయోగం విజయవంతం కావడంతో ఈ సోమవారంపైనా ఫోకస్



సాక్షి, హైదరాబాద్: ఆదాయం పెంచుకొనే చర్యల్లో భాగంగా సోమవారాలపై ఆర్టీసీ ప్రత్యేక దృష్టి పెట్టింది. సోమవారాల్లో వివిధ పనులపై వెళ్లే వారి సంఖ్య ఎక్కువగా ఉన్నందున ప్రతి సోమవారం ఆక్యుపెన్సీ రేషియో (ఓఆర్)ను భారీగా పెంచడం ద్వారా టికెట్ ఆదాయం అధికంగా వచ్చేలా చర్యలు ప్రారంభించింది. గత సోమవారం ప్రయోగాత్మకంగా చేసిన కసరత్తు సత్ఫలితం ఇవ్వడంతో ఇక నుంచి ప్రతి సోమవారం ప్రత్యేక కసరత్తు చేయాలని ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఆదేశించారు. దీంతో ఈ సోమవారానికి సంబంధించి కూడా ఆదివారం నుంచే కసరత్తు ప్రారంభించారు. డిపోల్లోని స్పేర్ బస్సులన్నింటినీ రోడెక్కించడంతోపాటు వీలైనంత వరకు సిబ్బంది సెలవుల్లో లేకుండా చూస్తున్నారు. ఇక సర్వీసులను అటూఇటూ మార్చడం ద్వారా ఎక్కువ ఆదాయం వచ్చే మార్గాల్లో ఎక్కువ బస్సులు తిప్పేందుకు రూట్లను మారుస్తున్నారు.

గత సోమవారం 73 డిపోల లాభార్జన

గత సోమవారం అంటే.. మే 15న ఆర్టీసీకి రికార్డు స్థాయిలో రూ. 20 కోట్ల ఆదాయం టికెట్ల రూపంలో సమకూరింది. గత సంవత్సర కాలంలో సంక్రాంతి ముగిసిన మర్నాడు, హోలీ రోజుల్లోనే ఇలా రూ. 20 కోట్లు చొప్పున ఆదాయం లభించింది. కానీ ఇప్పుడు ఎలాంటి పండుగలు లేకున్నా సాధారణ రోజునే అలా రూ. 20 కోట్ల ఆదాయం రావడం ఆర్టీసీ చరిత్రలో రికార్డే. మే 15న ట్రాఫిక్ రెవెన్యూకు ప్యాసింజర్ సెస్, సేఫ్టీ సెస్, టోల్ సెస్‌లను కలపడం ద్వారా ఈ మొత్తం రికార్డయింది. టార్గెట్‌ను మించి 116 శాతం ఆదాయం నమోదు కావడం విశేషం. ఆక్యుపెన్సీ రేషియో 79.33 శాతంగా నమోదైంది. అధికారులు చేసిన ప్రత్యేక కసరత్తు వల్ల సాధారణ సోమవారాల్లో వచ్చే ఆదాయం కంటే దాదాపు రూ. 3 కోట్లు అదనంగా వచ్చింది. 96 డిపోలకుగాను ఏకంగా 73 డిపోలు లాభాలను ఆర్జించాయి.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.